
# మాదిరెడ్డి సులోచన

# అగ్ని పరీక్ష



# అగ్నిపరీక్ష

విష్ణువర్ధన్ పుస్తకం చేతిలో పట్టుకుని సైగల్‌పాటలు తన్మయత్వంతో వింటున్నాడు. 'అమర గాయకుడు' అనుకున్నాడు.

"ఒరేయ్ విష్ణూ! ఈ పాత చింతకాయ పచ్చడి సంగీతం నచ్చుతుందేమిట్రా నీకు!" అన్నాడు రమణ.

"ఒరేయ్ కొత్త చింతకాయా! ఈపూట గదిలో వున్నావు. విశేష మేమిటీ?"

"ఇప్పుడు అయిదు గంటలే కదరా"

"ఏమిటి ప్రోగ్రామ్?"

"నువ్వు దయతలిస్తే...."

"మధ్యలో నా దయ ఎందుకురా?"

"నా పర్సుకు చిల్లులున్నాయిరా"

"కాదురా విష్ణూ, వీడి చేతిలో కత్తెరలున్నాయి" మరో రూమ్మేటు అందుకున్నాడు.

"పాపం! వాడికి ముందు ఆలోచన వుండదురా. ఇంతకీ ఏమిటి కార్యక్రమం?"

"ప్లాజాలో మంచి పిక్చరు ఆడుతూంది."

"ఒక్క ప్లాజాలోనే ఏం ఖర్మరా. అంజలీ నటరాజ్.... అన్నింటి లోనూ మంచి సినిమాలే ఆడుతున్నాయి."

"ఒరేయ్ లక్ష్మీపుత్రా... నీవు జంటనగరాలలోనేకాక, కావాలంటే మదరాసు, బొంబాయి వెళ్లి చూడగలవు. మాకు ప్లాజాలో సినిమా చూపించు చాలు."

"అవునన్నయ్యా.... వారంపైనే అయింది సినిమా చూసి" అప్పుడే వచ్చిన రాజీవ్ అందుకున్నాడు. అతను విష్ణువర్ధన్ చిన్నాన్న కొడుకు. అంతా హాస్టల్లో వుండి చదువుతున్నారు.

"నిజమేనన్నయ్యా.... వారం రోజులు అయింది సినిమా చూసి" ఉదయ్ రాజీవ్‌ను బలపరిచాడు.

"సరే. మీరంతా ఒక్కుమ్మడిగా దండయాత్ర సాగిస్తే వద్దంటానా. ఒరేయ్ రమణా త్వరగా తెములు. నువ్వు అద్దం ముందు కూర్చుంటే ఆడపిల్లలు సిగ్గుపడతారు" విష్ణు చిరునవ్వుతో అన్నాడు.

"నాకు తెలుసురా. నువ్వు అంగీకరిస్తావని. నీ హృదయమూ, పాకెట్టూ రెండూ రిచ్చేరా" ఆనందంగా ఈలవేస్తూ వెళ్ళిపోయాడు రమణ.

అతను ఆలోచనలో పడ్డాడు. రోజుకు ఒకసారి అయినా ఫోను చేసే తండ్రి, వారం రోజులనుండి ఫోను చేయలేదు. పై ఊరెళ్ళినా ట్రంకాల్ చేసేవాడు.

"ఏమిట్రా అలా నిలబడిపోయావు?" ముఖం తుడుచుకుంటూ వచ్చాడు రమణ.

"ఏం లేదురా, నాన్నగారి నుండి ఫోను లేదు. ఆరోగ్యం బావుండ లేదేమో!"

"అంత ఆలోచన దేనికిరా? మీ అమ్మకు ఫోన్ చేయి."

"చేశానురా. ఆమెకు తెలియదట" అని మరోసారి ఇంటికి ఫోను చేశాడు.

తల్లే యెత్తింది.

"నేనమ్మా.... విష్ణును.... నాన్నగారు రాలేదా?"

"లేదురా. నాకు భయంగా వుంది. సుమతీ, దాని భర్తా వస్తారటరా. సెలవు అడిగి నీవూ వచ్చేయి.... అలాగే వస్తూ పండ్లు పట్టుకురా" కాంతమ్మ చెప్పింది.

"నాకు సెలవు వుండదమ్మా..."

"తీసుకోరా. అల్లుడు ఏమనుకుంటాడు! వాసుకేం తెలియదు."



"అలాగే వస్తానమ్మా" ఫోన్ పెట్టేశాడు. అందరూ తయారయి సినిమాకు వెళ్ళారు. విష్ణు మనసు ఆందోళనగా వుంది.

కోదండరామయ్య, చలపతి, రఘుపతి అన్నదమ్ములు. కోటీశ్వరులుగా పేరుపొందారు. రఘుపతి చనిపోయాడు. కోదండరామయ్య అలనాటి కోదండరాముడే. అతనికి తమ్ములంటే అభిమానం. వ్యసనాలకులోనై మరణించిన రఘుపతిని తలుచుకుని ఇప్పటికీ ఏడుస్తాడు. ఉమ్మడి కుటుంబం. అతని భార్య కాంతమ్మ భర్త లాంటిదే. మరిది పిల్లలు, నా పిల్లలు అంటూ ఏనాడూ భేదం చూపి యెరగని ఇల్లాలు. ఆమెకు సుమతి, విష్ణు, ప్రభ, రమలు నల్గురు సంతానం. ఉదయ్, రాజీవ్‌లు చలపతి సంతానము. సుధ, వాసు, రేణు రఘుపతి సంతానము. పేరు పేరునా పిలిచి వీరు ఫలానా అని చెబితేగాని తెలియదు. కాంతమ్మ ఇంటి అజమాయిషీ చేస్తూ అతిథి సత్కారాలు చూస్తుంది. రెండవ తోటికోడలు సుశీలమ్మ ఇంటిలోకి కావలసిన సరుకులు తెప్పించి పిల్లలకు ఫీజులు, పుస్తకాలు చూస్తుంది. మూడో ఆమె కమలమ్మ. వితంతువు. ఎక్కువగా బయటికి రాదు. వంటయిల్లు అజమాయిషి చేస్తుంది.

ఉస్మాన్‌సాగర్ చెరువుక్రింద పొలాలున్నాయి. వాటిని చలపతి అజమాయిషీ చేస్తాడు. పేరుకు పొలం వెళ్ళటమే. ఎక్కడో పేకాడుతూ గడుపుతాడు. పొలాలకు కాస్త దూరంలో చవకగా వస్తుందని యెవరో నవాబు అమ్ముతుంటే కొన్నాడు. అక్కడే అందరూ ఉంటారు. సికింద్రాబాదులో బంగళా కొన్నారు. అక్కడ క్రింది భాగం అద్దెకిచ్చి, తాము యెప్పుడయినా వెళ్ళితే ఉండటానికి పైభాగం ఉంచుకున్నారు.

రామయ్యకు మోటార్ రిపేరింగు కంపెనీ వుంది. అడితీ దుకాణం ఉంది. ఇంకా యెన్నో వ్యాపారాలు చేస్తాడు. అతని ఆదాయ, వ్యయాల సంగతి యెవరికీ తెలియదు. రోజుకు పదిమంది ఆశ్రితజనం ఆ ఇంటిలో చేయి కడుగుతారు.

గత సంవత్సరమే సుమతి వివాహం ఘనంగా చేశాడు. అందరూ ఆశ్చర్య పోయారు. అతని మర్యాదలకు వియ్యాలవారు వుక్కిరి బిక్కిరి అయ్యారు.

మిగతా పిల్లలు కూడా పిల్ల జమీందారులులాగే పెరుగుతున్నారు. విష్ణువర్ధన్ బి.కామ్. ఫైనలియర్‌లో ఉన్నాడు. అతను, ఉదయ్, రాజీవ్ హాస్టల్లో వుంటారు. విష్ణుకు కాలేజీ దూరం అని జావా కొనిపెట్టాడు. ఇంటి ముందు జీపు, అంబాసిడర్ కారులు వుంటాయి ఎప్పుడూ. సుధ గర్ల్స్ హాస్టల్లో వుండి చదువుతోంది. చిన్న పిల్లలంతా జీపులో పట్నంవచ్చి చదువుతారు. చలపతి పట్నం పోవాలంటే కారు వాడతాడు. కోదండ రామయ్య అతిమెత్తని హృదయం గలవాడు. ఒక్కనాడు కూడా ఈ ఖర్చులేమిటని పిల్లలని అడగలేదు.

సినిమానుండి వచ్చిన విష్ణువర్ధన్ బట్టలు మార్చుకున్నాడు. సాయంత్రం మార్చిన వందరూపాయల నోటులో ఓ పది మాత్రం మిగిలాయి. అవి బల్లపై పడవేసి నిద్రపోయాడు.

## 2

"వచ్చావా తండ్రీ! అల్లుడు ఇందాకే అడిగాడు" చాటంత ముఖం చేసుకుని విష్ణుకు యెదురు వచ్చింది కాంతమ్మ.

"నీ ఆరోగ్యం యెలా వుందమ్మా?"

"నాకేంరా రాయిలా వున్నాను."

అతను డ్రాయింగు రూమ్‌లోకి వెళ్ళాడు. అక్కడ పిల్లలు, సుమతి, ఆమె భర్త విఠల్ వున్నారు.

"ఏమోయ్ యువరాజా! క్షేమమా?" విఠల్ పలకరించాడు.

"డబుల్ క్షేమం బావా! వచ్చేటప్పుడు ఏదయినా జానపద సినిమా చూశారేమిటి? యువరాజులు గుర్తుకొస్తున్నారు?"

"చచ్చాం పో....ఇంకేమిటో అనుకున్నాను. కోరకమునుపే అవసరాలు గ్రహించి అన్నీ అమర్చే తండ్రి వుండగా యువరాజుకాక మరేం అనాలోయ్?"

"అదా అసలు సంగతి. ఏమక్కా! బావగారి కష్టంబులు...."

"ఆపరా, కాస్త ఫలహారం పడనీయ్"

"వచ్చావా బాబూ!" సుశీలమ్మ వచ్చి అడిగింది.

"నువ్వేమిటి పిన్నీ అలా చిక్కావు?"



"రాజీవ్, ఉదయ్‌లపైన దిగులేమోరా పిన్నికి?" అన్నది సుమతి.

"కొండంత అన్న వాడు వుండగా నాకేం దిగులమ్మా!" అని తన పుట్టింటి సంగతులు చెప్పి విచారించింది. ఆమె అన్నకు అందరూ ఆడపిల్లలు. తమ్ముడు అత్తగారి మాట వింటాడుట.

"ఉండు పిన్నీ, వాడితో మమ్మల్ని మాట్లాడనియ్యి. మీరెప్పుడూ వుండేవారే కదా?" సుమతి బుంగమూతి పెట్టింది.

"మీరు వచ్చారనిగాని, లేకపోతే వాడొచ్చింది ఎప్పుడమ్మా?"

"సుశీలా! ఫలహారాలు తీసుకువెళ్ళు. తీరికగా పోట్లాడుదువు రా" బయట నుండి కాంతమ్మ కేకవేసింది. సుశీల వెళ్ళిపోయింది.

"చెప్పక్కయ్యా, యెలా వుంది మీ వైజాగ్?"

"మీ బావగారి ముందు వారి ఊరిని విమర్శిస్తే ఊరుకుంటారా?"

"ఏం బావా?"

"తనలాగే అందరూ అనుకుంటుందోయ్ మీ అక్క. ఈవిడ పోరు పడలేకుండా వున్నాను. మీ నాన్నగారిని అడిగి ఇటువైపు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి"

"నాన్నగారు తలుచుకుంటే నిమిషాలమీద పని" గర్వంగా అన్నాడు విష్ణువర్ధన్. అతను అనుకున్నదాంట్లో తప్పు ఏమాత్రం లేదు. రామయ్య తన పిల్లలను అంత అపురూపంగా చూశాడు.

ఫలహారాలు సిద్ధం అయ్యాయి, అందరూ బల్ల దగ్గరకు వెళ్ళారు. పూరి, హల్వా, పకోడీలు, వడలు, మిక్చర్, పళ్ళు బల్లపైన అమర్చివున్నాయి.

"ఫలహారాలకు ఇన్ని పదార్థాలా పిన్నీ?"

"మామూలుగా రోజూ ఉండేవే విష్ణూ. అక్కయ్య వచ్చిందని హల్వా చేయించాను."

"బాబోయ్..... మీ ఓపికకు మెచ్చుకోవాలి. ఇవన్నీ తిని అరిగించు కోవటమెలా?" విఠల్ అడిగాడు.

"అలా తిరిగి రండి" సుశీల సలహా యిచ్చింది. మధ్యలో కమలమ్మ ఫలహారాలు మారు తెచ్చింది. "ఈ పకోడీలు వేడిగా ఉన్నాయి బాబూ" అంటూ.

"ఏం పిన్నీ కనిపించనేలేదు. ఊరువెళ్ళావేమో అనుకుంటున్నాను" విష్ణు అడిగాడు.

"లేదు బాబూ! బావగారొచ్చారని వంటయింట్లోనే ఉన్నాను."

"వంట మనుషులుండగా పని నీ నెత్తిన వేసుకోకపోతేనేం పిన్నీ?"

"నేను చేసింది ఏముంది? పర్యవేక్షణ మాత్రమే" అన్నది. అతని మృదు హృదయానికి, స్వభావానికి ముగ్ధురాలయింది. అంతా తండ్రి పోలికే అనుకుంది.

ఫలహారాల తరువాత అందరూ పొలాలవైపు వెళ్ళారు.

"ఈ వ్యవసాయంలో లాభం వుందా విష్ణూ?"

"లాభనష్టాలు చూసుకోరు బావా! గౌరవం మాత్రమే. ఎందుకడిగారీ ప్రశ్న?"

"జీతగాళ్ళు నిద్రపోతున్నారు. ఎక్కడ చూసినా గడ్డి. పిచ్చి మొక్కలున్నాయి. పశువులు కొనప్రాణంతో వున్నట్టున్నాయి."

"అదేమో, మా చిన్నాయనకు తెలుసు."

"బి.కామ్. కాగానే ఏం చేద్దామని?"

"ఎమ్.కామ్. చేయాలని ఉంది."

"నాన్నగారికి ఫారిన్ పంపాలని ఉంది" అన్నది సుమతి.

"అదృష్టవంతుడు" అన్నాడు విఠల్. అందరూ వెనుదిరిగారు. చలపతి జీపుతో వచ్చాడు. అందరినీ చిరునవ్వుతో పరామర్శించాడు. జీపులో యెక్కించుకుని బయలుదేరాడు.

రాత్రి పంచభక్ష్య పరమాన్నాలు భోంచేసి అందరూ నిద్రబోయారు. భోజనాల బల్లమీద మిగిలిపోయిన పదార్థాలు చూస్తుంటే, విష్ణుకు ఆశ్చర్యం వేసింది.

మర్నాడు ఉదయం ఫలహారాలు కాగానే సాలార్‌జంగ్ మ్యూజియం చూడటానికి బయలుదేరారు.

"విష్ణూ! మీ నాన్నగారు ఎప్పుడు వచ్చేదీ తెలియదు. అక్కయ్యకు, బావగారికి బట్టలు ఇప్పించుకురా" అన్నది కాంతమ్మ.

"అలాగేనమ్మా!"



"నాకు కంచిపట్టు పరికిణీ కొంటానన్నావ్" రేణు గుర్తుచేసింది.

"అలాగేలేవే, దానికి పరికిణీ ఒకటి కొనవే సుమతీ."

"నేనంటే ఆడపిల్లలు లేనిదాన్ని అన్నాను అంటారు. రేణుకు పరికిణీలకేం కరువు? పెట్టెనిండా ఉన్నాయి" సుశీలమ్మ అడ్డుపడింది.

"పిల్లలు.... వాళ్ళుకాక మనము అడుగుతాములే!"

"అమ్మా, నాకు మ్యాచింగు బ్లౌజులు లేవు" ప్రభ పరుగెత్తుకు వచ్చింది. ఆమె అధునాతన వేషం చూచి విష్ణు నెత్తిమీద ఒకటి వేశాడు.

"ఈ అమ్మవారి అవతారమేమిటే?"

"ఫ్యాషన్ తెలియకపోతే సరి" బుంగమూతి పెట్టింది ప్రభ.

"లైటు బ్లూ, స్కై బ్లూ."

"ఈ బ్లూల చిక్కు యెందుకు? నువ్వూ బండెక్కు" అన్నాడు విష్ణు.

"ఇదేం చూచావు. మీ పెద్దచెల్లి సుధమ్మను చూడు. ఫ్యాషన్‌తో బంగారంలాంటి జుట్టు కత్తిరించింది. తనో పిల్ల జమీందారిణినని అనుకుంటుంది. ఆరు జతల చెప్పులు కొన్నది" కమలమ్మ చెప్పింది.

"నీకేం తెలియదు పిన్నీ! బట్టలు వేసుకోవటంలో పంజాబీలను మెచ్చుకోవాలి. స్వెట్టర్ దగ్గరనుండి మ్యాచింగ్ వేసుకుంటారు."

"భలే జోరుగా ఉందే వ్యాఖ్యాయణం! పంజాబీలు తమ పని తాము చేసుకుంటారు. తమ బట్టలు తాము కుట్టుకుంటారు. మనలా తిండికి ఖర్చు పెట్టరు చెల్లెమ్మా!"

"వెళ్ళి త్వరగా వచ్చేయండి". అందరూ వెళ్ళి కారులో సర్దుకున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంచూసి, మదీనాలో భోజనాలు చేశారు. తరువాత షాపింగ్‌కెళ్ళారు. సుమతి రెండువందల రూపాయలు పెట్టి చీర కొన్నది.

"అంత ఖరీదుపెట్టి చీరకొనటమే! మీ తమ్ముడి పెళ్ళి అయినా కాదు."

"పెళ్ళి అయితేనే కొనాలని వుందా?"

"ఓహో.... మీ నాన్నగారు లక్షాధికారని చాటి చెప్పాలి కాబోలు."

"మీరు కొనివ్వరు-కొనిచ్చేవారుంటే ఆక్షేపిస్తారు."

"ఆక్షేపించలేదు. 'పెళ్ళి చీరలున్నాయి కదా' అన్నాను. తరువాత నీ ఇష్టం" అన్నాడు.

"పోనివ్వండి బావా! ఏదో సరదా."

"సరదాలు, కోరికలు తెలుసు. వాటిని అదుపులో పెడితేనే అందం."

"అది మన కుటుంబాలలో ఉన్న అంటువ్యాధి. ప్రిస్టేజి అంటే ప్రాణం పెడతారు." అలాగే అందరూ తమకు కావల్సినవి కొన్నారు. విఠల్‌ను కూడా తీసుకోమన్నాడు.

"నాకెందుకు? పండగా, పేరంటమా? సరదాకు వచ్చాను."

"ఆ మాట అమ్మతో చెప్పండి" అనేసి వెళ్ళి తనకు నచ్చినవి తీశాడు.

అంతా అయ్యాక బిల్లు చెల్లించబోయాడు.

"అదేమిటి బాబూ! మేం ఏనాడయినా బిల్లు తీసుకుని యెరుగుదుమా? వుంచండి" వినయంగా చేతులు నలుపుతున్నాడు షాపు యజమాని.

"అంటే?"

"ఇదిగో ఆ పుస్తకంలో సంతకం చేయండి చాలు." అతను చిత్రగుప్తుని చిట్టాలాంటి పుస్తకం ముందుపెట్టాడు. అక్కడ తమ పేరనున్న బిల్లులు, తండ్రి, పినతండ్రి, గుమస్తాల సంతకాలు చూచి ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి బాబూ ఆలోచన?"

"ఏం లేదు." సంతకంచేసి, బయటికి వచ్చాడు. ఇల్లు చేరేవరకు అతను యెవరితోనూ మాట్లాడలేకపోయాడు.

పిల్లలు పెద్దన్న ఉదారతను కొనియాడారు. వారి ఆనందంలో పాలు పంచుకోలేక పోయాడతను.

"ఏమిటి విష్ణు అలా ఉన్నావ్?" విఠల్ అడిగాడు.

"ఏం లేదు బావా." అతను మామూలుగా ఉండటానికి చాలా ప్రయత్నం చేశాడు.

మర్నాడు సన్నగా వినిపిస్తున్న భక్తిరంజని వింటూ దొర్లుతున్నాడు విష్ణు. హాలులోంచి మాటలు వినిపిస్తున్నాయి. సుశీలమ్మ వస్తువుల లిస్టు చెబుతూంది. గుమాస్తా రాస్తున్నాడు.



"అమ్మగారూ! పంచదారకు బ్లాకు మార్కెట్ ధర వేసుకుంటాడు. కాస్త తంటాలుపడి ఆ కార్డుముక్క తెచ్చుకుందాము..."

"నువ్వు అనేది ఏమిటయ్యా! అంతవరకు ఇంట్లోవారు టీ త్రాగకుండా ఉంటారా?"

"అమ్మమ్మ యెంతమాట..." అతను నొచ్చుకున్నాడు.

"సంచులు ఇప్పించండి" సుశీలమ్మ పనిపిల్లలచేత సంచులు తెప్పించింది.

విష్ణు ఒళ్ళు విరుచుకుంటూ బయటకు వచ్చాడు.

"గుమాస్తాగారు డబ్బు మరిచిపోతున్నారేం?"

"అదా?" నవ్వేశాడు. "పద్దు రాస్తా! వీలునుబట్టి పెద్దబాబుగారు తీర్చేస్తారు. విష్ణుబాబూ? నేను మీ గుమాస్తాని నన్ను "అండీ" అని మన్నించాలా?"

"మీరు నాకంటే పెద్దవారు?"

"అది సరే! ఇంత పెందలకడే లేచి ఏంచేస్తావు బాబూ" సుశీలమ్మ అడిగింది. మెల్లగా గుమాస్తా వెళ్ళిపోయాడు.

"అయిదు దాటితే నిద్రరాదు పిన్నీ."

"అంతా మీ బాబాయి అలవాటే" అప్పుడే హాల్లోకి వచ్చిన కమలమ్మ అన్నది.

"పిల్లలంతా లేచారా!"

"అప్పుడేనా?"

"మరి బడులు లేవూ?"

"ఎనిమిదికి లేచి తయారవుతారు."

"పాఠాలు అవీ చదవరా?"

"రాత్రిళ్ళే పూర్తిచేస్తారు. ట్యూషన్ మాస్టర్ వస్తాడుగా. ఒరేయ్ కన్నా కాఫీ పట్రా."

అతను గబగబా వెళ్ళి బ్రష్ చేసుకొని వచ్చాడు. కన్నా కాఫీ తెచ్చాడు. అయిదారేళ్ళ వయసున్న కన్నా హుషారుగా కనిపించాడు.

"ఈ కన్నా యెవరు పిన్నీ?"

"కొత్త పని కుర్రాడు. వీరయ్య చెట్లకు నీళ్ళు పోయాలంటేనే ప్రొద్దుకూకిస్తున్నాడు. మంగమ్మకు అంట్లపనితోనే సరిపోతోంది. చిట్టి వంటింటికే ప్రాణాలు ధారపోస్తోంది. రంగి పిల్లలకి జడలువేస్తూ, బట్టలు అందిస్తూనే అలసిపోతోంది. మున్నెయ్య జీపునుఅంటిపెట్టుకు తిరుగుతాడు. ఏదో చేతికిందుంటాడని వీడిని పెట్టుకున్నాము."

"చాలు పిన్నీ చాలు ఆ పేర్లు కూడా నాకు గుర్తుండవు" చెవులు మూసుకున్నాడు. ఆ వాతావరణంలో ఏదో ఊపిరి సలపనట్లు అన్పించింది.

"పిన్నీ! నేను వెళ్ళిపోవాలి. ఫలహారం త్వరగా కానియ్యండి."

"అప్పుడేనా! బావ మరో రెండు రోజులు వుంటాడు కాబోలు-"

"బావ కాలేజి వదిలి వుండమని ఏం అనడు. నేను చెబుతాను" బాత్‌రూంలోకి వెళ్ళాడు విష్ణు.

## 3

సుందరమ్మ రుసరుసలాడుతూ పెరట్లోకి వెళ్ళిపోయింది. ఆమెకు కడసారి కూతురు సుజాతను 'చంపుదాం', అన్నంత కోపంగా ఉంది. ఒకప్పుడు సుందరమ్మ భర్త తహసిల్‌దారుగా పనిచేశాడు. సికింద్రాబాద్ దగ్గర లాల్ బజార్‌లో బంగళా కట్టించాడు. దగ్గరే పొలం కొన్నాడు. నలుగురు ఆడపిల్లలు, ఒక్కడే కొడుకు. అందరిలో పెద్దవాడు రఘు, ఆఖరి అమ్మాయి సుజాత. మధ్యపుట్టిన ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. రఘు వివాహం కూడా అయ్యింది. కడసారి అమ్మాయి కదా అని సుజాతను చదివించారు. ఆ యేడే బి.ఏ. ప్యాసయింది. సంబంధాలు చూస్తున్నారు. ఒక్కటీ సుజాతకు నచ్చదు.

సుజాత తల్లి వెనకాలే పెరట్లోకి వెళ్ళింది. "అమ్మా! కోపం వచ్చిందా?"

"అహ... ముద్దెట్టుకోవాలనిపిస్తోంది. ఆ రోజే చచ్చినా పీడా పోయేది."

"ఏ రోజు"

"నోరుముయ్యి. ఇందాకటి సంబంధానికేం లోపమే? అబ్బాయి ఎం.ఏ. చదివాడు. లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్థిపరుడు."

"ఆస్థిపరుడంటే ఒప్పుకోను."



"ఎందుకని"

"ఆస్తి ఉన్నవాడు కట్నం యెందుకు అడుగుతాడు?"

"ఇదెక్కడి వితండవాదమే. కట్నం లేంది పెళ్ళి యెలా అవుతుంది?"

"నువ్వు నోరుమూసుకో. మహారాజులా అవుతుంది. అతను నాకు నచ్చలేదు. అందమయినవారంతా నచ్చాలని రూలు ఏం లేదు" విసురుగా అన్నది.

మళ్ళీ వాతావరణం వేడెక్కింది. సమస్య మొదటికి వచ్చింది.

"మరి నీ రూల్ ఏమిటి. చెప్పి ఏడ్వరాదూ?" అన్నది సుందరమ్మ తీవ్రంగా. "ఇప్పటికి నలుగురు వచ్చి చూసి వెళ్ళారు."

"మరో నలుగురు వచ్చినా అంతే 'సంతలో మేకల్లా అమ్ముడు అవుతాం అనే వారంటే నా కసహ్యం. తాతలసొమ్ము పాతిపెట్టారా? పది పదిహేను వేలంటే చిల్లరపెంకులు అనుకుంటారేమో?"

"ముష్టి పదివేలే అడిగారు. కమ్మవారు, రెడ్లూ అయితే లక్షలు ఇస్తారు."

"ఇస్తారు. యివ్వక యేం చేస్తారు? చెమటోడ్చి సంపాదించారా? తాతలు, తండ్రులు సంపాదించింది, వుంది... యిస్తారు."

"కట్నం యిచ్చేది మేము. మధ్య నీకెందుకే! అవునులే నిన్ను కాలేజీకి పంపి చదివించినందుకు ఫలితం అనుభవించవద్దూ." ఆమె కళ్ళు ఒత్తుకుంది. "అందరిలా పదోతరగతి కాగానే ముడిపెట్టేస్తే పోయేది."

"వాళ్ళంతా మహా సుఖపడిపోతున్నారు లెద్దూ! పెద్దక్క పెళ్ళయి పదేళ్ళు అయింది. అత్తవారింటి చీర కట్టిందా? ఎనిమిది వేలుపోసి శ్యామక్క పెళ్ళిచేశారు. అతను తృప్తిగా ఉన్నాడా! యెప్పుడూ దెప్పుతూ దాన్ని కొరుక్కు తింటాడు. పద్మక్కకు యేం తక్కువ? తన అత్తగారు, తమ ఆడబిడ్డలకు చేసే మర్యాదలు చెప్పుకు వస్తుంది. నువ్వేమో అన్నయ్య ప్రాణాలు తీస్తూ అన్నీ జరిపిస్తానంటావు!"

"యెంతలేసి మాటలంటున్నావే! చచ్చి ఏ లోకాన వున్నారో ఆయన కూడా ఇన్ని మాటలు అనలేదు. మీ అన్న సంపాదన పద్మ పెళ్ళికి వాడలేదు. అంతా ఆయన మిగిల్చిపోయిందే."

"మరి నాన్నగారిచ్చిపోయిందాంట్లో అన్నయ్యకు ఏం మిగలవద్దా? వున్న ఇల్లుకాస్త అమ్మి నన్ను పంపేస్తావు. ఆ తరువాత నా మూలంగా వాడు వుసూరుమంటూ అద్దె కొంపల్లో ఉంటాడు. వాడికి యిద్దరు పిల్లలు వున్నారు. వాళ్ళ గతి?"

"ఫో... పోవే సన్యాసులలో కలిసి పో."

"పోతానులే, డబ్బుతీసుకుని నన్ను పోషించు అంటూ యెవరింటికో వెళ్ళేబదులు సన్యాసం పుచ్చుకుంటేనే హాయి" అన్నది తల్లికంటే విసురుగా.

"సుజా!" రఘు కేకకు యిటు తిరిగింది.

"నువ్వెప్పుడొచ్చావు"

"పది నిమిషాలు అవుతుంది. వదిన పేరంటానికి వెళ్ళింది."

"దారిలో కనిపించింది, సరేగాని నువ్వు యిలా రా?"

"టీ కావాలా?"

"వద్దు, నీతో మాట్లాడాలి" అన్నాడు.

ఇద్దరూ పైకి వెళ్ళారు. అతను మంచంపై కూర్చున్నాడు. ఆమె మోడా లాక్కుని అతని యెదురుగా కూర్చుంది.

"సుజా! నిన్న వచ్చిన వరుని అర్హతలు చూస్తే మనమిచ్చే కట్నం తక్కువే తల్లీ! నీకు నాపైగల ప్రేమాభిమానాలకు కృతజ్ఞుడిని! నా బాధ్యత కూడా తీర్చుకోవాలి కదా!" అన్నాడు అనునయంగా.

"అతని అర్హతలు, యోగ్యతలు నాకనవసరం. కానీ కట్నం అడిగినా నేను పెళ్ళి చేసుకోను."

"ఇచ్చిపుచ్చుకోవడాలు అనాదిగా వస్తున్న ఆచారాలమ్మా."

"నాకు తెలుసునన్నయ్యా! ఆచారాలపేరిట అన్యాయాలు యివి. ఉంటే ఇవ్వవచ్చు. ఈ బేరాలు అమానుషం కదూ!"

"నిజమే. కాని నల్గురితో 'నారాయణ'...."

"అక్కరలేదు" మధ్యలోనే త్రుంచివేసింది. "మరి నువ్వెందుకు తీసుకోలేదు? నీలాంటివాడు నూటికి ఒక్కరయినా వుండరా?"

"నా సంగతి వేరు. వద్దు అనుకున్నాను. అవతలివారిని వద్దంటే సమంజసంగా వుంటుందా?"



"అలా నాభావాలకు విలువ యిచ్చే వరుడు దొరికితే సరి, లేకుంటే ఉద్యోగం చేసుకుంటూ నీతోనే వుంటాను."

"సుజా!"

"దయచేసి నన్ను బలవంతపెట్టకన్నయ్యా" లేచి వెళ్ళిపోయింది. తను చెప్పాల్సింది అయిపోయింది అన్నట్టుంది ఆమె మాట.

ఆమె వెళ్ళినదిక్కే కళ్ళు పెద్దవి చేసి చూశాడు. "అన్నయ్యా, ఐదు పైసలియ్యి" అని చెడ్డీ ఎగదోసుకుంటూ వెంటబడిన చెల్లెలేనా? స్త్రీలు మానసికంగా యెంతగా యెదుగుతారు? తల్లిని తృప్తిపరచటానికి కట్నం ఇస్తానన్నాడు గానీ, తనదగ్గర అంత డబ్బు యెక్కడిది? ఇల్లు అమ్మినా పద్మ పెళ్ళికి చేసిన అప్పులు మొదట తీర్చాలి. ఎంత పొదుపుగా చేయబోయినా సాగదు. ముగ్గురు పెళ్ళయిన చెల్లెళ్ళు ఒకరి తరువాత ఒకరు, పురుళ్ళు అంటూ, పుణ్యాలు అంటూ వస్తూనే వుంటారు. లాంఛనాలు పొల్లుపోవద్దు అంటుంది సుందరమ్మ. అటు తల్లికి యెదురు చెప్పి ఆమె ఏడిస్తే చూడలేడు. ఇటు అప్పులు తీర్చలేడు. కొంతలో కొంత సుగుణం ఏమంటే పెళ్ళికెదిగిన సుజాతగాని, అతని భార్య సరళగాని అవి కావాలి, యివి కావాలి అంటూ వేధించరు.

ఇంటిని యీమధ్యే సుజాత బలవంతంపై అద్దెకిచ్చాడు. క్రింద రెండు గదులు, వరండాపైన ఓ గది తమకు వుంచుకున్నారు. ఆ వచ్చే అద్దెలు వడ్డీలకే సరిపోవు.

అతని తల్లి సుందరమ్మది అదో తరహా మనస్తత్వం. 'మా తాతలు నేతులు త్రాగారు. మా మూతులు వాసన చూడు' అంటుంది.

తహసీల్దారు భార్యనన్న దర్జా, ఖర్చు చేయటమే తెలుసు. ఎక్కడి నుండి వస్తుందన్న ఆలోచన లేదు. భర్త తహసీల్దార్ పై రాబడి వుంటుంది. కొడుకు అకౌంటెంట్ అన్న ఆలోచనే రాదు. కోడలు కట్నం తేలేదన్న కక్షతో కూతుళ్ళకు పెట్టి, కోడల్ని చిన్నబుచ్చాలనుకుంటుంది. రఘు తల్లిని ఏమీ అనలేడు.

రఘు సిగరెట్టుతీసి వెలిగించాడు. పొగలాగే అతని ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

"ఏమండీ?" సరళ గదిలోకి వచ్చింది.

"త్వరగా తెమలిండే నీ పేరంటం"

"మరేం చేయను? గానకచ్చేరి చేయమంటారా?"

"కాస్త బాగా పాడగలిగే వాళ్ళను ఎలాగా పాడమంటారు"

"నా పాట సరే. అత్తయ్య చాలా కోపంగా వున్నారు, సుజాత ముఖం మాడ్చింది. ఏంటి సంగతి?"

"సుజాతకు ఈ సంబంధం కూడా నచ్చలేదట"

"కట్నం దగ్గరేనా?"

"అవును పిల్లలేరీ?"

"సుజాతకు పేరంటం కబుర్లు చెబుతున్నారు." రఘు పరీక్షగా భార్య వంక చూశాడు. మందారరంగు వెంకటగిరి చీర. సన్నగా వుంది అంచు. మెడలో బంగారుతో గట్టిన నల్లపూసలు. చేతులకు మట్టిగాజులు తప్ప మరేం లేవు. ఈ ఆరు సంవత్సరాలలో ఆమెను తన శరీర సుఖానికి వినియోగించుకున్నాడే తప్ప, యేం యివ్వలేదు. సంవత్సరాని కోసారి పుట్టింటివారిచ్చిన ఒక్క మంచి చీరే. తను మాత్రం సాదావి ఓ రెండు కొంటాడు. సరళ దగ్గరగా వచ్చి అతని భుజంమీద చేయివేసింది.

"ఏమిటండీ, అంతగా ఆలోచించే విషయం?"

అతను జవాబు చెప్పలేదు. నిష్కల్మషంగా వుండే ఆ కళ్ళు చూసి ముగ్దుడైపోయాడు.

"పెళ్ళిచూపులనాడు కూడా ఇంత పరీక్షగా చూడలేదనుకుంటాను", కిలకిల నవ్వింది.

"సరూ! నువ్వింత స్వచ్ఛంగా ఎలా నవ్వగలుగుతావు?"

"బావుంది"

"నిజం! నిన్ను చూస్తే యోగినివా, సర్వసంగ పరిత్యాగినివా? కోర్కెలు లేవా? అనిపిస్తుంది."

"గొప్ప సందేహమే. కోర్కెలులేనినాడు మనిషి జీవించలేడు. ముఖ్యంగా స్త్రీలు ముందు పుట్టి కోర్కెలు వెంటతెస్తారు. కేర్ కేర్ మనే పాపకూడా రంగు రంగుల వస్తువులు చూసి సంబరపడిపోతుంది."



"ఈ సోదికాదు నిన్ను అడిగింది? నీ విషయం చెప్పు."

"నాకూ వున్నాయి కోర్కెలు. కాని పరిస్థితులు గమనించి అదుపులో పెడతాను. బాధ్యత, బరువుల క్రింద కోర్కెలు నలిగిపోతాయి."

"నిజమా! ఒకోసారి నాకు అనిపిస్తుంది. నేను పెళ్ళి చేసుకుంది జడపదార్థాన్నా అని."

"మిమ్మల్ని చూస్తే నాకు జాలివేస్తుంది. నన్ను వరించిన చిట్టితండ్రి యింత మెత్తని వాడేమిటా అని. అమ్మ నాల్గుచివాట్లు పెట్టగానే అప్పులకు పరిగెడతారు. నేను సాధింపు మొదలుపెడితే యెక్కడికి పోతారో?"

"సరూ" అతని కంఠం బొంగురుపోయింది. యిద్దరూ చాలాసేపు అలాగే వుండిపోయారు.

# 4

విష్ణు మనసు చాలా ఆందోళనగా వుంది. తండ్రికి ఇన్నాళ్ళనుండి అనారోగ్యంగా వుంటే, తనకు చెప్పని తల్లిపై కోపం వచ్చింది. మరుక్షణమే కరిగిపోయింది. తనకి పరీక్షలని చెప్పలేదేమో! కారు డ్రైవ్ చేస్తున్న అతని ఆలోచనలన్నీ తండ్రి చుట్టే వున్నాయి. ఆయన తనకు అత్యంత ప్రియమైన వ్యక్తి.

"వీరయ్యా! అసలేం జరిగింది?"

"నాకు తెలియదు బాబూ! వారం రోజుల క్రితం పడిపోయారు. రోజూ డాక్టర్ వస్తుంటారు. ఈ పూట చాలా గాభరా పెట్టారు! అందుకే అమ్మగారు నన్ను పంపారు. ఫోను చెడిపోయింది."

కారు ఇంటి ముందు ఆగింది. ఇల్లు జనంతో కిటకిటలాడుతుంది. అతను భయంగా యింటివంక చూసి దిగాడు. ఏం చెడు వినవలసి వస్తుందో అని సంకోచం ఒక వంక పీడిస్తోంది. అందరినీ తప్పించుకుని గదిలోకి వెళ్ళాడు. అతన్ని చూస్తూనే అందరి ప్రాణాలు లేచివచ్చాయి. కాంతమ్మ మంచం దగ్గరనుండి లేచింది.

"వచ్చావా?" అన్నది యెంతో భారం దింపుకున్నట్టు.

"ఇప్పుడెలా వుందమ్మా?"

"ఇప్పుడే మాగన్ను పడ్డట్టుంది" అన్నది మెల్లగా.

"అందరూ యిక్కడ ఎందుకు?" మెల్లగా అందరినీ పంపి బయటికి. అతని స్వరం మంద్రస్థాయిలో వినిపించినా కోదండరామయ్య లేపింది.

"ఎవరూ? విష్ణూ-" ఆయన కళ్ళు విప్పాడు. విష్ణు ముఖం ప్రసన్నమయింది..

"వచ్చేశాను నాన్నా!" అతని ప్రక్కలో కూర్చుని చేతులు నిమురుతూ చిన్నగా నవ్వాడు. తండ్రి చూపులు అంత దీనంగా వుండటం ఏనాడు చూడలేదు విష్ణు.

"విష్ణూ!"

"ఏం నాన్నా!"

"నా రోజులు దగ్గరకొచ్చాయిరా"

"డాక్టరుగారికి ఫోన్ చేస్తాను."

"అతను వచ్చి ఏం చేస్తాడు? గుండెజబ్బు గదా?"

"ఇదే వరసరా" కాంతమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఊర్కో అమ్మా? మీరు విశ్రాంతి తీసుకుంటే అంతా చక్కబడు తుంది. నా పరీక్షలు అయ్యాయి. అంతా నేను చూసుకుంటాను."

"ఊఁ, అందుకే పిలిచాను. యీ భారం యెలా మోస్తావో విష్ణూ"

"అదేంమాట నాన్నా! మీరు చెప్పినట్టు చేస్తాను."

"కాంతం! నువ్వెళ్ళి ఇంటి పనులు, అమ్మాయివాళ్ళకు ఏం కావాలో చూడు. నేను వాడితో ఏకాంతంగా మాట్లాడాలి" అన్నాడు మెల్లిగా.

"నేనుంటే నేం?" అన్నది. విష్ణు కళ్ళతో చెప్పగానే వెళ్ళిపోయింది.

"ఒట్టి భోళా మనిషిరా, అసలు చిన్న సమస్య కూడా తట్టుకోలేదు" అన్నాడు భారంగా.

"మీరిప్పుడవన్నీ ఆలోచించి మనసు పాడు చేసుకోవద్దు."

"మనసా!" నవ్వాడు. "వెళ్ళి తలుపులు వేసి రా."

"అదేమిటి నాన్నా!"



"విష్ణూ! ఈ యింటి బరువు, బాధ్యతలతోపాటు గౌరవ మర్యాదలు నీ చేతిలో పెడుతున్నాను. గుప్పెట మూసినంతసేపేరా రహస్యం."

"నాకు అర్థంకావటం లేదు."

"నాకు ఒక్క మాటివ్వరా!"

"చెప్పండి నాన్నా!"

"మనము మాట్లాడుకునే విషయాలు ఈ గదిలోనే వుండిపోవాలి. 'కోదండరామయ్య సంసారమిదా' అని అందరూ నవ్వకూడదు."

"అలాగే జరుగుతుంది నాన్నా" అని అతను లేచి తలుపులు వేసి వచ్చాడు. తండ్రి ఆదేశం ప్రకారం అలమారాలుతీసి ఫైళ్ళు అన్నీ పరిశీలిస్తూ, తండ్రి చెప్పిన వివరాలు వింటూ స్థాణువు అయిపోయాడు. నిమిషాలు గంటలలోకి మారాయి.

"విష్ణూ! విష్ణూ" కాంతమ్మ గొంతు విని ఉలిక్కిపడ్డాడు. అతనికి తను ధరించిన ట్వీడ్‌సూట్, ఒమేగా వాచి ఎంతో బరువు అనిపించాయి.

"విష్ణూ! మీ అమ్మ పిలుస్తోంది."

"వింటున్నాను." ఫైళ్ళు ప్రక్కన పెట్టి లేచాడు.

"బాబూ! ఈ విషయాలు మనిద్దరికే తెలియాలి" చేయి చాపాడు. అప్రయత్నంగా ఆయన చేతిలో చేయివేశాడు. ఆయన కళ్ళు తృప్తిగా మెరిశాయి. అతను అలాగే నిల్చుండిపోయాడ

"బాబూ! విష్ణూ ఏం జరిగిందిరా?" కాంతమ్మ మరోసారి పిలిచింది.

"వస్తున్నానమ్మా, ఒక్క నిమిషం" బీరువాలో బిగించిన అద్దంలో తన ముఖం చూసుకున్నాడు. తన ముఖం తనకే అసహ్యంగా కన్పించింది. గ్లాసెడునీళ్ళు తీసుకుని కిటికీ దగ్గరకెళ్ళి ముఖం కడిగి వచ్చాడు. తలుపు తీశాడు. కాఫీ ఫలహారాలతో వచ్చింది అమ్మ.

"నా గుండె ఆగిపోయిందిరా!"

"ఏం లేదమ్మా! రేపటినుండి వ్యాపారము చూసుకోవాలి. అందుకు సంబంధించిన ఫైళ్ళు చూస్తున్నాను" కాఫీ గ్లాసు అందుకున్నాడు.

"చిప్స్ తీసుకోరా! నీకని పిన్ని స్వయంగా చేసింది."

"వద్దమ్మా యిప్పుడేం వద్దు" అన్నాడు. మరో అయిదు నిమిషాలకు డాక్టర్ వచ్చాడు. ఇంజక్షన్ యిచ్చాడు.

"ఏమయినా తీసుకున్నారా?" డాక్టర్ అడిగాడు.

"లేదు"

"మీకిష్టమయిన పదార్థాలు తినండి" అన్నాడు.

విష్ణు అతని బ్యాగు పట్టుకుని కారువరకు వెళ్ళాడు.

"డాక్టరుగారూ!"

"విష్ణూ బి బోల్డ్" భుజంతట్టి కార్లో కూర్చున్నాడు. అతని కారు వెళ్ళేవరకు అక్కడే నిలుచున్నాడు. అతనికంతా అయోమయంగా వుంది. ఏదో తెలియని దిగులు అతని మానసాన్ని కల్లోల పెట్టసాగింది. మెల్లగా ఇంట్లోకి వచ్చాడు. కాంతమ్మ పుట్టింటివారు, సుమతి అత్తగారు, యింకా బంధువులు కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. విష్ణును చూడగానే ఆపారు. అతను గమనించనట్టే వెళ్ళిపోయాడు.

## 5

సుందరమ్మ పెద్దకూతురు రాసిన ఉత్తరం కొడుక్కు యిచ్చింది.

"పిల్లలు బాగా చెడిపోయారుట్రా. నీ భయం ఉంటే చదువుకుంటారేమో పంపుతానని రాసింది-పిచ్చి సన్నాసి" అన్నది. మాట్లాడకుండా పైకి వెళ్ళాడు.

"ఈ విషయం కూడా పెళ్ళాన్ని సంప్రదించాలి కాబోలు" వెనకాల ఆమె గొణుక్కోవటం వినిపించింది. పైకి వెళ్ళాడు. సుజాత, సరళ ఏదో తీవ్రంగా వాదించుకుంటున్నారు. "ఎన్ని అయినా అను సుజా! సంసార రథానికి కళ్ళాలు బిగించేది మొగాడే".

"మొగాడు మృదువుగా వుంటే ఆడది పతివ్రత అవ్వాలా?" తీవ్రంగా అడిగింది సరళ.

"ఏమిటి మీ గోల?"

"పెద్దక్కయ్య ఉత్తరం రాసింది" అంది సుజాత.

"అమ్మ యిప్పుడే యిచ్చింది."

"ఈ విషయంలో కాస్త కఠినంగా వుండమ్మా, అంటే ఆయనిష్టం అంటుందేం? సీత, సావిత్రి తనే అనుకుంటోంది" అన్నది.



"సుజా! యెందుకమ్మా నీకీ విషయాలు?"

"ఎందుకా, కనీసం నీ పిల్లలను అనాధాశ్రమము చేరకుండా కాపాడాలని."

"సుజా!" ఈసారి కోపంగా అరిచాడు.

"యెందుకన్నయ్యా అరుపులు?" బాధగా అంది సుజాత - పెద్దక్క పంపగానే పంతానికి శ్యామక్క పంపుతుంది. వాళ్ళకయ్యే ఖర్చులు నిన్ను పైకి లేవనిస్తాయా?"

"అదికాదు సుజా! అదంత ప్రాధేయపడుతూ రాసింది. కాదని ఎలా రాయను."

"పెన్నుతో, కాగితంపై" అంది.

"నీకు అంతా ఆవేశమే."

"నాది ఆవేశమా? నువ్వూరుకో. నాటకం నేను నడిపిస్తాను. వదినా! నీవు పతివ్రతవు కావాలంటే నీ మూర్ఖత్వం వదిలిపెట్టి కాస్త సంసారం సంగతులు పట్టించుకో."

"బావుందమ్మా నీ కోపం" నవ్వింది సరళ. సుజాత మాటలకు ముచ్చట పడింది. "ఈ ఇంట్లో నువ్వు మొగపిల్లాడివై పుట్టాల్సింది" అన్నది.

"ఇప్పుడేమయింది?" రఘు నవ్వబోయాడు.

"చాల్లే నీ మస్కా. నేను చెప్పింది గుర్తుంచుకో."

సుజాత హెచ్చరించి క్రిందికి వెళ్ళిపోయింది.

"సరూ!"

"ఏం భర్తగారూ! మంచినీళ్ళు కావాలా?" నవ్వును బిగపట్టి అడిగింది.

"ఛీ.... మీకందరికీ లోకువయి పోయాను" అన్నాడు.

"పోనీ కాఫీ తెస్తాను" క్రిందికి వచ్చింది. కోడల్ని చూస్తూనే ముఖం చిట్లించింది సుందరమ్మ.

"కాలమమ్మా కాలం. ఒక్కనాడయినా యెదురుపడి మాట్లాడి యెరుగుదుమా! యిప్పుడు మేడలెక్కి దిగరు. ఈ వంట అయినట్టే" అన్నది.

"ఈ పూట అందరం పడుకుందాం. ఆరోగ్యానికి మంచిదే" సుజాత అన్నది.

"నువ్వు మాట్లాడకే నాకు తిక్క రేగుతుంది. నన్ను ఆడిస్తున్నావ్ కట్నం లేకుండా యెవడొస్తాడో చూస్తాను. పుట్టగానే చస్తే పీడ పోను" ఆమె మాటలు సాగుతుండగానే అందరికీ కాఫీ యిచ్చి వంటకు ఉపక్రమించింది సరళ.

"ఓ సుజాతమ్మ తల్లీ!"

"ఏం? ఏం కావాలమ్మా?"

"అలా మొద్దులా కూర్చోపోతే పెద్దక్కకి ఉత్తరం రాయకూడదటే."

"సరే!" పెన్ను తెచ్చుకుని బుద్ధిమంతురాలిలా కూర్చుంది.

"ఏం రాయమంటావు?"

"నా ఇల్లు. నా యిష్టం. యెవరి అనుమతి దేనికి?"

"ఇదంతా రాయనా?"

"నోరుముయ్యి. ఆ పిల్లలతో ఏం కష్టాలు పడుతుందో, వెంటనే పిల్లలను పంపమని రాయి" ప్రసన్నంగా అంది.

"అన్నయ్య కిష్టమో, లేదో....?"

"వాడెవడే వద్దనటానికి?"

"ఈ ఇంట్లో సంపాదించేది అన్నయ్యే."

"ఏం మాయదారి కాలమే, మా కాలంలో అయినవారిని, కాని వారిని అట్టేపెట్టుకు చదివించాం."

"కాలం మాయదారిది కాదమ్మా. మనుష్యులే మాయదారి వారు. నాకు గుర్తుంది-అత్తయ్య కొడుకు మనింట్లో వున్నప్పుడు నాకు పెరుగువేసి, వాడికి మజ్జిగ పోసినా ఊరుకున్నాడు. ఇప్పటి పిల్లలు ఊరుకుంటారా?"

"నీ ఎతండవాదంతో చంపకే. నేను చెప్పింది రాయి."

"అలాగే" బుద్ధిమంతురాలిలా ఉత్తరం రాసింది.

"ప్రియమైన అక్కకు,

అంతా క్షేమము, నీ క్షేమము తెలిసి అమ్మ చాలా సంతోషించింది. ఇక్కడ అన్నయ్య తన పిల్లలనే చూచుకోడు. నీ పిల్లలనేం చూస్తాడు? హాయిగా హాస్టల్లో చేర్పించు. ఇప్పుడు డబ్బు ముఖం చూచుకుని రేపు అనుకుంటే లాభంలేదు. ఇక పప్పన్నం తినాలని బావగారి ఉబలాటమా?



వచ్చినప్పుడల్లా పంచభక్ష్య పరమాణ్ణాలే తింటున్నారుగా. ఇంకా యెలాంటి శుభగడియా రాలేదు. అమ్మ అందరినీ అడిగానని చెప్పింది.

ప్రేమతో చెల్లెలు

సుజాత.

"అయిందమ్మా"

"పోస్టు చేయించు! అలా దేవాలయంవరకు వెళ్ళివస్తాను" సుందరమ్మ వెళ్ళిపోయింది. "ఏదీ చదువు" అననందుకు తల్లిని మెచ్చుకుంది మనసులోనే.

"ఏమిటి మరదలమ్మా, ప్రేమలేఖా?"

"చూడు." ఉత్తరం అందించింది. అది చూచి సరళ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఇంట్లో తుఫాను రేగాలంటే ఈ ఉత్తరం పోస్టు చేయి."

"సరేలే, నీవు తెలివయినదానివని అపోహపడ్డాను" చుర, చుర చూస్తూ లేచిపోయింది సుజాత.

## 6

సరిగ్గా తండ్రి చనిపోయి వారం రోజులయింది. విష్ణువర్ధన్ కేలండర్ వంక చూచి నిట్టూర్చాడు. కాలం ఎవరికోసం ఆగదు. మాసినగడ్డంతో పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. ఎవరితోనూ మాట్లాడ్డంలేదు. అందరితో వెళ్ళి ఏదో భోజనం అయిందనిపిస్తున్నాడు. అతన్ని తేనెటీగల్లా ఆలోచనలు చుట్టుముట్టాయి. ఉక్కగా వుందని లాన్‌లోకి వచ్చాడు. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. పెద్ద గుమాస్తా వెంకటసుబ్బయ్య, వీరయ్య బయటికి వెడుతున్నారు.

"సుబ్బయ్యగారూ!"

"చిత్తం..." అతను వచ్చాడు.

"రండి, కూర్చోండి. యెక్కడికో బయలుదేరారు?"

"పెద్ద ఖర్మకు కావాల్సిన వస్తువులు తెస్తాము" అంటూ లిస్టు చూపాడు. అదిచూసి మతి పోయినంత పని అయింది. "ఈ లిస్టు ఎవరిచ్చారు?" అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

"దీనికంతా ఎంత ఖర్చు అవుతుంది?"

"రెండు వేలదాకా అవ్వొచ్చు."

"బ్యాంక్ అకౌంట్ నా పేర వుంది. డబ్బెవరిచ్చారు?"

"ఎవరూ ఇవ్వలేదు. ఖాతా వుందిగా."

"ఊహుం...." లేచాడు విష్ణు. "మరో రెండు గంటలు ఆగి వెళ్లదురుగాని. ఇకనుండి ఖాతా యివద్దు. నేను డబ్బిస్తాను."

"నాన్నగారున్నప్పటినుండి యిలాగే జరుగుతూంది."

"నాకు, నాన్నగారికి ఒక తరం తేడావుందన్న సంగతి మరిచిపోవద్దు. ఈ సంగతి అమ్మకు తెలియాల్సిన అవసరం లేదు. నేను మరో లిస్టు యిస్తాను. వాటి ప్రకారం తీసుకురండి."

"చిత్తం!"

వాళ్ళు అక్కడుండగానే ఇంట్లోకి వెళ్ళాడు. పది నిమిషాల తరువాత ఉతికిన పైజమా, లాల్చీ వేసుకుని వచ్చాడు. బయటికివెళ్ళి అరగంటలో వచ్చాడు.

"ఇదిగో డబ్బు. అన్నీ సగం తగ్గించి తీసుకురండి." సుబ్బరామయ్య ఏమో చెప్పబోయి, విష్ణు గంభీరవదనం చూచి తలవంచుకు వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి తల్లి దగ్గరనుండి పిలుపు వచ్చింది. "పిలిచావా అమ్మా" అన్నాడు. కారణం అతనికి తెలుసు.

"ఇలా కూర్చో. ఇలా యెప్పుడయినా జరిగిందా? మేం యెంత రాసినా ఏనాడూ వివరం అడగలేదు పుణ్యాత్ముడు" ముఖానికి కొంగు అడ్డుపెట్టుకుంది.

"అదికాదమ్మా! పరిస్థితులు మారాయి. మనమూ మారాలి."

"అదే ఎందుకురా? పెత్తనం రాగానే మార్పు తేవాలా?"

"లేదమ్మా! ఏం కావాలో తెప్పించుకోండి" అనేసి పైకి వెళ్లిపోయాడు. తండ్రి చితి ఆరకపూర్వమే తల్లిని బాధపెట్టడం అతనికిష్టం లేదు.

అతని కిష్టంలేనివి, అవసరం లేనివి ఎన్నో జరుగుతున్నాయి. అశాంతిగా పన్నెండోరోజు రాత్రి మేడ బాల్కనీలో తిరుగుతున్నాడు. అతనికి అవుట్‌హౌస్‌లో వీరయ్య, అతని కూతురు కనిపించారు. తండ్రి వెలిగించిన చుట్ట తనకు కావాలని మారాం చేస్తోంది. అతను ముద్దాడి, ఎన్నో విధాలుగా మాన్పించే ప్రయత్నం చేశాడు. ఆ పిల్ల మారాం మానదు. విసిగి బెదిరించాడు. ఏడ్పు మొదలెట్టబోయింది. చెయ్యి ఎత్తాడు నోరు మూసుకుని తల్లిని కరుచుకుపోయింది. ఆ సంఘటన అతనికేదో సందేశం యిచ్చింది.

* * *

పెద్దకర్మ మర్నాడు అందరూ వెళ్ళిపోయారు. సుమతి అత్తగారి పరివార మంతా వచ్చారు. వెళ్ళడానికి సిద్ధం అవుతున్నారు. సుమతికి మరో పది రోజులుండి, తన పుట్టింటి వైభవము ఆడపడుచులకు చూపాలని వుంది.

"వెడదాం అనుకుంటున్నాం విష్ణూ!" అన్నది. అతను తమను ఆపు చేయాలని ఆవిడ ఉద్దేశం.

"మంచిదక్కయ్యా, కర్మకు వచ్చి వుండరాదంటారు. అదీకాక బావగారు అక్కడ ఇబ్బంది పడతారేమో?"

సుమతి దిమ్మెరపోయింది. తన తమ్ముడేనా?

అరగంట తరువాత తల్లి దగ్గరనుండి పిలుపు వచ్చింది. వెళ్ళి తల్లిని చూడలేక ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నాడు. లక్ష్మీదేవిలా కళకళలాడుతూ వుండే కాంతమ్మ బోసిగా, ఏమోగా కూర్చుంది.

"పిలిచావా అమ్మా?"

"అవునురా. సుమతి వెళ్ళిపోతుందట. వాళ్ళందరికి రిజర్వేషన్ చేయించు."

"అవన్నీ నేను చూసుకుంటాను. నీవు నిశ్చింతగా వుండమ్మా" వెనుదిరిగాడు.

"అదికాదురా, నీకు యింకా మర్యాదలు తెలియవు."

"నాకంతా తెలుసమ్మా. మనం పెళ్ళి పేరంటాలకు పిలిచిననాడు అలాంటి మర్యాదలు. చావుల దగ్గరేమిటమ్మా!" తల్లికి వాదించే అవకాశము యివ్వకనే వెళ్ళిపోయాడు.

"యెందుకండీ!... నన్నీ స్థితిలో వదిలిపోయారు" కుమిలి, కుమిలి భర్తను తలుచుకుని ఏడ్చింది కాంతమ్మ.

"ప్రభా!" కళ్ళు ఒత్తుకుని కూతుర్ని పిలిచింది.

"ఏమ్మా!"

"బీరువాలో డబ్బుంది. సుబ్బరామయ్యకిచ్చి అక్కయ్య వాళ్ళకు టిక్కెట్లు కొనమనిచెప్పు."

"అలాగేనమ్మా" ప్రభ బీరువాదగ్గర కెళ్ళింది.

"అక్కయ్యా" సుశీలమ్మ వచ్చింది. "బావగారి మరణవార్త వింటూనే అన్నయ్య బస్సెక్కాడట. ఓ వందరూపాయలుంటే ఇస్తావా?"

"తీసుకోమ్మా! ప్రభా, పిన్నికి వందరూపాయలు ఇవ్వమ్మా!" ప్రభ తల్లి చెప్పినట్టు చేసింది. మర్నాడు సుమతి పరివారంతో వెళ్ళిపోయింది. సుశీలమ్మ అన్న కుటుంబం వెళ్ళిపోయింది.

"అక్కయ్యా" కమలమ్మ వచ్చింది.

"ఏమిటే?"

"నెత్తిమీద నీడలేనిదాన్ని. నాకేం స్వతంత్రం. అయినా సిగ్గువిడిచి అడిగాను" కళ్ళు ఒత్తుకుంది.

"అసలు సంగతేమిటే?"

"సుశీలక్కకు వందరూపాయలు ఇచ్చాడు. మా నాన్నను ప్రయివేటు డాక్టర్‌కి చూపించడానికి డబ్బు లేదా? ఉస్మానియాకు వెళ్ళమన్నాడట."

"సుశీలకు డబ్బు వాడివ్వలేదే. చిన్న వెధవ. అలా కోపం తెచ్చుకుంటే యెలా?" బీరువా తీసి యాభై రూపాయలు చేతిలో పెట్టింది. కమలమ్మ ముఖం ప్రసన్నం చేసుకుని వెళ్ళిపోయింది. కాంతమ్మ లేచి బయటికి వచ్చింది. తను భర్త మరణానికి పగుస్తూ కూర్చుంటే, లోకానుభవంలేని విష్ణు అందరితో నిష్టూరాలుతెచ్చేలా వున్నాడు-అనుకుంది.

## 7

"ఆపండి, ఇదే మా ఇల్లు" రఘు అన్నాడు.

"మీరు ఇలా జ్వరంతో పనిచేయటం భావ్యం కాదండీ."

విష్ణు తలుపుతీశాడు.

"ఉదయం బాగానే ఉన్నానండీ. మీరు సమయానికి అక్కడికి రాబట్టి సరిపోయింది."



"డాక్టర్ దగ్గరకు తప్పకుండా వెళ్ళండి."

"అలాగే! ఒక్కసారి ఇంట్లోకివచ్చి కాఫీ తీసుకుపొండి."

"మరోసారి వస్తాను."

"మీరు వ్యాపారస్తులు. మరోసారి వస్తారనుకోను. ప్లీజ్ రండి" రఘు ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"సరే! మీరంతగా అంటుంటే కాదనటానికి మనసు రావటం లేదు" విష్ణు కారు దిగి తలుపువేశాడు.

"ఒక్కమాట"

"చెప్పండి!"

"నేను రోడ్డుమీద స్పృహ తప్పానని మా ఇంట్లో అనకండి"

"అదేమిటి? మీ ఆవిడ-"

"ఆవిడ కాదండీ. మా ఇంట్లో ఓ మారెమ్మ వుంది. అందరినీ జడిపిస్తుంది."

"మారెమ్మా?"

"అదేనండీ, మా చెల్లెలు."

విష్ణు ఫక్కున నవ్వేడు. రఘు కూడా శృతి కలిపాడు. ఆవిడ హిడింబిలా వుండి చేతిలో గరిటతో వస్తుందని ఊహించాడు. ఇద్దరూ వెళ్ళారు ఇంటిముందుకు. సన్నగా, పొడుగ్గా, బంగారు తీగెలావున్న యువతి అనర్గళంగా ఉపన్యసిస్తోంది.

"చూడు మామ్మగారూ, నీటియెద్దడిగావుందని కుళాయి కట్టేశాను."

"డబ్బిచ్చాం. పోతేపోయాయి."

"అలా అంటే నేనేం చెప్పాలి? వస్తువులు వృధా చేయొద్దని మీరు మాకు చెప్పేదిపోయి...."

"సుజా!" రఘు పిలుపుతో వెనక్కు తిరిగింది. కొత్త యువకుడిని చూచి సుజాత లజ్జితురాలయింది. వాకిట్లో వున్నవారందరూ లోపలికి తప్పుకున్నారు. సుజాత, ఆ వెనుక రఘు, విష్ణు లోపలికి వెళ్లారు.

"సుజా! ఇతను విష్ణువర్ధన్ - 'రామయ్య అండ్ బ్రదర్స్' వర్క్‌షాప్ ప్రొప్రయిటర్. మా చెల్లి సుజాత."

"అంటే ఇందాక మీరు చెప్పిన మా..."

"అవునవును" కంగారుగా అన్నాడు రఘు. ఇద్దరూ పరస్పరం నమస్కరించుకున్నారు.

"కూర్చోండి" అని లోపలికి వెళ్ళింది సుజాత.

"ఒట్టి కాఫీ చాలు. ఫలహారం అంటూ యిప్పుడేం హడావుడి పడొద్దనండి

"ఆ దిగులు మీకేం అక్కరలేదు. మా చెల్లెలు ఇలాంటి విషయాలలో ఒట్టి పిసినారి. దాన్ని ఆర్థికమంత్రినిగా చేస్తే ఈపాటికి దేశం బాగుపడేది" అన్నాడు. తరువాత భార్యను, బిడ్డలను పరిచయం చేశాడు. సుందరమ్మ లేదు. ఇంట్లో కాఫీ త్రాగి బయటకు వచ్చి, రఘును మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు.

రఘుకు యెవరేమన్నా భరించే శక్తిలేదు. ఉదయము మార్వాడీ వచ్చి నానామాటలని వెళ్ళిపోయాడు. అప్పు తీర్చేయాలని వార్నింగు యిచ్చాడు. అప్పు తీర్చే మార్గము కనిపించలేదు. ౧ నెలకానెల ఏదో ఒకటి వస్తూనే వుంది. మధ్యాహ్నానికి విపరీతంగా తలనొప్పి వచ్చింది. జ్వరం వచ్చినట్టు అన్పించింది. ఫైళ్ళుకట్టి ఇంటికి బయలుదేరాడు. కొద్దిదూరం రాగానే తూలాడు. ఇంకో నిముషం అయితే రోడ్డుకడ్డంగా పడేవాడే. బలమైన చేయి వచ్చి ఆపింది. సంబాళించుకుని తలెత్తి చూశాడు. ఎదురుగా విష్ణు. ఇద్దరూ పరిచయాల తరువాత ఎక్కడో బీరకాయపీచు చుట్టరికం కూడా బయటపడింది. ఆ తరువాత విష్ణు దగ్గర్లోనే వున్న వర్కుషాప్‌కెళ్ళి కారు తెచ్చాడు. ఎంత వారించినా వినక లిఫ్టు యిచ్చాడు.

"అతను వెళ్ళిపోయి చాలాసేపయింది అన్నయ్యా"

"ఆఁ ఏం లేదు".

ఇంట్లోకి వచ్చాడు. సుజాతను అడిగి మాత్ర వేసుకు పడుకున్నాడు.

## 8

"చిన్నబాబూ! ఏమిటిది?" సుబ్బరామయ్య వచ్చాడు.

"ఏం జరిగిందండీ?" విష్ణు అడిగాడు.

"జీపు అమ్మారట!"



"అవును."

"మీ ఆరోగ్యం"

"దివ్యంగా వుంది. నాకేం మతి చలించలేదు. మిమ్మల్ని సలహా అడిగితే తప్పక చెబుదురుగాని."

"అయ్యా."

"ఇక మీరు వెళ్ళవచ్చు."

"చిత్తం" సుబ్బరామయ్య ఆఫీసులో జరిగిన మార్పులనే సహించ లేకపోతుంటే ఇదొకటి. వెంటనే కాంతమ్మ దగ్గరకు పరుగులుపెట్టాడు.

సాయంత్రం విష్ణు టీ త్రాగుచుండగా కాంతమ్మ వచ్చింది.

"మతిగాని పోయిందేమిట్రా?"

"ఎందుకమ్మా"

"జీపు అమ్మావట"

"అవును. అవసరంలేదు అనిపించింది, అమ్మాను"

"ఇంట్లో ఎవరి అనుమతీ అవసరం లేదా?"

"ఎవరి అనుమతితో కొన్నారు నాన్న"

"అంటే...." చలపతి అడిగాడు.

"బాబాయ్! యిల్లు ఒక్కరు నడిపితే బాగుంటుంది. బాధ్యతలు మీరు తీసుకుంటానంటే నాకేం అభ్యంతరం లేదు."

"అన్నయ్య నీకే అప్పగించాడుగా" లేచిపోయాడు. మొదటినుండి అతను తేలికగా బ్రతకటానికి అలవాటు పడ్డాడు.

"అదికాదురా! అడుగడుగునా ఈ మార్పులేమిటి? టైపిస్టు షీలాను ఎందుకు మాన్పించినట్టు! మీ నాన్న చేసినవి అసమంజసం అని చూపడానికేగా...?" కాంతమ్మ అడిగింది.

"అదంతా నీకు ఎవరు చెప్పారో? శుద్ధ అబద్ధం. ఆ పిల్లకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. ఓపిక అంతకన్నా లేదు. మూడు నెలల నుండి ఉత్తి పుణ్యానికి జీతం తీసుకుంట ంది."

"మేనేజర్‌గారికి పనిలేదా?"

"లేదని నేను అన్నానా? అతనికి ఫలానా పని అని నేను పురమాయించాను. అతని కది ఇష్టం లేదు."

"మరి, అతని పని ఎవరు చేస్తారు?"

"నేను."

"ఇంత బ్రతుకు బ్రతికి ఈ కర్మ ఏమిట్రా?"

"అమ్మా! మీరు బయటి విషయాలలో తలదూర్చి నన్ను చికాకు పరచవద్దు. అలా ప్రతిసారీ ఏదో ఒకటి అంటూ వుంటే, నేను వెళ్ళి ఎమ్.కామ్., చేస్తాను లేదా అంతా నా ఇష్టప్రకారమే జరగాలి" అన్నాడు నిశ్చలంగా, దృఢస్వరంతో. ఆమె మ్రాన్పడిపోయింది.

"మరింట్లో మాటేమిటి, మున్నెయ్య, వీరయ్యల్ని వ్యవసాయం చేయమన్నావుట?" సుశీలమ్మ అడిగింది.

"అంతేకాదు పిన్నీ! రంగి, చిట్టి పొలం దగ్గరే వుంటారు. మంగమ్మా, కన్నా మాత్రం ఇంట్లో వుంటారు."

"మరి వంట. పిల్లల జడలు ఎవరు చూస్తారు?"

"అమ్మా! అన్నీ నా నోటిమీదుగా చెప్పించి, నన్ను దోషిగా చేయాలా! ముగ్గురు స్త్రీలున్న ఇంట్లో వంట ఓ సమస్యా!"

దూరంగా నిలబడి వీళ్ళ సంభాషణ వింటున్న కమలమ్మ మ్రాన్పడిపోయింది. క్రితంసారి యింతమంది "పనివారుండగా వంట నీవే చేయాలా" అన్న విష్ణుయేనా? అధికార గర్వం ఎంత చెడ్డది. నిర్దాక్షిణ్యంగా ఇంటిలోని స్త్రీలను వంటవారి క్రింద జమకట్టేశాడు. ఆమె కళ్ళు చెమర్చాయి.

"మేమంతా వంటమనుషుల్లా కనిపిస్తున్నామా?"

సుశీలమ్మ ఉక్రోషంగా అడిగింది.

"పిన్నీ, ఇక్కడ పరాయివారెవరూ లేరు. అంతా ఇంటివారమే. మన పనులు మనం చేసుకుంటే తప్పేం లేదు. ఆడపిల్లలు, రేపు మరో ఇంటికి వెళ్లాల్సిన వారు. అక్కడ పరిస్థితి మనకు తెలియదుగా! అన్నీ గారాలు నేర్పి జడలు వేసుకునే అవసరం రాకుండా పెంచుతారా? నేను చెప్పింది జరిగి తీరుతుంది" ఆజ్ఞాపించినట్టే అని వెళ్ళిపోయాడు. చేతిలోని



కప్పులో రెండుగుక్కల కాఫీ మాత్రమే త్రాగి వెళ్ళిపోయాడు. అది చూచి కాంతమ్మ హృదయం కలుక్కుమంది.

"వీడెంత కర్కోటకుడుగా తయారయ్యాడు"

సుశీలమ్మ విస్తుపోయింది.

"నాకు చావు వస్తే బావుండునే సుశీలా?"

"ఊర్కో అక్కా! మీ మరిది చూసుకోలేరా ఏం! వెళ్ళి ఎమ్.కామ్. చదవమను" అన్నది సుశీలమ్మ.

అప్పటికి అందరూ తేలికపడ్డారు.

మర్నాడు ఉదయం విష్ణు ఫలహారానికి వచ్చాడు. బల్లమీది వస్తువులు చూసి ముఖం చిట్లించాడు. అతని భావం గ్రహించినట్టు జవాబు యిచ్చింది సుశీలమ్మ. "చిన్నపిల్లలు ఇడ్లీ కావాలంటారు, ప్రభకు ఉప్మా కావాలి. మీ బాబాయికి చపాతీలు కావాలి. నీకిష్టమని..."

ఆమె మాట మధ్యలోనే త్రుంచేశాడు.

"మరి అమ్మకు, మీకు ఏం ఇష్టమో చేయలేదేం?"

"మాదేం ఉంది"

"మళ్ళీ ఈ పక్షపాతమెందుకు?"

అతని మాట పూర్తికాకపూర్వమే వాసు గదిలోంచి ఫలహారం కోసం కేకవేశాడు.

"వాసూ! ఇక్కడికి రా!"

"అబ్బా! బోర్ ఇక్కడికే పంపమ్మా"

"వాసూ!" అది పిలుపుకాదు, గర్జన. పిలిచింది కమలమ్మ కాదు విష్ణు.

"ఏమన్నయ్యా" తటపటాయిస్తూ వచ్చాడు. తనిప్పుడేం తప్పు చేశాడని.

"ఏరా గదిలోకి ఫలహారం తేవాలా? నిన్ను నీవు ఏం అనుకుంటున్నావు? ప్రిన్స్ ఆఫ్ వేల్స్ వా? ప్రభా, రమా, రేణూ అందరూ యిలా రండి" ఏమిటో అని అందరూ వచ్చారు. "రేపటి నుండి అందరమూ ఒకేసారి ఒకే విధమయిన ఫలహారం చేయాలి. అదీ యిక్కడే తెలిసిందా?"

"ఆ" అందరూ కూర్చున్నారు.

"పిన్నీ, ఇష్టమో! కష్టమో! అందరికీ ఒకే ఫలహారం మీకు తోచింది చేయాలి" అందరూ మౌనంగా ఫలహారాలు ముగించి లేచారు.

"ఆయన లేకే ఈ మాటలు పడుతున్నాను" అనుకుంటూ కళ్ళు ఒత్తుకుంది కమలమ్మ. కాంతమ్మ కొడుకుతో ఈ విషయాలు చెబుదామంటే అవకాశమే రాదు. అతను ఇంటిలో ఉండేదే తక్కువ. ఉన్నంతసేపూ టెలిఫోన్ కాల్స్, ఎవరో రావటంతో అవతలకి పోతాడు.

రెండురోజుల తరువాత సుధ దిగింది పెట్టే బేడాతో. అందరూ ఇప్పుడేం సెలవులా అని అనుకున్నారు.

"ఇప్పుడేం సెలవులే?"

"నాకేం తెలుసు? మా కాలేజి వాళ్ళు పిక్‌నిక్ వెడుతున్నారు. రెండు వందలు కావాలని అన్నయ్యకు ఫోను చేశాను. అన్నీ సర్దుకుని రా అన్నాడు."

"ఎందుకో అడగలేదా?" కమలమ్మ ఆదుర్దాగా అడిగింది.

"అసలు అడగనిస్తేగా! ఫోను పెట్టేశాడు" అన్నది సామానులు గదిలో సర్దుతూ.

"రంగీ... చిట్టీ... యీ సామానులు కాస్త సర్దండే" సుధ కేకలు వేసింది.

"వాళ్ళంతా ఎక్కడున్నారమ్మా! పెద్దనాన్నతోనే ఈ యింటి డాబూ, దర్పం వెళ్ళిపోయాయి" కమలమ్మ నిట్టూర్చింది.

"అదేమిటమ్మా!"

"ఆ కర్కోటకుడికి పెత్తనం వచ్చిందా, అంతా తారుమారు అయింది."

"కర్కోటకుడా? వాడెవడే?"

"ఉష్... నీకేం తెలియదు. పెద్దన్నయ్య" రేణు గొణిగింది.

"ఊర్కో... అన్నయ్య వచ్చే వేళయింది. పదండే" స్టడీరూమ్‌లోకి రమ రేణును తోసింది. ఈ మార్పేమిటో సుధకు అర్థం కాలేదు. స్నానం చేసి వచ్చింది. భోజనాల బల్లదగ్గర అందరినీ చూసి ఆశ్చర్యపోయింది. తనూ వెళ్ళి కూర్చుంది.

"ఎప్పుడొచ్చావ్?" విష్ణు పలకరింపుగా అడిగాడు.

"సాయంత్రం" అన్నదే కాని, అతని గంభీరవదనం చూసి 'ఎందుకు పిలిచావ్' అని అడగలేకపోయింది. వడ్డిస్తూ కాంతమ్మే అడిగింది.

"ఏరా, సుధను అన్నీ సర్దుకుని రమ్మన్నావట?"



"సుధే కాదు. వచ్చేవారం రాజీవ్, ఉదయ్‌లు కూడా వస్తారు. అందరికీ బస్సు ప్యాసులు కొంటాను" నిదానంగా చెప్పాడు. అందరూ ఒకసారి ఒకరి నొకరు చూచుకొని తలలు వంచేసుకున్నారు.

"వాసు కనిపించడేం?"

"వాడు క్రికెట్ ఆట ప్రాక్టీసు చేశాడట. అసలు..."

"అసలూ, వడ్డీ కలిపి పడక్కి చేరాడు. పిల్లలు చదువుకునే వారు కాసేపు చదువుకోవాలి. రేపటినుండి మీలో ఎవరు తొమ్మిదిన్నర లోపున నిదురబోయినా, నాకంటె చెడ్డవాడు మరొకడు వుండడు" పిల్లలను హెచ్చరించాడు. "ప్రభా! ఆ వాసు మహాశయుడికి కూడా చెప్పు".

"మంచిదన్నయ్యా!" పిల్లలు లేచి వెళ్ళిపోయారు.

"పిల్లలు ఇక్కడనుంచి స్కూలుకు వెళ్ళటం ఏమిట్రా?"

"అదంతే! వివరాలు చెప్పినా మీకు అర్థం కావు. అందరూ మనుషుల్లా తయారవుతారు చాలదె."

"విష్ణూ! సుబ్బరామయ్య సామానులు తేనంటాడేమిటి?"

"ఓ..... పిన్నీ, అమ్మా! అందరూ వినండి. మనం తినేది ఒక వంతు, పారబోసేది రెండొంతులు. రేపటినుండి ప్రతిపూటా యిన్ని కూరలు వద్దు."

"బావుందయ్యా వ్యవహారం! అన్నీ నేనే తింటున్నానేమిటి?"

"ఎంత తింటావో తిను పిన్నీ" నవ్వేడు. "మీరు సవ్యంగా ఏదీ అర్థం చేసుకోరు. అది నా దురదృష్టం."

"నాదిరా... నాది" అన్నది కాంతమ్మ.

"అందరి భోజనాలు అయ్యాయి గదా మీరు ముగ్గురు వున్నారు. ఎన్ని పదార్థాలు మిగిలిపోయాయి? అవన్నీ పారబోయటమేగా! అరువు వస్తువులు బంద్. నా సంతకం లేని చీటీలు ఎవరు పంపినా నా బాధ్యత లేదు."

"అది గాదురా, అన్నయ్య పోగానే యిన్ని ఆంక్షలు ఎందుకు? జీపు అమ్మావు. ఇల్లు అద్దెకిచ్చావు" చలపతి అడిగాడు.

"అవసరం ఉందిగనుకే. బాధ్యతగలవాడిగా, ఈ కుటుంబ క్షేమం కోరి అలా చేయాల్సి వచ్చింది" లేచి చేయి కడుక్కుని పైకిపోయాడు.

"ఆ వ్యవహారాలు మీరు చూడరాదండీ, వాడు పేలపుగింజలా పేలి పోతున్నాడు" ఉక్రోషంగా అంది సుశీలమ్మ.

"నిజం చలపతీ" కాంతమ్మ బలపరిచింది.

"అలాగే చూస్తాను. అదేం గొప్ప విషయమా?" అని ఆడవాళ్ల దగ్గర కోతలు కోసిన చలపతి విష్ణు చూపిన దస్త్రాలు, లెక్కలు, ఆదాయం, ఖర్చు చూస్తూనే హడలిపోయాడు. "జన్మలో స్త్రీలమాట వినకూడదు" అనుకున్నాడు.

"ఇదంతా నాకెందుకురా? ఏదో నీ తంటాలు నీవు పడు. ఈ ఆడవారికి ఎవరిదో ఒకరి భయం ఉండాలి" అని క్రిందికి వచ్చాడు.

"ఏమన్నాడు?" సుశీలమ్మ అడిగింది.

"పెత్తనం తీసుకోమన్నాడు. కాని ఆరు నెలల్లో హార్టు అటాక్ వస్తుంది" అన్నాడు.

"ఏమిటండీ. వివరంగా చెప్పండి."

"అంత తెలివిలేదు నాకు సుశీలా. నన్నిలా బ్రతకనివ్వండి." అతని మాటలకు సుశీలమ్మకు పీకలదాకా కోపం వచ్చింది. దిగమింగి ఊరుకుంది.

## 9

విష్ణుకు ప్రతిరోజూ ఒక గండంలా వుంది. అందరికీ శత్రువుగా మారాడు. ఇంటిలో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. తను కమిషన్ వ్యాపారం కొట్లో కూర్చుని ఫైళ్ళు చూస్తున్నాడు.

"అయ్యా... తమరి కోసం ఎవరో వచ్చారు" బయట వుండే నైట్ వాచ్‌మెన్ చెప్పాడు.

"రమ్మను" తల ఎత్తకనే జవాబు యిచ్చాడు. అతనికి మహా చికాకుగా వుంది. సుబ్బరామయ్య వందలకు వందలు ధాన్యం బస్తాలు కొన్నాడు. ధర బాగా పడిపోయింది, ఎంత లేదన్నా ఆరేడు వేలు నష్టం వచ్చేలా వుంది.

"నమస్తే సర్"



"యస్.... నావల్ల మీకేం సహాయం కావాలి?" తలెత్తి ఆశ్చర్యంగా చూశాడు. ఆ వచ్చిన అమ్మాయి, అంతకన్న ఆశ్చర్యపోయింది.

"మీరు.... మీరు...." అన్నది తడబడుతూ.

"నేను నేనేనండీ. నా పేరు మీరు మరిచిపోయినా మీ పేరు నాకు గుర్తుంది. మారే.... సారీ సుజాత" విష్ణు నవ్వు బిగపట్టి అన్నాడు.

"ఓ.... మా అన్నతో వచ్చారు. పేరు నాకు గుర్తుకు రావటం లేదు."

"విష్ణువర్ధన్ కూర్చోండి యిప్పుడు చెప్పండి."

ఆమె అతని కెదురుగా కుర్చీలో కూర్చుని ముఖాన పట్టిన చెమట ఒత్తుకుంది.

"మీరు యిచ్చిన ఎడ్వర్టయిజ్‌మెంట్ చూశాను."

"నేనా?"

"మీరో-మరెవరో ఈ సంస్థ ప్రొప్రయిటర్ - టైపిస్టు కావాలని ప్రకటించారు" ఆమె పేపర్ చూపింది. విష్ణు ముఖంలో రంగులు మారాయి. బెల్ కొట్టాడు యిందాకటి వాచ్‌మెన్ వచ్చాడు.

"సుబ్బరామయ్యగార్ని యిలా పిలువు."

మరో అయిదు నిమిషాల్లో అయన వచ్చి విష్ణు ముందు చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

"ఇది మనం యిచ్చిన ప్రకటన కదూ!" పేపరులో ఎర్రగీత పెట్టిన స్థలం చూపాడు.

"బాబుగారు-మరి?"

"వివరణ తరువాత. మనం ఇచ్చిందేనా?"

"చిత్తం"

"మీరు వెళ్ళొచ్చు" సుబ్బరామయ్య పిల్లిలా వెళ్ళిపోయాడు.

"సారీ-మిస్ సుజాతా. ఆ వేకెన్సీ ఫిలప్ అయింది. ఆఫీసు స్టాఫ్‌కు తెలియదు. అందుకే ప్రకటన చేశారు."

"ఫరవాలేదు" లేచి వెళ్ళిపోయింది. సాయంత్రం వరకు ఓ పాతిక మంది వచ్చి వెళ్ళారు. విష్ణు కోపం తారాస్థాయిని అందుకుంది. సుబ్బ రామయ్యను దులిపివేశాడు.

"క్షమించండి బాబూ, ఒక టైపిస్టు వెడితే మరొకరికోసం వెం[illegible] ప్రకటన చెయ్యమని నాన్నగారి ఆజ్ఞ."

"ఆయన ఇప్పుడు లేరుగా"

"మీకు అవసరం కదా..."

"అది నేను చూసుకుంటాను. ఇలా మరోసారి జరిగితే మీ[illegible] సెలవు పుచ్చుకోవాలి."

"అయ్యా.... అంతమాట అనొద్దు"

అతన్ని పంపివేశాడు. మనసంతా చికాకుగా వుంది. కోటు భుజ[illegible] వేసుకుని బయలుదేరాడు. అతని కారు వెళ్ళి టాంక్‌బండ్‌పై ఆగిం[illegible] దిగి ముందుకు వెడుతూ ప్రక్కకు తిరిగి చూశాడు.

"నిజంగా మనవారు మూర్ఖులా, అతితెలివైనవారా అర్థం కాదు. అప్పులు చేసి ఆడంబరాలు చూపకపోతేనేం? అన్నయ్యకు శాసించడ[illegible] రాదు. అమ్మ ఏదంటే అది 'సయ్' అంటాడు. ఉద్యోగం దొరికితే [illegible] యేడాది పాటుచేసి, అన్నయ్యకు సహాయపడదాం అనుకుంటున్నాను".

"అవన్నీ ఆలోచించకే. సినిమాకు వెళదాం పద" మరో అమ్మాయి అంటోంది.

"సారీ.... నా ట్రబుల్సుతో నీ సమయం పాడు చేశాను."

"అదేం లేదు సుజా, మరి మొన్నటి సంబంధం."

"అక్కరలేదని చెప్పాను. ఏది ఏమయినా కట్నం అనేవాడి నీడ కూడా భరించను."

"అయితే కన్యగానే మిగిలిపోతావు."

"మరేం ఫరవాలేదు."

"అని నువ్వు అనుకున్నా లోకం అనుకోదు."

"అదీ చూద్దాం. నేను చేసి చూపాక కొందరికయినా ఇన్‌స్పిరేషన్ వస్తుందేమో...." ఇద్దరూ అలా మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు. వారు దూరం అయ్యేవరకు అలాగే చూశాడు. తలతిప్పి మరో రెండు అడుగులు వేసి, షాక్ తగిలినట్టు నిలబడిపోయాడు.

"నా ఉత్తరం?"



"అందింది..."

"వస్తావా.... రావా..." యిక అక్కడ వుండలేక పోయాడు. వెంటనే ఆ యువకుడిని నాలుగుతన్ని, యువతిని గొంతు నొక్కి హుస్సేన్ సాగర్‌లో పడేద్దాం-అనుకున్నాడు. ఏమాత్రం గొడవ జరిగినా కుటుంబం బజారున పడుతుంది. అలాగే దూరంగా నిలబడి వారిని గమనించాడు. గంట తరువాత చెరో వైపు వెళ్ళారు. అతను తనకు గుర్తే. ఓ సంవత్సరం తనకంటె సీనియర్. పెళ్ళి అయినవాడు. కోపం దిగమింగి ఇల్లుచేరి గబ గబా క్రింది రూమ్ డ్రాయర్లు వెతికాడు. అతనికి కావల్సినవి దొరికాయి.

## 10

విష్ణువర్ధన్ భోజనం చేసి పైకి వెడుతూ "అమ్మా, పిన్నీ- భోజనాల తరువాత పైకి రండి" అన్నాడు. తలనొప్పిగా వుందని సుశీల పడుకుంది. ఇద్దరు తోడికోడళ్ళే హాల్లో వున్నారు. ముఖ, ముఖాలు చూసుకున్నారు. అతను చరచరా పైకి వెళ్లిపోయాడు.

"రాజీవ్ వెధవగోల చేస్తే పదిరూపాయలు యిచ్చానే."

"అందుకు కాదక్కా! ఈ రోజు పిల్లలు గొడవ చేశారని నాలుగు రకాల ఫలహారాలు చేశాను. ఈ సాయంత్రం విష్ణు తొందరగా వచ్చాడు."

"ఆయనతోపాటు నన్నూ తీసుకుపోలేదు భగవంతుడు". భోజనాలు చేసి, తలుపులు వేసి ఇద్దరూ పైకి వెళ్లారు.

"కూర్చోండి" అన్నాడు తను పచారులు చేస్తూ... "క్షమించండి. క్రింద అయితే పిల్లలకు వినిపిస్తుందనే పైకి పిలిచాను" వాళ్ళిద్దరూ అతని మంచం వార కూర్చున్నారు.

"సుధ వివాహం యెంత తొందరలో జరిగితే అంత మంచిది పిన్నీ! మీ అన్న కొడుక్కిస్తానంటావా; పై సంబంధం చూడాలా? అది మీరు నిర్ణయించాలి" అన్నాడు.

"అది డాక్టరీ చదువుతానంటోంది బాబూ! అది పుట్టగానే మీ బాబాయి అదే కోరిక కోరారు."

"మన కోరికలు సరే. అది యిప్పటికే రెండుసార్లు పరీక్ష తప్పింది. ఈసారి పాసవుతుందన్న నమ్మకం లేదు."

"అదేమిటి విష్ణూ! దేవుడు దయ తలచి మనకింతిచ్చాడు. ఫేలయితే చదివించుకోలేమా? దాని వయసు యెంతని! పట్టుమని పదిహేడు లేవు." కాంతమ్మ అందుకుంది.

"దానికి తండ్రి లేడనేగా బాబూ-"

"ఊహు.... గుట్టుగా, గుప్తంగా ఒక తాటిమీద నడుద్దాం అంటే కుదురుతుందా ఈ ఇంట్లో!" విసుక్కుంటూ వెళ్ళి రెండు ఉత్తరాలు తెచ్చి వారికిచ్చాడు. కమలమ్మ ఉత్తరాలు చదివి వణికిపోయింది.

"అతనెవరు.... నీకు తెలుసా విష్ణూ!"

'ఆ-కాని, వివాహితుడు పిన్నీ!"

"అయ్యో-" ఆమె తలపట్టుకుంది. కాంతమ్మ సంగతి అర్థం చేసుకుంది. కమలమ్మ భుజం తట్టింది ఆప్యాయంగా.

"ఊర్కో కమలా-ఈ కాలమే యింత."

"అలాంటివన్నీ తండ్రి వున్నవారికి అక్కా! నాలాంటివారు ఎందుకు బ్రతుకుతారో తెలియదు" వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏడిస్తే సమస్యలు పరిష్కారం కావు పిన్నీ."

"మామయ్య దగ్గరకు వెళ్ళు విష్ణూ! అతను అంగీకరించకపోతే పై సంబంధం చూడు".

"పిన్నీ! సుధనేం అనొద్దు. ఇది నా విన్నపం!"

"ఆజ్ఞాపిస్తూనే విన్నపం అంటావేం?" వెళ్లిపోయింది.

"ఏం కాలమో, ఏం పిల్లలో" గొణుక్కుంటూ కాంతమ్మ మేడ దిగింది.

కమలమ్మ అన్నకొడుక్కే సుధ నిశ్చయం అయింది. ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు. సుధ తేలుకుట్టిన దొంగలా అయింది. 'పెళ్ళి అయినా, బాయ్ ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్ వుండొచ్చు అతను చెప్పాడు. తను నమ్మింది, అన్నయ్యకెలా తెలిసిందో-' అనుకుంది.

రాత్రి పేపర్ చూస్తూ కూర్చున్నాడు విష్ణు. కాంతమ్మ వచ్చింది.

"ఏంరా, యింకా కూర్చున్నావు! ఆడపిల్ల పెళ్ళి అంటే మాటలా" అటు కమల పుట్టింటివారు యెలాగూ రారు. సుశీల పుట్టింటివారికి



కబురు చేయి. మావాళ్ళ దగ్గరకు ఉదయ్ వెడతాడు. ఓ నలుగురు ఆడవారు ముందు వస్తే గాని పనులు తెమలవు. ఓ నాలుగు వందల రూపాయలు సుమతి అత్తగారికి మనియార్డరు చేయించు. తక్కువయితే వచ్చాక చూసుకుందాము."

"ఇంకా?" పేపరు ప్రక్కకు పెట్టాడు.

"సుధకు వున్న నగలు చాలు గాని, అదేమో క్రొత్త మోడలు కావాలంటోంది. వద్దంటే తండ్రిలేని పిల్లంటూ పిన్ని ఏడుస్తుంది. ఈసారి ఎక్కువగా ఎవరికీ పెట్టను. బట్టలు నీ పెళ్ళికి పెడదాం. ఓ మూడువేలు యిస్తే ఏవో ముఖ్యమైన వారికి, పిల్లలకు తెస్తాను."

"ఊఁ-"

"సామానులు సుబ్బరామయ్య తెస్తాడు. మనం మరిచిపోయినా, అతను గుర్తుపెట్టుకు తెస్తాడు. ఇంటికి రంగులు అవీ వేయించాలి. మొన్నే ఆరు నెలల క్రితం మీనాన్నగారి దినానికి వేయించాము. అయినా తప్పదు."

"అమ్మా! మీరు ఎవరూ శ్రమపడొద్దు. అన్నీ నేను చూసుకుంటాను. అందరికీ బట్టలు తెస్తాను. వాళ్ళ యిష్టం వచ్చినవే తెచ్చుకుంటారు. యిక రైలు ఛార్జీలు ఎవరికీ పంపక్కరలేదు. అభిమానం వున్నవారు వస్తారు" అన్నాడు మెల్లగా. "అందరికీ శుభలేఖలు పంపుతాను."

"విష్ణూ!"

"ఎందుకమ్మా, ఒకే విషయం పదిసార్లు అనుకోవటం" లేచి వెళ్ళిపోయాడు. తర్వాత పిల్లలందరినీ పిలిచి తలొక యాభైరూపాయలు యిచ్చాడు.

"సాయంత్రం నేను తీసుకువెడతాను. మీ యిష్టం వచ్చినవి కొనుక్కోండి" అన్నాడు అందరూ తలలు ఆడించారు.

"వీడి తెలివి బంగారంగాను, యాభై యిచ్చి యిష్టం వచ్చినవి కొనమంటాడేమే" సుశీలమ్మ బుగ్గలు నొక్కుకుంది.

ఓ పేరుమోసిన సత్రమే భోజనాలతోసహా వివాహం జరిపిస్తుంది. ఆహ్వానితుల సంఖ్య, పదార్థాలు చెప్పాలి. అదే సత్రంలో వివాహం జరిపించాడు విష్ణు. పదివేల కట్నం అడిగితే యిచ్చాడు. అటునుండే

అమ్మాయి వెళ్ళిపోయింది. వివాహం కాగానే బంధువులూ వెళ్ళిపోయారు సుమతి, విఠల్ మిగిలారు.

"తండ్రి లేడనేకదా, సత్రంలో పెళ్ళి. యిదో పెళ్లా! సుమతి పెళ్ళి ఎలా జరిగింది?"

"నన్ను నమ్మి కమలా! నాకు యిద్దరూ ఒక్కటే. వాడి నిరంకుశత్వం నాశనం కానూ! నేనేం చేయాలి. వెళ్ళిపోయే బంధువులను వుండమన్నా ఏమంటాడో అని గిలగిలలాడిపోయానే!" అన్నది కాంతమ్మ

"చిన బావ చెబితేనేం?"

"సంబడం! పెళ్ళి చినబావను అడిగే కుదిర్చావా" సుశీలమ్మ కయ్యిమంది.

"ఆ కర్కోటకుడు చావనీ. ఏ మహమ్మారో వచ్చి వాడిని ఎత్తుకు పోనీ" కాంతమ్మ ఏడ్చినాక గాని కమలమ్మ శాంతించలేదు.

మూడు రోజులకు సుమతి ప్రయాణం అయింది. బొట్టుపెట్టి సుశీల పెట్టిన వెంకటగిరి చీర చూడగానే ముఖం మాడ్చుకుంది. తల్లి దగ్గర గునుపు మొదలుపెట్టింది.

"మా అత్తగారింటిలో ఏమనుకుంటారమ్మా"

"నేనేం జేయనే? మాతల్లి కదూ. వచ్చే నెలలో ఎలాగూ సూడిదలతో మీ అత్తవారింటికి వస్తాం. అప్పుడు మంచిది కొంటానే" అని బుజ్జగించి పంపివేసింది.

## 11

"అక్కా! వీడిలా పక్కా వ్యాపారస్తుల రీతిలో మాట్లాడటం మానాలంటే ఒకే ఉపాయం ఉంది." అన్నది సుశీలమ్మ. సుమతి సీమంతం అంటే అంతా మూడువందలతో జరిగిపోవాలంటాడు విష్ణు. తోడికోడళ్ళు విసుక్కున్నారు!

"చెప్పవే ఏం చెయ్యను."

"వాడికి త్వరగా పెళ్ళిచేయాలి. ఆ కోడలే వీడిని ఆడిస్తుంది. మనకు నీతులు బోధించే మొగాడు కిక్కురుమనడు చూడు" అన్నది.



"మారతాడంటావా?"

"ఎవడికోసం మారతాడే. మా బంధువులలో అమ్మాయి వుంది. అందరినీ నిలేస్తుంది. చదువుకుంది, యాభైవేలు కట్నం కూడా యిస్తారు."

"వాడిని ఒప్పిస్తానే. వాళ్ళతో నువ్వే మాట్లాడు."

"అలాగే" హుషారుగా వుంది సుశీలమ్మ.

కాంతమ్మ కొడుకు ముందు తన బాధలు ఏకరువు పెట్టింది.

"నువ్వు పెళ్ళి తప్పక చేసుకోవాలిరా. "చాలా సంబంధాలు వస్తున్నాయి." అన్నది

"సరే" అన్నాడు.

"అలాగే సుమతికి చీర తీసుకురా. ఈ ఒక్కసారి నా పరువు కాపాడరా. అది అసలే అభిమానంగల పిల్ల. కాస్త ఖరీదుగల చీర తీసుకురా."

"మంచిది" అన్నాడు. బట్టలు వేసుకొని తయారయ్యాడు. ఈ మధ్య విష్ణుకి కూడా వివాహం చేసుకోవాలనే తలపు కలిగింది. ఏదో ఒంటరితనం. యాంత్రిక జీవితంలో విసుగెత్తి పోయాడు. ఇంటిలో అందరూ అతన్నో శత్రువులా చూస్తారు. తన కష్టసుఖాలు పంచుకునే అమ్మాయి కావాలి. కాని తన ఆశయాలను ఏ యువతీ హర్షించదు. ఓ నిట్టూర్పు వదిలాడు. మెల్లగా కారు బట్టలకొట్టు ముందు ఆగింది. ఆ కొట్లో అన్ని రకాల బట్టలు వుంటాయి. అన్ని జాతులవారు వస్తారు. అటు పాత, ఇటు కొత్తల మేలు కలయిక గల రకాలుంటాయి.

"విష్ణు బాబా! ఎన్నాళ్ళకు దయ కలిగింది." షాపు ఓనరే అతన్ని లోపలికి తీసుకువెళ్ళాడు. జనంతో కిటకిటలాడుతోంది షాపు. అతను చీర చూసుకుంటుండగా వెనక సన్నగా సంభాషణ వినిపించింది. ఆ గొంతు చిరపరిచితంలా అనిపించింది. మెడ తిప్పి చూశాడు. అతని ఊహ నిజం అయింది. సుజాత మరో వృద్ధురాలితో కూర్చుంది. పోలికలు చూస్తే తల్లిలా కనిపించింది. ఏవేవో బేరం చేస్తున్నారు.

"ఈ ధర్మవరం చీర తీసుకో సుజా?"

"అంత ఖరీదున్న చీర యెందుకే?"

"నీలాంటి పిచ్చిపిల్లను చూడలేదు. యెందుకేమిటి కట్టుకోవటానికి"

"అన్నయ్య అంత డబ్బు తెచ్చాడో లేదో?"

"లేకపోతే పద్దు రాస్తాడు ఎవడికోసం?"

"వద్దమ్మా. అది పెట్టెలోపెట్టి పూజించటానికే, హాయిగా యీ వాయిల్ చీరలు కొంటాను."

"దానికున్న దర్పం, ఈ వాయిల్ చీరలకేది?"

"చాల్లే అమ్మా. డాబు, దర్పాలకు ప్రాణం ధారపొయ్యనక్కర లేదు. అవి రెండూ వదినకు" మరో రెండు చీరలు తీసిపెట్టింది. ఇంతలో రఘు వచ్చాడు. బిల్లు చెల్లించాడు.

"బిల్లు యింత తక్కువయిందేమిటి చెల్లాయ్"

"బాధగా వుందా అన్నాయ్"

"నీతో వాదం దేనికీ? భోజనాల సమయం అయింది టాక్సీపిలవనా"

"అబ్బే షాపు పైభాగం విశాలంగా వుందట విమానం దింపించు"

"ఏమిటమ్మా విసురు?"

"మన డాబులకు అంతు కనిపించదు" రఘు యిటు తిరిగి చూసి విష్ణుకి నమస్కరించాడు.

"హల్లో నమస్తే మిస్ సుజాతా" అన్నాడు.

"న.... నమస్తే!" సుజాత గుండెల్లో రాయిపడింది. ఉద్యోగం కోసం ఆఫీసుచుట్టూ తిరిగిందని తెలిస్తే ఇంకేమైనా వుందా, తల్లి సాధింపు. అది గ్రహించినట్టు అతనీ విషయమే ఎత్తలేదు.

"నేను డ్రాప్ చేస్తాను రఘూ! ఓ అయిదు నిమిషాలు ఆగండి"

"వెళ్ళగలమండీ" సుజాత అన్నను కొరకొర చూచింది.

"మీకు ఫ్రీగా రావటం యిష్టం లేకపోతే నాకో చిన్న సహాయం చేయండి. ఓ చీర కావాలి ఎన్నిక చేయండి."

"అబ్బే! అదేం లేదు. ఎంతలో చూడమంటారు? మా అమ్మ.. అమ్మా, అన్నయ్యకు జ్వరం వచ్చినరోజు వాడిని యింటికి తీసుకు వచ్చింది వీరే" పరిచయం చేసింది. అతను చెప్పిన ధరలో ఓ చీర ఎన్నికచేసి పెట్టింది. వారిని వారి ఇంటి దగ్గర దింపి వచ్చాడు.



అతను ఆశించిన లక్షణాలున్న కన్య అతని కళ్ళముందున్నట్టు అనిపించింది. నిశ్చింతగా నవ్వుకున్నాడు.

"అమ్మా" తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆమె చుట్టూ మంచాలలో అడ్డదిడ్డంగా పడుకున్నారు పిల్లలందరూ. అందరినీ జరిపి, చెల్లాచెదురుగా పడివున్న పుస్తకాలు ఓ దగ్గరపెట్టి తల్లి దగ్గర కూర్చున్నాడు.

"అమ్మా నీకోసంగతి చెప్పాలి"

"ఏమిటిరా?"

అతను మెల్లగా చెప్పాడు.

## 12

"ఒరేయ్ రఘూ! నీకీ మాట అనటానికి మనసెలా వచ్చిందిరా? ఆ కర్కోటకుడికా నా కూతురిని యివ్వటం. కన్నతల్లే పెట్టే బాధలు భరించలేదుట. ఎవడికో యిచ్చి చేతులు దులుపుకొందాం అనుకున్నావా?"

"అమ్మా"

"అమ్మట, అమ్మ. నీ కూతుర్ని అలాంటివాడికిస్తావుట్రా"

"ఇష్టంలేకపోతే మానెయ్యవచ్చు. ఇదివరలో ఎన్ని మాన లేదు. మనమేం అడిగామా? వాళ్ళే కబురు చేశారు. వద్దనుకుంటే పోలా? నిష్ఠూరం దేనికి?" సరళ అంది.

"పైగా నాది నిష్ఠూరమా? లక్షాధికార్లు. కానీ కట్నం లేక మనమ్మాయిని చేసుకుంటాం అని కబురు చేశారంటే అందులో తిరకాసుంది. ఆ అబ్బాయి గుణం తెలిసి యెవరూ పిల్లను యివ్వలేదని. నీది కన్న కడుపా?"

"అమ్మా!" రఘు బాధగా అన్నాడు, "సుజాత నీకు కూతురయితే, నాకు చెల్లెలు. తనకి కలలోకూడా అన్యాయం చేయను. నీవెందుకు అపోహ పడుతున్నావో నాకు తెలియదు. అతన్ని ఎరిగిన వారు అంతా మంచివాడు, సమర్థుడు అన్నారేగాని దుర్మార్గుడు అని చెప్పలేదు. అందుకే నీకు నచ్చితే చేద్దాం అని. వాళ్ళే అమ్మాయి నచ్చిందని కబురు చేశారు."

"మరి ఎందుకు చెయ్యరు. బంధువులంతా రకరకాలుగా చెప్పుకుంటున్నారు. పిసినారట. యింటిలో వారిని గడగడ లాడిస్తాడట" అన్నది.

"మాకు నచ్చలేదని చెబుతాను."

"ఊర్కే చెప్పటమా? నీకో దండం. నీ డబ్బుకో దండం. నీకిచ్చే బదులు ఓ బావిలో దింపటం మంచిదని చెప్పు."

"సరే. అలాగే" అన్నాడు.

"ఏమిటన్నయ్యా? ఏదో వేడివేడి చర్చలో ఉన్నట్టున్నారు."

"ఏం లేదు నువ్విలా రా" తల్లి పిలిచింది.

"అవునులే యేదయినా నాకెందుకు చెబుతారు? అప్పంతా మీ నెత్తిన రుద్ది వెళ్ళిపోయే ఆడపిల్లనేగా!"

"సుజా...."

"నాకేం చెప్పొద్దు అన్నయ్యా-నేను ఎం.ఏ. చదువుతాను."

"ఏమిటే?" సుందరమ్మ బుగ్గలు నొక్కుకుంది. "ఇలాంటి పిచ్చి వేషాలు వేశావంటే నేను ఏ కాశీకో వెడతాను" అంటూ బెదిరించబోయింది.

"అమ్మా.... వెళ్ళేది ఏదో తొందరగా వెళ్లవే. నీకు ముక్తి, నాకు డిగ్రీ, అన్నయ్యకు అప్పుల నుండి విముక్తి లభిస్తాయి."

"అవునే-నీకంతా ఆటగా వుంది. ఒరేయ్ రఘూ! ఆ విజయవాడ సంబంధం ఖాయం చేయరా. ఎలా వద్దంటుందో నేను చూస్తాను."

"మంచిదమ్మా!" అన్నాడు. అందరూ భోజనాలు చేశాక, సరళ వంటిల్లు సర్దుతోంది. సుందరమ్మ నిద్రపోయింది. సుజాత మెల్లగా మేడెక్కింది.

"అన్నయ్యా! ఇందాకటి గొడవ ఏమిటి?"

"విష్ణువర్ధన్ గుర్తున్నాడా?"

"అదే... ఆ రోజు లిఫ్టు యిచ్చాడు అతనేనా?"

'అతనే. అతనికి నువ్వు నచ్చావట. నీకిష్టమయితే. కానీ కట్నం వద్దన్నాడు.

ఇందులో అమ్మను చికాకు పరిచే విషయం ఏమిటి?

"అతనిది పెద్ద కుటుంబం. అతనే యజమాని. ఇంట్లో వాళ్ళకు అతనంటే హడలు. అతనికి ముద్దుగా 'కర్కోటకుడు' అని నామకరణం కూడా చేశారు."

"అయితే."

"అతనికిచ్చే బదులు బావిలో వెయ్యమంటుంది అమ్మ."

"నన్నేనా?" భయం నటించింది.

'నీకు అన్నీ హాస్యాలే" చికాకుగా చూచి, అతను సిగరెట్టు అంటించుకున్నాడు.

సుజాత మనసులో తళుక్కుమంది ఆలోచన. మూడు రోజుల క్రితం అప్రయత్నంగా అన్నా, వదినల మాటలు విన్నది.

"ఈ వడ్డీలు కట్టలేను సరూ. ఈ ఇల్లు అమ్మితే పీడాపోతుంది."

"అంత తొందరెందుకు? ఇల్లు అమ్మేరోజు వస్తుంది" అంది సరళ.

"అదేం?"

"రేపు సుజాత పెళ్ళి యెలా చేస్తారు?"

"అవును" అన్న భారంగా నిట్టూర్చాడు.

"నేను మెట్రిక్ చదివాను కదా. యెక్కడయినా ఉద్యోగం చేయకూడదూ?"

'అమ్మో... అమ్మ ఊరుకుంటుందా? ఇంకోసారి అనేవు అలాంటి మాటలు'

అప్పటినుండి తను ఏం చేయాలన్నదే ఆలోచన. ఎం.ఏ. చదివి ఏ కాలేజీలోనైనా ఉద్యోగం చేస్తూ అన్నకు సాయపడదాం అనుకుంది. తల్లి అది సాధ్యపడనివ్వదు. యెంత కర్కోటకుడయినా యింత అన్నం పెట్టకపోడు. వేలు కట్నం తీసుకున్న బావలు పువ్వుల్లోపెట్టి పూజ చేస్తున్నారా? సుజాత తేలికగా నిట్టూర్చింది.

"అన్నయ్యా!"

"ఏమ్మా?" సిగరెట్టు పారేసి అడిగాడు.

"అతనికి కబురుచేయి నాకిష్టమేనని."

"అమ్మ.... అమ్మ కిష్టం లేదు సుజా! వివాహము అంటే నూరేళ్ళ పంట. బాగా ఆలోచించుకో."

"ఆలోచించాల్సిన అవసరం లేదు."

"పోనీ, అతని గురించి పూర్తిగా చెప్పనీ, తరవాత నీ నిర్ణయం తీసుకుందువుగాని."

"అక్కరలేదు. కట్నం వద్దన్నాడంటే కనీసం అవతల మనిషి కష్టాలు అర్థం చేసుకునే విశాల హృదయముంది."

"తొందరపడకే, ఒక పని చేద్దాం. మీరిద్దరూ కలిసి మాట్లాడుకున్న తరువాత ఓ నిర్ణయానికి రా. ఒకరి ఆశయాలు ఒకరు...."

"ఆశయాలు కాదు ఒకరి దురాశలు ఒకరను బావుంటుంది. చిన్నబావ, చుట్టపక్కాలు ముక్కుమీద వేలువేసుకునేలా, అక్కయ్యను అవతలికి పిలిచి ఆశయాలు, అభ్యుదయభావాలు చర్చించలేదూ? అటు తాళి కడుతూనే మర్యాదలు తెలియవని మనల్ని దులిపి వెయ్యలేదూ? నాకలాంటి పిచ్చి కోర్కెలు లేవు."

"అదికాదు సుజా...."

"ఇంకేం చెప్పొద్దు. అతను ఎలాంటివాడయినా, నా కనుగుణంగా మార్చుకుంటాను" అన్నది దృఢంగా.

అతనేం మాట్లాడలేదు. సుజాత తన జీవితం పణంగా పెట్టి అయినా అన్నను రక్షించాలని అనుకుంది. అలా అని అనుభూతులకు, ఆశలకు అతీతురాలు కాదు. వివేకంతో వుండాలంటుంది. అది ఆమెకెలా అబ్బిందో సుందరమ్మకిప్పటికీ అర్థం కాదు. మిగిలిన కూతుళ్ళు అచ్చు తల్లి పోలిక.

"చూడమ్మాయ్ దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో. వాడు సంపాదించినప్పుడే నాలుగురాళ్ళు వెనక వేసుకో" అనే అత్తగారి మాటలే గుర్తుకొస్తాయి.

ఈ మారెమ్మకు ఆ ముసలమ్మ గుణమే వచ్చింది అనుకుంటుంది ఎన్నోసార్లు.

పైకివచ్చిన సరళ అన్నా, చెల్లెళ్ళ వాదం విన్నది.

"నా సంగతి నేను చెప్పాను. ఆ పైన మీ యిష్టం. మళ్ళీ నా పెళ్ళి విషయం ఎత్తవద్దు" అని వెళ్ళిపోయింది.



"ఏమంటావు?" భార్యను ఉద్దేశించి అడిగాడు రఘు.

"నేనేమంటే చెల్లుతుంది? సుజాత వ్యక్తిత్వాన్ని గౌరవిస్తాను" అన్నది.

"నాకు వ్యక్తిత్వం లేదని పరోక్షంగా చెప్పడమేగా" కొంచెం కోపంగా చూశాడు.

"ఇదో కొత్తఅలవాటు నేర్చుకున్నారా?" విసుక్కుని వెళ్ళి పడుకుంది.

ఆ రోజుతో ఆగలేదు ఆ ప్రస్తావన. అక్కలూ, బావలూ హితవు చెప్పటానికి వచ్చారు. 'కట్నం తీసుకోని బుద్ధిమంతుడు యెవరన్నా వుంటే అతనికిచ్చి చేయమంది.' దాంతో వారు ఈ ఊబిలో తల దూర్చటం దేనికని ఊరుకున్నారు. రఘు వెళ్ళి పెళ్ళికి తమ అంగీకారం తెలిపి తాంబూలం తతంగం పూర్తి చేశాడు.

## 13

"ఏమిటీ?" సుందరమ్మ ముక్కుపై వేలుంచుకుని బయటికి వచ్చింది. భార్యతో పెళ్ళి యెక్కడ జరగాలో చెబుతున్న రఘు గతుక్కుమన్నాడు.

"అదే, విష్ణువర్ధన్ మన ఇంటి ఆవరణలో పెళ్ళి జరిపించాలన్నాడు. ఆయన వైపు నుండి వందమంది వస్తారట. మనమూ..."

"మనమూ అంతే అను. బుద్ధిలేదురా. మీ నాన్న తహసిల్దారురా. ఆయన గౌరవం నిలపవద్దూ!"

"అలా అని లేనిపోని ఆడంబరాలు పెట్టుకుంటే రిజిస్టరు మేరేజి చేసుకుంటాడట."

"అవును. ఎందుకు చేసుకోడూ? మన సంగతులు బాగా తెలుసాయె. కట్నం వద్దన్నాడని దరిద్రంగా పంపుకుంటామట్రా! ఓ పదివేలు పెట్టి నగలు చేయిద్దాం."

"అన్నయ్య చెప్పలేదు కదూ! మొన్ననే బంగారంకొని కంసాలికి యిచ్చి వచ్చాడు" సుజాత చెప్పింది.

"ఏరా?"

"చెప్పన్నయ్యా మొహమాటం దేనికి?"

అతను వెర్రిగా సుజాతను చూచాడు. అప్పుడే పక్కింటావి పిలిచింది. ఆమెకు వెళ్ళి సాష్టాంగ ప్రణామం చేద్దామా అనుకున్నాడు రఘు.

రఘు ఇంటి ఆవరణలో సుజాత, విష్ణువర్ధన్‌ల వివాహం క్లుప్తంగా జరిగింది. రెండుజతల గాజులు, ఓ గొలుసు, రెండు పట్టుచీరెలు కోడలికి బహూకరించింది కాంతమ్మ. వియ్యపురాలు మూతి తిప్పడం చూసి ఆవి హృదయం కలుక్కుమంది.

"మనకు లేకనా? కమలకు మీ బావ ఎన్ని చీరలు కొనలేదు. వీడి మొండిపట్టు వీడిదే. వియ్యపురాలి మూతివిరుపు చూశావా?

"నువ్వూరుకో అక్కా, ఆమె ఇచ్చే కట్నానికి ఆమాత్రం చాలులే" సుశీలమ్మ ఊరడించింది.

"మీ వియ్యపురాలు తనే తహసిల్‌దారు అయినట్టు చేస్తుందేమిటి కాంతక్కా! శోభనం వగైరాలు ఇక్కడే జరగాలట" అంటూ కమలమ్మ వచ్చింది.

"ఆమే, నేనూ అనుకున్నంత మాత్రాన జరుగుతాయటే, వాడే మన్నాడు?" భోజనాలు జరుగుతున్నాయి. కాంతమ్మ దూరంగా నిలబడి చూస్తూంది.

"అలాంటివన్నీ మరీ చిన్నపిల్లలకయితే బావుంటాయి. మనింటికి భోజనాలు కాగానే సుజాతతో వెళ్ళిపోదాం అన్నాడు. మీ వియ్యపురాలు చిందులు తొక్కుతోంది" కమలమ్మ వియ్యపురాలి వింత డాబులు చెబుతోంది. విష్ణువర్ధన్ యిష్ట ప్రకారమే వధువును తయారు చేశారు. సుజాత వెళ్ళి తల్లికి నమస్కరించింది.

"నా మాట విన్నావు గనకనా. కష్టమో, సుఖమో చేసుకున్నావు అనుభవించు" అన్నది లేవనెత్తుతూ.

"అమ్మా, ఇంకా కోపం పోలేదా! నీ ప్రేమ మా పట్ల ఎంత ఉన్నతమైనదో ఎరగమా? అన్నయ్య కూడా నీ కొడుకేనమ్మా-" ఇంకా చెప్పాలని వున్నా, గొంతు పూడుకుపోయింది. సుందరమ్మ కోపం పటాపంచలయింది. కూతుర్ని హృదయానికి హత్తుకుని బావురుమంది.



"బావుంది సుందరమ్మా ఆడపిల్ల అన్నాక తప్పుతుందా" ఆమె అన్న భార్య విడదీసింది.

"వెళ్లొస్తాను వదినా!"

"సుజా-" సరళ ముందుకు వచ్చి రెండు భుజాలపై చేతులు వేసింది. 'నీ వ్యక్తిత్వాన్ని ఆరాధిస్తాను. మీ అన్నపట్ల నీకున్న ఈ ప్రేమ కలకాలం వుండాలని కోరుకుంటూ....' యిలా ఎన్నో చెప్పాలని వుంది కాని గొంతు పెకిలి మాటే రాలేదు.

"ఆలస్యం అవుతుంది" ఎవరో కేక వేశారు. సుజాత అన్న దగ్గరకు వచ్చింది. ఇద్దరు ఒకరి నొకరు చూసుకున్నారు. మరుక్షణమే పసిపాపలా చెల్లెలిని దగ్గరకు తీసుకుని బావురుమన్నాడు.

"బావుంది బావగారూ వరస" విష్ణు వెనుకగా రఘు భుజం తట్టాడు.

"కాదు... కాదు విష్ణూ. సుజా లేని ఈ యిల్లు హించలేను, అదో చైతన్య ప్రవంతి."

"చైతన్యంగల వస్తువులు చలనం ఉంటేనే శోభిస్తాయి మరి" అతను అన్న మాటలకు అందరూ నవ్వారు. సుజాత అన్న దగ్గిరనుండి వెళ్ళి అక్కలకు, బావలకు నమస్కరించి వీడ్కోలు తీసుకుంది.

"గుర్తుంచుకో మరదలా! మమ్మల్ని వెక్కిరించావు, మొగాళ్ళంతా యింతేనని. ఉత్తరం రాయకపోతావా, మేం చూడమా?" చిన్నబావ హాస్యం చేశాడు. సూటులో నిండుగా వున్న విష్ణును చూసి సుందరమ్మ ఒక్కక్షణం కూతురి అభిరుచి అభినందించకుండా వుండలేకపోయింది. మిగిలిన అల్లుళ్ళు అక్కడే వున్నారు. వారితో చిన్న అల్లుడిని పోల్చి చూచుకుంది.

అందరికీ నమస్కరించి గడప దాటింది సుజాత.

"విష్ణూ-మాచెల్లి" ఆర్ద్రంగా చూచాడు రఘు.

"నీకు చెల్లి. మాకేం కాదా? నిశ్చింతగా వుండు" అని చేతులు నొక్కి వదిలేశాడు, కారు ముందుకు సాగింది.

సుందరమ్మ వెంటనే తన కూతుళ్ళకు, అల్లుళ్ళకు తెచ్చిన బట్టలు ఇచ్చి బొట్టు పెట్టించింది సరళ చేత. సుజాత ఖర్చు తగ్గించాలని చేసిన ప్రయత్నం కొనసాగుతుందా?

"ఒరేయ్ రఘూ! ఆఖరు పెళ్ళి. అత్తయ్యలకు వాళ్ళకు పెట్టే ఈ లిస్టు ప్రకారం బట్టలు తీసుకురా."

"ఆఖరు పెళ్ళి ఎందుకమ్మా మనుమరాలు లేదూ?" నవ్వుతూ అడిగాడు రఘు.

"ఒరేయ్, నన్ను మురిపించకురా వెళ్ళి పట్రా."

"ఇప్పుడు డబ్బు లేదమ్మా! సుజాత అప్పులకు వెళ్ళొద్దని ప్రమాణం తీసుకుంది."

"అదంతా నాకేం తెలియదు. పద్దు రాయించి పట్రా."

అతను నిట్టూర్చి వెళ్ళిపోయాడు.

## 14

విష్ణు కారుని నెమ్మదిగా పోనిస్తున్నాడు. సుజాత బయటికి చూస్తోంది.

ఇంత అందమైన మూర్తికి కర్కోటకుడని పేరు ఎలా పెట్టారో అమ్మ చెప్పినదంతా విని తన స్నేహితురాళ్ళు విలన్‌లా వుంటాడు అనుకున్నారట పదేపదే చూడాలనిపించే రూపం, ఆడవారిని మాయజేసి మరిపించే రూపం-

"కర్కోటకుడు యిలా వున్నాడేమని ఆలోచిస్తున్నావా?" చటుక్కున తల యెత్తింది. అతను చిన్నగా మందహాసం చేశాడు. కళ్ళు ఒత్తుకుని తలదించుకుంది. నేను అనుకుంటున్న విషయం ఈయన యెట్లా గ్రహించారబ్బా! ఈయనతో సామరస్యంగా సంసారం సాగుతుందా? యింట్లోవారు ఎలాంటివారో.

"ఇతనితో జీవితాంతం ఎలా గడుపుతానని యోచనా?"

"కాదు... ఊరికినే?"

"మౌనవ్రతం లేదన్నమాట?" అతని చిరునవ్వు చూసి తల వాల్చింది. ఒక్కసారి అతన్ని తనివితీరా చూసి, తన ఆశయాలు గుర్తించినందుకు, అవి నెరవేరడానికి కారణభూతుడు అయినందుకు అతనికి కృతజ్ఞత చెప్పాలని వుంది. సిగ్గు తెర అడ్డు వస్తోంది. ఓసారి అన్న స్నేహితుడుగా, మరోసారి ఒకసంస్థ యజమానిగా అతన్ని చూసింది. తనవాడు అనుకున్న



తరవాత అతన్ని తనివితీరా చూడనే లేదు. ఆమె కోర్కె గ్రహించినట్టే, ఆమెను దగ్గరకు లాక్కున్నాడు ఒక చేతితో. అతని స్పర్శ ఏదో లోకాల కీడ్చుకుపోయింది. అలాగే వుంటే అతను కారు కంట్రోలు చెయ్యలేడేమో!

"వదలండీ... రోడ్డు" అంది దూరం జరుగుతూ.

"ఏదీ-సరిగ్గా చూడనీ. మొదటిరోజు 'మారెమ్మ' అంటూ ముద్దుగా మీ అన్నయ్య చెబితే జడుసుకున్నాను సుమా" అన్నాడు కొంటె నవ్వు చిందిస్తూ. అతను మాటలు పూర్తికాక పూర్వమే కారు ఇంటి ముందాగింది. సుశీలమ్మ ఎదురు వచ్చింది.

"కుడికాలు పెట్టమ్మా...." దిగబోయింది సుజాత. ఆమె చీర చెంగు హేండ్ బ్రేక్‌లో చిక్కుకుపోయింది. ఆగి వెనుతిరిగింది. కళ్ళు చికిలించి తనే చెంగు వదిలించాడు. అప్పుడే వచ్చిన కాంతమ్మ చెవిలో గుసగుసలాడింది సుశీలమ్మ.

"అబ్బాయి అప్పుడే మారాడు చూడక్కా. మనకదే కావాలిగా" అన్నది సుశీలమ్మ. ఎర్రనీళ్ళు తిప్పిపోసింది.

ఇద్దరూ యింట్లోకి వచ్చారు.

"అన్నయ్యా... యిందాక నిత్యానందమట ఫోను చేశాడు" వాసు వచ్చి చెప్పాడు.

"ఏమన్నాడురా!"

"నిన్ను హోటల్ రిట్జ్‌లో కలవమన్నాడు అర్జంటుట."

అతని ముఖాన యిందాకటి ప్రసన్నత లేదు. చికాకు స్పష్టంగా కన్పించింది. కోటు కుర్చీపైకి వేసి బయలుదేరాడు.

"విష్ణూ! ఉదయమే పెళ్ళి అయింది. ఇల్లు కదలకూడదు రారా. అతనికి రేపు వస్తానని ఫోన్ చేయి."

"ఫోన్‌లో జరిగే పనయితే నేను వెడతానా? అతను రేపు వెళ్ళిపోతాడు."

"భోజనం చేసి వెళ్ళరా?"

"వచ్చి చేస్తాను" అప్పటికే కారు స్టార్టు అయింది. సుజాత ఆడబడుచుల దగ్గర కూర్చుని వారి బడిలో విషయాలు వింటూ, తన

కాలేజీ అనుభవాలు చెబుతూ వారిలో కలిసిపోయింది. సుశీలమ్మ షర్బత్ తెచ్చి యిచ్చింది. అలా గంట గడిచింది. సుజాతకు ఓ మూల ఏదో బాధగా వుంది. సరససల్లాపాలతో గడపాల్సిన సాయంత్రం యిలా గడిచిపోయింది. అతని సమక్షం కావాలని తన మనసు ప్రగాఢంగా వాంఛిస్తోంది. అతనికా వాంఛ లేదా?

"అమ్మాయ్.... స్నానం చేద్దువురా" సుశీలమ్మ పిలిచింది. స్నానం చేసి, ఆమె యిచ్చిన తెల్లని జరీ చీర కట్టుకుంది.

"నేను జడ వేస్తాను" సుమతి ముందుకు వచ్చింది. ఆమె నిండు చూలాలు. ప్రసవానికని వుంది. జడవేసి, మల్లెలు తురిమింది.

"అమ్మా! వాడిని ఓ దారిలో నువ్వే పెట్టాలి" అంది సుశీలమ్మ

"కొత్త కోడల్ని హడలగొడతావేం పిన్నీ?" సుమతి కసురుకుంది. మరదలి నుదుట చక్కగా తిలకం దిద్దింది.

"రండమ్మా, భోజనాలు చేద్దురుగాని" అత్తగారు పిలిచాక వెళ్ళక తప్పదు. కాని మనసంతా అదోలా వుంది. ఏ చిన్న శబ్దం అయినా విష్ణు వచ్చాడని చూస్తోంది.

పరిసరాలు నిశ్శబ్దంగా మారిపోయాయి. పదకొండు దాటాక, అలసటగా విష్ణు వచ్చాడు. స్నానం, భోజనం చేసి పైకి వెళ్ళాడు.

"సుజాతా, ఇదిగో పాలు. పైకి వెళ్ళి విష్ణుకివ్వమ్మా" సుశీలమ్మ పాలగ్లాసు తెచ్చియిచ్చింది.

"ఏమిటో, ఆయన లేకపోవటంతో అంతా యిలా అయింది" కళ్ళు ఒత్తుకుని బీరువాలోంచి ముత్యాలహారం కోడలి మెడలో వేసింది. "వెళ్ళమ్మా"

ఆమె హృదయం పరుగులు పెడుతున్నది. కాళ్ళు ఆగిపోయాయి. తన వివాహపు మొదటిరోజు యిలా యింత మామూలుగా, స్నేహితురాండ్ర సరసాలు, బంధువుల హాస్యాలు లేక గడవడానికి తనే కారణమా? ఆలోచించసాగింది. ఏదో అసంతృప్తి అలముకొంది మనసంతా.

"వెళ్ళమ్మా, ఇదంతా మన దురదృష్టం. ఆయనే వుంటే ఈనాడు ఈ పెళ్ళి యిలా జరిగేదా? కమల శోభనం ఈ పెళ్ళికన్నా ఘనంగా



జరిగింది. ఈ కర్కోటకుడిచేతిలో ఈనాడిలా అయిపోయాం రెక్కలు విరిగిన పక్షిలా" బుగ్గలు పుణికి పైకి పంపింది.

తడబడే అడుగులతో పైకి వెళ్ళింది. ఫలానా గది అని చూపించే వారు లేరు. ఆయనను గూర్చి అందరూ అన్ని రకాలుగా చెబుతున్నారు. చివరకు తల్లికూడా! తనెలా మసలుకుంటుందో ఏమో! లైటు కనిపించే గదిలోకి వెళ్ళింది. పెద్దగది! ఒకవైపు తెల్లని దుప్పటి పరిచిన పెద్ద మంచం వుంది. మరోవైపు రాసుకునే బల్లలా వుంది - దానిముందే కూర్చుని టకటకా టైప్ చేస్తున్నాడు. రెండు కుషన్ ఛైర్స్ గాడ్రెజ్ బీరువాకు రెండు వైపులా వున్నాయి. ఎదుటి గోడపైన నిలువెత్తు ఫోటో వుంది. పోలికలు, దానికి వున్న పూలదండ, గంధంబొట్టు చూచి అది తన మామగారైన కోదండరామయ్య గారిదని తెలుసుకుంది. గది ముందున్న కారిడార్‌లో బాత్‌రూమ్, బట్టలస్టాండ్ వున్నాయి. ప్రపంచంలో తనకేం పట్టనట్టు పనిలో లీనమయ్యాడు. మధురస్మృతులతో గడిచే తొలిరేయి ఒకరికోసం ఒకరు నిరీక్షించుకుంటారు. 'నిజంగా కర్కోటకుడే. హృదయం లేదు' అనుకుంది. వెంటనే కళ్ళల్లో నీరూరింది. అయిదు నిమిషాలు అలాగే నిలబడింది. ధోవతి, లాల్చీలో మరింత అందంగా కనిపిస్తున్నాడు.

వీళ్ళింటి పద్ధతులేమో! తను వస్తానని అతనికి తెలుసో లేదో, తను అలక సాగించడం మంచిది కాదు. మెల్లగా గ్లాసు మంచం తలవైపునున్న చిన్న బల్లపై పెట్టింది.

ఓ టైపిస్టును పెట్టుకోకూడదూ! పిసినారితనానికి ఓ హద్దు వుంటుంది అనుకుంది. అతని ఏకాగ్రత చెడగొట్టాలా, లేక వెళ్ళి మౌనంగా నిదురపోవటమా అని ఆలోచించింది. అతని ఏకాగ్రత చెడగొట్టడమే అనుకుని మంచంవైపున్న కిటికీ తీసింది. చల్లటిగాలి గదిలోకివచ్చి గిలిగింతలు పెట్టింది. అతను తల తిప్పి చూచాడు. చిన్నగా నవ్వుతూ చేతులు వెనక్కు విరుచుకున్నాడు.

"ఓ.... నువ్వు వచ్చావా?" అన్నాడు. ఆమెకు చిరుకోపంలాంటిది వచ్చింది. తలెత్తి ఒకసారి చూసి తలవంచింది.

"చాలా సేపయిందా?"

"టైమ్ చూడలేదు" విసురుగా జవాబు యివ్వాలనుకుంది. పెద
...ేన మాటలు గుర్తుకు వచ్చాయి. ప్రకృతే స్త్రీకి కొన్ని బలహీనత
అంటగట్టింది సుజా. ప్రతి నిత్యమూ మన హక్కులు నిలుపుకోవా
అభిమానపడితే, జీవితంలో మిగిలేది అశాంతి. కొన్ని విషయాలలో మన
విశాలహృదయం ప్రదర్శిస్తేనే సంసారం సాఫీగా సాగిపోతుంది."

"కోపం వచ్చినట్టుందే" టైప్‌మిషన్ మూసి వచ్చాడు.

"ఈ మనిషికి పెళ్ళాం కంటే, పెళ్లి కంటే టైపే ఎక్కువా అ
ఆలోచిస్తున్నావ్ కదూ?" నవ్వుతూ ఆమె రెండు భుజాలపై చేతు
ఆన్చాడు. ఆ స్పర్శకు పులకించిపోయింది.

"అది చాలా ముఖ్యమైన పని. రేపు మార్నింగ్ పోస్టులో వెళ్ళిపోవా
అందుకే.... అదీకాక మా అక్క పెళ్ళిలో చూశాను, అలంకరణ
ముగిసేటప్పటికి తెల్లవారుఝాము అయింది. అలాగే అవుతుందేమో, ఈ
సమయం వృధా చేయరాదని...." చిన్నగా నవ్వింది అతని మాటలకు.

"సుజా, కోపం పోయినట్లేనా?"

జవాబుగా ముందుకు జరిగి, స్పృహతప్పినట్టు అతని చేతులలో
ఒరిగిపోయింది.

"సుజా...."

"మాట్లాడు సుజా!"

"మీరు పిలిస్తే మళీ, మళ్లీ వినాలని వుంది."

"ఓ" నవ్వాడు. "ఇటు చూడు, మామూలు రోజయితే ఈ పాటికి
అలసి హాయిగా నిదురపోయేవాణ్ణి. ఈరోజయితే నీ కోసం కూర్చున్నాను."

"థాంక్స్"

"ఇలాగేనా చెప్పేది" అతను ముందుకు వంగాడు. అలా కొన్ని
నిమిషాలు తన్మయావస్థలో గడిపారు. అతని చేయి ఆసరాగా తీసుకుని
మంచం దగ్గరకు వచ్చింది. అతను కూర్చోగానే తను దూరం జరిగింది.

"ఎక్కడికి?"

"నా ఆశయం నెరవేరడానికి సహకరించిన మీకు కనీసం పాదాభి



వందనం చెయ్యొద్దూ!" అన్నది ఒంగుతూ. అతని ముఖం గంభీరంగా
మారిపోయింది. ఆమెను లేపాడు.

"ఏమిటో ఆ ఆశయం?"

"...నం లేకుండా భర్తను పొందటం?"

"సుజా! భార్యాభర్తలంటే లోకానికి చూడటానికి ఒక తాడుతో
బిగింపబడే ఎద్దులు కారు. ఒకరిని ఒకరు మనస్ఫూర్తిగా గౌరవించుకోవాలి.
దినమంతా పోట్లాడి పడకటింట్లో కాళ్ళు పట్టుకోవాలనుకునే స్త్రీలంటే పరమ
అసహ్యం."

"మీ ప్రతి పనికి నా సహకారముండాలని పరోక్షంగా చెప్పటమా"
ధైర్యంచేసి నవ్వుతూ అంది.

"అవన్నీ తీరికగా చర్చించుకుందాం" ఆమె చేతులుపట్టి ముందుకు
లాగాడు. అతని అధరాల మధురస్పర్శ ముఖం అంతా ప్రాకుతుంటే
భరించలేనట్లు అతని వక్షస్థలంపై తలవాల్చేసింది.

మధురానుభూతులు మనుసుని గిలిగింతలు పెడుతుండగా ఈ
లోకంలోకి వచ్చింది. 'వదినా' అనబోయింది. రోజూ అది మామూలే!
వదినను టైం అడగడం. అప్పుడు గుర్తుకు వచ్చింది. అది తన పుట్టిల్లు
కాదని. తనను మూడు నాలుగుసార్లు లేపడానికి వదినా, తల్లీ లేరనీ,
తనే లేచి శ్రీవారికి మేలుకొలుపు పాడాలి కాబోలు అనుకొని బద్ధకంగా
పక్కకు తిరిగింది. విష్ణు లేడు; మత్తు వదుల్చుకుని లేచింది. అటూ
ఇటూ చూసింది. అతను బల్ల ముందు కూర్చుని, రాత్రి టైపుచేసిన
ఉత్తరం కవరులోపెట్టి అంటిస్తున్నాడు. కన్నా గదిముందు కూర్చుని
బూట్లను పాలిష్ చేస్తున్నాడు. టైం పీస్ వంక చూసింది. ఏడున్నర! చీర
సరిచేసుకుని నిలబడింది. అలికిడికి అతను యిటు తిరిగాడు.

"సుప్రభాతం" అతని చిరునవ్వులో వెక్కిరింపు కనిపించింది.

"ఆలస్యం అయిపోయింది" అన్నది సిగ్గుగా.

"ఫరవాలేదు, వెళ్ళి ముఖం కడుక్కురా."

"కన్నాని యిలా పైకి రావద్దని చెప్పండి"

"టీ ఎవరు చేశారు?"

"ఏం, నేనే" అన్నాడు. ఆమె ముఖం తిప్పుకొని బాత్‌రూమ్లో వెళ్ళింది. అతని స్నానంకూడా అయినట్టుంది. విడిచిన బట్టలు కనిపించాయి. కారిడార్‌లో బల్లపై హీటరు వగైరా సరంజామా కనిపించాయి. కాలకృత్యాలు తీర్చుకొని వచ్చి టీ త్రాగింది. కన్నా ఆమె పెట్టె తెచ్చి గదిలో పెట్టాడు. స్నానంచేసి వచ్చేసరికి అతనింకా ఏదో పని చేసుకుంటున్నాడు. క్రిందికి పోదామని రెండు అడుగులు వేసింది.

"సుజా మాట!"

"చెప్పండి" అని దగ్గరగా వెళ్ళింది. అతను ఏదయినా చిలిపి చేష్టలు చేస్తే వారించి, ఎలా జవాబు చెప్పాలో ఆలోచిస్తూ నిలబడింది.

"క్రింద అమ్మావాళ్ళకు మరో పనివాడు కావాలట. జగ్గును పంపితే నీకేం అభ్యంతరం వుండదుగా?"

"అభ్యంతరమా! నాకెందుకు?"

"వాడు చేసే పనులు నువ్వు చెయ్యాలి... పెద్ద పనులేం లేవు. ఈ గది శుభ్రంచేసి, బట్టలు అవీ సర్దడం."

"అలాగే."

తన పని అయిపోయిందన్నట్టు-మళ్ళీ అటు తిరిగి ఏవో కాగితాలు చూసుకోసాగాడు. తమ మధ్య మాట్లాడుకోనటానికి 'స్వీట్ నథింగ్స్' లేవా? కళ్ళలో నీరూరింది. అతన్ని కవ్వించే మాటలు అనాలని ఎంతో ప్రయత్నం చేసి తగ్గిపోయింది. ఇంటిలో అందరిని కడిగేసే మనిషిని యింత డల్‌గా అయ్యానేమిటి అనుకుంది.

"ప్రతినిమిషం తనెదురుగా వుండాలంటారే, ఎలా సాధ్యపడుతుంది చెప్పు?" అనే స్నేహితురాలి మాటలు గుర్తుకొచ్చాయి. స్నేహితురాలేం తనకంటే అందగత్తె కాదు. మెల్లగా, అడుగులో అడుగువేస్తూ క్రిందికి దిగింది.

"రామ్మా...." ఆప్యాయంగా పిలిచింది కాంతమ్మ.

"టీ కావాలా, కాఫీయా?" అడిగింది సుశీలమ్మ.

"ఏం వద్దండీ, పైన తీసుకున్నాను." అని, ఆమె వెనకాలే వంట యింటిలోకి వెళ్ళింది. క్రింద సంతలా ఉంది.



"నేను కాకరకాయలు తరగనాండీ!"

"మేము ముగ్గురం వుండగా నీకెందుకమ్మా శ్రమ?"

"నాకేం పని వుంది?"

"మీవారిని అడుగు, వేరే ఏదో పని చెబుతాడు" కమలమ్మ అన్నది. అది వ్యంగ్యమో, నిజమో అర్థం కాలేదు. బయటికి వచ్చి ఆడబడుచులకు జడలు వేసింది. హడావుడి పడిపోతూ స్నానాదులు ముగించారు. హాల్లో గడియారం టంగ్‌మంది. తలెత్తి చూచింది. ఎనిమిదిన్నర. ఇల్లంతా ఒకేసారి నిశ్శబ్దం అయింది. అందరూ భోజనాల బల్లచుట్టూ చేరారు. ఏమిటా అని ఆశ్చర్యంతో చూసింది. పంతులు వచ్చేముందు క్లాస్‌రూమ్‌లాగా వుంది. బట్టలు వేసుకుని విష్ణు మేడదిగాడు. తన వంక చూచి చిరునవ్వులు చిందిస్తాడనుకుంది సుజాత. అతను ఎటూ చూడకుండా, తిన్నగా వెళ్ళి భోజనాల బల్ల దగ్గర ఓ కుర్చీ జరుపుకుని కూర్చున్నాడు. అందరూ ఫలహారం చేస్తున్నారు. చంచాల, ప్లేట్ల చప్పుడు తప్ప ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"అన్నయ్యా! కొన్ని పుస్తకాలు కొనాలి మా లైబ్రరీలో లేవు."

"పుస్తకాలు కొనడానికి ఎప్పుడూ సందేహించవద్దు. ఈ రోజే డబ్బు ఇస్తాను." ఉదయ్ వెళ్ళిపోయాడు.

"నాకో సైకిల్ కావాలన్నయ్యా" రాజీవ్ అడిగాడు.

"పి.యు.సి.లో ఫస్టుమార్కులు తెచ్చుకో. సైకిల్ కాదు, స్కూటర్ కొనిపెడతాను."

రాజీవ్ ముఖంలో రోషచ్ఛాయలు కదలాడాయి. తనకు తక్కువ మార్కులు వచ్చాయని, పరోక్షంగా ఎత్తిపొడుస్తున్నాడు. 'ఈయన శభాష్ అనేలా చదవకపోతే నా పేరు రాజీవే కాదు', అనుకున్నాడు మనసులో.

'అతని మనసులో భావాలు చదివినట్టే విష్ణు అన్నాడు. "దృఢ నిశ్చయంతో చదివితే అదేం గొప్ప పని కాదు". తలాడించి రాజీవ్ వెళ్ళిపోయాడు. పిల్లలందరూ ఒక్కొక్కరే లేచి వెళ్ళారు.

"వాసూ! మాట?"

"ఏమన్నయ్యా?" అతని కళ్ళలో సన్నగా ఒణుకు ప్రారంభం అయింది.

"బడులు తీసి వారం రోజులు కాలేదు. అప్పుడే నాగాలు పెడుతున్నావేం?"

"నాగా పెట్టలేదు. పుస్తకాలు కొందామని."

"పైగా అబద్ధం కూడాను. అబద్ధాలు ఆడే వారంటే నాకు పరమ అసహ్యం. సినిమాకు వెళ్ళావు కదూ?"

"ఏదో ఫ్రెండ్స్ బలవంతం చేస్తే..."

"ఫ్రెండ్స్ బలవంతం చేస్తే గడ్డి తింటావా?"

"పిన్నీ! వాడిని చెడగొట్టాలనుకుంటే డబ్బులు యివ్వండి. నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు విష్ణు.

"డబ్బులు నాకెక్కడివి! కుర్రవెధవని ఓ రూపాయిచ్చాను" అని వెళ్లబోతూ, గదిముందు నిలబడ్డ కోడల్ని చూసింది.

"తను మహారాజులా సాగించుకున్నాడు. ఆంక్షలన్నీ మా పిల్లలకే" అని మూతి తిప్పింది. సుజాత తలవంచుకుంది. ఆమెకు విష్ణుపై కోపంగా వుంది.

"విష్ణూ! పొలాల దగ్గరకు ఓసారి రా. పాత యింజన్‌తీసి కొత్తది పెట్టాలిరా! అలాగే ఓ రెండు జతలు గిత్తలు కావాలి. ఓ పాత జీపు చూడరా..." అన్నాడు చలపతి.

"బాబాయ్! ఎప్పుడయినా మన వ్యవసాయానికి అయ్యే ఖర్చూ, రాబడీ లెక్క చూచుకున్నారా?"

"ఎందుకు చూచుకోలేదూ?"

"లాభాలు ఏమాత్రం కనిపించాయి!"

"ఈ నాల్గు సంవత్సరాల నుండి లేదురా, ఖర్చులే అవుతున్నాయి"

"అలాంటప్పుడు వ్యవసాయం నిలిపి వేయటం మంచిది, కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు."

"నేనేం చెయ్యనురా!"

"దానికి జవాబు చెప్పలేను. వ్యవసాయదారుడు కాని, మరొకరు కాని కూర్చుంటే పనులు కావు. యే సమయాని కా పనులు చేయాలి."



చలపతి మాట్లాడలేదు. పేరుకు పొలం వెడతాడు. ఆఫీసరులా జీతగాళ్ళు వచ్చారా లేదా చూసుకొని వచ్చేసి, యెక్కడో పేకాటలో కాలక్షేపం చేస్తాడు.

"అది కాదురా, వ్యవసాయంలో లాభాలు రావాలంటే చాలా పొలం ఉండి....ట్రాక్టర్."

"మీకు ఉన్న ఇంజన్ చూసుకునే తీరిక లేదు; ట్రాక్టరు చూస్తారా బాబాయ్! రామచంద్రంగారి పొలం మన పొలంలో సగం వుంది. సంసారం అంతా దానిమీదే గడుస్తుంది. మనకు అంత ఆదాయం లేకపోయినా, దాని ఖర్చుపోగా, తిండి గింజలు వచ్చినా తృప్తేగా!"

"ఈసారి చూద్దాం."

"చూద్దాం కాదు, చేద్దాం అనాలి. మీ వ్యవసాయంలో వచ్చిన లాభాలుపెట్టి ఏమేమి కొంటారో మీ యిష్టం". చలపతి మాట్లాడక మెల్లగా కాఫీ సిప్ చేస్తూ కూర్చున్నాడు.

"విష్ణూ! సుధ భర్తకు మనం అలకపాన్పు మీద ఏం యివ్వలేదు. స్కూటరు కావాలట" కాంతమ్మ చెప్పింది.

"మోటారయితే బావుండదూ!"

"ఏమిట్రా ఆ మాటలు? పెళ్ళినాడు కట్నం తప్ప లాంఛనాలు ఏం జరిపామని!"

"ఈ కట్నాలు, లాంఛనాలే మనలాంటి మధ్యతరగతి కుటుంబీకులను అడుక్కు త్రొక్కి వేస్తున్నాయమ్మా. వివాహమంటే ఓ పవిత్రమైన అనుబంధం. స్త్రీ పురుషులు ఒకరికొకరు అండదండలుగా వుంటూ ఇల్లు గడిచేలా చూస్తారు. యిలా కన్నవారినో బేంక్ అనుకొని, పీడించి జోలి చేతికివ్వరు, యివ్వాల్సిందేదో పెళ్ళినాడే యిచ్చాం" లేచి బేసిన్ దగ్గర చేయి కడుక్కున్నాడు.

"నీ వాదనే నీదిట్రా. స్కూటర్ కొనకపోతే యికమీదట మనింటికి పంపడట"

"మంచిదేగా అన్యోన్య దంపతులు" అన్నాడు.

సుశీలమ్మ వేడి కాఫీ తెచ్చి, బల్లపై పెట్టి పోబోయింది.

"పిన్నీ! మీకెన్నిసార్లు చెప్పినా అరువు బేరాలు మానరు యెందుకు వద్దంటానో అర్థం చేసుకోరేం? వాడు కిలో బదులు తొమ్మి వందల గ్రాములే యిస్తాడు. బయట ఒక రూపాయివున్న వస్తువు రూపాయి ఇరవై అయిదుపైసలు వేస్తాడు. అత్యవసరం అనుకుంటే తప్ప"

"వస్తువులు నిండుకున్నాయి."

"ఎలా అయిపోతాయి! ఖర్చులకు ఓ ప్రణాళికంటూ లేదా? కొట్లో మీరు చేసే అప్పులకు నేను బాధ్యుడిని కానని ప్రకటించి పరువుపోగొట్టు కోవాలి కాబోలు".

కూర్చుని కప్పు ముందుకు లాక్కున్నాడు.

"నేనేం మింగటం లేదు."

"ఎవరూ మింగరు పిన్నీ! పనికిమాలిన డాబు, దర్పాలే మింగుతాయి"

"అమ్మా! సుధ పెళ్ళికి నాకు తెలియకుండా, రాజయ్య కొట్లో బట్టలు తెప్పించావ్, యింతవరకు తీరలేదేం?"

"బావుందిరా, నేను ఉద్యోగం చేస్తున్నానా!" ఆపైన ఆమె మాట్లాడలే పోయింది. భర్తలేక కొడుక్కు యెంత అలుసయింది. అతను తనను దోషిలా నిలబెట్టటమా? దుఃఖం ముంచుకు వచ్చింది. ఉదయమే సుధకు వాగ్దానం చేసింది. ఎలాగయినా స్కూటర్ కొనిపించుతానని. అది భంగపడిందాయె. ఆమె హృదయం కుతకుత లాడిపోతోంది.

"ఛ, చేసేవి చేస్తూనే ఏడ్పులు. ఆ డబ్బు కట్టివేశాను. ఇకపై అలా తెప్పిస్తే పూర్తిగా మీ బాధ్యతే"

ఫోను మ్రోగింది. లేచి వెళ్ళి తీసుకున్నాడు.

"హలో! సారీ, నిన్న నా మేరేజ్. అందుకే. వెంటనే అయిదు నిమిషాల్లో-" అతను ఫోనుపెట్టి కోటందుకొని తిరిగి అయినా చూడకుండా వెళ్ళిపోయాడు.

సుజాతకు ఏడ్పు వచ్చింది. "ఇంట్లో ఎందరున్నా నేనే వెళ్ళి వీడ్కోలు ఇవ్వాలే" పద్మ పెళ్ళి అయినకొత్తలో చెప్పుకునేది చెల్లెలితో. "తనవంకయినా చూడలేదేం?" సుజాత మనసు ఆక్రోశించింది. పెద్దగా అరుస్తోంది సుశీలమ్మ ఆ అరుపులు సుజాత ఆలోచనలను చెల్లాచెదరుచేశాయి.



"మీ మెతకవల్లే వాడిన్ని మాటలు అంటున్నాడు. వేరుగా వుంటే బ్రతకలేమా?"

"అప్పుడయినా పనిచేసుకోవాల్సిందేగా. వాడేమన్నాడు?" నింపాదిగా చెప్పాడు చలపతి. చిన్నప్పటినుండి అతని స్వభావం చిత్రమయింది. పంతాలకు పట్టింపులకు పోడు. తనలోవున్న బలహీనత తనకు తెలుసు. స్వతంత్రించి యేపనీ చేయలేడు. సుశీలమ్మ చిరబురలాడుతూ వెళ్ళి పోయింది.

## 15

మధ్యాహ్నం పిల్లలుండరు. ఇంట్లో అందరూ ఆడవారే. సుజాత వారపత్రిక తిరగేస్తుండగా కాంతమ్మ పిలిచింది.

"రామ్మా భోజనం చేద్దువుగాని"

"వారు.... వార్ని రానియ్యండి."

"వాడు పగలు ఎప్పుడూ రాడమ్మా, యిందాకనే భోజనం పంపాను" అన్నది. ఆమె వచ్చేసరికి అందరూ బల్లచుట్టూ చేరారు.

"చదువుకునే రోజులలో చూసిన విష్ణు ఎంత ఉదార హృదయుడు" నిట్టూర్చింది సుశీలమ్మ.

"మీకే మిగులుస్తున్నాడుగా పిన్నీ" సుమతి మూతి తిప్పింది. "రేపు మా ఆడబిడ్డలు, అత్తగారు 'ఆడబిడ్డ కట్నం ఎంత' అంటే ఏం చెప్పాలో!"

"ఓ పొట్లంలో పసుపు, కుంకం కట్టుకో. రెండు ఆకులు, పోకలు తీసుకుపోవే అక్కయ్యా!" సుధ వ్యంగ్యంగా అని ఓరగా సుజాత వంక చూచింది.

"అదికూడా ఖర్చు దండుగంటే?" యిద్దరూ ఫక్కున నవ్వారు. సుజాత అపరాధిలా తలవంచుకుంది. "అందుకే తల్లి అంది కాబోలు. వాళ్ళిద్దన్నారని ఉత్తగా పంపితే రేపు దాన్ని దెప్పిపొడవరూ" అంటూ.

"అదేమిటమ్మా అలా కెలుకుతున్నావ్? కారంగా వున్నాయా?"

"లేదండీ" అన్నది అత్తగార్ని చూచి సిగ్గుగా. అన్నం ముద్దలు మింగుతున్నా ఆలోచనలు వస్తూనే వున్నాయి.

పాపం పెద్దక్కను, పద్మక్కను ఆడబడుచులు యిలా వేధిస్తూన్నారు కాబోలు. అందుకే అమ్మను పీడించి, మరీ లాంఛనాలు జరిపించుకుంటారు అనుకుంది.

"అక్కయ్యా!" విసురుగా వుంది కమల పిలుపు.

"ఏమిటే?"

"ఆడపిల్ల అత్తవారు అస్తమానము దెప్పటం ఏం బావుంటుంది నా నగలు అమ్మి దానికి స్కూటర్ కొనమని చెప్పు."

"బావుందే వరస. నీ నగలు దానికిచ్చి, మరి రేణునేం చేస్తావ్"

"ఆనాటికి వాసు యెదిగి వస్తాడు."

"వాడూ విష్ణులాగే తయారయితే?"

"ఖర్మ, అంతా మా దురదృష్టం" తల బాదుకుంది. ఆరోజు అంతా తిడుతూనే వుంది. సాయంత్రం సుమతికి నొప్పులు రావటంతో ఆస్పత్రికి తయారయ్యారు.

"విక్టోరియా కెళ్దామా?" సుశీలమ్మ అడిగింది.

"మీ కాళ్ళు పట్టుకుంటాను పిన్నీ! నేను వసంతాదేశ్‌ముఖ్ దగ్గరికి వెడతాను."

"ఆమె నార్మల్‌గా అయ్యే డెలివరీకే యేడు, యెనిమిది వందలు బిల్ చేస్తుంది."

"చెయ్యనీ! నా ప్రాణంకంటే ఎక్కువ కాదు, మీరిచ్చుకోలేక పోతే మా ఆయనకి రాస్తాను."

"అంతమాట దేనికే? మొదట వెళ్దాం పద. కమలా, యేదయినా సహాయం కావాలనుకుంటే సుజాతను పిలువు" కాంతమ్మ చెప్పింది. సుమతిని తీసుకొని తోడికోడళ్ళు యిద్దరూ వెళ్ళిపోయారు.

కమలమ్మకు వంటలో సాయం చేసింది. బడులనుండి వచ్చిన ఆడబడుచులకు, మరుదులకు ఫలహారం అందించింది.

"అప్పుడే కొత్తవదిన పనిచేస్తుందే" ఉదయ్ నవ్వాడు.

"అన్నయ్యకి స్వపరభేదాలు లేవురా" రాజీవ్ నవ్వబోయాడు. పనులన్నీ ముగించి, ఏ చిన్న చప్పుడయినా భర్తేనని యెదురు చూసింది.



నిమిషాలు గంటలలోకి మారాయి. ఆమె నిరీక్షణ విసుగులోకి మారినా, అతను ఇంటికి రాలేదు. అందరితో రాత్రి భోజనం చేసి, రమ యిచ్చిన మల్లెచెండు తురుముకొని పైకి వెళ్ళిపోయింది. విపరీతమైన బాధగా వుంది. బాధపడటంలో అర్థం లేదు! అతని విషయాలు అన్నీ విన్నాకనే చేసుకుందాయె! మెల్లగా కళ్ళు మూతలు పడ్డాయి.

# 16

మధురమైన స్పర్శ! తను ఎదురుచూసిన రూపం, ఆ స్పర్శవల్ల కలిగే అత్యంత ప్రియమయిన అనుభూతి! ఆమె ప్రక్కన చోటు చేసుకుంటున్నాడు అతను.

"మీరు వచ్చారా" నమ్మలేనట్టు అడిగింది.

"ఐయామ్ సారీ సుజా! బాగా అప్‌సెట్ అయ్యావు కదూ?" మృదువుగా బుగ్గలు నిమురుతూ అన్నాడు.

"భోజనం చేశారా?"

"చేశాను. థ్యాంక్స్ ఎ లాట్" అన్నాడు వెక్కిరిస్తూ.

'అత్తయ్య మేలుకుని ఉన్నారా?"

"మీ అత్తయ్య ఆస్పత్రిలో వుంది. తొమ్మిదింటికే బయలుదేరాను. పిన్ని ఫోన్ చేసింది. అక్కయ్య ఆస్పత్రిలో వుందంటూ. అక్కడికి వెళ్ళాను. పరిస్థితిచూస్తే ఆపరేషన్ చేయాలేమో అనిపించింది. అక్కడే వున్నాను."

"మరేమయింది?"

"అక్కయ్యకు కూతురు పుట్టింది. ఇద్దరూ క్షేమమే!"

"మీకెవరు వడ్డించారు?"

"తొమ్మిది దాటితే ఎవర్నీ నాకోసం ఉండొద్దని చెప్పాను. నేనే వడ్డించుకు తింటాను!"

ఆమె నిద్ర ఎగిరిపోయింది. దినమంతా శ్రమపడిన వ్యక్తికి అన్నం వడ్డించేవారు లేరు. పైగా అతన్ని అందరూ తిట్టుకుంటారు. ఒకరు తన కోసం కష్టపడకూడదనుకునే వ్యక్తినా కర్కోటకుడు అంటారు! ఆమె కళ్ళు చెమర్చాయి.

"సారీ..." ఆమె కన్నీళ్ళకు అతను మరో అర్థం తీసుకున్నాడు ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"అది-అది-కాదు" ఆపైన అతను మాట్లాడనివ్వలేదు. మరో పది నిమిషాల్లో అతను గాఢనిద్రలో మునిగిపోయాడు.

పాపం ఉదయం నుండి ఒకటే శ్రమ అనుకొని, అతని ఒత్తయిన జుట్టు నిమురుతూ కూర్చుంది.

* * *

టక, టకమని శబ్దం వినిపించింది. బలవంతంగా కళ్ళు విప్పింది. విష్ణు దీక్షగా టైప్ చేస్తున్నాడు. లేచి బాత్‌రూమ్‌కి వెడుతుంటే అతను చిన్నగా నవ్వి, తన పనిలో లీనమయ్యాడు. ముఖం కడిగి అతను చేసిపెట్టిన టీ త్రాగి, చక, చకా అతని పనులు చేసింది. ఆ ఇంటికి తను రెండురోజుల క్రితం వచ్చినట్టు లేదు. యుగాలముందు పరిచయం వున్నట్టుంది. అతన్ని ఏమేమో అడగాలని వుంది. అతని నిర్మోహమాటం చూస్తే జంకు కలుగుతోంది.

"ఏ సూటు తియ్యమంటారు?"

"అలమారాలో మొత్తం మూడు సూట్లున్నాయి. ఏదో ఒకటి తియ్యి" అన్నాడు.

'నీకు దేంట్లో అందంగా కనిపిస్తాను!" అని అడుగుతాడని అనుకుంది. ఎంతయినా క్రొత్త పెళ్ళికూతురు కదా! యెన్నో స్వీట్ నథింగ్స్ వుంటాయి. ఆశాభంగమయినట్లు ఒకసారి తల విదిలించింది. పనులు అయిపోయాక వెళ్లబోయింది.

"సుజా!...."

"ఊఁ"

"ఇలా రా" అతనికి దగ్గరగా వెళ్ళింది. అతనామె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"సుజా! మనముంటోంది వాస్తవ జగత్తులో. సినిమాలో చూపించే ప్రేయసీప్రియులు, భార్యాభర్తలు కేవలం వినోదం కోసం కల్పించిన వారు.



శోభనం గదిలో డ్యూయెట్లు పాడితే మెంటల్ ఆస్పత్రికి ఫోను చేస్తారు" ఫక్కున నవ్వేసింది.

"నిజం సుజా?"

"మీ ఉపోద్ఘాతమంతా దేనికి!"

"తెలివయినదానవు ఆ మాత్రం అర్థం చేసుకోలేవూ?" ఈ మనిషికి మనసులో మాట ఎలా తెలుస్తుందో అనుకుంది. మరోసారి ఇలా పట్టుపట్ట కూడదు అనుకుంది.

"నాదో చిన్న కోర్కె"

"ఊఁ చెప్పు. నాకు సాధ్యమయితే తీరుస్తాను."

"మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకూడదూ?"

"ఆ టైంలో ఎంత పని చేసుకుంటానో నీకు తెలియదు.... వీలున్నప్పుడల్లా వస్తాను" ఆమె చేతిని ముద్దు పెట్టుకుని వదిలేశాడు.

క్రిందకు వచ్చి అత్తలకు సాయం చేసింది. అందరి ఫలహారాలు అయ్యాయి. సుశీలమ్మ పాలు, అన్నం తీసుకుని ఆస్పత్రికి వెళ్ళింది. ఆమె అక్కడే వుండి కాంతమ్మను పంపింది.

మధ్యాహ్నం కొడుకు భోజనానికి రావటం చూచి తోడికోడళ్ళిద్దరు ముసిముసిగా నవ్వుకున్నారు. బల్లదగ్గర టెలిఫోను అమర్చి, బల్లమీద అన్నీ శుభ్రంగా పెట్టి తప్పుకుంది.

"ఊ.... వడ్డనకూడా కానియ్యి" కమలమ్మ అన్నది.

"పొండత్తయ్యా" దూరం వెళ్ళిపోయింది. కమలమ్మ వడ్డిస్తుండగా అతను భోజనం చేశాడు. అతడు మజ్జిగ పోసుకుంటుండగా ఫోను వచ్చింది.

"హలో-పీతాంబరంగారా! నమస్తే.... ప్రయత్నిస్తూనే వున్నాను. అలాంటిదేం లేదు-తీవ్రతకొస్తే లాభంలేదు-కోర్టా-నాదేం లేదు. మీ యిష్టం" ఫోను పెట్టేసి చేతులు కడుక్కున్నాడు. అతని ముఖం పాలిపోయింది. ఏదో అసహాయత. తన కోటు అందుకున్నాడు.

"అదేమిట్రా!"

"నేను అర్జెంటుగా వెళ్ళాలమ్మా" వెనుతిరిగి చూడకనే వెళ్ళిపోయాడు...

*　　　*　　　*

రాత్రి పదిన్నరకు ఇల్లు చేరిన విష్ణు తలుపు తట్టక పూర్వమే తలుపులు తీసుకున్నాయి. సుజాత నిలబడ్డది. క్షణం అతని కళ్ళల్లో కదలాడిన మెరుపు గ్రహించింది. ఆమె చేయిచాపి అతని కోటు అందుకుంది. అతని తృప్తికంటె తనకేం కావాలి? అతను చేతులు కడిగి వచ్చేసరికి పదార్థాలు వేడిచేసి తెచ్చింది.

"ఇంత రాత్రివరకు మేలుకోవటం దేనికి?"

"దినమంతా నేను ఏం రాచకార్యాలు ఏమున్నాయ్!" నవ్వుతూ వడ్డించింది. అతను ఒక ముద్ద కలిపి నోట పెట్టుకోబోయి ఏదో గుర్తు వచ్చినవాడిలా చేయి దించాడు.

"నీ భోజనం అయిందా!"

"తరువాత...."

"అదేంలేదు. నువ్వూ కూర్చో." తనూ కూర్చుంది. నిశ్చింతగా, నిమ్మళంగా అతను భోజనం చేస్తుంటే ఎంతో తృప్తిగా వుంది.

"వేడిగా వున్నాయని కడుపునిండా తింటున్నాను. వారంరోజులలో లావెక్కిపోతాను."

"ఎక్సర్‌సైజు మాత్రం తక్కువ వుందేమిటి?" అన్నది.

ఇద్దరూ భోజనం ముగించి పైకి వెళ్ళారు.

"నువ్వు ఈ ఇంటికి కొత్తదానిలా లేవు సుజా! పాతదానిలా, ఎన్నో ఏళ్ళనుండి పరిచయమున్నట్టు అన్పిస్తుంది."

"ఏమో?"

"చెప్పలేను" అతను కై ముందు వేసుకున్నాడు.

"ప్లీజ్! ఉదయం చూడవచ్చు" అని మూసింది. "మీతోపాటు నన్నూ లేపండి! ఎంత లేవాలనుకున్నా మెలకువరాదు" అన్నది సిగ్గుపడుతూ.

"మరి తమరేమో ఆఖరి సంతానం. నేను జ్యేష్ఠుడను."

"అదేం లేదు" అన్నది, అతని సరసనే కూర్చుంటూ. "ఒకమాట అడగనా?"

"సందేహం ఎందుకు?"



"వున్నట్టుండి గంభీరంగా మారిపోతారు! అందరిపట్ల చాలా కఠినంగా వుంటారు" జంకుతూ అడిగింది.

"ఓ అదా-" చెప్పబోయాడు. వెంటనే తన డాక్టర్ స్నేహితుని మాటలు గుర్తుకువచ్చాయి. 'అహంకారంతో సమాన హక్కులంటారు గాని, ఏ చిన్న విషయం విన్నా జీర్ణించుకోలేరు. కొన్ని విషయాలలో మనం జాగ్రత్తగా వుంటే అనవసరమైన హంగామా తగ్గుతుంది'. అది నిజమే అనిపించింది. అందుకే అతను ఏం చెప్పలేదు.

"నీకే అర్థం అవుతాయి" అన్నాడు పడుకుంటూ.

"ఎందుకు?"

"ఏమో...." అతను కళ్ళు మూసుకున్నాడు.

"మీరు స్త్రీలను గూర్చి ఏదో తప్పుగా అంచనా వేసినట్లున్నారు." అన్నది బ్లాంకెట్ పైకిలాగుతూ.

# 17

"ఏమిటోనే, ఈ పుట్టినరోజు పండుగలు, సరదాలు ... మాకెట్లా తీరుతాయి! ఆయనకు పట్టవు. మా తోడికోడలు పెట్టి పుట్టిందే! పుట్టింటివారు అన్నీ అపురూపంగా జరిపిస్తారు" పద్మ తన ఏడాది నిండబోతున్న కూతుర్ని చూసుకుంది.

"ఎంత మాటన్నావే! అపురూపంగా చూడకపోయినా, ముద్దూ ముచ్చట తీర్చటం లేదా?" సుందరమ్మ కూతుర్ని నిష్ఠూరంగా చూసింది.

"ఏం ముచ్చట్లు తీరతాయి. మీ సంసారం అంతంత మాత్రమే! ఇద్దరి తరువాత పుట్టిన ఆడపిల్లకో ముత్యాలదండ చేయించాలనుకున్నాను. ఏదీ కుదిరితేనా? దేనికయినా పెట్టి పుట్టాలి."

"నోరు మూసుకోవే, మీ నాన్న లేకపోయినా ఏం తక్కువ చేశాను?" సుందరమ్మ కోపంగా లేచి వెళ్ళిపోయింది. ఆమెకు ఒకటే ఆలోచన, ఎట్లాగయినా తన ప్రేమ నిరూపించుకోవాలి. రాత్రి భోజనాలు అవుతున్నాయి. రఘు లేచాడు తొందరగా, అతనికి భోజనం చెయ్యగానే ఓ సిగరెట్టు కాల్చుకోవటం అలవాటు. ఇంటి ముందు పచార్లు చేస్తూ కాలుస్తున్నాడు.

"రఘూ!"

"ఏమిటమ్మా"

ఆమె వచ్చి వేపచెట్టు క్రింద చప్టాపై కూర్చుంది.

"రేపు పద్మ కూతురు పుట్టినరోజట. ఏదో నల్గురినీ పిలి ఘనంగా చేయాలనీ. మన బంధువులను భోజనాలకి కేకేసి, దాని రెండొందలు పెట్టి ఓ ముత్యాల గొలుసు చేయించు. అ, అప్పట్ల చేయించటానికి సమయమేది. కొనెయ్యి."

"అమ్మా"

"ఏమిటి?" అంది అసహనంగా.

"అంత డబ్బు యెక్కడుందే?"

"అప్పులో అప్పవుతుంది తీసుకురా."

"అప్పెవరిస్తారు? మార్వాడీ దగ్గర పద్మ పెళ్ళికి చేసిన అప్పు తీర్చక మునుపే సుజాత పెళ్ళికి తీసుకున్నాము. పాపం పెరిగినట్టు వడ్డీలు పెరుగుతున్నాయి. పోనీ ఇల్లు అమ్మేద్దామా."

"అన్నీ పోయాయి. మాటకు ముందు ఇల్లు ప్రసక్తి దేనికీ. ఇష్టం లేదంటే పోలా?" చివాల్న లేచింది.

"అమ్మా! నా మాట వింటావా?"

"ఏమిటా విలువయిన మాట" అన్నది చీదేస్తూ.

"నాకొచ్చే జీతంలోంచి నెల నెలా యింతో అంతో మార్వాడీ కిస్తూంటే వడ్డీలకు సరిపోవటంలేదని ఒకటే అవమానం చేస్తున్నాడు."

"ఆ......తెలివి లేకపోతే సరి! ఆయన వుండగా ఎన్ని చోట్ల అప్పులు చేయలేదు? పద్దులు రాయించలేదు."

"ఆ కాలం వేరమ్మా. అదీకాక నాన్నగారి ఉద్యోగం అలాంటిది..."

"పోనీ ఓ పనిచేయి. సుజాత మొగుడిని అడగరాదూ! నీకు బాగా స్నేహమేగా?"

"అమ్మా" ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టాడు. ఈ రోజు మరో సత్యం తెలిసింది. బిడ్డల మీది ప్రేమతో కూతుళ్ళకు దోచిపెడుతుంది అనుకున్నాడు. కాని అది కేవలం గొప్పకోసమని అర్థం అయింది. కాకపోతే



కానీ కట్నం లాంఛనం అడగని అల్లుడి దగ్గర అప్పడగ మంటుందా? అతను ఆలోచిస్తూ కూర్చున్నాడు చెట్టు మొదట్లో.

మర్నాడు కంపెనీలో ఎమర్జెన్సీ లోన్ రెండువందల రూపాయలు తీసుకున్నాడు. తన దగ్గరున్న డబ్బు కలిపి సన్న ముత్యాలదండ కొన్నాడు. తల్లి చెప్పిన బంధువులలో సగం మందికే చెప్పాడు. ఆ ముత్యాల గొలుసు చూస్తూనే అతని కూతురు చిట్టి ఏడ్పు మొదలుపెట్టింది. తనకూ కావాలని. అలాంటి పరిస్థితి వస్తే ఏం చేయాలో తెలియదు అతనికి. మెల్లగా బయటికి తప్పుకున్నాడు.

"ఇక్కడ ఏడిస్తే లాభం ఏమిటే? మీ అమ్మమ్మను చేయించమను. నేను చేయించటం లేదూ?" కూతుర్ని సముదాయిస్తూనే కోడలికేసి ఓరగా చూసింది.

"అడిగితే అప్పయినా చేసి చేయిస్తారేమో! అడిగి చేయించుకోవటం నాకిష్టం లేదు" అన్నది స్పష్టంగా. యెప్పుడో సరదాకి కొన్న ఆర్టిఫిషియల్ దండ కూతురి మెడలో వేసింది. సుందరమ్మ రయ్‌మని కోడలి దుమ్ము దులిపేది కాని వంటలు అవీ చేయాలి. సరళ ముఖం మాడిస్తే కష్టం. అందుకే కోపం దిగమింగింది.

విందు భోజనానికి చాలామంది వచ్చారు. సుజాత రాలేదు. సుందరమ్మ మహా బాధపడిపోయింది. "మొదటి నుండి మాకు పెట్టొద్దన్నట్టే వుండేది దాని ధోరణి, అది వచ్చి ఈ ఖర్చు చూసి భరించగలదా?" పద్మ నిష్ఠూరం.

"అదికాదే. వీడసలు చెప్పాడా?"

సుందరమ్మ బయటిగదిలోకి వచ్చింది. ఘు కూతురుతో కబుర్లు చెబుతున్నాడు. అది చూసి సుందరమ్మ కళ్ళు చిట్లించింది.

"ఏరా, అసలు సుజాతను పిలిచావా?"

"చెప్పానమ్మా, విష్ణు నవ్వి తనకు తీరిక లేదన్నాడు."

"అమ్మాయిని పంపమనకూడదూ, నీ 'మీ• తెలియదు" సాధింపు మొదలుపెట్టింది.

"అతని కంటికి మేం ఆని వుండములే" అన్నది పద్మ. సాయంత్రం వరకు సాధిస్తూనే వున్నారు.

"దీనికోసమని వంటంతా తగలేశాం. యెన్ని పదార్థాలు పాడై పోయాయో" అంగలార్చింది పెద్దావిడ.

"నేను ఉదయమే చెప్పాను. అవి చాలా వున్నాయని. సుజాత వచ్చినా యిన్ని పదార్థాలు తినేదా?" సరళ అన్నది.

"కొసరి కొసరి చేసుకోవటం మా యింటా వంటా లేదు" అత్త మూతి తిప్పింది.

'అందుకే పొలాలు, నగదు, వెండి, బంగారం అన్నీ మాయం అయ్యాయి. ఇల్లు కూడా అవుతుంది." అనబోయి మళ్ళీ పుట్టినరోజు నాడు గొడవ యెందుకని ఊరుకుంది. పేరంటం మొదలయింది. పేరంటాల వారికి లడ్డూ, అరటిపండు పంచిపెట్టారు. అందరూ పాపను దీవించి వెళ్ళిపోయారు.

"దానికో చీర కొంటే పోయేదిరా" అన్నది కొడుకుతో. అతను ఏమనాలి అని యోచించే లోపలే బయటి నుండి ఎవరో పిలిచారు.

"రఘూ భాయ్"

"ఎవరూ"

"మార్వాడీలాగున్నాడు" బయటికి వచ్చాడు.

"నమస్తే"

"నమస్తే, మేము వ్యాపారం చేసేది నాలుగు డబ్బులకి భాయి. వడ్డీ కట్టవు.... అసలు సంగతే ఎత్తవు. పదిరోజులు గడువు. వడ్డీకాక అసలులో వేయి రూపాయలు జమకట్టాలి. లేకపోతే ఇల్లు తాకట్టు వాకట్టవుతుంది." అన్నాడు ఖచ్చితంగా.

"తొందరపడొద్దు శేఠ్‌గారూ! అంతా సవ్యంగా జరుగుతుంది. కొంచెం ఓపిక పట్టాలి."

"ఓపిక సంవత్సరాల తరబడి వుంటుందా?"

"రేపు వచ్చి ఇంటి దగ్గర మాట్లాడుతాను. ఈ పూట గొడవ చేయకండి." అన్నాడు. అతను మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు.

"వారి ముందు అలా నంగి నంగిగా మాట్లాడకపోతే గట్టిగా మాట్లాడలేవూ?" తల్లి దులిపింది!



"తప్పు మనదిగా?"

"నాకు తెలియక అడుగుతానురా! అప్పులు అంతగా చేయకపోతే ఏం" ప్ర్మ అడిగింది. రఘుకి మండిపోయింది. కాని యెవరినీ గట్టిగా యేం అనలేదు.

"వడ్డీ అయినా కట్టాలమ్మా" అన్నాడు నీరసంగా.

"ఇప్పుడు మొహమాటపడి లాభం లేదు. వెళ్ళి సుజాత భర్తనడుగు. పరాయివాళ్ళమా? అదీకాక నువ్వంటే దానికి వెర్రి అభిమానం. మొత్తం అప్పు కట్టిగచినా కట్టించేస్తుంది. తరువాత తీర్చేయవచ్చు నెమ్మదిగా."

"అది నా వల్ల కాదమ్మా. అతను చాలా ఖచ్చితం మనిషి. ఇంట్లో వారే కాదు. ఆఫీసులో వారు కూడా అతని ప్రణాళికనూ, అతన్నీ చూస్తే హడలిపోతారు. ఆయనకు ముఖం చూపించలేను" అన్నాడు.

ఆ రాత్రి నిద్రకు దూరమై బాధపడసాగాడు. సరళ కూడా అదే పరిస్థితి.

"ఆలోచించి బుర్రతో పాటు ఆరోగ్యం పాడుచేసుకోవటం దేనికి? మిగిల్చి అప్పులు తీర్చటమన్నది జరగని పని. అప్పు తీర్చగా మిగిలిన డబ్బుతో ఎక్కడయినా ప్లాటు కొనండి. ఓ గది వే.ుకుని వుందాం" సలహా యిచ్చింది. ఆలోచించగా అంతకంటే మార్గం కనిపించలేదు. మర్నాడు ఆ విషయం తల్లితో ప్రస్తావించాడు.

"బాగుంది తెలివి. మీలాంటివారిని చూసే కాబోలు ఇల్లు విప్పి పందిరి వేయమన్నారట. యింకేదయినా ఏర్పాటు చూడు" అన్నది. పదిరోజులు ప్రయత్నం చేశాడు. ఎక్కడా పదిరూపాయలు పుట్టలేదు. స్నేహితులంతా అతని అజాగ్రత్తను అపహాస్యం చేశారు.

చివరకు ఇల్లు అమ్మేశాడు. మిగిలిన డబ్బు బ్యాంక్‌లో వేశాడు.

"నా గురించి నాకేం దిగులు లేదు. మీ గురించే. సంపాదించక పోయినా, ఆ మహారాజు యిచ్చిపోయింది మిగుల్చుకోలేకపోయావు" సుందరమ్మ శోకాలు పెట్టింది.

"సుజాత ఈ ఇల్లునూ, నన్నూ కాపాడాలని యెంత ప్రయత్నం

చేసిందో. ఈ వార్త వింటే అది బాధపడుతుంది. నాలాంటి అసమర్థుణ్ణి దేవుడు కూడా కాపాడలేడు" అన్నాడు బాధగా.

"ఇప్పటికయినా కాస్త లౌకికంగా వుంటే వున్నదాంట్లో తృప్తిగా వుండొచ్చు" అన్నది సరళ. ఆ మర్నాడు అద్దె ఇంటికి తరలిపోయారు.

## 18

భర్త వదిలిపోయిన టైపుపని పూర్తిచేసి క్రిందికి వచ్చింది సుజాత. హాల్లో ఫోను మ్రోగింది. రిసీవర్ తీసుకుంది. అవతలి కంఠము వింటూనే ఆమె ముఖం వికసించింది.

"సుజాత హియర్..."

"హల్లో సుజా! ప్రామిస్ కీప్అప్ చేసుకోలేకపోయాను. క్షమించు. నాకు ఆఫీసులో చాలా పని వుంది. భోజనము పంపించు" అని పెట్టేశాడు. ఈయన మాటలు కూడా తూచి తూచి మాట్లాడుతాడు. పక్కా బిజినెస్ టైపులో.

"మెల్లగా వంటింట్లోకి వెళ్ళింది. పిల్లలందరకూ కాలేజీలకు, బడులకు క్యారియర్ పంపాలని సర్దుతున్నారు. చాలా పదార్థాలు చేశారు. రవ్వ కేసరి కూడా చేశారు. అన్నీ నోరూరించేలా వున్నాయి.

"అందరి కేరియర్లలో అన్నీ పెట్టారు. విష్ణువర్ధన్ క్యారియర్లో మాత్రం అన్నం, కూర, సాంబారు, పెరుగు పెట్టారు."

"అత్తయ్యా-కేసరి పై డబ్బాలో పెట్టవచ్చు."

"నయం మాకు గుర్తు లేదనుకుంటావు కదూ! ఈ పూట యిన్ని పదార్థాలు చేశామని తెలిస్తే రాత్రికి వచ్చి ఇంట్లోవారికి ఉపన్యాసము మొదలుపెడతాడు. ఖర్చు చేశామని నసపెడతాడు" సుశీలమ్మ అంది.

"వాడికి పెట్టక తినాలని కాదమ్మా! ఈ ఇంట్లో యేనాడు వాళ్ళ అధరువులకు తక్కువగా చేయలేదు. వాడు పొదుపో, పొదుపో అని అరవటం తప్పితే, ఒక్కనాడయినా యిది చేయండి! అది చేయండి! అంటాడా?" కమలమ్మ అంది.

"అందుకే అప్పుడప్పుడు యిలా చేస్తాము" సుశీలమ్మ అందుకుంది మధ్యలో. కాంతమ్మ వింటున్నా ఏమనలేదు.



సుజాత అంతరంగమంతా కదిలిపోయింది. తను కొత్తకోడలు. ఏమని సలహా యిస్తుంది. ఉదయం లేచి, అనుభూతులు, సుఖం యెరక్క పనిచేసే విష్ణు ఆమె కళ్ళ ముందు కదిలాడు. కంటిలో ఉబికిన నీరు కనిపించకుండా అదిమిపెట్టి యివతలికి వచ్చింది.

అత్తగారు భోజనానికి పిలిస్తే తలనొప్పి సాకుతో తప్పించుకుంది.

"అదేమిటమ్మా?"

"ఏం లేదండీ. ఒకపూట భోజనం మానేస్తే అదే తగ్గిపోతుంది." అన్నది. గంట తరువాత ఖాళీ టిఫిన్ క్యారియర్‌తో వీరయ్య తిరిగి వచ్చాడు.

"అయ్యగారు యింత త్వరగా తిన్నారా వీరయ్యా?"

"చాలా పనిలో వున్నారమ్మా! ఏం తిన్నారో చూచుకోలేదు" అన్నాడు.

సుజాతకు బాధగా వుంది. "ఆయన యింత శ్రమపడుతున్నది ఎవరి కోసమో వారు గుర్తించటం లేదు. పైగా అతన్ని కర్కోటకుడని పిలుస్తారు. తన ప్రాణం పోయినా సరే అతన్ని పీడించి 'యిది కావాలి, అది కావాలి' అని అడగకూడదు. నూటికి యాభై సంసారాలు ఆడదాని సహకారం లేక పాడయితే, మిగిలిన యాభై మొగాడి అసమర్థత వల్ల పాడవుతాయి" అనుకుంది. తల్లి గుర్తుకు వచ్చింది.

"ఆడంబరాలే తప్ప అమ్మకేం తెలియదు. వివాహం అయి అత్తవారింటికి వచ్చాక మళ్ళీ వెళ్ళనే లేదు. ఆయన కసలు తీరిక వుండదు. తను ఒక్కర్తీ వెళ్ళాలంటే ఏమోగా వుంటుంది. ఈలోగా, అన్నయ్య కాస్త తెరిపినపడతాడు" అనుకుంది.

రాత్రి అందరి భోజనాలు అవుతుండగా అత్తగారు మళ్ళీ పిలిచింది.

"వారొచ్చాక భోజనం చేస్తానత్తయ్యా."

"అర్ధరాత్రికో, అపరాత్రికో వస్తాడు."

"ఫరవాలేదు" అన్నది.

"ఓహో! పతివ్రతా లక్షణం కాబోలు" పక్కున నవ్వింది ప్రభ వదినను చూస్తూ.

"చాల్లే, చిన్నా, పెద్దా ఏం లేదా?" కాంతమ్మ కసురుకుంది. మరో గంటలో ఇల్లంతా నిశ్శబ్దం అయింది. సుజాత మేడ మెట్లపై కూర్చుని

పత్రిక తిరగవేయసాగింది. లేనివారు పొదుపు, పొదుపు అంటే పరవాలే లక్షాధికార్లకు వీళ్ళకెందుకో? తనేది అడిగినా దాటవేస్తాడు. విష్ణు ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ తలుపు తట్టాడు భర్త. వెళ్ళి తలుపు తీసింది, వాడిన ముఖంతో వచ్చాడు. అతను చేతులు కడిగేసరికి ఈ వడ్డించటానికి పదార్థాలు తీసి చూసింది. సాయంత్రం అందరూ తి ఒక్క పదార్థం లేదు. చారు, కూర వున్నాయి. ఆమె హృదయం ఏదో పిండినట్టు అయింది. "మీరెందుకు శ్రమ పడుతున్నారు? ఎవరి కోసం అనాలని ఆవేశపడింది. ఆమె ఎంత అపుకుందామన్నా కన్నీరు ఆగలేదు. మౌనంగా టేబుల్‌పై వస్తువులు అటువి ఇటు, ఇవి అటు సర్దసాగింది. అతను కూర్చోబోతూ ఆమె వంక చూశాడు. కన్నీరు ఆమె పట్టిందని స్పష్టంగా తెలుస్తోంది. అతను లేచి ఆమె భుజాలు పట్టి తన వైపుకి తిప్పుకున్నాడు.

"సుజా! రోజూ తొందరగా రావాలనుకుంటాను, కుదరటం లేదు. ఇంకొక్క సంవత్సరం ఓపిక పట్టు. నీ చిరునవ్వులో అలసట మరిచిపోవాలని వస్తే అలక సాగించావేమిటి?

"అలక కాదు...." ఆపైన చెప్పలేకపోయింది. గట్టుతెగిన చెరువులా దుఃఖం వచ్చింది. అతని చేతులలో ఒరిగిపోయి వెక్కివెక్కి ఏడ్చింది.

"అసలేం జరిగింది సుజా? ఎవరన్నా అవమానించారా? చెప్పందే నాకెలా తెలుస్తుంది."

ఏమని చెబుతుంది. చెప్పి అతని మనసు పాడుచేస్తుందా? ఇంటిలో తన వలన ఎలాంటి చీలికలు రాకూడదు.

"ఏం లేదు. మీరు దినమంతా కనిపించకపోతే...." అన్నది దూరం జరుగుతూ.

ఫక్కున నవ్వాడు. అతను నవ్వుతుంటే మైమరిచి చూడసాగింది.

"సరే భోజనం చేద్దాం రా. కడుపులో ఏదయినా పడితేగాని మాట్లాడడానికి ఓపికరాదు." ఇద్దరూ భోజనాలు పూర్తిచేసి పైకి వెళ్ళారు.

ఆమె టైపు చేసిన కాగితాలు చూసి, అక్కడక్కడ పొరపాట్లు దొర్లాయని చూపాడు. విష్ణుకు పనిదగ్గర స్వ పర భేదం లేదు.



"ఈసారి జాగ్రత్తగా చేయాలి. యిదంతా యిలాగే పంపలేను. మరోసారి నేను చేయాలి" అన్నాడు.

"ప్రాక్టీసు లేదండీ" అన్నది.

"పరవాలేదు."

"ఓ టైపిస్టుని పెట్టుకుంటేనేం."

"ఆడమ్మాయిని పెట్టుకుంటే, మిగిలిన మొగాళ్ళు ఆమెను పని చేయనీయరు. మొగాళ్ళను పెట్టుకుంటే మన పని కొండెక్కించి డబ్బు తీసుకుని యితరుల పనిచేస్తారు. యెప్పుడయినా, ఏదయినా చేసినా దాన్నిండా తప్పులు" అన్నాడు.

"మీ పనిని మీరు యెంత బాగా సమర్థించుకుంటారు" నవ్వింది. అతను వెళ్ళి ప్రక్కపై వ్రాలాడు. సుజాత కిటికీ తెరలు దించసాగింది.

"సుజా! నీకో విషయం చెప్పాలి."

"ఏమిటండీ?" అన్నది.

"మధ్యాహ్నం రఘు మా ఆఫీసుకు వచ్చాడు. ఇల్లు అమ్మాడట-"

"నిజమా"

"అతడు నీకు ముఖం చూపించలేకపోయాడు. ఫోను చేయమన్నా వినలేదు. అద్దె ఇంటిలో వుంటున్నారట."

"ఎంత పనిచేశాడు" ఆమె కళ్ళు అశ్రుపూరితాలు అయ్యాయి. నిలబడలేనట్లు గోడకు చేరబడిపోయింది.

"నేనున్నానని వాడికసలు గుర్తువుండి వుండదు" అన్నది.

"సారీ! సుజా, అతను ఇదివరకోసారి వచ్చి మీ అక్కయ్య కూతురి పుట్టినరోజని చెప్పాడు. నేను మర్చిపోయాను" అన్నాడు సుజాత అక్కడే నిలబడిపోయింది. అన్నపై, భర్తపై ఒక్కుమ్మడిగా కోపం ముంచుకు వచ్చింది.

"సుజా... టేకిట్ ఈజీ! నేను చాలా అలసివున్నాను" అనుకుంటూనే నిద్రలోకి జారిపోయాడు.

తన ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. ఎందుకోసం తనీ వివాహం చేసుకుంది? అందరిలా సినిమాలు లేవు.

షికార్లు లేవు. ప్రొద్దున ఓ అరగంట, సాయంత్రం ఓ అరగంట మాటల భర్తతో. దినమంతా యెలా గడుస్తుంది? ఐనా అన్నకో ఆధారం మిగిల్చానన్న తృప్తి వుండేది. అంతా మట్టిలో కలిసింది. బూడిదలో పోసిన పన్నీరయింది.

అలా ఏడుస్తూ ఒంటరిగా యెంతసేపుందో ఆమెకే తెలియదు. నిస్పృహ, నీరసం వచ్చేశాయి. అలాగే రాయిలా గోడకు చేరబడి కూర్చుండిపోయింది.

# 19

రఘు అద్దె ఇల్లు రెండు గదుల వాటా, చిన్న వంటిల్లులాంటి పంచ. నెలకు యాభై రూపాయలు అద్దె. అక్కడ సదుపాయాలు లేవ్, మొక్కలు లేవని ఒకటే గొడవ సుందరమ్మ.

కోడలిని సాధించి, సాధించి బయట కూర్చుందో సాయంత్రం. ఇంటిముందు ఆగిన కారులోంచి కూతురు, అల్లుడు దిగారు. సుందరమ్మ లేచి గుజాలచుట్టూ పమిట లాక్కుంది.

"చాలరోజులకు దయ కలిగిందా బాబూ? అమ్మా వాళ్ళంతా కులాసేనా?"

"నమస్కారమండి. అంతా కులాసే" లోపలికి వెళ్లారు? సరళ ఆనందంగా యెదురువచ్చింది.

"బావ లేడాండి"

"వస్తారన్నయ్యా మీరు కూర్చోండి" కుర్చీ చూపించింది సరళ. పిల్లలు బయటగదిలో వుండగా సుందరమ్మ కూతుర్ని లోపలకు లాక్కు పోయింది.

"గుండె రాయి చేసుకున్నావు కదుటే. ఏ విషయాలూ చెప్పవు. ఒక్కనాడయినా అమ్మను చూడాలనిపించలేదా?" తల్లి కంటతడి పెట్టుకున్నది.

"అదికాదమ్మా ఒక్కర్తెను యెలా రాను? ఆయన యింటికి రావటమే ఆలస్యంగా వస్తారు. వారం రోజుల నుండి అనుకుంటుంటే ఈ రోజు కుదిరింది."



"ఏమిటో.... చిక్కిపోయావు. తిండయినా దొరుకుతూందా."

"బావుందమ్మా నీ ఊహాగానం! మా అత్తలంతా నీకంటే భారీ చెయ్యి కలవారే" నవ్వింది సుజాత.

"అత్తల సంగతి కాదే.... అల్లుడు."

"ఉష్... ఆయన అవతలే వున్నారు" సుజాత వారించి తనక్కడ ఆనందంగా వున్నానని చెప్పింది.

"ఏమో నీ పట్టు నీదే. నీ మాటే సాగాలంటావు. మీ వదిన కుళ్ళు బుద్ధి చూడవే..."

"ఏం చేసిందమ్మా"

"ఇల్లమ్మి అప్పులు తీర్చగా ఎనిమిదివేలు బ్యాంక్‌లో వేశాము. నీకు పెళ్ళిలో ఏమిచ్చాం? గాజులు, గొలుసు చేయించాలంటే, అమ్మో ఏడనిస్తుందా, 'ఊ' అనదు 'ఆఁ' అనదు. స్థలంకొని ఇల్లు కడుతుందిట" అన్నది. సుజాత నిట్టూర్చింది. కూతురి బాగోగులు యింతగా కోరే తల్లికి కోడలంటే అంత నిరసన యెందుకో? ఆమె కూడా ఒక ఇంటి కూతురేగా!

"పోనీలేమ్మా వాళ్ళు సంతోషంగా వుంటే మనకదే చాలు. అద్దెలు పోశాక ఏం మిగులుతుంది. రెండు గదులు వేసుకోనీ" అన్నది.

"తనో బోడిబొమ్మలా వచ్చిందా! అందరినీ అలాగే అనుకుంటుంది. ఏమిటోనే రాత..... పెద్దక్క పది ఉత్తరాలయినా రాసింది పిల్లలను గూర్చి బాధపడుతూ. మొగుడూ పెళ్లాం నోరు విప్పరు."

"మమ్మల్ని పెంచావు. పెద్ద చేశావు. మా ఆడబిడ్డల బాగోగులు నీ కెందుకమ్మా. ఎవరి పిల్లలను వారు చూసుకుంటారు. నీవు నిశ్చింతగా తిని వుండు" అన్నది.

"అదికాదే పిల్లలు భయంలేక బొత్తిగా పాడయిపోయారట"

"అన్నయ్యకు మాత్రం జడుస్తారా"

"పోవే నీకు చెప్పటం నా బుద్ధి తక్కువ. ఇంతకీ తీపి మాటలేనా. ఏమయినా చేయించి యిచ్చిందా మీ అత్త."

"చేయిస్తున్నారు. అదిగో అన్నయ్య వచ్చినట్టున్నాడు" సుజాత బయటి గదిలోకి వచ్చింది.

రఘు చెల్లెలి పిలుపువిని తలయెత్తాడు. అతని దీనము చూపులకు చలించిపోయింది సుజాత. అతన్ని అనాలనుకున్న మాట మరిచిపోయింది. అతనికి దగ్గరగా వెళ్ళింది.

"నువ్వు బాగున్నావా అన్నయ్యా."

"ఇదిగో కనిపించటం లేదూ?" అన్నాడు.

"ఏం బావగారూ! అంత మైమరుపు. యుగాల తరవాత చెల్లెల్ని చూసినట్టు" విష్ణు హాస్యం చేశాడు.

"మీకు తెలియదా బావా! దాన్ని నా భుజాలపై పెంచాను. సహ సానుభూతి, ప్రేమానురాగాలు దానికి ఒక్కదానికే వున్నాయి" అన్నాడు కన్నీరొత్తుకుంటూ.

"తరువాత మాట్లాడుదురుగాని, వెళ్ళి ఏమయినా పళ్ళు పట్రా" సరళ బ్యాగుతెచ్చి యిచ్చింది.

"మీరు యిప్పుడు అలాంటి ఫార్మాలిటీస్ పెట్టుకోవద్దు. మరోసారి వస్తాము" విష్ణు అడ్డువచ్చాడు.

"అదేంలేదు అన్నయ్యగారూ! రాక రాక వచ్చారు. భోజనాలు చెయ్యందే వెళ్ళటానికి వీలులేదు" అన్నది సరళ.

"ఎవరి సంసారం వారిది. మన అన్నం కోసం వారు పనులు మానుకొని వుంటారా?" అంది సుందరమ్మ కోడలిమాట ఎవరూ మన్నించ వద్దని. విష్ణు ఈ విషయాలలో నిశితంగా ఆలోచిస్తాడు. సూక్ష్మగ్రాహి. అందుకే అతను వుండాలని అనుకున్నాడు.

"సరే. చేసేది ఏదో తొందరగా కానివ్వండి. భోజనం చేసి వెడతాము" అన్నాడు ఓరకంట అత్తగారిని కనిపెడుతూ.

భోజనాలు అయ్యేసరికి చాలా రాత్రి అయింది.

## 20

విష్ణు వచ్చేసరికి మార్వాడి శేట్ వరండాలో వున్న కేన్ చైర్లో కూర్చున్నాడు. అతను సుజాతతో కారు దిగుతుండగానే యెదురు వచ్చాడు.



"మాటంటే నీది భాయి. ఎవ్వరూ యింత ఖచ్చితంగా అప్పు తీర్చలేదు. ఋణ పత్రాలు తెచ్చాను."

"శేట్‌గారూ! మీరు ఇంటికి రావటం అంత మంచిది కాదు. మీరు రేపు ఆఫీసుకు రండి" అతని ముఖం గంభీరంగా మారిపోవడం సుజాత గమనించింది.

"అది కాదు, విష్ణు సాబ్!"

"చెప్పాను కదండీ, మన లావాదేవీలు బయటే'' అన్నాడు కచ్చితంగా. మార్వాడీ గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

అతని మూడ్స్ మార్చాలని సుజాత ప్రయత్నం. "మా అన్నయ్య యింత మెత్తగా యెందుకుంటాడో అర్థం కాదు''

"ఆడపిల్లలకు వుండవలసిన అణకువ వుంది మీ అన్నయ్యకి" అన్నాడు నవ్వుతూ.

"అవునండి. మొదటి పిల్లవాడని చాలా గారాబంగా పెంచారు. ఎవరికీ ఎదురు చెప్పలేడు" అన్నది నిట్టూరుస్తూ. ఆ తరువాత విష్ణు నిద్రపోయినా సుజాత నిద్రపోలేదు.

"ఆస్తిపరులయిన అత్తవారికి అప్పులా? మార్వాడీ యెందుకలా అన్నాడు. విష్ణు తనకెందుకు వివరాలు చెప్పడు!" చాలాసేపటికి అలసి నిద్రపోయింది.

మర్నాడు లేచేసరికి చాలా పొద్దెక్కిపోయింది. విష్ణు మేడదిగాడు. తను తొందరగా కాలకృత్యాలు తీర్చుకుని క్రిందికి వచ్చింది. రోజూ మల్లేనే ఏదోవాదం జరుగుతోంది.

"ఉదయ్ ఎన్నాళ్ళనుండో కాశ్మీర్ చూడాలనుకుంటున్నాడట! వద్దన్నావేం బాబూ?" సుశీలమ్మ అడిగింది. ఆ సౌమ్యత తెచ్చిపెట్టుకున్నదని తెలిసిపోతుంది.

"వెయ్యి రూపాయలు కావాలి పిన్నీ! ఆ డబ్బుతో మరో సంవత్సరం చదవవచ్చు" అన్నాడు దోసె తుంపుతూ.

"ఔనులే, నువ్వు చదివిననాడు వేలకు వేలు ఖర్చుచేస్తే అది పాడుపు కదూ!"

"ఆ వేలు ఎవరిచ్చారు పిన్నీ!"

"ఇంకెవరు - మీనాన్న."

"అంతే కదా!" చిత్రంగా నవ్వి తినటంలో నిమగ్నమయ్యాడు

సుశీలమ్మ అతను లేచిపోగానే భర్తను, తోడికోడల్ని పట్టి దులిపేసింది

"మీకు చెముడా! వాడన్నది విన్నారా? వాడి తండ్రి డబ్బు వాడు ఖర్చుపెట్టుకున్నాడట. మనల్ని సంపాదించి ఖర్చుపెట్టుకో మంటున్నాడు మాట్లాడవేమక్కా!"

"వాడన్నది నాకర్థం కాలేదే!" అన్నది కాంతమ్మ.

"మీకూ అర్థం కాలేదా?" భర్తను వెటకారం చేసింది.

"అర్థమయితే ఏం చేయనే!"

"అవునేం చేస్తారు! ఏడుద్దాం" అన్నది. "పెద్దావిడకు అర్థం కాలేదా అంతా నటన. కొడుకంతా నాకే మూట కడుతున్నాడన్న ధీమా."

ఈ అభియోగం భరించలేనట్టు విలవిల లాడిపోయింది కాంతమ్మ త్వరగా బయటికి వెళ్ళింది. విష్ణు కారు కడిగిస్తున్నాడు కన్నాతో. ఆమె చేతిలో నీటి పైపు వుంది.

"విష్ణూ! ఏమిట్రా నీ ఉద్దేశం?"

"ఏ విషయంలో?" ఎరగనట్టే అడిగాడు.

"ఉదయ్‌కి నూరు ఆరయినా, ఆరు నూరయినా డబ్బు పంపి తీరాల్సిందే" అన్నది.

"నా దగ్గరలేదు. మీ దగ్గర వుంటే పంపండి" అన్నాడు తల్లి వెనుక నిలబడ్డ పినతండ్రిని చూస్తూ! చలపతికి అదో సవాలులా అన్పించింది. ఉదయ్ తన గారాల పంట. విష్ణు పొగరేమిటో అణచాలి.

"సుశీలా నువ్వూరుకో. నేను వాడికి డబ్బు పంపుతాను" పోజు యిచ్చి విసవిసా వెళ్ళిపోయాడు చలపతి.

సాయంత్రం రాగానే ఆదుర్దాగా అడిగింది సుశీలమ్మ - "డబ్బు పంపారా?"

"మనింట్లో మింట్ వుందా? అప్పు అడగాలి. యే వెధవను అడిగినా ఒక్కటే మాట - ఎలా తీరుస్తారు? అంటూ."



"పంట వచ్చాక - అని చెప్పలేకపోయారా?"

"చెప్పాను. ముఖానే నవ్వారు. మన ప్రక్క పొలంలో బంగారం పండుతుంది. మనకెందుకు పండదు!" అతని ఆలోచనలు చాలా సీరియస్‌గా వున్నాయి. అతనికి జవాబు దొరికింది. వెంటనే లేచి భార్యమాట వినకుండానే బయటికి వెళ్ళాడు. సరాసరి పొలం వెళ్ళాడు. జీతగాళ్ళు చెట్టుక్రింద చేరి పేకాట ఆడుతున్నారు. ఇంజన్ ఆన్‌చేసి వుంది. పరిమడులు నిండి ప్రక్కకు దుముకుతున్నాయి నీళ్ళు.

"మడులకు నీరు అందినా మీకు తెలియటం లేదురా?" గావుకేక పెట్టాడు చలపతి.

"ఆ(..... ఆ(...." అంటూ వాళ్ళు కంగారుగా లేచారు. ఈ వేళప్పుడు ఈయన ఎందుకు వచ్చాడబ్బా?.... అని ఆశ్చర్యపోయారు వాళ్ళు.

"ఒరేయ్ మీకు బాగా పొగరెక్కిందిరా. అందరిలా పనిచేస్తే వుండండి, లేదా వెళ్ళి వేరేపని చూసుకోండి."

"అలాగే దొరా!" అన్నారు. కాస్త దూరం వెళ్ళి నవ్వుకున్నారు.

"చిన్నదొర ఏదో అని వుంటారు అందుకే ఈ గంతులు. రేపు మళ్ళీ ఈ ఛాయలకు వస్తారా చలపతిదొర" అనటం అతనికి వినిపిస్తూనే వుంది. అతని పళ్ళు కోపంతో బిగుసుకున్నాయి.

ఆ రాత్రి ఇంట్లో పెద్ద అలజడి బయలుదేరింది. అన్నం పొలానికే పంపమని చలపతి కబురుచేశాడు.

"ఆయనకు కోపం వచ్చిందక్కా. రాదుమరీ! నీ కొడుకు మాటలు నీకు ముద్దు, అందరికీ ముద్దా? పెద్దా చిన్నా లేదు" అన్నది సుశీలమ్మ విసురుగా. ఆ రాత్రి భోజనం మానివేసింది. కాంతమ్మకు ఈ నిందలు భరించటం కష్టంగా వుంది.

"పీడ పోయి, యింకా కొన్నాళ్ళు ఆయన బ్రతకకూడదూ! నాకిదేం బాధ" అని కళ్ళు ఒత్తుకుంది.

సుజాత ఉలిక్కిపడింది. ఏ తల్లీ తన కొడుకు చావును కోరదు. ఆమె హృదయం ఎంత బాధపడిందో! భర్త రాగానే ఈ విషయాలన్నీ

చెప్పి, ఈ బాధ్యతలు వదల్చుకోమనాలి. ఉన్న డబ్బు ఎవరికి వచ్చినా వారు ఏమయినా చేసుకోనీ.

రాత్రికి భర్తను చూడగానే నోట్లోని మాటలు నోట్లోనే వుండి పోయాయి. అతని ముఖం పీక్కుపోయివుంది. ఏదో సమస్యతో సతమత మవుతున్నాడని ముఖమే చెబుతోంది.

"ఒక్క రోజంటే ఫరవాలేదు. రోజూ యిలా ఎందుకు మేల్కొని వుంటావు?"

"ఇప్పుడేమయింది?"

"నిద్రలేక ఆరోగ్యం దెబ్బతింటే!"

"రోజూ మీరు మేల్కొని ఉంటే మీ ఆరోగ్యం చెడదా?"

"నాకలవాటయింది" అన్నాడు చికాకుగా. వెళ్ళి చేతులు కడుక్కుంటూ.

"నాకూ అలవాటు అవుతుంది."

"ఊ," అన్నాడు అన్యమనస్కంగా. ఎదుట ఎవరూ లేనట్టే ఆలోచనలో మునిగిపోయాడు.

"చిన్నత్త భోజనం చేయలేదీపూట?" అన్నది.

".... ఏమిటీ?"

"సుశీలమ్మ అత్త అలిగారు. భోజనం చెయ్యలేదు."

"మంచిదేగా! ఓ పూట అన్నం మానటం ఆరోగ్యకరం కూడాను" అన్నాడు నిర్లక్ష్యంగా. అతను భోజనం ముగించాడు. ఎందుకో చాలా ఆందోళనగా వుంది అతని ముఖం. అతని వెనకాలే పైకివెళ్ళినా పలకరించే ధైర్యం లేదు. అతను బట్టలు మార్చకుండానే ఈజీ ఛైర్‌లో కూర్చున్నాడు. అతను అంత సీరియస్‌గా ఎప్పుడూ లేడు. ఉదయం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

"ఏమండీ?"

"ఏమిటి సుజా! నువ్వింకా నిద్రపోలేదా?"

ఏమో చెప్పాలనుకుంది, అతని గంభీరత చూస్తే నోట్లోంచి మాటలు బయటికి రాలేదు. అలాగే చూస్తూ నిలబడింది. వర్షం వచ్చేలా వుంది. ఒకటే గాలీ, దుమారం. వాతావరణం అల్లకల్లోలంగా వుంది.



ఏమనుకున్నాడో లేచివచ్చి, ఆమెను మంచంపై పడుకోబెట్టి బ్లాంకెటు కప్పి, లైటు తీసి, టేబుల్‌లైటు వేశాడు. బల్లముందు కూర్చుని ఫైల్స్ ముందేసుకున్నాడు.

సుజాత కెక్కడలేని నీరసం వచ్చింది. ఈ వాతావరణంలో ఒంటరిగా పడుకోవటమా? కిటికీ నుండి వచ్చే గాలులు ఆమెను గిలిగింతలు పెట్టి పులకింపజేస్తాయి గాని, విష్ణు మౌనం బాధపెడుతోంది. సరసనే అతడు పడుకుంటే అతని బాధ ఏమిటో అడగాలనుకుంది.

పెళ్ళి అయిన కొత్తలో ఎంతటివారికయినా మోజు వుంటుంది. అలాంటిదేం లేదు. సంసార సాగరంలో మునిగి తేలే వృద్ధుడిలా, ఎప్పుడూ జమా ఖర్చులే. స్త్రీకి పురుషుడిలో నిద్రాణమైన కోరికలు మేలుకొలిపే శక్తి ఉండాలంటారు. అది తనలో లేదా? ఆలోచనలు తెగటం లేదు! నిద్ర రావటం లేదు.

ఆమె లేచి బాత్‌రూమ్ వైపు వెళ్ళింది. అతనికి ఆ గదిలో మరో మనిషి ఉన్నట్టు గుర్తు లేదు.

ఆమె బాత్‌రూం నుండి వచ్చి అద్దంలో ముఖం చూసుకుంది. చెదిరిన ముంగురులతో తన ముఖం తనకే అందంగా కనిపిస్తోంది అనుకుంది. ఒకవేపు నిట్టూర్పు వదిలి విష్ణు కుర్చీకేసి చూసి కళ్ళు మూసుకుంది.

అలవాటు ప్రకారం మేలుకోగానే భర్త కుర్చీవైపు చూచింది. బద్ధకం అంతా యెగిరిపోయింది. విష్ణు యింకా అక్కడే వున్నాడు. రాత్రి ఏ పొజిషన్‌లో వున్నాడో, అదే పొజిషనులో కూర్చున్నాడు. బట్టలు కూడా మార్చలేదు. ఒక్కంగలో వరండాచేరి తొందర తొందరగా టీ చేసింది. పుట్టినింట్లో యెంత అల్లరిగా, గల్లంతుగా తిరిగేది? ఒక్కరోజు సుజాత లేకపోతే యిల్లు చిన్నబోయింది అనేవారు. ఈయన సాహచర్యంలో నేను మూగదాన్ని అయ్యాను అనుకుంది. టీ తెచ్చి యిస్తే, రెండు గుక్కల్లో త్రాగి, తన పనిలో లీనమయ్యాడు. కనీసం అడగకుండా టీ యిచ్చి నందుకు థ్యాంక్స్ అయినా చెప్పలేదు అనుకుని క్రిందికి వచ్చింది.

హాల్లో ఫోను మ్రోగింది, వెళ్ళి తీసింది. ఆ సమయంలో పిల్లలెవ ఎవరి చదువులలో వారుంటారు. వారిని పిలిచి పనులు చెప్పకూడదు అతను ఆంక్ష పెట్టాడు.

"హల్లో....సుబ్బరామయ్యగారా! ఆఁ లేచారు, పని చేసుకుంటున్నారు అలాగే, రమ్మని చెబుతాను. ఆయన చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు ఏం జరిగింది?" సుబ్బరామయ్య చెప్పిన వార్త వినగానే ఆమె గుండెలు దడదడలాడాయి.

"యాభైవేలా?" నోరు వెళ్ళబెట్టింది. అవతల ఫోను పెట్టిన చప్పుడు అయింది.

"ఏమిటే యాభై వేలంటావు? యెవరు మాట్లాడింది?"

కాంతమ్మ అటుగా వచ్చిందేమో - అడిగింది.

"ఆఁ, ఏం లేదు మా అన్న యిల్లు కొందాం, అనుకున్నాడు" కంగారుగా చెప్పింది.

"అలాగా" నవ్వుకుంది. ఏదైనా డబ్బు సహాయం అడిగాడేమో, అందుకే కోడలు కంగారుపడుతుంది అనుకుంది.

సుజాత పైకి వెళ్ళబోయేంతలో విష్ణు క్రిందికి దిగాడు, షర్టు గుండీలు పెట్టుకొంటూ.

"సుబ్బరామయ్యగారు ఫోను చేశారు"

"రమ్మని చెప్పాడా?"

"అవును" అన్నది. భోజనాల బల్లవైపు పోబోయేవాడు వెనక్కు తిరిగాడు.

"ఫలహారం చేసి వెళ్ళండి" అన్నది. అతని వాలకం చూస్తే రాత్రి తనకు వచ్చిన కోపం మంచులా కరిగిపోయింది. అతన్ని అపార్థం చేసుకుంది. అందుకు పశ్చాత్తాపపడింది.

"ఇప్పుడు ఏడున్నరే. ఫలహారం తయారవదు" అన్నాడు.

"ఒక్క నిమిషం" వంట యింట్లోకి వచ్చింది. అతడన్నదే నిజం! యిద్దరు చిన్నత్తలూ కాఫీలు త్రాగుతూ, విష్ణువర్ధన్‌ని తిట్టుకుంటున్నారు.

"వారు త్వరగా వెళ్లాలట అత్తయ్యా" అన్నది.



"త్వరగా లేవకూడదూ! వంటవాళ్ళుంటే, యజమానుల ఆజ్ఞాను సారమే చేస్తారు" సుశీలమ్మ అంది.

అసహాయంగా వెనుతిరిగింది.

"నీకంటే తలమీద నీడ వుంది. ఏమన్నా చెల్లుతుందే సుశీలక్కా! నేను వంటమనిషినేగా" కమలమ్మ అంటున్నది. వెడుతూ వెడుతూ వెనక్కు తిరిగి చూసింది. భర్త వాళ్ళను గూర్చి సరిగ్గానే ఊహించాడు. తనే వచ్చింది వెళ్ళి ఏం చెప్పాలి? అనుకుంటూ హాలులోకి వచ్చింది. అప్పటికే అతను వెళ్ళిపోయాడు. తేలికగా నిట్టూర్చింది. మనసు పచ్చిపుండులా వుంది. మనిషి అంత ఆందోళనగా వున్నప్పుడు కోర్కెలు ఎలా పుట్టుకు వస్తాయి?

రెండు రోజులనుండి విష్ణువర్ధన్ ఇంటికే రాలేదు. సుబ్బరామయ్య వచ్చి ఫైళ్ళు తీసుకువెళ్లాడు. అవన్నీ ఇన్‌కమ్‌టాక్స్‌కు సంబంధించినవే.

"అక్కయ్యా! నేను మాత్రం యిక్కడెందుకు? వెళ్ళి ఆయనతో పాటు కలో, గంజో త్రాగుతాను" సుశీలమ్మ కంటతడి పెట్టింది.

"వెళ్ళండమ్మా... యింకేం చేస్తారో చెయ్యండి" అన్నది కాంతమ్మ.

"అంటే నీకు కోపం వస్తుందక్కయ్యా! సుధ వెళ్ళి ఎన్నిరోజులు అయింది. తండ్రి వుండి మాకు స్వతంత్రం వుంటే యిలా జరిగేదా? అతను అయిదువేలు అడిగితే, మూడువేలన్నా ఇచ్చి సమాధాన పరిచేవారు" కమలమ్మ అందుకున్నది.

"అంతా ఈవిడే నేర్పి పెట్టిందేమో యెవడు చూడొచ్చాడు" సుశీలమ్మ ఈసడించింది.

"అయ్యో! ఎంతంత మాటలంటున్నారే. ఆ విష్ణు చెడబుట్టాడు నా కడుపున."

"అత్తయ్యా!" సుజాత కంఠం తీవ్రంగా వుంది. భర్తను స్వంత తల్లి శపించటమా? "ఆయనను ప్రతిసారీ ఎందుకు అన్ని మాటలంటారు? మామగారు, పాత మేనేజరు కలిసి ఇన్‌కంటాక్సు కట్టలేదట. ఫైళ్ళు దాచారట. అతన్ని ఈయన తీసివేశారన్న కక్షతో ప్రభుత్వానికి రిపోర్టు

చేశారట. యాభైవేలు కట్టాలట. అంగ-నేం తనకోసం తినటం లేద అన్నది. అప్పటికే చెంపలమీదుగా కన్నీరు కారుతోంది.

"నిజమా........ సుజాతా?" కాంతమ్మ ముఖం పాలిపోయింది

"అవునత్తయ్యా, ఇందాక సుబ్బరామయ్య చెప్పారు."

"ఆ మాట చెప్పడే?" సుశీలమ్మ వచ్చింది. వాళ్ళు మాట్లాడుకుంటుండగానే సుబ్బరామయ్య, విష్ణువర్ధన్ వచ్చారు. ఆయన విష్ణు యిచ్చిన ఫైళ్ళు తీసుకొని వెళ్ళిపోయాడు.

భయంగా ప్రభ, రేణు, రమ వచ్చారు. విష్ణు ముఖం చిట్లిస్తూ వారిని చూచాడు.

"అమ్మా! మీకు పిల్లలు బాగుపడాలని లేదా?"

"ఎందుకురా! ఏమయింది?" అన్నది జంకుతూ. ఉదయం స్నేహితురాలి పుట్టినరోజు అంటే ప్రభకు పదిరూపాయలు యిచ్చింది.

"వాళ్ళనే అడుగు.... చెప్పండి. అబద్ధాలు చెబితే చంపేస్తాను."

విష్ణు గర్జన విని రేణు చెప్పింది.

"మా బడిలో ఓ అమ్మాయి వుంది, పెద్దమ్మా! మనిషికి మూడు రూపాయలు కడితే, సినిమాలో యాక్టు చేయడానికి అవకాశం యిస్తారట.. మేం.... మేం కట్టాము."

"ఓసి అప్రాచ్యురాలా!" కమలమ్మ అరిచింది.

"ఇప్పుడు కసురుకుంటే ఏం లాభం? ఆ పిల్లతల్లి ఇన్‌కంటాక్సు ఆఫీసర్ ఇంటిలో పనిమనిషట. నేను ఆయనతో పని వుండి వెళితే పీళ్ళ దర్శనం అయింది గేట్లో...."

"ఎంతకు తెగించారే?" కాంతమ్మ కోపంగా అరుస్తూ, తలా నాల్గు చెంప-దెబ్బలు వేసింది.

"చాలమ్మా.... కాస్త కనిపెట్టి వుండండి. తగినంత పనిలేక వీళ్ళిలా తయారు అవుతున్నారు. ప్రభా, మూలనున్న మెషీన్ తియి. అందరి బట్టలు నువ్వూ, వదినా కలిసి కుట్టాలి తెలిసిందా?"

అందరూ తలలు ఆడించారు. ప్రభ, రమ జారుకున్నారు. రేణు అలాగే నిల్చుంది.



"ఏం అలా నిల్చున్నావ్?"

"పెద్దన్నయ్యా.... నాకీ నెలలో మ్యాథ్స్‌లో జీరో వచ్చింది."

"అదేం?"

"క్రొత్త టీచరు చాలా తొందరగా చెబుతున్నారు - అర్థం కాదు" అన్నది. రేణు భావం అర్థమయింది. ట్యూషన్ కావాలి.

"సుజాతా! తీరిక వున్నప్పుడు రేణుకు లెక్కలు చెప్పు" అన్నాడు.

"అలాగే"

"ఏం కాలమో, ఏం పిల్లలో" కాంతమ్మ నిట్టూర్చింది. "నీలో నువ్వే బాధపడకపోతే, మాకు చెప్పకూడదా?" అన్నది కాంతమ్మ. అతని భృకుటి ముడిపడింది.

"ఏ విషయంలో?"

"అదే.... ఏదో ఇన్‌కమ్‌టాక్సు గొడవలు వచ్చాయిట కదా!"

"సుబ్బరామయ్యగారి ప్రసాదమా! అదంతా మీకెందుకు?"

"కోడలే నయం నీకంటే - కష్టసుఖాలు చెప్పింది."

"యెవరు? సుజాతా?"

"ఆc..... అదే పాపం!"

ఆమె అన్న మాటలు వినలేదు. రెండేసి చొప్పున మెట్లెక్కుతూ పైకి వెళ్ళాడు.

"సుజా!" అతని గర్జన విని హడలిపోయింది. అతని ముఖం ఎర్రగా రక్తం చిందేలా వుంది. కళ్ళు కోపంతో అగ్నిగోళాలు అయ్యాయి.

"ఏమిటి?" అన్నది ఫేజ్‌లో పూలు సర్దుతూ. అతని కోపం ఊహించగలదు.

"ఇన్‌కంటాక్సు గొడవలు నీకెవరు చెప్పారు?"

"సుబ్బరామయ్యగారు...." మాట పూర్తికాక పూర్వమే ఆమె గూబ గుయ్యిమంది.

"సుబ్బరామయ్యగారు చెపితే ఇంట్లో అందరికీ యెవరు టామ్ టామ్ చెయ్యమన్నారు? నా తపస్సంతా నాశనం చేశావు. నాన్నగారికిచ్చిన

మాట నిలబెట్టుకోవాలని నేను పడే శ్రమ అంతా దండగ అయింది అందుకే ఆడదాని నోట్లో నువ్వు గింజ నానదంటారు."

"విష్ణూ-" తల్లి పిలుపు వచ్చినంత వేగంగా వెళ్లాడు. క్రింది వెడుతూ వెనక్కు చూచాడు! పెదవులు నొక్కిపెట్టి అశ్రువులు ఆపే ప్రయత్నం చేస్తూ, చెంప మృదువుగా రాసుకుంటున్నది! ముఖం తిప్పుకొని వచ్చేశాడు. మెట్లదగ్గర తల్లి నిల్చుంది. పరీక్షగా చూశాడు - ఆమె ముఖంలో కళ మాయం అయింది. ఇటు తన ఆంక్షలు భరిస్తూ అటు అందరనే మాటలు భరిస్తోంది! జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. ఆమె నొప్పించకుండా పనులు చేయాలంటే సాధ్యం కావటం లేదు.

"అమ్మా!" మృదువుగా పిలిచాడు. తలెత్తి చూచింది కాంతమ్మ ఆమెకు చిన్నప్పటి విష్ణు-చదువుకోవటానికి పోతూ సెలవు తీసుకోవటానికి వచ్చిన విష్ణు కన్పించాడు. నిరంకుశంగా ఆజ్ఞాపించే యజమానిలా లేడు.

"ఏం నాయనా, బుగ్గలు ఎలా పీక్కుపోయాయో చూడు" దగ్గరగా వచ్చి, అతని చెంపలు నిమురుతూ అన్నది.

"నాకేం? బాగున్నాను. నువ్వే చాలా నీరసించావు. యెవరేం చెప్పినా నమ్మవద్దు."

అతనికి పచ్చి వెలక్కాయ గొంతులో ఇరికినట్టయింది. తల్లి ముందు నిర్దాక్షిణ్యంగా భార్యను అబద్దాల కోరుగా చేస్తాడా?

"అమ్మా! వ్యాపారం అన్నాక ఎన్నో చిక్కులు. అవన్నీ మొగవారు చూచుకునేవి. మీరు ఇల్లూ, పిల్లలను చూసుకుంటే చాలు" అన్నాడు. తల్లి భుజాలమీదుగా చేతులువేసి నవ్వాడు.

"ఏమోరా...."

"పోనీ నాపై నీకు నమ్మకం లేదా?"

"అదేం మాటరా! నా మనసు ఆందోళనగా వుంది."

"పోనీ కొన్నాళ్ళు మామయ్యల దగ్గర వుండి వస్తావా."

"నయం-నిన్ను వదిలి ఎలా వెడతాను" మళ్ళీ ఫోన్ రావటంతో అన్నం తినకుండానే వెళ్ళిపోయాడు.



"నిజమే అంటావా సుశీలక్కా. యాభైవేలు అంటే మాటలా?" ఎలా చెల్లిస్తాడు? నగలు యిమ్మనడు కదా?"

"ఏమోనే, ఈ సంసారం సంగతి అంతా చిత్రంగా వుంది. బావగారుండగా యేం గొడవలు లేవు. నీ నగలు అడిగితే పుట్టింట్లో ఉన్నాయను."

"నమ్ముతాడా"

"ఏమో! పోనీ మన భాగాలు మనం పంచుకుంటే!" అన్నది సుశీలమ్మ.

"పంచుకుని ఏం చేస్తాను అడదాన్ని. నీకంటే ఆడపిల్లలు లేరు" అంది కమలమ్మ ఒక్కసారి సుధ విషయం గుర్తుకు తెచ్చుకుంటూ. కాంతమ్మ రావటంతో యిద్దరూ నోరు మూసుకున్నారు.

## 21

వారం రోజులయింది విష్ణు ఇంటికే రాలేదు. రోజూ ఇంటికి వస్తాడని, తనను అనునయిస్తాడని సుజాత ఎదురుచూసింది. ఆమెకు ఆశాభంగమే అయింది. ఆఫీసులోనే వుంటున్నాడు. తను చేసిన చిన్న పొరపాటుకు యింత పెద్ద శిక్షా. తనే మూర్ఖంగా తన జీవితం సమస్యల మయం చేసుకుంది. తనకేం తక్కువ! ఇంకెవరయినా పువ్వుల్లో పెట్టి పూజించుకునేవారు. అపురూపంగా ఆరాధించుకునేవారు. తను వెళ్ళిపోవాలి. ఆయన పిలిస్తేనే రావాలి."

"సుజాతా..." ఉలిక్కిపడి తలెత్తింది. కాంతమ్మ నిల్చుంది.

"ఏమిటే నిండింటిలో అభోజనాలు. ఇటు నీవు ఒకపూట తింటే రెండోపూట తినవు. అటు వాడికి పంపిన క్యారియరులో రెండు ముద్దలు తరగటం లేదు" అన్నది. చటుక్కున లేచింది సుజాత. ఆఖరి మాటలు ఆమెపై బాగా పనిచేశాయి.

"అదేమిటత్తయ్యా! వారు భోజనం చెయ్యటం లేదా?"

"ముట్టుకుని వదిలేస్తున్నాడు. వాడినెత్తిన ఈ బరువంతా మోపి ఆ మహారాజు తప్పుకున్నారు" అన్నది. అత్తగారి తృప్తికోసం రెండు

ముద్దలు తిన్నది. భర్తకు ఫోను చేద్దాం అనుకుంటుండగానే, సుబ్బరామయ్య వచ్చాడు.

"ఎంత పని చేశారమ్మా. నోరుజారిన మాట చినబాబుతో అంటారా ఆయన నన్ను పనిలోంచి తీసేసి, తనే స్వయంగా లెక్కలు చూస్తున్నారు"

"పొరపాటు జరిగింది సుబ్బరామయ్యగారూ! నేను వారికి చెప్పి మీ ఉద్యోగం నిలబెడతాను" ఫోను దగ్గరకు వెళ్ళింది.

"అమ్మా.... ఈ సమయంలో ఫోనా? వద్దు స్వయంగా కలిసినప్పుడే చెప్పండి. ఇదే సమయమని, ఆ మేనేజరు గుమాస్తాని లేవదీసుకుపోయాడు. బలే కష్టంగా ఉందమ్మా" అతను వెళ్ళిపోయాడు.

నెమ్మదిగా వంటయింట్లోకి వెళ్ళింది. ఈ మధ్య కూరలు తరగటం, రొట్టెలు చెయ్యటం, వడ్డించటం తనే చేస్తోంది. యెన్నాళ్ళో చూద్దాము అనుకున్న ఉన్నత్తలు తామే పొరపాటు పడ్డట్టు గ్రహించుకున్నారు. అక్కడ పనులు పూర్తి అవుతుండగా పిల్లలు బడులనుండి వచ్చారు. వారికి అల్పాహారం పెట్టి మిషన్ దగ్గర కూర్చుంది. ఏడింటికి వాళ్ళు వచ్చి పాఠాలు చెప్పమంటే చెప్పింది. భోజనానికి కూర్చోబోయేముందు విష్ణుకు పంపిన క్యారియర్‌తో వీరయ్య వచ్చాడు. అత్తగారి మాట అక్షరాలా నిజం. రెండు ముద్దలు తరిగాయి. ఇంట్లో అయినా అతని కంత ధ్యాస వుండదు తిండిని గూర్చి. తల్లో, సుజాతో, యెవరో బలవంతంగా వడ్డిస్తే తింటాడు. ఈ సగం తిండితో ఆరోగ్యం ఎన్నాళ్ళు బావుంటుంది! ఆ రాత్రంతా నిద్ర పోలేదు.

మర్నాడు ఏదో పోగొట్టుకున్నట్టు తిరిగింది. పగలు రఘు వచ్చాడు. సుజాత పెద్దక్క నాల్గురోజులుండి పోదామనివస్తే కూతురు పెద్దమనిషి అయి కూర్చుందట. పేరంటం రమ్మని పిలిచాడు. కాంతమ్మ కాఫీ ఫలహారాలు యిచ్చింది.

"సోమవారం కదయ్యా! అలాగే వస్తాము" చెప్పిందామె.

"బజారుకు సుజాతను తీసుకువెడతాను. అమ్మాయికి చీర కొనమన్నారు."

"అలాగే తీసుకు వెళ్ళు."



అన్నా చెల్లెళ్ళు షాపింగ్ పూర్తిచేశారు. రఘు టాక్సీ పిలిచాడు.

"అన్నయ్యా? నన్ను ఆయన ఆఫీస్ దగ్గర డ్రాప్ చెయ్యి."

"అప్పుడే బావగారి మీదికి మనసుపోయిందేమిటే" రఘు నవ్వాడు.

"కాదన్నయ్యా!" క్లుప్తంగా విషయాలు చెప్పింది.

"పాపం, అలాగా?" అన్నాడు.

"ఎలాగో ఆయన సర్దుకుంటారు. అమ్మతో అనేవు" అన్నది.

"నాకు ఆమాత్రం తెలుసులేవే" ఆమెను ఆఫీసు దగ్గర వదిలివెళ్ళి పోయాడు.

పెద్ద కాంపౌండులో వుంది ఆఫీసు. ఒకవైపు గోడౌన్స్ వున్నాయి. రెండోవైపు పనివారికి కట్టిన రేకుల ఇళ్ళున్నాయి. రెండింటి మధ్యన ఆఫీసు గదులున్నాయి. ముందు గదిలో ఎవరో ఒకతను దులుపుతున్నాడు. కారు కన్పించలేదు. అతడు లేడనుకొని నిరాశచెందింది.

"మీరా! అమ్మా?" పనివాడు నోరు వెళ్ళబెట్టాడు.

"అయ్యగారు లేరా?"

"ఇప్పుడే లోపలికి వెళ్ళారు. వెళ్ళండి" తర్జనితో దారి చూపాడు. ఆమె గుండె దడదడ లాడసాగింది. అతను కోపంతో నాల్గు అంటించినా, బయటపడరాదని పనివారు దూరం వెళ్ళేవరకు ఆగిపోయింది. లోపలి గదిలో సోఫాలో పడుకొని కళ్ళుమూసుకున్నాడు. మాసిన గడ్డంతో నీరసంగా కన్పించాడు. ధోవతి కట్టుకున్నాడు. పెద్దమనిషిలా కన్పిస్తున్నాడు. రెండు అడుగులు ముందుకు వేసింది. గాజుల గలగలలు వినిపించేమో, కళ్ళు విప్పాడు. భయంతో ఆగిపోయింది.

అతని కళ్ళు వెడల్పుకావటం, పెదాలు చిరునవ్వుతో విచ్చుకోవటం, అతని చేయి ముందుకు రావటం ఒకేసారి జరిగాయి. ఆమె భయం, సంకోచాలు పటాపంచలు అయ్యాయి. మరుక్షణమే అతని చేతులతో యిమిడి పోయింది! ఏమో చెప్పబోయింది-అతని పెదవులప్పటికే ఆమె పెదాలను తాకాయి! అయిదు నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి!

"సుజా!" నెమ్మదిగా పిలిచాడు.

"ఊఁ"

"ఏదీ కళ్ళు విప్పు, ఇటు చూడు!"

"ఊహు! కళ్ళు విప్పితే ఈ కల కరిగిపోతుంది! యిలా వుంటాను!"

"సెంటిమెంటల్ ఫూల్‌వి" నవ్వుతూ, ఆమెను కూర్చోబెట్టి తను కూర్చున్నాడు-ప్రాణం లేనట్టు మళ్ళీ అతని చేతుల్లో వాలిపోయింది.

"సుజా! మనసంతా భారంగా వుంది. ఏదో రిలీఫ్ కావాలనిపించింది. నీ స్పర్శలో యింత హాయి ఉందనుకొంటే ఇంటికి పరిగెత్తుకు వచ్చేవాడిని"

"నన్ను క్షమించరూ!" ప్రాధేయపడింది-ఎటువంటి పరిస్థితిలో ఇన్‌కంటాక్స్ రహస్యం బయటపెట్టాల్సి వచ్చిందో చెప్పింది.

"అదంతా మరిచిపో సుజా. న్యాయానికి క్షమార్పణ నేను అడగాలి. చికాకులో వున్నానేమో, ఒళ్ళెరగని కోపం వచ్చింది."

"ఆమాత్రం అర్థం చేసుకోలేనా! మీరింటికి రాకపోతే ఏడుపు వచ్చింది."

"మాటిమాటికీ ఏడ్చే స్త్రీలంటే నాకింకా ఏడ్పించాలనిపిస్తుంది."

"అమ్మో! అయితే జాగ్రత్తగా వుండాలన్నమాట."

"అన్నమాటే. ఇంకో రెండు రోజులు నన్ను క్షమించు! సుజా, ఇంటికి రావడానికి కారు లేదు. కారు అమ్మేశాను. మోటార్ సైకిల్ రెడీ అయి వచ్చేదాకా వూపిరాడదు."

"మీకు స్త్రీపట్ల ఎలాంటి అభిప్రాయముందో చెబుతారా?" అన్నది. విష్ణు తెల్లబోయాడు-ఆఫీసు గొడవలు తను చెబితే స్త్రీపట్ల తనకుండే అభిప్రాయం అడుగుతుందేం అని.

"ఎందుకు. ఏ విషయంలో?"

"సంసారంలో స్త్రీ పాత్ర వంటింటివరకేనా? లేక భర్త సమస్యలు కష్టసుఖాలు పంచుకునే అర్హత లేదంటారా?"

"అలా ఎప్పుడూ కాదు. సంసార రథానికి స్త్రీ పురుషులు జోడు గుర్రాలు. ఏ ఒక్కరు తమ బాధ్యత మరిచిపోయినా ఆ ఇల్లు నరకమే అవుతుంది."

"నమ్మమంటారా?"



"అబద్ధం చెప్పే అవసరం ఏమొచ్చింది?" లేచాడు. బాత్‌రూమ్ వైపు వెళ్ళబోతూ ఏదో గుర్తుకు వచ్చినవాడిలా ఆగాడు.

"ఇంట్లో నా ప్రవర్తన చూసి అలా అనుకుని వుంటావు కదూ? అంతులేని ఖర్చులు, ప్రణాళికలేని పండగ పబ్బాలు చూసి, ఇంట్లో అలా కట్టడి చేశాను. స్త్రీని బానిసలా చూస్తాననుకుంటున్నావా?"

"అయితే మీ ఆఫీసులో చెయ్యాల్సిన పనులు ఏమిటో చెప్పండి. మీ మేనేజర్‌కిచ్చే జీతంలో సగం యివ్వండి చాలు. పని మాత్రం రెండింతలు జరుగుతుంది."

"నిజమా, సుజా!"

"నిజమేనండీ. నా బి.ఏ. చదువు సార్ధకం అవుతుంది. ఇంట్లో వారితో పోట్లాడాను అన్న చెడ్డ పేరుండదు. మరి కొన్ని రోజులు యిలాగే వుంటే ఇంట్లోవాళ్ళ ప్రవర్తనకు పోట్లాడే పరిస్థితి ఏర్పడుతుంది."

"ఓ.కే. నీ ఇష్టప్రకారమే కానివ్వు."

"మరి జీతం?"

"తేలికయిన వాయిదాలపై యిస్తాను" ఆమె బుగ్గపై చిటికెవేసి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఆమె గది శుభ్రం చేసింది. అతను తల తుడుచుకుంటూ వచ్చాడు.

"పద, నిన్ను బస్టాండు వరకు దిగబెట్టి వస్తాను."

"ఈ పూట మీరు రాందే నేను వెళ్ళను."

"ఎలా రావాలి-సుజా!"

"ఒక్కరోజు బస్సులో వస్తే శ్రీ యువరాజాగారి పరువు పోదు." అతని దగ్గరగా వెళ్ళింది. అతని భుజంపై గడ్డం ఆన్చింది. అప్పుడే స్నానం చేశాడేమో, చల్లగా, హాయిగా వుంది ఆ స్పర్శ.

"ప్లీజ్! పదండి."

"సరే, ప్లీజ్ అన్నాక తప్పుతుందా?" నవ్వుతూ బట్టలు వేసుకోసాగాడు.

"నేనిలా మీకోసం వచ్చానని చెప్పేరు మీ అమ్మతో."

"అంత పసివాడినేం కాదు."

"ఏమండీ-నాదో చిన్న కోర్కె."

"చెప్పు-కొంపదీసి యే కొత్త నెక్లెసో అడుగుతావా ఏమిటి?" అన్నాడు అతని ముఖంలో రంగులు మారటం చూసి నవ్వింది.

"మిమ్మల్ని ఇబ్బందిలో పెట్టేదేం కాదు. సుబ్బరామయ్యను పనిలోకి తీసుకోండి-నావల్ల అతని కుటుంబం బాధపడటం ఇష్టం లేదు"

"సుబ్బరామయ్య బుద్ధి ఈమధ్య వికసించినట్టుందే" అని నవ్వాడు "అలాగే-పద మరి."

ఆమె నిట్టూర్చింది.

## 22

కొత్తగా జరిగిన మార్పులు చూసి అందరూ తలక్రిందులయ్యారు.

"వీడి యెత్తులు నాకు తెలుసులేవే! ఓ నెల రోజులబట్టి భార్య వంటింట్లోకి వస్తోంది. ఎక్కడ అరిగిపోతుందోనని ఈ యెత్తు వేశాడు" సుశీలమ్మ ముక్కున వేలుంచుకుంది. నిజమేనా అని ఆలోచించ సాగింది కమలమ్మ.

"మన ఇంటా వంటా ఉందట్రా!" కాంతమ్మ అడిగింది.

"మారే కాలంతో మనమూ మారాలమ్మా" అంతకంటె ఎక్కువ ఏం చెప్పలేకపోయాడు. అందరి మాటలు వింటోంది సుజాత. ఆమెకు కోపం బాగా వచ్చింది. తను కావాలని చేసే పనికి ఆయనను కారణం చేస్తున్నారు వీళ్ళంతా అనుకుంది. అలారమ్ పెట్టుకుని తెల్లవారుజాము నాల్గున్నరకు లేస్తుంది బాయిలర్ అంటించి, ఫలహారం అందరికీ చేసి, కాఫీ ఫిల్టర్‌లో పోసి, మళ్ళీ పైకి వెళ్ళి తన గది శుభ్రపరుచుకుని వస్తుంది. అప్పుడు స్నానంచేసి బట్టలు మార్చుకుంటుంది. ఫలహారం కాగానే భర్తతో వెళ్ళిపోతుంది. మళ్ళీ సాయంత్రం రాగానే టీ త్రాగి, వంట ఇంట్లోకి వెళ్తుంది. అక్కడ పని కాగానే, మళ్ళీ వచ్చి పిల్లలకు చదువులు చూస్తుంది. కాంతమ్మ హృదయం గిలగిలలాడినా మాట్లాడలేని స్థితి.

"నువ్వు ఆఫీసులో పని చేస్తావు. వంట ఇంట్లో కూడా దేనికమ్మా!" కమలమ్మ మొహమాటపడింది.



"ఆడదానికి వంటిల్లే ముఖ్యం కదత్తయ్యా. ఆఫీసు సాకుతో పనులు తప్పించుకుంటామా!" అన్నది. ఆ చురక సుశీలమ్మకు తగిలింది.

"గట్టిదేనే" అన్నది చాటుగా. ఒకప్పుడు పడక దొరికితే నిద్ర లేరాదని విసుక్కునేది భర్తను. ఇప్పుడు తనూ అంతే.

అటు ఆఫీసులో కూడా ఆమె అంటే అందరికీ గౌరవం. అది సుబ్బరామయ్య ప్రభావం. అతను అవకాశం దొరికితే చాలు-ఇంద్రాణి, చంద్రాణి అంటూ పొగిడేస్తాడు. విష్ణు ఒక్క భోజనం సమయంలో తప్ప, మిగతా సమయంలో పక్కా ప్రొప్రయిటర్‌లాగే ప్రవర్తిస్తాడు.

"సుబ్బరామయ్యగారూ! నువ్వులు, వేరుసెనగ అమ్మలేదేం?"

"సుజాతమ్మగారు యింకాస్త ధర పెరగనీ అన్నారండీ."

"ఆమెనిలా పిలువు"

అతను వార్త అందజేశాడు. సుజాత వెళ్ళింది లోపలికి.

"ఈ కొట్టు పెట్టింది కమిషన్ వ్యాపారం కోసం. అంతేగాని నిల్వలుంచుకొని లాభాలు చేసుకోవటానికి కాదు, ఆ సంగతి చెబుదామనే" అన్నాడు సీరియస్‌గా.

"ఈ రోజే అమ్మే ఏర్పాటు చేస్తాను" అన్నది.

ఆ తరువాత చెయ్యవలసిందంతా సుబ్బరామయ్యకు చెప్పింది.

భోజనాల దగ్గర మళ్ళీ ప్రొద్దుటి విషయం యెత్తింది.

"అది కాదండీ! ఈ ఇన్‌కంటాక్స్ వ్యవహారం పూర్తి కావాలంటే అదనపు లాభాలు రావాలి."

"వద్దు సుజా! వ్యాపారస్తులే భారతదేశపు సగం సౌభాగ్యం నాశనం చేస్తున్నారు. సగం కట్టాను, మిగతా సగానికి ఆరునెలలు గడువుంది. ఈలోగా చూద్దాం. అధిక లాభాలకై నిలవచేసిన ధాన్యం పురుగులు పట్టి నాశనం అవుతుంది."

"నేనంత దూరం ఆలోచించలేదు."

"ఏమండీ! రేపు సాయంత్రం యెలాగయినా ఒక్కసారి మా వాళ్ళ ఇంటికి వెళ్ళాలి. పేరంటానికి కూడా సుశీలత్తతో వెళ్ళాను. మా అమ్మకేమో అల్లుడిని చూడాలని ఒకటే తహతహ" అన్నది.

"అలాగే వెడదాం, ఇప్పుడేం పండగ?"

"మా అమ్మ మూడ్స్ బావున్నప్పుడల్లా పండగలు జరుగుతూ వుంటాయి."

"సరే! జీతం బత్తెం లేని మేనేజరువు. అలక సాగిస్తే కష్టం కదా అలాగే వెడదాం."

వారు ప్లాను వేసుకోవడమే గాని అది ఆచరించటానికెన్నో ఆటంకాలుంటాయి. మర్నాడు మధ్యాహ్నమునుండి ఆఫీసు చూసుకోవాలని ఉదయ్‌కు చెప్పాడు. ఆ ఉదయం టిఫిన్ చేస్తుండగా క్రితం రోజు సాయంత్రం వచ్చిన పోస్టు తెచ్చి ఇచ్చారు. అందులో సుధ ఉత్తరం తన పేరున వుండటం చూసి ఆశ్చర్యపోయాడు. అది చదివి జేబులో పెట్టుకున్నాడు.

"ఎవరురా రాసింది?"

"సుధ" అన్నాడు క్లుప్తంగా. "సుజాతా! సాయంత్రం ఉదయ్ నిన్ను బస్సు యెక్కిస్తాడు వెళ్ళిరా. నాకు వేరే పని వుంది" గబగబా బ్రీఫ్ చూసుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఏం రాసిందో! మనకు రాసి, రాసి విసిగి ఆపిచ్చిది వీడికి రాసిందేమో? అంతా మాదురదృష్టం" ఆ రోజంతా కమలమ్మ ఏడుస్తూనే వుంది.

"ఆఫీసులో వచ్చిన గొడవలు తెలిసే అలా అంటున్నావా కమలా?"

"అక్కయ్యా! మీరంతా అదృష్టవంతులు. మా కోసం గొడవలు సృష్టిస్తారు. కోడలు జీతం తీసుకుని బ్యాంకులో వేసుకుంటుంది. ఎన్ని జాగ్రత్తలు వారు అవలంబిస్తారు."

"సుజాత ఆఫీసులో జీతం తీసుకుంటుందా?" కాంతమ్మ నోరు వెళ్ళబెట్టింది. మధ్యాహ్నం వరకు ఆమె కోపం బిగపట్టుకు కూర్చుంది. పుట్టింటికి వెళదామని, తయారవటానికి ఇంటికి వచ్చిన కోడల్ని గుమ్మంలోనే పట్టి దులిపింది.

"ఏమిటే? జీతం డబ్బు బ్యాంకులో దాచుకునేకాడికి నన్ను మోసగించటమెందుకు? ఆయనకు సాయం వెడుతున్నానని చెప్పావేం నంగనాచిలా?"



"అత్తయ్యా!"

"ఆ... అత్తయ్యనే. ఆయన స్వపరభేదాలు లేకుండా సంసారం చేశారు. మీరెలా తయారయ్యారే?"

"యెవరన్నారు? అంతా అబద్ధం" అన్నది.

"తప్పించుకోవాలని చూడకు! మొన్న విష్ణు స్వయంగా నీతో అనగా రేణు విన్నదట" కమల విసురుగా అంది.

"చూడండి కమలత్తా! పరిహాసంగా వారన్నారు. చిన్నపిల్ల రేణు అది చెబితే మీరు నమ్ముతారా? సామరస్య జీవితానికి, అందరూ ఒకరిని ఒకరు అర్థం చేసుకోవాలి. నేను చెప్పాల్సింది చెప్పేను. నమ్మడం, మానటం మీ ఇష్టం" అన్నది.

కాంతమ్మ దగ్గరగా వెళ్ళి నిల్చుంది.

"అత్తయ్యా! వారి మీద ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇంతవరకు ఒక్కరూపాయి నాకోసం తీసుకోలేదు. నాకేం అవసరం? ఈ పూటే అనుకున్నాను. ఓ యిరవై రూపాయలు అడగాలని. అన్నయ్య పిల్లలు, అక్కయ్య పిల్లలు యెదురు వస్తారని, ఏదయినా కొందామని. వారు తొందరలో వెళ్ళిపోయారు."

"పిచ్చిపిల్లా, అంతంత ప్రమాణాలు యెందుకే?" ఇప్పుడయినా నమ్ముతావా అన్నట్టు తోడికోడలివంక చూసింది. ఆమె వెళ్ళిపోయింది.

తరువాత అత్తగారిచ్చిన యిరవై రూపాయలు తీసుకుని వెళ్ళిపోయింది.

## 23

"ఏమిటే లంబాడీల చుట్టరికమా? లేక గర్వమా? ఎప్పుడు వచ్చి నాల్గురోజులుండమన్నా మీ ఆయన పంపడు!" సుందరమ్మ ఒంటికాలిపై లేచింది కూతురిపైకి.

"తీరిక లేదంటే వినవేం?" సుజాత అంది విసుగ్గా.

"ఆ ఆఫీసు పని నీకెందుకే? మీ అత్త తెలివయిందిలే. అంతా కూతుళ్ళకే దోచిపెడుతుందటగా."

"ఆవిడా నీలాంటిదే!" నవ్వింది.

"నువ్వో కొరకరాని కొయ్యవు" విసురుగా లేచిపోయిందామె. స్టౌ దగ్గర కూర్చుంది.

ఆ ఇంటి పరిస్థితి చూస్తే మతిపోయింది సుజాతకు. అక్క కొడుకు కూతురు యిక్కడే వుండిపోయారు. పధ్నాలుగేళ్ళ పిల్ల నిర్మల పసి నీళ్ళు కూడ ముంచుకోదు. ఎందుకో సరళ విరాగిలా మారింది. చిత్తశల్యమయింది.

"వదినా, ఈ పూట వంట నేను చేస్తానమ్మా" అని బయటకు వచ్చింది. అక్కడ చిన్న వరండాలో సరళ వంట ప్రయత్నంలో వుంది.

"నా గురించి నీ హృదయంలో సానుభూతి వుంది. అంతే చాలు సుజా, నువ్వు కూర్చుని కబుర్లు చెప్పు."

"ఏం కబుర్లు వదినా! నువ్వే చెప్పాలి" అన్నది.

"నేను చాటయితే చెబుతుందే. నిర్మలను, కుమార్ వుంచుకున్నాననే ఒకటే నస" సుందరమ్మ అందుకుంది. సరళ కళ్ళెత్తి ఒక్కసారి చూసి తలదించుకుంది.

"నువ్వు ఆఫీసులో పనిచేసి అత్తగారికి ధారపోయటం లేదూ! నోరెత్తనిస్తాడా మీ ఆయన? మనవాడో అసమర్థుడు. పెళ్ళాంమాటే వేదం అంటాడు."

"అమ్మా!"

"అవునే. ఉన్నమాటే. మీ అత్త అదృష్టవంతురాలు. నీలాంటి కోడలుంది. అన్నీ కడుపులో దాచుకుంటావు. మా ఇంట్లో చూడు, పసుపు తాడు లేకపోయినా యెంత గీరో. వారం రోజులనుండి మాటలు బంద్ చేసింది మీ వదిన.

"ఎందుకమ్మా, ఊరికే అనుకోవటం? నేను మాత్రం వట్టినే వెళ్ళలేదూ?"

"వెడితే నెలనెలా జీతం రాదూ? నా మనవడు, నా మనవరాలు నా దగ్గరుంటారు. దీని కెందుకే దుగ్ధ? యెవరి పిల్లలు వారి దగ్గరే వుండాలి అంటుంది నంగనాచిలా."



"అత్తయ్యా! నాకు తోచింది చెప్పాను. మీ అబ్బాయికి, మీకు యిష్టం అయితే శ్యామలక్క పిల్లలను, పద్మ కూతుర్ని తెచ్చిపెట్టుకోండి. నాకేం అభ్యంతరం లేదు" సరళ మాటలు పదునుగా వున్నాయి.

"నీకు అభ్యంతరం వున్నా నాకేం లెక్కలేదు. రావే సుజా! అక్కడ చేసి చేసి వచ్చావు" సుందరమ్మ కూతుర్ని లేవదీసింది. తనక్కడుంటే తల్లి మరీ రెచ్చిపోతుందని లేచి బయటకు వచ్చింది. యిద్దరూ కూర్చున్నారు.

"నాలుగు డబ్బులు యిప్పుడే వెనకేసుకోవే. అంతా అడవిమూకకు దోచిపెడుతున్నాడు మీ ఆయన" యెన్నో సలహాలు యిచ్చింది కూతురికి.

ఓ రేడియో నాటిక గుర్తుకు వచ్చింది సుజాతకు. తన తల్లిలాంటి ఓ అత్త. "మా కోడలు రాక్షసి! వాడిని కొంగుకు ముడేసుకుందమ్మా. మావాడు చవట!" అంటుంది. కూతురి గురించి అడిగితే, "దానికేం అదృష్టవంతురాలు. కనుసన్నలలో మెదిలే భర్త. యిదెంత అంటే అంతే నమ్మా. అన్యోన్య దాంపత్యము" అంటుంది. అలా వుంది సుందరమ్మ వాలకం. ఇంతలో ప్రక్కింటామె శంకరమఠం వెడదాం అంటూ పిలిస్తే నిర్మలను తీసుకుని వెళ్ళింది. సుజాత రానంది. అప్పుడు సరళ తనింటి గోడు చెప్పుకుంది.

"సుజాతా! యిలా అడుగుతున్నందుకు ఏం అనుకోకు. ఓ చిన్న ఉపకారం చేసిపెట్టమ్మా."

"అడుగు వదినా!"

"నేను మెట్రిక్ పాసయ్యాను క , మీ ఆయన ద్వారా ఏదయినా ఉద్యోగం సంపాదించాలని."

"ఈ నిర్ణయానికి వచ్చేశావా?"

"మొదట అత్తయ్య సాధింపులువిని పందేనికి చేయాలనుకున్నాను. ఇప్పుడు నా పిల్లల భవిష్యత్తు ఆలోచించి చెయ్యాలనుకుంటున్నాను. వచ్చే డబ్బు ఇంటద్దెకు, తిండికి అతికష్టంమీద సరిపోతుంది."

"స్థలం కొందామనుకున్నారు. ఏమయింది?"

"డబ్బు ఏనాడో ఖర్చయిపోయింది. అసూయతో చెప్పటం

లేదమ్మా. అర్థం చేసుకో. నిర్మల పెద్దమనిషి అయితే అయిదు వందలు వదిలాయి. మీ శ్యామక్క సంతానికి తిరుపతి ప్రోగ్రామ్ పెట్టుకుంటే మరో యెనిమిది వందలు వదిలాయి. నెలనెలా చాలనప్పుడల్లా అందులోంచే తీస్తున్నాము. ఈ ఖర్చులకు అంతూ దరీ లేదమ్మా. ఇప్పుడు అత్తయ్యకు గురువుల పిచ్చి పట్టింది. వారం వారం ఇరవై రూపాయలు వదులుతున్నాయి."

"నీదికూడా కొంత పొరపాటే వదినా!"

"నువ్వెలాగయినా అనుకో. ఇందాక చూశావుగా! నీలా యెందరు యిలాంటి విషయాలు అర్థం చేసుకుంటారు! ఈ మధ్య 'ఊ' అంటే కోపం 'ఆ' అంటే చిరాకు మీ అన్నయ్యకి. నేను సాధిస్తే ఏం బావుంటుంది?"

"ఆదర్శాలకు పోయి జీవితాలు నాశనము చేసుకుంటారా! అన్నయ్యతో నేను మాట్లాడతానుండు."

"లాభం లేదు సుజాతా! మా జీవితాలకోసం నీ జీవితమే పణంగా పెట్టావు. ఏ మంచి కన్పించింది. ఇన్నాళ్ళకు ఒక విషయం తెలిసింది, నా ప్రవర్తనతో అత్తగారిని ఒప్పించటం అసంభవమని, ఆమెకెంతసేపటికీ నేను తీసుకురాలేని కట్నకానుకలపై ధ్యాస." ఆలోచనలో పడింది సుజాత.

* * *

సుందరమ్మ తను వెళ్ళి దర్శించే గురువుగారి మహాత్మ్యం వేనోళ్ళతో పొగుడుతోంది. అతని మహత్యాలను మధ్య మధ్య నిర్మల వర్ణిస్తోంది.

"చిన్నపిల్లవు. 'గురువు, తరువు' యెందుకే చదువుకోక."

"అది కాదు పిన్నీ! కావాలంటే నువ్వూ రా. అంతా నాలాంటివారే వస్తారు."

"ఏడ్చావ్, నాకేం పనిలేదా?"

"అత్తవారింటికి వెళ్ళినా నీ మొండితనం బొత్తిగా మారలేదే. ఏం పిల్లవో ఏమో" సుందరమ్మ నిట్టూర్చింది. రఘు పళ్ళు, మిఠాయి తీసుకొని వచ్చాడు చెల్లెలు వచ్చిందని. అతన్ని ఎన్నో అడగాలనుకొన్న సుజాత



అన్నీ మరిచిపోయింది. అతని మారినరూపు చూసి, పదేళ్ళ వయసు పెరిగినట్టు అయింది. అక్కడక్కడ జుట్టు తెల్లబడిపోయింది.

# 24

ఆ రోజు అరగంట యెక్కువగా గడిపి వచ్చింది. క్రింద రేణుకు పరీక్షలట, పాఠాలు చెప్పింది సుజాత. పైన విష్ణు ఫైళ్ళు కట్టిపెట్టి లేచాడు. భార్యను చూడగానే చిన్నగా నవ్వి, "గుడ్‌నైట్ ట్యూటర్‌గారూ!" అన్నాడు.

"ఏం వెక్కిరించనక్కరలేదు ఆ పిల్లలకు చదువుపైన శ్రద్ధ అనేది ఏ కోశానా లేదు. మీ భయానికి పరీక్షలు రాస్తారు" అన్నది.

'రాస్తారు, అని బహువచనము ఉపయోగిస్తావేం?'

"రమా అంతే! పెంకిదయినా ప్రభకు చదువుపై శ్రద్ధ వున్నది. వీళ్ళిద్దరూ కబుర్ల రాయుళ్ళే."

"అందరూ నీలాగ ప్రతి పనిలో శ్రద్ధ చూపుతారా? నీవు తయారుచేసిన స్టేట్‌మెంట్స్ చూసి సుబ్బరామయ్య నివ్వెరపోయాడు."

"మీరు దిమ్మెరపోలేదు కదా. ఆ రోజున సంతోషిస్తానులెండి" అన్నది. అతనేం మాట్లాడలేదు.

"పోనీండి, ఈ శుభసమయంలో మిమ్మల్ని ఓ చిన్న కోరిక కోరాలి."

"బావుంది. కోరుకో మరి!"

"మా అన్నయ్య చాలా మెత్తటివాడండి."

"అవును. నేను కఠినుడిని, కర్కోటకుడిని అను."

"ఛ, ఛ! నేను ఆ ఉద్దేశంతో అనలేదు. పరిస్థితులు అర్థం కావాలని" అన్నది ఆమె చిన్నబోయి.

"ఒట్టి ఫూల్‌వి. పరిహాసం చేస్తే" నవ్వుతూ దగ్గరగా వచ్చి, భుజాల చుట్టూ చేతులు వేశాడు.

"టేకిట్ ఈజీ. అసలు విషయం చెప్పు"

అన్నగారి స్థితి అంతా చెప్పింది. వదిన అసహనం చెప్పింది.

"మీకు తెలిసినవారు చాలామంది వున్నారుగా. ఎక్కడయినా చిన్న జాబ్ చూసిపెట్టండి."

"అలాగే రెండు రోజులు ఆగు." అతను వెళ్ళి మంచంపై కూర్చున్నాడు. సుజాత వెళ్ళి ప్రక్కన కూర్చుంది. తలుపుపై ఎవరో కొట్టారు.

"ప్రభయి వుంటుంది" అన్నది. వెళ్ళి తలుపు తీసింది. వచ్చింది కమలమ్మ. సుజాత కంగారుగా కొంగు భుజాలమీదుగా లాక్కుంది. విష్ణు లేవబోయాడు.

"కూర్చో బాబూ" తనే చనువుగా వచ్చి అతని యెదురు కుర్చీలో కూర్చుంది.

"విష్ణూ! నన్ను మన్నించరా. నీ హృదయం నవనీతంరా. ఆ తెలుసుకోలేక యెన్నో మాటలన్నాను. సుధ యెంత గర్వంగా రాసింది నీలాంటి అన్న వుండటం అదృష్టమట" అన్నది.

"దానిదేం వుంది పిన్నీ, సుధ పరాయిదా."

"కాకపోతే మాత్రం, సమయానికి ఎవరు ఆదుకుంటారు?"

"ఏమిటత్తయ్యా?"

"నీకు చెప్పలేదా ఈ కర్కోటకుడు" ఆమె నవ్వింది!

"సుధ భర్త పనిచేసే కంపెనీలో యెవరో డబ్బు కాజేశారట. అనుమానం అల్లుడిపైకి వస్తే బాబు పదివేలుకట్టి ష్యూరిటీ యిచ్చేడట. లేకపోతే పరువు బజార్నపడేదిట."

"అలాగా" అన్నది భర్తను యెలా అర్థంచేసుకోవాలో తెలియలేదు. ఇంత సన్నిహితంగా వున్నట్టే వుంటాడు. మనుష్యుల్ని అంత దూరంలో వుంచుతాడు.

"నేను మనసు నొప్పిస్తే ఏమనుకోకు! నువ్వు మమ్మల్ని శాసిస్తున్నావని అపార్థం చేసుకున్నామే తప్ప అర్థం చేసుకోలేదు."

"పిన్నీ! అంత పరాయివాడినా!"

"లేదురా. అవసరమయితే నీ ప్రాణాలు అడ్డుపెట్టే అప్పుడివి" అన్నది హృదయపూర్వకంగా.

"మీరడిగినట్టు అతనికి స్కూటర్ కొనిస్తే, దాని విలువయేం తెలుస్తుంది. ఆయాచితంగా వచ్చే వస్తువులకు ఆశించటం పురుష లక్షణం కాదు పిన్నీ."



"మేం అవన్నీ ఆలోచించం. చెల్లి నీకు రాశానంది. దొంగతనం చేసింది మేనేజర్ కొడుకేనట."

"ఎవరయితే మనకేం? మనవాడు నిర్దోషి అని నిరూపింపబడ్డాడు. అదే చాలు" కమలమ్మ వెళ్ళిపోయింది.

సుజాత భర్తను విస్ఫారిత నేత్రాలతో వీక్షించసాగింది.

"ఏమిటలా చూస్తున్నావ్?"

"నేను కోరిన పురుషుడిని మీలో చూశాను. జీవితం ధన్యమయింది." అని చెప్పాలనుకుంది. కాని అలాంటివి విష్ణుకు బొత్తిగా ఇష్టం వుండవు.

"ఏం లేదు" అన్నది అవతల వైపునుండి ప్రక్కపై వాలుతూ.

అతను ఆమెను దగ్గరగా లాక్కున్నాడు.

## 25

"సరళా...సరళా"

"ఏమిటండీ.... ఆ గావుకేకలు" భర్త అరుపులు విని వచ్చింది సరళ. అతను చికాకుగా పచార్లు చేస్తున్నాడు.

"నన్ను అవమానించటానికి వేరే మార్గం కనబడలేదా."

"మిమ్మల్ని అవమానించానా?" చేతిలోని దువ్వెన పడవేసింది అద్దం ముందు.

"నెమ్మదిగా అడుగుతావా? నేను బ్రతికుండగా ఉద్యోగము చెయ్యటం ఏమిటి? అంత అవసరం ఏమొచ్చింది?

"మీరు అంత సెన్సిటివ్‌గా ఆలోచిస్తే నేనేం చెప్పను? ఉద్యోగాలు చేసే స్త్రీల భర్తలంతా అసమర్థులేనా?" కొంచెం గొంతు తీవ్రంగా వుంది.

"అలా యెదురు ప్రశ్నలు వేసి విసిగించవద్దు. నాకిష్టంలేని పని నువ్వు చెయ్యొద్దు" అన్నాడు పచార్లు ఆపి. "ఇల్లూ, పిల్లలు శుభ్రంగా వుంటే చాలు."

"ఉద్యోగం చేసినంతమాత్రాన యింటినీ, పిల్లలనూ నిర్లక్ష్యం చేస్తానా?"

అతను జవాబు చెప్పలేదు. నూనె రాసుకొని క్రాఫ్ దువ్వు సాగాడు. కాలం మారుతోంది. మనుష్యులు మారుతున్నారు. మారు రెవరయినా వుంటే రఘు లాంటివారు. భార్యంటే బానిస అని, యితరుల చూడదగిన వస్తువు కాదని అతని భావన. కొన్నిసార్లు రఘు ప్రక్క చూస్తే సరళకు చిర్రెత్తుకొస్తుంది. సినిమాహాలు దగ్గరో, ఏ కొట్టు దగ్గరయినా సరే ఎవరన్నా ఆమె వంక చూస్తేచాలు వచ్చి అడ్డు నిలబడతాడు. ఆ చూసినా స్త్రీ పాతివ్రత్యం మంటకల్సిందని బాధపడతాడు. అలాంటప్పుడు చచ్చిపోవాలనిపిస్తుంది. ఒక పెళ్ళి విషయంలో తప్పితే, యే విషయంలోనూ తల్లి మాటకు యెదురు చెప్పడు, చెప్పాలని ఆమె అభిలాష కాదు. మంచీ చెడూ నిర్ణయించాలి గదా.

"సంసారం అన్నాక ఆర్థిక యిబ్బందులూ, అప్పులూ వుంటూనే వుంటాయి. వాటిని ఆధారంగా చేసుకొని ఊరేగాలనుకుంటే నీ యిష్టం" అంటూ భోజనానికి కూర్చున్నాడు. ఆ మాటలు సుందరమ్మకు వినిపిస్తూనే వున్నాయి. పెరటి తలుపు వద్ద కూర్చుని మనుమరాలికి జడవేస్తోంది. భార్యా, భర్తల మాటలు ఆగిపోగానే తను మొదలుపెట్టింది.

"ఎంత వాళ్ళకు అంత బుద్ధులు! ఆనాడే చెప్పాను. మామయ్య కూతురు కాకపోతే మరో అయినింటి కోతిని చేసుకోరా అని. పెద్దది అన్న జ్ఞానము నీకుందా, అంటే నా నోరుమంచిది కాదు" ఆమె గొణుక్కుంటూనే వుంది. భోజనం చేసి అతను వెళ్ళిపోయాడు.

మంచి మాటలతో, నిదానంగా రాత్రికి నచ్చుచెప్పవచ్చని, త్వరగా తయారయి అత్త మాటలు లెక్కచేయకనే వెళ్ళిపోయింది బడికి సరళ.

అదో ప్రయివేట్ స్కూలు. అయిదో క్లాసువరకూ వుంది. హెడ్ మిస్ట్రెస్ టైమ్ టేబుల్ యిచ్చింది. చిన్నపిల్లలకు పాఠాలు చెబుతుంటే జరిగిన కాలమే గుర్తుకు రాలేదు.

* * *

ఇంటి ముందాగి ఆశ్చర్యంగా చూచింది. నల్గురు పిల్లలూ దోసెలు పొట్లాలు విప్పుకుతింటున్నారు.

"ఎక్కడివిరా బాబూ" కొడుకుని అడిగింది.



"నానమ్మ డబ్బులు యిచ్చింది కొనుక్కున్నాము' ఆమె చికాకుగా చూచింది. ఈ సంసారము యిలా గడవాల్సిందేనా? సరియైన సారథ్యం లేంచి మునిగిపోయే సంసార నౌకను ఓ దరి చేర్చేవారే లేరు కాబోలు! పిల్లలతో పాటు తనకూ తెప్పించుకుని వుంటుంది. మూడు రూపాయలు ఖర్చు. అదే డబ్బుతో ఇంట్లో మూడు పూటలు ఫలహారం చెయ్యవచ్చు. ప్రతి విషయంలో అత్తగారు తనకెందుకు ప్రత్యర్థిగా నిల్చుని, తను తలపెట్టిన పని పొసగనియ్యదు. తనపైనున్న నిరసన, చిన్నచూపే కారణమా? పోనీ, తను లేకపోతే కొడుకూ, పిల్లలను బాగా చూస్తుందేమో? అది అబద్ధం అని తేలిపోయింది.

"ఒసేయ్ చిట్టిముండా! ఒక దోసె పూర్తిగా తింటావటే. నీ కడుపు మండిపోను. నిర్మలకు సరిపోలేదట యివ్వకూడదూ?" అంటుంది సుందరమ్మ. అలాంటిది తన పిల్లలను చూస్తుందనుకుంటే హాస్యాస్పదమే. కోడలలా రాయిలా నిల్చుని చూడటం ఆమెకు బొత్తిగా గిట్టలేదు.

"వండివార్చాలని వుబలాటం వున్నా నేనేం చిన్నపిల్లనా. సత్తువేది. ఆకలితో వచ్చిన పిల్లలకు ఆ మాత్రం పెట్టకుంటే యెలా......." సరళ చికాకుగా లోపలికి వెళ్ళింది.

వేడి టీ త్రాగేసరికి ఎంతో ఉత్సాహం వచ్చింది. భర్తకు కాఫీ యిచ్చింది. పిల్లలకు పాఠాలు చెబుతూ వంట పూర్తి కానిచ్చింది. ఎన్నో ప్రణాళికలు వేసుకుంది. రాత్రి అందరికీ వడ్డించింది. యిల్లు సర్ది ముందు గదిలోకి వచ్చింది. రఘు భార్యను చూస్తూనే ముఖం తిప్పుకున్నాడు!

"ఇంకా కోపం పోలేదా." ప్రక్కన కూర్చుని ముఖం యిటు తిప్పింది.

"కోపం దేనికి? నేను, నా కోపం నీకో లెక్కా?"

"అలా అనకండి. నేనేం చేసినా, మీ సమస్యలు తగ్గించాలని. అంతకంటే మరేం లేదు. మిమ్మల్ని ఏనాడయినా అది కావాలి, యిది కావాలని వేధించానా? మీరే అనేవారు నేను జడపదార్థాన్నని. ఈనాడు, ఈ చిన్న కోర్కె కోరితే కాదంటున్నారు." ఆమె కంఠము మృదువుగా జాలిగొలిపేలా వుంది.

"అది కాదు సరూ, నీకు ఏం యివ్వలేకపోయినా, ఈనాడు చేత పని చేయిస్తున్నాను."

"నాకు లేని బాధ మీకెందుకు చెప్పండి. ఫాల్స్ ప్రిస్టేజికి పై జీవితాలు బలిపెట్టవద్దు" అతని సరసనే పడుకుంది.

"అలాగే నీ యిష్టం" అన్నాడు, ఆమె తేలికగా నిట్టూర్చింది

మర్నాడు ఉదయమే సుందరమ్మ ఆవులిస్తూ సగం సగం పనులు నా నెత్తిన కొట్టిపోదాం అనుకుంటుందేమో, దాని పని చెబుతా అనుకుంది. అప్పటికే అన్ని పనులు ముగించి తల దువ్వుకుంటుంది సరళ.

"అత్తయ్యా! ఆ టిఫిన్ డబ్బాలో చపాతీలున్నాయి. పిల్లలు నాలు గంటల కడిగితే పెట్టండి."

అవును, కాదు అనలేదు. మూతి తిప్పుకుని దొడ్లోకి వెళ్ళిపోయింది అందరికీ భోజనాలు పెట్టి, మధ్యాహ్నము తినటానికి డబ్బాలు పెట్టి తను భోజనము చేసి వెళ్ళిపోయింది బడికి.

సాయంత్రము ఇంటికి వచ్చేసరికి యధావిధిగా హోటలు నుంచి ఇడ్లీ తెచ్చుకుని తింటున్నారు. "గోధుమ రొట్టెలు డబ్బాలో వున్నాయి ఇడ్లీ యెందుకు తెచ్చారు?"

"పాడు రొట్టెలు నార సాగిపోతున్నాయి. అత్తయ్యా!" విర్ర జవాబు యిచ్చింది.

"రాగానే వాళ్ళ తిండి మీద పడింది నీ దృష్టి. చల్లారి నీరుగారే పదార్థాలు ఎలా తింటారు! గతిలేక వచ్చారనుకుంటున్నావేమో! వాళ్ళ తండ్రి నీలాంటి పదిమందిని పోషించగలడు" సుందరమ్మ అందుకుంది.

"మేం గతిలేనివాళ్ళమనే ఈ వృధా ఖర్చులు వద్దంటున్నాను" విసురుగా అనేసి లోపలికి వెళ్ళింది. అవే రొట్టెలు భోజనాల వద్ద అవురావురు మంటూ తిన్నారు.

"అత్తయ్యా! మధ్యాహ్నం అంతా అన్నాలు తినే పిల్లలే సాయంత్రం వారికిష్టమయితే ఇంట్లో చేసినవి తింటారు లేకుంటే మానేస్తారు. రోజూ మూడు రూపాయలు హోటల్‌కు తగలెయ్యవద్దు."



"ఏమిటే! పిల్లలకు కడుపునిండా తిండి పెట్టకూడదా! రెండు రోజులు పనిచేసి యింత అధారిటీ చేస్తున్నావ్?"

"అత్తయ్యా! మీరిలా ప్రతిదానికీ పెడర్థాలు తీస్తే బ్రతకడం చాలా కష్టం - డబ్బంతా తీసుకోండి, అప్పులు లేకుండా సంసారం నడపండి!"

"ఇంకా నేనేం సంసారం నడుపుతాను. వయసు వస్తోంది!" అన్నది ఈసడింపుగా.

కొడుకు డబ్బులు యివ్వలేదని మూడ పూటలు ఉపవాసం చేసింది. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆ మధ్యాహ్నము పక్కవారి బావిలో దూకబోయిందట. వాళ్ళు రక్షించి తెచ్చారట. అవన్నీ విని, రఘు పిచ్చివాడయిపోయాడు. ఈ గొడవలన్నింటికి కారణము అయిన సరళను పట్టుకుని ఎడా, పెడా బాదేశాడు. అప్పుడు లేచి అన్నం తిన్నది సుందరమ్మ. సరళకు పూర్తిగా ఆ ఇంటి పరిస్థితి అర్థం అయింది. తను యిలాంటి మార్పులు తేవటం అత్తగారు సహించలేదని, భర్త స్వయంగా నిర్ణయించుకోలేడని. దెబ్బలకు బాధ కాదు, అత్తగారి ప్రవర్తనకు బాధ పడింది. పదో తారీఖునే డబ్బు అయిపోయింది. బ్యాంకులోది తేవటం తప్పితే మార్గం కనిపించలేదు.

సరళ మౌనంగా పనులు చేస్తోంది. ఎవరేం చేసినా పట్టించుకోవటం లేదు. అతను భార్యకు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. "కోపంగా వుందా సరూ?"

"దేనికి?"

"పశువులా ప్రవర్తించాను - క్షమించు."

"ఎందుకా మాటలు? కొట్టినా, తిట్టినా బాధ లేదు. ఈ సంసారము ఒక తాటిపై నడిపితే సంతోషించేదాన్ని?"

"ప్రయత్నిస్తాను? నువ్వు ముభావంగా వుంటే పిచ్చి ఎక్కుతుంది."

జాలిగా నవ్వింది. "అదెంతవరకు అమల్లోకి వస్తుందో ఊహకందని విషయము - "

సుందరమ్మ రోజూ శంకరమఠానికి వెడుతూ అక్కడి నుండి గురువు గారిని దర్శించి వస్తుంది - యిదీ ఒకందుకు మంచిదే అనుకొంది

సరళ. కాని ఆ సంతోషం అట్టే నిలువలేదు - ఆదివారం తీరికగా పేపరు చదువుతున్న కొడుకు దగ్గరకు వచ్చింది.

"గురువుగారయిన త్రిలోకనాథుల పాదపూజ చేయించాలి. ఆరు వందల రూపాయలు అవుతాయి. నేను పెద్దగా పెట్టుకోవద్దనుకుంటున్నా. మాకు మూడువందలు చాలు, యెప్పుడు తెస్తావు?

"నా దగ్గర స్వాములకు, గురువులకు ఖర్చుపెట్టే డబ్బు లేదమ్మా!"

"అపచారం - అలా అనొద్దు."

"ఉపచారమో, అపచారమో నాకు తెలియదు" మరో మాటకు అవకాశం యివ్వకుండా బయటకు వెళ్ళిపోయాడు. సుందరమ్మ లేచి పెరట్లోకి వచ్చింది. సరళ బట్టలు వుతుక్కుంటోంది.

"నేను అన్నింటికి దూరమయ్యాను దేవుడో! ఆయనతో ఎందుకు పోలేదు నాయనో" శోకాలు మొదలుపెట్టింది. సరళ తలెత్తి ఒకసారి చూసి తలదించుకుంది.

"ఏమిటి పిన్నిగారూ!" పక్కింటావిడ శోకాలు విని బయటకు వచ్చింది.

"ఏముందమ్మా! కాలం, కలికాలం" జర్రున చీదేసింది. "ఈనాడు ఆ త్రిలోకస్వామి పాదపూజ చేద్దాం. అంటే గతి లేదు. అందరూ చేస్తే అంటున్నారు."

"మీకేమిటండీ! శ్రీరామచంద్రుని వంటి కొడుకు."

"ఆ కాలమే పోయిందమ్మా. బ్రహ్మంగారు చెప్పిన కాలం వచ్చిందమ్మా. 'పెళ్ళాం బెల్లం అయ్యనే' అన్నట్టుంది. ఒక్క కొడుకని యెంత గారాబంగా పెంచామని" రోజా కంటతడి పెట్టడమే...

ఆఖరుకు కూతురి దగ్గరకు ప్రయాణం అయింది.

"అబ్బ, ఏమిటమ్మా, ఈ సత్యాగ్రహాలు! అంత గొప్ప స్వాములా?" రఘు కదిలిపోయాడు.

"నెమ్మదిగా అడుగుతావేంరా? అతని వల్ల సద్గతులు పొందినవారు కోకొల్లలు. ఇంజనీరు మొదలుకొని మినిష్టర్లవరకు అందరూ వస్తారు.



ముఖాన బ్రహ్మ తేజస్సు ఉట్టిపడుతుంది. సర్వసంగ పరిత్యాగులు. మన నిర్మలను చూస్తూనే అదేమిటో 'నిత్య' అన్నాడు." సంబరంగా చెప్పింది.

"సర్వసంగ పరిత్యాగులెవరూ సంసారుల చేత ఖర్చు పెట్టించి సన్యాసులుగా చేయరు" అన్నది సరళ. ఆమెకు భర్తపై మండుకు వస్తోంది. అమ్మ అడగ్గానే కరిగిపోవటం దేనికి? నాల్గురోజులు కూతుళ్ళ దగ్గరుంటే తెలిసేది.

"ఖర్చు, ఖర్చు! యిదేం అడ్డమైన ఖర్చా! సద్వినియోగం అవుతుంది. నా కొడుకు యిస్తే నువ్వెవరు మధ్యన?"

"అవును నేనెవరు? కట్నం తెచ్చిన పెళ్ళాం అయితే కొంగున ముడేసుకుని ఆడిస్తుందనే నన్ను చేసుకున్నాడు మీ కొడుకు. ఇంకా అనుకోవటం దేనికి?" భర్త వంక చురుగ్గా చూసి వెళ్ళిపోయింది సరళ.

మూడు వందలు తీసుకుని, నిర్మలను బడి మాన్పించి, ఆ స్వామి వారి పాదసేవకై తీసుకుని వెడుతోంది.

"అమ్మమ్మ అంటే పెద్దవారు. నీవెందుకమ్మా అతని దగ్గరకు?" నిర్మలను అడిగింది సరళ.

"అది కాదత్తా, నాలో నిత్యత్వం వుందట. రోజూ లలితోపాసన చేయమన్నారత్తా."

"ఆయనే చెప్పారా?"

"అవును, ఆయన ముసలివారనుకుంటున్నావా? రంగారావు పర్సనాలిటీ, జగ్గయ్య గొంతు, రామారావు ఠీవి, నాగేశ్వరరావు నడక!"

సరళ ఫకాలున నవ్వింది. నిర్మల తన ధోరణి ఆపింది.

"నీకు నవ్వులాటగా వుంటే వచ్చి చూడరాదూ?"

"మీరు వెడుతున్నారు చాలు. నన్నిలా బ్రతకనివ్వండి" అన్నది. తను తెచ్చుకున్న ఆన్సర్ పేపరు దిద్దుతూ.

## 26

తన తోటలో కాసిన పండ్లూ, కూరలూ పట్టించుకుని వచ్చాడు. చలపతి. ఇదివరకున్న జంకు లేదు. మొదటిసారిగా అతనికో సత్యం

తెలిసివచ్చింది. స్వయంగా కష్టపడి, సంపాదించుకుంటే వుండే ఆనందము ఆయాచితంగా ఒకరు వేయి రూపాయలు యిచ్చినా లభించదు. ఇన్నాళ్ళ అంధకారంలో వున్నాడు. తను సంపాదిస్తే ఎంత స్వాతంత్ర్యం వస్తుంది. తను యెవరికీ జంకవల్సిన అవసరముండదు. తను సంపాదించిన డబ్బు ఖర్చు పెట్టుకుంటుంటే యెంత ఆనందం, ఎంత తృప్తి. సుశీలమ్మ ఆనందం అంతా, యింతా కాదు.

"ఆ రాక్షసుడేదో అన్నాడని, యిన్నాళ్ళు పంతం పట్టి ఇంటికి రాలేదు కదూ?"

"వాడు రాక్షసుడు కాదే" అతని మాట పూర్తికాక పూర్వమే విష్ణు వచ్చాడు.

"చిన్నాన్నా! పొలం విడిచి వచ్చారా?"

"ఏం దెప్పనక్కరలేదురా. అప్పుడంటే పనులున్నాయి. కాయకూరలు సీజన్. ఇప్పుడేం పనులున్నాయి?"

"దెప్పటమేమిటండీ?"

"అదేనే! వాడు వారానికొకసారి వచ్చి రమ్మని పిలిచేవాడు. నేను పొలం విడిచి రానన్నాను."

"నిజమా" నమ్మలేనట్టు చూసింది.

"నిజమేనే! ఈసారి మనం పెట్టిన ఖర్చులు పోను, రెండు మూడు వేలు మిగులుతాయిరా."

"చాలా సంతోషం చిన్నాన్నా! నాన్న అప్పుడు మీరు అడగ్గానే ఇన్‌స్టాల్‌మెంట్ బేసిన్ మీద తెచ్చారు డబ్బు. అది పూర్తిగా చెల్లిస్తే మంచిది."

"అలాగే" చలపతి తలాడించాడు.

విష్ణు వెళ్ళిపోగానే సుశీలమ్మ విరుచుకుపడింది.

"వాడు ఆజ్ఞలు జారీచేయగానే గంగిరెద్దులా తలూపుతారేమిటండీ ఆ లోన్‌లు మనమెందుకు చెల్లించాలి? మనకేం ఆడపిల్లలు లేరు! బావగారు పోయిందగ్గరనుండి మంచి బట్ట ఎరగరు. పిల్లలకు బట్టలు కుట్టించండి. మనమలా నాల్గు ఊళ్ళు తిరిగి వద్దాం."



"సరేలే ఆలోచిద్దాం. మొదటలా వెళ్ళివద్దాం. త్వరగా తెములు" ఇద్దరూ భోజనాలు చేసి సిటీకి వెళ్ళిపోయారు. అంతా కాంతమ్మ వింటూనే వుంది. తోడికోడలి ప్రవర్తనకు చాలా బాధపడింది.

ఆ మర్నాడు తన కొడుకులని వెంటబెట్టుకుని కాశ్మీర్ వెళ్ళిపోయారు చలపతి దంపతులు. ఈ సంఘటన విష్ణు మనసును అల్లకల్లోలం చేసింది. అందరూ పడుకున్నా అతనికి నిద్ర రావటం లేదు. తను ఇలాగే స్వలాభాపేక్షతో పనిచేస్తే కుటుంబము ఎక్కడ వుండేది? సుజాతను కూడా శ్రమింపచేస్తున్నాడు. తనంతట తాను ఒక్క బహుమతి కొనివ్వలేదామెకు.

తలుపుతట్టారు ఎవరో. అప్పటికే అలసిపోయిన సుజాత గాఢ నిద్రలో మునిగి వుంది. దుప్పటి ఆమె గొంతు వరకు లాగి, వెళ్ళి తలుపు తీశాడు.

తల్లిని చూస్తూనే ఆదరాబాదరగా నైటుగౌను నాడలు బిగించుకున్నాడు.

"పిలిస్తే నేను క్రిందికి వచ్చేవాడిని కదమ్మా" ఆమె మాట్లాడలేదు. స్పృహ తప్పినట్టు నిద్రబోయిన కోడలి వంక జాలిగా చూసింది. ఆ వయసులో తామందరూ పైలా పచ్చీసుగా గడిపారు జీవితం. రోజూకు రెండు రూపాయల పూలు కొనేవారు. కోడలు, ఇటు యింటిపనులూ, అటు మొగుడితో సమానంగా ఆఫీసు పనులూ చేస్తోంది. ప్రొద్దున తోడికోడలన్న మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి.

కొడుకును బాగా చీవాట్లు వేయాలని వచ్చి, ఆ విషయమే మర్చిపోయింది.

"ఏమ్మా, ఆలోచనలో మునిగిపోయావు. ఈ మధ్య కాస్త పని ఎక్కువయి వుంటుంది. తను అలసిపోతోంది." భార్య త్వరగా నిద్రపోవటానికి కారణం చెప్పాడు.

ఆమె గాఢంగా నిట్టూర్చింది. కొడుకు రాసుకునే బల్ల దగ్గర కుర్చీ లాక్కుని కూర్చుంది.

"నీతో ప్రతి విషయంలో పోట్లాడవలసి వస్తోందిరా."

"ఇప్పుడేం వచ్చిందమ్మా?"

"రాజీవ్‌ను బి.యస్‌సి. చదవమన్నావట, వెళ్ళే ముందు పిన్ని పిచ్చి మాటలన్నదని...."

"తనకొచ్చిన మార్కులతో యింకేం చదువుతాడట."

"మళ్ళీ ఈ సంవత్సరం కూడా అదే చదివి యింజనీరింగ్ చదువుతాడట."

"వాడు చెప్పటం, మీరు సమర్థించటం చాలా బావుందమ్మా. ఈ రోజులలో ఫాషనయిపోయింది. డాక్టర్‌ను అవుతాను, ఇంజనీరు అవుతాను అనుకోవటం. నా తెలివితేటలేమిటి అని యెవడూ ఆలోచించడు" అన్నాడు. అతని కంఠంలో కరుకుదనం కరకరలాడింది. "ప్రిపేర్ అవలేదంటూ ఓ సంవత్సరం పరీక్ష రాయనే లేదు. రాసినప్పుడు అత్తెసరు మార్కులు."

"ఈ ఒక్కసారీ చదవనీ!"

"నాదేం వుంది. కాశ్మీరు ట్రిప్పుకు పెట్టే ఖర్చు వాడి చదువుకు పెట్టకూడదూ?"

"ఉదయ్‌కి ఆరోగ్యం బావుండక కాస్త మార్కులు తక్కువ వచ్చినా, వాడికి శ్రద్ధ వుందని సీటు యిప్పించలేదా?"

"ఏమోరా, మధ్యలో నాకు చావు వచ్చింది."

"నువ్వలా బాధపడితే ఏం చేయలేను. వయసు పెరుగుతుందా, తరుగుతుందా. ఆడంబరాల కోసం చదివేది చదువే కాదు. నేను చెప్పేది చెప్పాను తరవాత మీ యిష్టం."

"ఏమిటో అంతా నా దురదృష్టం" అనుకుంటూ లేచిపోయింది. ఈ గందరగోళం కంటే విడిపోతేనే మంచిదనిపించింది. కాని భర్తృహీన కమల ఏమవుతుంది? ఆమె మెల్లగా మెట్లు దిగింది.

అతను నిట్టూర్చాడు. తలుపు వేసి, లైటు తీసి వచ్చాడు. బెడ్‌లైట్ వేశాడు. వీరిద్దరి మాటలు గాని, తలుపు చప్పుడు గాని సుజాతకు నిద్రాభంగం కలిగించలేదు. "అభిమానంకొద్దీ నాతో పోటీపడుతోంది" అనుకొని అంటీ అంటనట్టు ఆమె బుగ్గలు తాకి తనూ పడుకున్నాడు.



# 27

"అక్కయ్యా! ఏమిటిది. ప్రభుకు డాక్టర్ చెప్పిస్తూ నా కొడుకును బి.యస్‌సి. చదవమంటారా?" హాల్లో హోరాహోరీగా పోట్లాడుతోంది సుశీలమ్మ.

"పిన్నీ! నేను అన్నదానికి అమ్మతో పోట్లాడటం దేనికి? వాడు ఇకా పదిసార్లు రాసినా వచ్చే మార్కులు అంతే."

విష్ణు మాటలు విని తగ్గిపోయింది.

ఆఖరు సంవత్సరం చదువుతున్న పెద్దకొడుకును కదిపింది. "నాకేం తెలుసమ్మా, మరి ఆయన అన్నట్టు డబ్బు రాగానే మనం యాత్రలు చేయటం ఏమిటీ, మన ఖర్చులు ఆయనెందుకు భరించాలి."

"వ్యాపారమంతా ఉమ్మడిదేగా?"

"పొలం మాత్రం మన ఒక్కరిదేనా" ఈ ప్రశ్నకు భార్యాభర్తలు నిరుత్తరులయ్యారు. ఉదయ్ వెళ్ళిపోయాడు.

"ఒరేయ్ రాజీవ్! ఈ సంవత్సరం వాడు చెప్పింది చదువు. వచ్చే ఏడు చూద్దాం" చలపతి అన్నాడు.

"చూద్దాం! చూద్దాం అంటావు" భర్త పైకి రయ్యిన లేచింది. "వాడు రిపీట్ చేస్తాడు, చేసి తీరుతాడు. మొన్న పదివేలు తన కూతురికి కట్టాడని చిన్నాడిద పత్తిత్తులా నోరు మూసుకుంది" సుశీలమ్మ అరిచింది. బి.యస్‌సి.లో చేరడానికి తీసుకెళ్ళిన డబ్బుతో పి.యు.సి.లో చేరాడు. విష్ణు ఆ చర్చ మళ్ళీ యెత్తలేదు.

"అన్నయ్యా ఈ నెల పాకెట్ మనీ యివ్వలేదు" రాజీవ్ విష్ణును అడిగాడు.

"యెవరి అనుమతితో పి.యు.సి. రిపీట్ చేస్తున్నావో, వారినే అడుగు" టై కట్టుకుంటూ అన్నాడు. రాజీవ్‌కు అదే భయం వుండేది. ప్రతిసారీ పిలిచి యిచ్చేవాడు పాకెట్‌మనీ. కొన్ని విషయాలు విష్ణు యెప్పుడూ మరిచిపోడు, మరిచిపోయాడంటే ఏదో ఉంటుంది. రాజీవ్ క్రిందకు వచ్చి విషయము తల్లితో చెప్పాడు.

"అవును ఇస్తాను భయమా! చదివించేవారిని డొనేషన్లు కట్టి చదివిస్తారు అంతా కర్మ" సుశీలమ్మ అరుస్తూ హాల్లోకి వచ్చింది. అక్కడ సుజాత ఫలహారాలు సర్దుతూ కన్పించింది.

"వెళ్ళమ్మా, వండటం అయ్యాక సర్దటం గొప్పేనా? చదువుకున్న దానవు, ఆఫీసులలో పనిచేసేదానవు. కట్నకానుకలు తెచ్చి మాలాంటి వాళ్ళని పోషించేదానవు. జీతం, బత్తెం లేని నౌకర్లము మేము వున్నాముగా."

"చిన్నత్తా!" ఏమో చెప్పబోయింది.

"సుజాతా" మేడ దిగే విష్ణు పిలుపు విని తలెత్తింది. అతని కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"క్షమించండి" అనేసి ప్రక్కకు తప్పుకుంది. ఆమెకు చాలా అభిమానం కలిగింది. చిన్నత్త తనను కట్నం తేలేదని దెప్పుతోంది. ఆదర్శ వివాహాలు పురుషులు చేసుకున్నా, సాటి స్త్రీలు హర్షించలేరు. తను సమాధానం చెబితే తప్పేం? తనూ రక్త మాంసాలున్న మనిషే. ఆడదంటే బానిస అనుకుంటాడా తన భర్త. అందరూ అనే మాటలు పడే ఖర్మం పట్టింది. కన్నీరు బిగపట్టి పెరట్లోకి వెళ్ళిపోయింది. పెళ్ళి అయిన దగ్గర నుండి తను ఏం అనుభవించింది. నీరసంగా వుంది. భర్త తీయని మాటలతో పని గడిపేస్తున్నాడు.

"వదినా, అన్నయ్య తయారయ్యాడట" ప్రభ చెప్పటంతో గబ, గబ వచ్చి చెప్పులు వేసుకుంది.

"ఇదేమిటమ్మా, ఫలహారం చెయ్యవూ."

"చెయ్యాలనిపించలేదత్తయ్యా! నోరంతా చేదుగా, వికారంగా వుంది" అని వెళ్ళి అతని వెనకాల కూర్చుంది. ఈ రోజు ఏమిటో, తను ఒంటరి దయినట్టు, తన శ్రమను గుర్తించినవారు లేనట్టు ఫీలయింది.

## 28

సుందరమ్మ, నిర్మల రాత్రంతా ఏవో వ్రతాలు అంటూ గురువుగారి వద్దే వుండిపోయారు. ఉదయం వచ్చి చాపపై పడుకుని నిద్రపోయింది నిర్మల.



"ఏమిటిది నిర్మలా, చదువు పాడుచేసుకుంటూ."

"అతని మహిమ చెప్పినా అర్థంకాదత్తా. నాలాంటి కన్యల కడుపున లోకోద్ధారకుడు జన్మించబోతున్నాడట. మాలో ఆ కన్య యెవరని అన్వేషిస్తున్నాడు."

"అవునే" సుందరమ్మ కల్పించుకుంది. "అంతా మన నిర్మల లాంటివారే ఉపదేశం పొందుతున్నారు. అందరితో లలితోపాసన చేయించరు. దైవత్వము కనిపించినవారినే. ప్రతిరోజూ ఆయన దర్శనము చేసుకొని, లలితోపాసన చేస్తే కుమారస్వామి వంటి పుత్రుడు కలుగుతాడట."

"అక్కడికి వచ్చేవారికి లలితోపాసన అంటే ఏమిటో తెలుసా?"

"అదంతా నాకు తెలియదు. నువ్వు వచ్చి చూడు. ఇంగ్లీష్ కూడా చక, చకా మాట్లాడేస్తారు" ఆ రోజు సరళకు త్రిలోకనాథులను చూడాలని బుద్ధి పుట్టింది, అత్తగారితో వెళ్ళింది. కోడలు దారిలో పడ్డందుకు సంతోషించింది సుందరమ్మ.

త్రిలోకనాథులు భక్త కోటి మధ్యలో కూర్చున్నాడు. నిర్మల వర్ణించిన దానిలో అసత్యం ఏమీ లేదు. పచ్చని మేని ఛాయ, ధోవతి కట్టుకుని ఉత్తరీయము ఒక భుజం మీదుగా వల్లెవాటు వేసుకున్నాడు. నుదుట చందన తిలకం, పె. వులపై చిరునవ్వు, చూపరులను యిట్టే ఆకర్షిస్తాడు. అందరూ కూర్చోగానే, అందరినీ చిరునవ్వుతో పలకరింపుగా కలయచూశాడు.

లలితాస్తోత్రముతో ప్రారంభమయింది ఆనాటి సమావేశం. స్త్రీని అంత నగ్నంగా వర్ణిస్తుంటే సరళ తల తిరిగిపోయింది. అది పూర్తి అవుతుండగా యిద్దరు కన్యలు అతని తొడలపై కూర్చుని అతని బుగ్గలు చుంబించారు. సరళకు కంపరమెత్తింది. అత్తగారినేమో ప్రశ్నించబోయింది.

"ఉష్! ఆయన వారిని దేవీమూర్తులుగా భావించాడు. అందుకే తొడలు ఆసనముగా చేశాడు" అత్తగారి సమర్ధింపుకు మతిపోయింది కాని ఆ గుంపు నుండి బయటపడటం సాధ్యంకాదని తేలిపోయింది. అతను ఏదో వేదాంతం చెప్పి నాలుగు వాక్యాలలో ముగించాడు.

"అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టే చెప్పాడమ్మా జీవితసారము" అని ఒకరంటే -

"అందుకే త్రిలోకనాధులు అయ్యారు" అని మరొకరు అన్నా అందరూ పొగిడేవారే.

"ఏకాంతసేవలో ఎవరు పాల్గొంటున్నారు?" ఎవరో ప్రశ్నించా ఆవిడ ఇంట్లోనే గురువుగారి బస.

"మేము" అంటూ ఓ పదిమంది యువతులు పక్కకు వచ్చి నిలబడ్డారు. త్రిలోకనాధులు సరళను గమనిస్తున్నారు.

"ఈమె ఎవరు సుందరమ్మా?"

"నా కోడలు స్వామి!"

"ఈ కాంత ముఖంలో నిత్యత్వం కనిపిస్తోంది."

"నేను కన్యను కాను" పెళుసుగా జవాబిచ్చింది సరళ.

"కన్య కన్యత్వము కోల్పోయినా, దైవత్వము కోల్పోదు సుందరమ్మా అందరినీ బయట వుంచు. ఈ స్త్రీ ముఖతః దేవీ ప్రసన్నం కావాలి ఆ దేవే ఈమెను దరిద్ర బాధలకు గురిచేస్తుంది."

"నిజమా స్వామి?" సుందరమ్మ సాష్టాంగపడి లేచింది. ఒక్కరొక్కరే వెళ్ళిపోయారు. సరళ మొండి ధైర్యంతో కూర్చుంది.

"ఇలా దగ్గరగా వచ్చి నీ వామహస్తము చూపు" అలాగే చేసింది.

"ఆహా! అపూర్వమైన స్త్రీ. నీలాంటి స్త్రీల వల్లే రససిద్ధి జరుగుతుంది" అతని చేతులు మెల్లమెల్లగా శరీరభాగాలను తడుముతున్నాయి.

"స్త్రీ - స్త్రీ పురుషుని కాంక్షల పాలిట కామధేనువు. అతని గమ్యానికి మార్గం. అనురాగమయి అయిన ఆత్మజ, అపురూప స్నేహ మొలకించు సోదరి, మమతల నొలికించే మాతృమూర్తి, స్వర్గద్వారము వరకు సారధ్యము వహించే ప్రియురాలు. అపూర్వమైన దశే ఈ ప్రేయసి దశ. మానసం, శరీరం మధింపబడతాయి. నాకింతవరకు ఏ స్త్రీ ప్రేయసిగా దర్శనం ఈయలేదు."

"మీ ఉద్దేశ్యం." అతని చేయి తొలగించింది. అతను ప్రసన్నంగా, మధురంగా నవ్వాడు.

"అదే. నీవు శక్తి అంశము. నీలో సంభోగ కోర్కెలు బలంగా వున్నాయి. కాని నీ భర్త బలహీనుడు."



"ఆపండి" సరళ ముఖం ఎర్రబడింది.

"నా కౌగిలిలోకి వచ్చి, ఒకసారి ఆ మాటను."

"ఛీ, ఛీ!" చటుక్కున లేచి బయటకు వచ్చింది.

"ఏమ్మా, ఏదైనా అపకారం జరిగిందా నీ వల్ల!" సుందరమ్మ అడిగింది.

"ఏం లేదండీ! నాకేదో వికారంగా వుంది. వెళ్ళిపోతాను" జవాబుకు ఎదురుచూడక వచ్చేసింది. ఎంత సిగ్గుచేటు. స్త్రీలంతా మూర్ఖులా? తనే మూర్ఖురాలా? సమాధానం లేని ప్రశ్నలు చాలా లేచాయి.

సాయంత్రం అమ్మమ్మ, మనుమరాలు వచ్చారు.

"అత్తయ్యా! మీరు వెళ్ళండి, నిర్మల దేనికి?"

"లోకోద్ధారకుడైన పుత్రుడు కన్యలకే పుడతాడే, నాకు కాదు. మీ కోడలిలో నిత్యత్వం వుందని భ్రమపడ్డాను. ఆమె ఒక మామూలు స్త్రీ" అని. అందుకే స్వామి అన్నారు.

"అది కాదత్తయ్యా! అతని వాలకం నచ్చలేదు."

"నీలాగ యెవరూ అనలేదు."

"అనడానికి సిగ్గు అడ్డం రావచ్చుగా. నా మాట వినత్తయ్యా."

"ఏమిటే నీ బోడి మాట" ఈసడించి వేసింది. "నా కామాత్రం తెలియదా? నేను నిత్యం నియమనిష్ఠలతో పూజలు జరిపే పుణ్యాత్ముల ఇంట పుట్టానే!"

"నాకదంతా తెలియదు. 'పూజ' అంటే ఓ సత్కార్యము, భగవంతుడిని మెప్పించేది అన్నారు. భగవంతుడు పూజామందిరంలో బంధింపబడి ఏం లేడత్తయ్యా! నీలో, నాలో సర్వవ్యాప్తమయి వున్నాడు. నిర్మలమైన మనసే అతని ఆసనం. నిత్యం చేసే మంచి పనులే అతని పూజలు."

"పూజా పునస్కారాలు మూర్ఖులు చేస్తారంటావా?"

"కాదు అజ్ఞానులు. మనసులో దాగిన కల్మషం కప్పిపుచ్చడానికి చేసే కపట నాటకం ఈ క్రతువు."

"చాల్లే, యెవరన్నా వింటే నవ్విపోతారు" సుందరమ్మ కోడల్ని ఈసడించింది. సంసారి అయిన సరళ ఒకరోజు నిర్మలను పరీక్షగా చూచింది. నిర్మల కన్యాత్వం కోల్పోయిందని గ్రహించటానికి అట్టే పట్టలేదు. భర్తతో ఈ విషయము చెప్పింది.

"నీకన్నీ అనుమానాలే. నీకిష్టం లేదు, మానెయ్యి. వాళ్ళను అనటం దేనికి?" రఘుకు ఈ మధ్య తల్లి సాధింపులు తక్కువయ్యాయి. అందుకే అతను త్రిలోకస్వామికి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

ఆ సాయంత్రము నిర్మలను అడిగింది. అతని విశేషాలు, ఏకాంతసేవ విషయాలు.

"అయ్యో! అపచారమత్తయ్యా! ఎవరితోనూ చెప్పకూడదు."

"నేను మామూలు స్త్రీనమ్మా! నాతో చెప్పడానికేం? యెంతో నచ్చచెప్పాక అసలు విషయం చెప్పింది. అది విని మ్రాన్పడిపోయింది సరళ. నోట మాట కూడ రాలేదు. రానున్న ఉపద్రవము ఆపటం ఒక్క సుజాత వల్లే సాధ్యం అవుతుంది అనుకుంది.

## 29

సుజాతకెందుకో ఈ మధ్య పనిమీద ధ్యాస నిలవటం లేదు. ఏదో అసంతృప్తి, భర్తను అర్థం చేసుకోవటంలో తనే పొరపడిందని నమ్మకం కలిగింది. యువకుడు, అయితే ఆ భావాలు లేవు. మరమనిషిలా 'పని, పని' అంటాడు. ఈ మధ్య బాగా మాటలు తగ్గించింది. అది అతను గమనించనట్లే ప్రవర్తిస్తున్నాడు. బొత్తిగా రసహీనమైన బ్రతుకు అనుకుంది.

"ఏమ్మా! అంత పరధ్యాస?" సరళ రెండోసారి కుదిపితే ఈ లోకంలోకి వచ్చింది.

"బావున్నావా వదినా! అకస్మాత్తుగా వచ్చావేం?"

"మేనేజర్‌గారికి మొదట విన్నవించుకోవాలి కాబోలు."

"అదేం లేదు. ఏదేని గొప్ప విషయం లేనిదే రావని."

"నిజమే సుజా! అలా బయటకు వెళ్ళి మాట్లాడుకుందాము."

"అలాగే."



ఓ చిన్న చీటి రాసి పర్మిషన్ కోసం విష్ణుకు పంపింది. శాంక్షన్ అయింది.

"ఇదేమిటమ్మో."

"అదంతే. పద" యిద్దరూ బయటకు వెళ్ళారు.

సరళ చెప్పింది విని మ్రాన్పడిపోయింది సుజాత.

"నిజమా వదినా?"

"నిజమే సుజా? ఒకసారి వెడదాం పద."

సుజాత వదిన వెంబడి రిక్షాలో పుట్టింటికి వెళ్ళింది.

తల్లిని, నిర్మలను చీవాట్లేసింది. అసమర్థతకు అన్నగారిని తిట్టింది.

"నీకేం తెలియదు. లోక కళ్యాణార్థమై ఓ పుత్రుడు కలుగబోతున్నాడే."

"అమ్మా! లోక కళ్యాణం తరువాత, దాని జీవితం నాశనం అవుతుందే!" యెన్ని విధాలుగా చెప్పినా వినలేదు. చేసేది లేక అక్కకు ఉత్తరం రాసింది. వెంటనే వచ్చి తన కూతుర్ని రక్షించుకోమని.

మనవాళ్ళు సాధించిన ప్రగతి యింతేనా? యింకా స్వాములను, సన్యాసులను నమ్ముతూ మోసపోవడమా? చదువుకున్నారెందుకు? విజ్ఞానము లేని చదువు. అజ్ఞానాన్ని పెంచుతున్న చదువు లేకపోతేనే నయమేమో. పట్టణం నడిబొడ్డున నవనాగరికులుండే ప్రదేశంలోనే యిలావుంటే పల్లెల అందం చెప్పనవసరం వుండదేమో? సుజాత రిక్షా తీసుకొని అత్తవారింటికి బయలుదేరింది.

రఘు మనసంతా అల్లకల్లోలంగా వుంది. తల్లి మాట నిజమో, భార్య మాట నిజమో అర్థం కావటం లేదు. మూర్ఖత్వం కాకపోతే ఇరవయ్యో శతాబ్దంలో లోకకళ్యాణార్థమై కుమారస్వామి జన్మించటమేమిటి? నిర్మల చెప్పిన మాటల్ని బట్టి ఆ పిల్ల పూర్తిగా చెడిపోయింది. రక్షించే మార్గమే లేదా? ఆలోచనలు అధికమైనప్పుడు మనిషి మానసికంగా బలహీను డవుతాడు. కొందరు నిద్రపోయి మరచిపోతారు... కొందరు నిలద్రొక్కుకుంటారు. మరికొందరు అన్నీ మరచిపోవాలని ఏదేదో చేస్తారు. రఘు పని అంతే అయింది. నెమ్మదిగా బార్‌లో దూరాడు. జేబులో వున్న డబ్బు అయిపోయేవరకు అక్కడే కూర్చున్నాడు.

# 30

సుజాత ఇంటికి వచ్చేసరికి విష్ణు రాలేదు. సుశీలమ్మ రుసరు
లాడుతోంది. కమలమ్మకు జ్వరం వచ్చింది. కోడలు తొందరగా వ్వ
అంతా ఆమె నెత్తిన రుద్దవచ్చు అనుకుంది. అనుకోకుండా అబ్బ
అయింది. "మా విష్ణు మహా తెలివైనవాడు. కమలకు జ్వరం వచ్చ
సంగతి తెలుసు. భార్య ఎక్కడ అరిగిపోతుందోనని అక్కడే వుంచేశా
మేం లేమూ దాస దాసీ జనము" అన్నది వెటకారంగా.

కాంతమ్మ కూతురి దగ్గరకు వెళ్ళింది. ఇక యెన్ని మాటలన్నా
యెవరడ్డు?

"లేదు చిన్నత్తా! వారేం వుంచలేదు. అత్యవసరంగా అమ్మను
చూడాల్సిన పని యేర్పడింది."

"పెత్తనాలు మీవి. ఎటయినా వెళ్ళండి" అన్నది విసురుగా.

కన్నా సహాయముతో మిగిలినపని చేసింది. అప్పుడే వీరయ్య
వచ్చాడు.

"అమ్మగారూ! చిన్న సూట్‌కేసులో బట్టలు సర్దివ్వమన్నారు
అయ్యగారు. అర్జంటుగా బొంబాయి వెళ్ళాలట. ఈ కవర్లో డబ్బు!"

"చిన్నత్తకివ్వు" అతన్ని చూడకుండానే పైకి వెళ్ళిపోయింది.

బట్టలు పెట్టుకుని వచ్చేసరికి సుశీలమ్మ సంబరంగా డబ్బు లెక్క
చూచుకుంటోంది."

* * *

నాల్గురోజులకే సుజాత పూర్తిగా నీరసించిపోయింది. ఒక సత్యం
తెలిసి వచ్చింది. శాసించినా, ఆజ్ఞాపించినా విష్ణు పనిచేయటానికి,
ఉత్సాహంగా వుంచటానికి ఉత్ప్రేరకం లాంటివాడు. అతన్ని విడిచి వుండటం
ఎంత దుర్భరమో తెలిసివచ్చింది. మనసులో పేరుకుపోయిన అశాంతి
తగ్గాలంటే,ఒక్కసారి అతని బలమైన చేతులలో విశ్రమించాలి. అతని
స్పర్శతో నూతనోత్సాహము పుంజుకోవాలి.



"అమ్మగారూ! పోయిన నెల ఆఖరి వరకు రాబడి ఖర్చులు
పూర్తిగా తయారయిన షీటు యివ్వమన్నారు."

"అయ్యగారొచ్చారా?"

"ఇంటికి ఫోను చేశారు, మీకు తెలియదా? ఉదయమే వచ్చారు.
వర్క్‌షాపుకు కొన్ని స్పేర్‌పార్ట్స్ వచ్చాయి."

"అలాగా, నాకు తలనొప్పిగా వుంది. ఈ పూటకు పనంతా మీరు
చూసుకోండి" లోపలకు వెళ్ళి ఫోన్ తీసుకుంది. ఆయన వస్తారా? వర్క్
ఈజ్ వర్షిప్ అంటారు.

ఈ వారం రోజుల నుండి మనసులో పేరుకుపోయిన మలినం
పోవాలంటే ఆయనతో మాట్లాడాలి. అతనికి ఫోన్ చేసింది. తనే యెత్తాడు.

"హల్లో - మీరేనా? ఏమిటా కొత్త పిలుపు! మీరు వెంటనే యిక్కడికి
రావాలి. సముఖంలో అన్నీ వివరంగా మాట్లాడుకుందాం - ఊహు! ఈ
ఒక్కరోజు నా మాట వినరూ - థ్యాంక్స్ -" అని ఫోన్ పెట్టేసి సోఫాలో
కూర్చుంది. పదిహేను నిమిషాల్లో అతని 'జావా' కాంపౌండ్‌లో ఆగిన
శబ్దం అయింది. అతను వస్తూనే గుమ్మంలో నిల్చుని రెండు నిమిషాలు
సుజాతను చూచాడు. వెంటనే డాక్టరుకు ఫోన్ చేశాడు.

"ఛ! యిప్పుడు డాక్టరెందుకు?" అన్నది కంగారుగా లేస్తూ.

"ఒక్కసారి ముఖం అద్దంలోచూసుకో, కళ్ళు లోతుకుపోయాయి.
అసలు చాలా రోజుల నుండి గమనిస్తున్నాను. అన్నం కెలికి లేస్తావు."
దగ్గరగా వచ్చి, ఆమె చెక్కిళ్ళు మృదువుగా నిమిరాడు.

"అందరికీ వుండే మామూలు స్థితే. డాక్టర్ వచ్చి చెప్పాల్సిందేం
లేదు" అన్నది.

"అంటే..."

"కారణం నాకు తెలుసు."

"మరి చెప్పరాదూ?"

"మీ కిష్టమో, కాదో."

"సుజా!"

"అవునండీ .... మీరంతా ప్రణాళికా ప్రకారం జరగాలంటూ కొన్నిసార్లు ప్రకృతి నియమాలకు దాసులు కాక తప్పదు."

"ఏమిటీ" అతని కళ్ళల్లో ఒక్క సెకను అపూర్వమైన కాంతి తళుక్కుమంది.

"ఇంత మంచివార్త యిలాగేనా చెప్పేది? నువ్వు చాలా కఠినాత్మురాలి పైగా నిష్ఠూరం నాపై వేస్తున్నావా?"

"అది కాదండి!"

"ఏది కాదు! అందరిలా నువ్వు భయంతోనే నన్ను సమర్థిస్తున్నావు మాట. నన్నర్థం చేసుకుంది యింతేనా?" అతడు ఆమెను వదిలి దూరంగా కిటికీలోంచి తరాజులు, తూనికరాళ్ళు చూస్తూ నిలబడ్డాడు. సుజాతకు తన పొరపాటు తెలిసివచ్చింది. అంత దురుసుగా మాట్లాడవలసింది కాదు.

"నా మనసెందుకో చాలా అల్లకల్లోలంగా వుందండీ" కంఠము బొంగురు పోయింది. వెళ్ళి సోఫాలో జారగిలపడింది. అతను తిరిగి చూచాడు. ఏమనుకున్నాడో? నెమ్మదిగా వచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"నీ బాధ చెప్పందే నాకు ఎలా తెలుస్తుంది సుజా!"

"మీరు ఆ రోజే ఊరికెళ్ళారు" త్రిలోకనాధుల ఉదంతము, నిర్మల తల్లి యెలా అతని పిచ్చి వ్యామోహంలో చిక్కుకున్నారో వివరించింది. అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"మీ అన్నయ్య చదువుకున్న మూర్ఖుడు సుజా."

"వదిన చెబితే అమ్మకు లక్ష్యం లేదు" అన్నది సుజాత.

"అలాంటివారిని చూచి జాలిపడటం తప్ప ఏం చెయ్యలేము. ఈ స్థితిలో నువ్వు మనసు నిర్మలంగా వుంచుకోవాలి. మనింట్లో కూడా వాతావరణం బావుండి వుండదు. అవునా?"

అతనే అడిగినప్పుడు చెబితేనేం? కాని అతను త్వరపడి యేదైనా నేమన్నా తను బాధ్యురాలు అవుతుంది. అందుకే చెప్పలేకపోయింది. చిన్నత్త అనే మాటలు.

"ఓ వారం రోజులు యెటయినా వెళదామా?"



"ఎక్కడికీ వెళ్ళాలని లేదు. యిక నుండి మీరు నన్ను ఒంటరిగా ఒదిలి వెళ్ళొద్దు" అతని భుజంపై తలవాల్చింది.

"మీరు ఎదురుగా వుంటే, యింకేం అక్కరలేదనిపిస్తుంది." అన్నది పెళ్లాం.

"అందుకే అంటాను, 'నువ్వు ఫూల్‌వని' భుజంపై వున్న తల ఒడిలోకి తీసుకున్నాడు. కాలింగ్‌బెల్ మోగింది. అతను ఆమెను లేపి, వెళ్ళి డాక్టరును వెంటబెట్టుకువచ్చాడు. పరీక్ష చేసి, చిన్నగా నవ్వాడు.

"ఇది లేడీ డాక్టర్ దగ్గరకెళ్ళాల్సిన కేసు."

"అవును. మీకు ఫోన్ చేశాక చెప్పింది."

"నో ఫియర్. జనరల్ వీక్‌నెస్." కాసేపు మాట్లాడి విష్ణు పని వరస పెట్టుకుని ఫీజు తీసుకుని వెళ్ళిపోయాడు.

"ఇక తమరు విశ్రాంతి తీసుకోండి. ఇప్పటికే నాకు చాలా బిరుదులు వచ్చాయి."

"ఎన్ని బిరుదులు వచ్చినా మీరేం చలించరుగా. మీలో వున్న కార్యదీక్ష, పట్టుదల అన్నయ్యకు రవంత వుంటే బావుండును." అన్నది.

"లేనిదాన్ని గూర్చి బాధ ఎందుకు? బలహీనతే వారి శత్రువు సుజా! ఆలోచించి నీ ఆరోగ్యం పాడుచేసుకోకు. అలా వెళ్ళి కాఫీ త్రాగి సినిమాకు వెళదాము పద."

"ఏమిటీ రోజు చాలా ఉత్సాహంగా వున్నారు?"

"నిజం సుజా! ఈ సాలెగూడు నుండి బయటపడతానని నేను అనుకోలేదు. ఈ నెలలో ఉదయ్ ఉద్యోగ ప్రయత్నం చేస్తూ వర్క్‌షాపులో వున్నాడు. ఎంత లాభం వచ్చిందని! ఇంకొక ఏడాది యిలాగే వుంటే నాన్నగారికిచ్చిన మాట నిలబెట్టుకుంటాను" అతని ముఖంలో ప్రసన్నత కన్పించింది."

"నాకు మాత్రం ఏం తోస్తుంది ఇంటి దగ్గర....."

"నీ యిష్టం. లేచి ముఖం కడుక్కో." ఆమె బాత్‌రూమ్ వైపు వెళ్ళింది.

# 31

అనుకోకుండా దిగిన కూతుర్నీ, అల్లుణ్ణీ చూచి తడబడింది సుందరమ్మ. పెద్దకూతురు రావటం, ఆమె తన కూతురుని స్వామికి ధారాదత్తం చేస్తానని అనటం వీళ్ళకి తెలియలేదు కదా!

"ఏమిటే నీ నగలు ఏళ్ళయినా తయారయ్యేటట్టు లేవు? పైగా ఆయన తీపి మాటలతోనే కడుపు నింపుతారు."

"అది సరే, నాకు కావాలనుకుంటే చేయించుకుంటాను. అక్కయ్య ఏది?"

"త్రిలోకనాథుల దర్శనానికి వెళ్ళింది. ఆయన ఈ వారం మహా యజ్ఞము చేస్తున్నారు. చూడాలని వెళ్ళింది."

"అదికాదు సుజాతా! ఈ రోజు నల్గురు కన్యలను మన నిర్మలతో పాటు ఆయనకు ధారాదత్తం చేస్తున్నారు." సరళ చెప్పింది.

"అవునే చేస్తుంది. కన్నతల్లి ఇష్టంతోనే చేస్తున్నారు. నువ్వు మళ్ళీ చెప్పడం దేనికి? మీరంతా తల తీసివేస్తారా? నేను దొంగతనము చేశానా!" అన్నది సుందరమ్మ.

"సుజాతా! మనకెందుకు? వెడదాం పద" విష్ణు లేచాడు.

"అయ్యో, మిమ్మల్ని అనలేదు నాయనా! మా కోడలిని అన్నాను. కూర్చో."

"చూడండి, కోడలయినా ఇంటి పనివారయినా మంచి మాట చెబితే వినాలి. విరిసీ విరియని మొగ్గలాంటి నిర్మల జీవితము నాశనం కావటమా! అరవై ఏళ్ళ ముసలాడితో పెళ్ళా?"

"అలా అనకు నాయనా! అపచారము."

"మీ మూర్ఖత్వానికి నవ్వాలో ఏడ్వాలో తెలియటం లేదు. వెళ్దాం పదండి."

"యజ్ఞము యిక్కడ కాదు నాయనా, నాకు కళ్ళతో చూచే యోగం లేదు. ఇద్దరూ సంపాదిస్తూ డబ్బు లేదన్నారు."



"డబ్బున్నా యిలాంటి పనులకు తగలేసుకుంటారా! యే ఊళ్ళో ఈ యజ్ఞము జరిగేది?"

"కాకినాడలో అతని ఆశ్రమములో."

విష్ణు బాగా కోప్పడి వచ్చాడు. తనకు తెలిసిన డి.ఎస్.పి. ద్వారా కాకినాడకు ట్రంక్‌కాల్ చేయించాడు.

"మనము వెడితే నేమండీ?" సుజాత అడిగింది.

"అనమానం పాలుగావడమే. మీ అక్కకు, బావకు బుద్ధి వుందా. అక్కడ విద్యాహీనులు, పల్లెటూరి వారెవరూ లేరు. అంతా చదివిన మూర్ఖులేనట. ఇదివరకే పోలీసులకు రిపోర్టు వెళ్ళిందట. ఆ రోజు యిద్దరూ ఇల్లు చేరేసరికి రాత్రి పది దాటింది."

మూడు రోజుల తరువాత త్రిలోకనాథుల లీలలు వర్ణిస్తూ పత్రికల నిండా వార్తలే. అతను చేసే కామయజ్ఞానికి యెందరో కన్యలు బలి అయ్యారట. అతని ఆశ్రమంలో ఖాళీ సారాబుడ్లు కోకొల్లలు దొరికాయట. అతను కొందరు కన్యలతో పారిపోయాడట. ఆ కన్యలలో నిర్మల కూడా వుందట."

"దాని కడుపున భగవంతుడు పుట్టనున్నాడు" అందుకే శూన్యంలోకి చేతులు జోడించి, చెంపలు వాయించుకుంది సుందరమ్మ. దుఃఖకు యిలాంటివి మరిచిపోవటానికి మంచి మందు దొరికింది.

# 32

సుశీలమ్మ ఆనందం అంతా యింతా కాదు. ఆమె సరాసరి కాంతమ్మ దగ్గరకు వచ్చింది.

"అక్కయ్యా? ఉదయ్‌కు యాభై వేలతో పిల్లను యిస్తారట."

"సంతోషమేగా?"

"అంత ముక్తసరిగా అంటున్నావు! అవునులే, నీ కొడుక్కు కట్నం రాలేదుగా. కుళ్ళు. అందుకే విష్ణు ఆ బడిపంతులు జగన్నాథం కూతుర్ని చేసుకోమన్నాడట."

"అమ్మాయి చదువుకుంది, బుద్ధిమంతురాలని అన్నాడేమో."

"ఇష్టం లేదని చెప్పరాదూ."

"నాకెందుకు యిష్టం వుండదే. మన పిల్లలకు యిచ్చేరోజు దెబ్బ గోల అవుతుందోనని."

"నా పిల్లలతో మీకేం పోలిక?" అన్నది తీవ్రంగా. "ఇన్నాళ్ళ కొడుకు నిరంకుశత్వం భరిస్తూ బానిసల్లా బ్రతికాము. నా కొడుకు ప్రయోజకుడయ్యాడు. మనుష్యుల్లా బ్రతుకుతాం."

"సుశీలా! నీకు 'నీ' 'నా' అని భేదం వుందేమో. నాకెప్పుడూ లేదు. విష్ణూ, ఉదయ్ ఇద్దరూ నా బిడ్డలే అన్నది. జేవురించిన ముఖంతో సుశీలమ్మ మూతి తిప్పింది.

"మాటలకేంలే, నా కొడుకు సంపాదనపరుడయ్యాడని ఈనాడు యిలా మాట్లాడుతున్నావు" అన్నది.

"ఇలాంటి భావనలు తనకూ, తన భర్తకీ వుంటే ...." ఆలోచన లేకపోయింది.

"అక్కయ్యా! నీ కొడుకు స్వార్థపరుడు. నా కొడుకు వివాహ విషయంలో అతని పెత్తనం అనవసరమని చెప్పు."

"ఎంత మాట అంటున్నావే! వాడా స్వార్థపరుడు. సుమతి పురుడు ప్రయివేటు హాస్పటల్లో పోసుకుంటే యెనిమిది వందలు పోశాడు. వాడి పెళ్ళాం మొగాడిలా పనిచేసినా క్లుప్తంగా మూడు రూపాయలతో పురుడు ముగిసింది. వాడే స్వార్థపరుడయితే తన కొడుకు నామకరణోత్సవం అంత క్లుప్తంగా చేస్తాడటే!"

"ఎవడికి తెలియని భాగోతం! అత్తగారింటివారు దరిద్రులని."

"అంతేలే!" మాటలు తుంచి గదిలోకి వెళ్ళింది. కోడలు విన్నదేమో అనుకొంది. అత్తగారి గదిలో పడుకుంటోంది సుజాత. పిల్లలు, సుజాత నిద్రబోయారు. రేణు, రమలు కమలమ్మ దగ్గర పడుకుంటారు. కాంతమ్మ మనమడు తడి చేశాడేమో చూచింది. తండ్రి పేరు కలిసి వచ్చేలా శ్రీరామ్ అని పేరుపెట్టాడు విష్ణు. శ్రీరామ్‌ను తన ప్రక్కనే వేసుకొని పడుకుంది.



రాత్రి పదకొండు గంటలకు వచ్చి, భోజనం చేసి, పైకిపోబోతూ, తల్లి గదిలోకి వెళ్ళాడు విష్ణు. రోజూ అది అలవాటే. కొడుకును చూసి వెదరాడు. అందరూ నిద్రబోయారు. ప్రభ తల వైపు టేబుల్ ల్యాంప్ వెలుగుతోంది. అది ఆర్పి గుండెలమీదున్న పుస్తకం ప్రక్కనపెట్టి, దుప్పటి సరిగ్గా కప్పాడు. భార్య దగ్గర బల్ల మీది మందులు పరీక్షగా చూసి, కొడుకు దగ్గర నిలబడ్డాడు."

"విష్ణూ!"

"నువ్వింకా పడుకోలేదా అమ్మా?"

"పడుకుంటాను గాని, యిలా కూర్చో" అతను తల్లి మంచము చివర కూర్చున్నాడు.

"ఇన్నాళ్ళు నువ్వేది చెప్పినా విన్నానురా. ఈ ఒక్క విషయంలో నా మాట వినాలి."

"ఏ విషయంలో?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉదయ్ పెళ్ళి విషయంలో వాళ్ళు యాభైవేల కట్నంతో అమ్మాయిని చూసుకున్నారు. నీవు అభ్యంతరపెడతావని భయపడుతోంది."

"మన ఆడపిల్లలకు యాభైవేలు యిచ్చి చేయగలమా?"

"పిన్నికి ఆడపిల్లలు లేరు."

"ఓహో! అంతవరకు వచ్చిందా?"

"ఊఁ" అన్నది బాధగా.

"అమ్మా! నిన్ను చాలా బాధపెట్టాను. నన్ను క్షమించు. యింత వరకు అందరిని ఆజ్ఞాపించింది మన ఆర్థిక పరిస్థితి సవరించడం కోసమే. నాన్నగారు పోయేనాటికి మనకున్న అప్పుల జాబితా చెబితే నీ గుండె ఆగిపోతుంది."

"నిజమా!" లేచి కూర్చుంది.

"నిజమమ్మా! అంతా అమ్మేసి అప్పులు తీర్చి ఎవరి మానాన వారిని వుండమని అందాం అనుకున్నాను. నాన్నగారు తన పరువు నిలబెట్టమని కోరుతూ ప్రాణం వదిలారు. ఒకనాడు ఆయన ధర్మగుణాన్ని కొనియాడిన వారే ఆయన్ని నిందిస్తారు, నవ్వుతారు. అది నేను

సహించలేను. ఆయన యెన్ని అప్పులు చేసినా, తండ్రిగా నాపై చూపు ప్రేమ వాత్సల్యాలు మరవరానివి. ఆయన అన్యాయమే చేశాడు కాదనను...”

“అన్యాయం చేసి ఆయన త్రాగలేదు - జూదం ఆడలేదురా.”

“మరి ఆడంబరాలు మాత్రం జూదాలకంటే తక్కువా?” అన్నాడు నిట్టూర్చి. ఆయన వ్యసనలోలుడు కాడు. మంచితనము మితిమీరితే అనర్థం అమ్మా! ఆయన మెతకతనాన్ని ఆసరాగా చేసుకొని అందరూ ఆయన్ని ఆడించారు. చీటీలో వ్రాసి సరుకులు, బట్టలు తెప్పించడం మీకు గొప్ప. వ్యవసాయం పేరున సంవత్సరానికి పదివేలు తగలేయడం బాబాయికి గొప్ప. ఆయన అడిగినంత యిచ్చారే గాని ఖర్చుల విషయం అడిగారా? ఆ బాధ్యత ఆయన విస్మరించారు. ఇక మేము హాస్టలంటే సరే. హోటలంటే సరే ... యిలా సాగింది. మరి డబ్బెలా వస్తుంది. మన రూపాయలు అచ్చువేసే యంత్రముందా?”

“ఏమిట్రా ఆయనను దెప్పుతావా?”

“లేదమ్మా. నేను నిరంకుశత్వంగా వుండటానికి కారణం వివరిస్తున్నాను. నీకు చెప్పలేదు. విని నువ్వు భరించలేవని.” తల్లి కన్నీరు వత్తాడు.

“చెప్పరా, నీకు మాత్రం ఎవరున్నారు చెప్పుకోడానికి?”

“ఆయన ఆశ్రితజనముతో కాలం గడుపుతూ, ప్రారంభోత్సవాలు చేస్తూ, మేనేజర్, గుమస్తాలకు వ్యాపారం వదిలారు. కొన్ని ఆస్తిపాస్తులు తాకట్టులోనే వున్నాయి. అన్నీ చూచేసరికి ఆయన ఆరోగ్యము దెబ్బతిన్నది.”

“నిజమా!” ఆమె అవధులు దాటిన ఆశ్చర్యంతో చూచింది.

“అంతా అక్షరాలా నిజం. అక్కయ్య పెళ్ళికి యిచ్చిన కట్నం పదివేలు, పై ఖర్చులు ముప్పైవేలు. నీ బంగారం బ్యాంకులో లేదమ్మా ఏనాడో అమ్ముడయింది.”

“విష్ణూ! నేను విన్నదంతా అబద్ధం అని చెప్పరా”.



“అబద్ధమే అనుకో అమ్మా! యించుమించు అన్నీ తీరాయి. ఒక్క పొలం విడిపించాలి. మొదటే మీకు పరిస్థితి వివరిద్దాం అనుకున్నాను. భారతదేశపు రాజకీయాలలా మన సంసారం తయారయ్యేది. అందుకే అందరికీ శత్రువునయ్యాను. ఆ ఒంటరితనం దూరం చేసుకోవాలనే పెళ్ళి చేసుకున్నాను. ఇంట్లో జరిగే విషయాలు నాకు చెప్పలేక, మిమ్మల్ని ఎదిరించలేక సుజాత ఎన్నోసార్లు బేలగా ఏడ్చేది.

“వద్దురా, అవన్నీ జ్ఞాపకం చేయకు.”

“నా ఉద్దేశం అదికాదమ్మా! నేను చేసింది అన్యాయం కాదని చెబుతున్నాను. అప్పుడే బాబాయి భాగం పంచమన్నాడు. అంతా వినకపూర్వమే హడలిపోయాడు. ఇంటి విషయంలో పూర్తిగా స్వేచ్ఛ నిచ్చారు. ఆయన సహకారానికి యెప్పుడూ ఋణపడి వుంటాను. పిన్ని మామూలు స్త్రీ ఆమెకు లోకం అర్థం కాదు. రాజీవ్‌ను బలవంతంగా చేర్పించింది. ఈసారి థర్డుక్లాసు వచ్చింది. వాడిప్పుడు ఏం చేస్తాడు? ఇరవై రెండో ఏడు వచ్చింది.”

“అవునురా! వాడి విషయమే మర్చిపోయింది.”

“కొత్త అంతా మోజు. పులిమీద పుట్రలా ఇన్‌కంటాక్స్ గొడవలు వచ్చాయి. ఇప్పుడు అన్నీ తీరిపోయాయి. వాళ్ళిష్టం, యెలాగయినా చేయమను.”

“అమ్మయ్య. నాకు ప్రాణంలో ప్రాణం లేదురా, నువ్వా జగన్నాథం కూతుర్నెక్కడ కుదురుస్తావోనని.”

“సలహా యిచ్చాను. పెళ్ళి విషయంలో బలవంతం యెందుకు? అరువిచ్చేవారున్నంతవరకు అప్పులు చేస్తూనే వుంటాము. అందుకే అన్నీ కట్టడి చేయాల్సి వచ్చింది. ఇప్పుడు భాగాలు పంచుకున్నా ఫరవాలేదు. అప్పు ఎవరికోసము చేసినా నాన్నగారు చేశారు. అంతా తీరిపోయింది.”

“యెంత గుట్టుగా అన్నీ నెట్టుకు వచ్చావురా? తెలియక యెన్ని మాటలన్నాను!” ఆమెకేం గుర్తుకు వచ్చాయో, కన్నీరు కార్చింది.

“జరిగిపోయింది గుర్తుకుతెచ్చుకోవడం దేనికమ్మా! ఊరుకో.”

"ఊర్కోక ఏం చేస్తాను! మాట సాయము కూడా చెయ్యలే పోయాము. వస్తూనే భర్తని కొన్నట్టు ప్రవర్తించే ఈ కాలంలో కోడలు."

"కోడలికి అవన్నీ ఆలోచించే సమయము ఎక్కడుంది?"

"అవునురా. పంపకాలంటూ నువ్వు నోరుజారకు. వారిష్టమొచ్చిన సంబంధం చేసుకోనీ."

"నువ్వా విషయంలో నిశ్చింతగా వుండు" అతడు పైకి వెళ్ళిపోయాడు.

తల్లి చాలా రాత్రివరకు నిద్రపోలేకపోయింది.

* * *

రెండు రోజుల తరువాత రాత్రి వచ్చి తనగది దులుపు కుంటున్నాడు సుజాత పైకి వచ్చింది.

"నేను దులుపుతాను. మీరు అలా కూర్చోండి" ఆమె పనిచేయటం మొదలుపెట్టింది.

"ఏమండీ!"

"చెప్పండి!" తమాషాగా నవ్వాడు. కాస్త వళ్ళు వచ్చిందేమో, యింకా రంగుతేలి గమ్మత్తుగా కన్పిస్తుందామె. అతను తదేకంగా చూడసాగాడు.

"ఏమిటంత పరీక్షగా చూస్తున్నారు? లావయ్యాను కదూ?"

"ఏం లేదు. ఏదో పిలిచావు!"

"ఉదయ్ పెళ్ళికాక పూర్వమే విడిపోతే బావుండును."

"ఎందుకు సుజా! ఒకేసారి అలా అనేశావు?" సుజాత యింతవరకు కుటుంబ విషయాలలో కలుగజేసుకోలేదు. ఒకేసారి విడిపోవటం అంటుందేం?

"కారణాలు అడగవద్దు."

"నా దగ్గర కూడా దాపరికమేనా?"

"నా దగ్గర మీరు అన్నీ దాచిపెట్టలేదా?"

"ఆడదాని నోట్లో నువ్వుగింజ నానదట."

"మొగాడి నోట్లో ఆముదం గింజ నానుతుందేమిటి? మీరంతా ఒక్కటే. యెటొచ్చి యెటుపోయినా నిష్ఠూరం నాపైనే వేస్తారు."



"ఆలా జరగదని హామీ యిస్తున్నాను - సరా!"

"సుశీలమ్మ అత్త చాలా మారిపోయారు. కోడలు రాకముందే అందరినీ ఈసడించివేస్తుంది. మూడు రోజుల నుండి కన్నాను పైకి వెళ్ళమని చెబుతుంటే, వాడిని రానివ్వదు. ఏదో ఒక మాట అంటుంది."

"మరేం ఫర్వాల్లేదు. వచ్చే కోడలు వడ్డీతో తీరుస్తుంది. కొందరికి మాట పదును ఎక్కువ, ఆలోచన తక్కువ."

## 33

సుందరమ్మ కీళ్ళవాతంతో ఆస్పత్రిలో చేరింది. మందులు కొనాలి. ఒక్క రూపాయి లేదు. పద్దెనిమిదో తారీఖు. ఇంకా జీతాలు రావటానికి పన్నెండు రోజులుంది. మెల్లగా మార్వాడీ శేఠ్ కొట్టుకు వెళ్ళాడు. మల్లు పంచె కట్టుకుని, తలకు పసుపురంగు పాగా చుట్టుకొని కూర్చున్నాడు మార్వాడీ.

"ఏం భాయి, యిలా వచ్చావు?"

"ఒక వంద రూపాయలు సర్దండి శేఠ్‌గారూ! ఫస్టు తారీఖున యిచ్చేస్తాను. మా అమ్మకు మందులు కొనాలి."

"దానికేం భాయ్...."

రఘు హృదయం గంతులు వేసింది. చాలా రోజుల నుండి బార్‌కు కూడా వెళ్ళలేదు.

"నిన్న వస్తే యిచ్చేవాడిని. వారం రోజుల వరకు డబ్బులు రావు" అన్నాడు.

"అలా అనకు శేఠ్‌గారు!"

"మాఫ్ కర్నా భాయి" అని, ఇంకో ఆసామితో ముఖం చేటంత చేసుకొని మాట్లాడుతున్నాడు. అతను తెచ్చిన గొలుసు తూకం వేసి, ఆరువందలు యిచ్చాడు. రఘుకు తల తీసినట్టయింది. వేలకు వేలు వడ్డీ ఈ మార్వాడికే కట్టాడు. అతనికేమాత్రం అభిమానము లేదు!"

"మీకు లేదని, ఈయనకు యిచ్చానని చూస్తున్నావా? ఆయన అడిగి వారం రోజులు అయింది." రఘుకు అర్థం అయిపోయింది - శేఠ్ ఒక్క రూపాయి యివ్వడని. వెనుతిరిగాడు నీరసంగా.

"ముందు యెప్పు అడిగితే అప్పు యిచ్చాను. అందుకే వచ్చాడు' ఇల్లు కూడా అమ్మిండు. ఏమి చూచి ఇస్తము. వీడి చేతిలో కత్తెర్లున్నా భాయి, కత్తెర్లు."

రఘుకు వినిపించినా ఏం చేయగలడు? నిరాశగా నవ్వుకున్నాడు స్నేహితులు అతన్ని మాట్లాడనివ్వకనే వారి వారి బాధలు ఏకరువుపెట్టారు

* * *

విధిలేక సుజాత దగ్గరకెళ్ళాడు. ఆ ఇంట్లో యెంతో ప్రశాంతత కన్పించింది. పెద్ద కుటుంబం వున్నట్టు లేదు. ప్రభ అతన్ని చూచి నవ్వింది నమస్కరించింది. తరువాత పైకివెళ్ళి సుజాతను పిలుచుకు వచ్చింది.

"ముఖం అలా పీక్కుపోయిందేం? అమ్మకెలా వుంది?"

"ఇప్పుడు ఫరవాలేదు."

ప్రభ కాఫీ, ఫలహారాలు తెచ్చింది.

"నువ్వు ఫలహారం చేస్తూ ఉండు. నేను తయారయి వస్తాను" సుజాత వెళ్ళిపోయింది. కాంతమ్మ శ్రీరామ్ నెత్తుకునివచ్చి యోగక్షేమాలు అడిగి వెళ్ళిపోయింది. సుజాత తయారయి వచ్చినా, డబ్బు అడగలే పోయాడు. ఆస్పత్రికి వెళ్ళాక అసలు సంగతి బయటపడింది.

"మందులేవిరా?"

"తెస్తానమ్మా" అన్నాడు తలవంచుకొని. సుజాతకతని నిస్సహాయత అర్థం అయ్యింది. బయటకు పిలిచి చీవాట్లు వేసింది. ఇంటికి తీసుకువెళ్ళి డబ్బిచ్చింది. ఆమె దగ్గరయినా ఎక్కడిది? శ్రీరామ్ నామకరణోత్సవము నాడు సరళ వందరూపాయలు, సుమతి వందరూపాయలు వాడి చేతిలో పెట్టారు, అవి అలాగే వున్నాయి. అత్తగారికి తరువాత చెప్పొచ్చని యిచ్చేసింది. తల్లికి మందులు, పళ్ళు కొన్నాడు. మిగిలిన డబ్బుతో చిత్తుగా తాగి ఇల్లు చేరాడు.

మర్నాడు తల్లిని చూచి వదిన దగ్గరకు వెళ్ళింది. సుజాతను చూస్తూనే బావురుమంది సరళ.

"ఏమిటి వదినా? ఏం జరిగింది?"



"ఏం చెప్పను సుజా! మీ అన్నయ్య పూర్తిగా పతనమైపోయారు. త్రాగుడు అలవాటు చేసుకున్నారు."

"వదినా! నేను నమ్మను. అది అసంభవము".

"... ఈ రాత్రికి వుండి చూడు. నిన్న నీవు డబ్బులిచ్చావు. అది అయిపోయేవరకు త్రాగుతారు."

"నువ్వూరుకున్నావా వదినా?"

"ఏం చేయను? ఏడుస్తూ త్రాగొద్దని బ్రతిమాలితే మరెప్పుడూ త్రాగనంటారు. గట్టిగా అరిస్తే కొడతారు. తన బాధలు మరిచిపోవటానికి త్రాగుతారట."

"అంతలేసి బాధలేమున్నాయి వదినా?"

"అప్పులు పుట్టటం లేదు. అన్నింటికన్నా మానసిక బలహీనత. సంసార బాధ్యత నాకొదిలి ఆఫీసు పనులు చూచుకోమన్నాను. అది నామోషీయట. నిర్మల ఎక్కడో ఆశ్రమంలో వుందట. అక్కడ తనలాంటి ఉంపుడుకత్తెలు ఆయనకు చాలామంది వున్నారట. వందరూపాయలు ఖర్చీల క్రింద పంపితే వస్తుందట. తనకు కడుపట. అది చూచి మీ అమ్మ మంచం ఎక్కారు."

"బాధ యెందుకు? ఇష్ట పూర్వకంగా అతనికి యిచ్చారుగా. తల్లీ తండ్రికి రాసుకొమ్మనండి."

"అలాగే రాశాను. అతనేమో పోలీసుల బారి నుండి తప్పించుకోవాలని యెక్కడెక్కడో తిరుగుతున్నాడట. తనను ఎవరూ బాగా చూడరట."

"ఏడవలేకపోయింది."

"అన్నీ ఈయన ఆలోచిస్తారు. దుర్మార్గుడయినా సరే, మానసికంగా దృఢంగా వుండాలి పురుషుడు" అన్నది ఏడుస్తూ. ఇద్దరూ రఘు రాకకోసం యెదురుచూస్తూ కూర్చున్నారు.

"రా సుజా! నువ్వు భోజనం చేద్దువు. ఆయన యిప్పుడే రారు."

ఇద్దరూ అన్యమనస్కంగా కూర్చున్నారు. సుజాత కంచాల వంక చూచింది.

"వెండి కంచాలు అమ్మారా సరళా!"

"మొన్న శ్యామల కొడుక్కు శ్రీకారం చేయించారు. అప్పుడు అత్తయ్య, ఆయన వెళ్ళారు."

"అదేం తిండి సుజా!"

"చాలు వదినా"

రఘు వచ్చాడు. ఏదో పాట పాడుకుంటున్నాడు. అతన్ని ఆ స్థితిలో చూస్తానని ఊహించని సుజాతకు కళ్ళు చెమర్చాయి.

"చిట్టీ, ఏయ్ చిట్టీ..."

"పది గంటలు దాటాయి. ఇప్పుడు చిట్టి మేల్కొనుంటుందా?"

"చిట్టిని పిలిస్తే చిట్టి అమ్మ రావాలి. బంగారు బొమ్మ?"

"అన్నయ్యా!" తీవ్రంగా అనబోయిన సుజాత గొంతు బొంగురు బోయింది.

"సుజా, నువ్వా! ఈ నరకంలోకి యెందుకు వచ్చావు!"

"అన్నయ్యా!" బావురుమంది సుజాత.

"యెందుకమ్మా ఏడుపు! బావ ఏమన్నా అన్నారా? ఊరుకో" లేచి వచ్చి చెల్లెలి తల హృదయానికి హత్తుకున్నాడు.

"యెందుకురా, ఈ అలవాటు చేసుకున్నావ్?"

"సారీ సుజా! మళ్ళీ త్రాగను. ఒట్టు, నన్ను నమ్మవా?"

"సుజా! తాగి వచ్చిన ప్రతి రోజూ యిదే తంతు. యిప్పుడు ప్రమాణాలు చేస్తారు. రేపు గాలిలో యెగిరిపోతాయి. రండి అన్నం-"

"ఏమిటే, ఏమన్నావ్!" సరళ గొంతు పట్టుకున్నాడు.

"అన్నయ్యా!" సుజాత అతని చేతులు విడిపించింది. అతను తీవ్రంగా చూచి మంచం మీద కూలబడ్డాడు. సరళ బ్రతిమాలి, వొట్టికాయలు తింటూ అన్నం తినిపించింది. అన్నం తింటూనే అలసిపోయినట్టు నిద్రబోయాడు.

విష్ణు రాగానే సుజాత వెళ్ళిపోయింది. కాని ఆమె యెందుకో పూర్తిగా మారిపోయింది. పరధ్యాస, చికాకు ఎక్కువ అయ్యాయి. శ్రీరామ్ బాధ్యత పూర్తిగా కాంతమ్మ వహించింది కాబట్టి సరిపోయింది.



# 34

ఉదయ్ వివాహము వైభవంగా జరిగింది. అతని భార్య వాసంతి అందంగా వుంది. పి.యు.సి. చదివింది. యాభైవేలు కట్నంతో వచ్చానన్న గర్వం ప్రతినిమిషం ప్రదర్శించుకోవాలని చూస్తుంది. దానికి తోడు ప్రతి విషయము సుశీలమ్మ ఆ కుటుంబాన్ని గూర్చి చులకనగా మాట్లాడుతుంది.

వాసంతికి, ఉదయ్‌కు మేడపై రెండో గది యిచ్చారు. అది కొంచెం చిన్నది.

"చేతులూపుకుంటూ వచ్చినవారికన్నీ అమరుతాయి. నా కోడలు యాభై వేలు కట్నంతో వచ్చినా, ఇరుకు గదే - ఖర్మ." ఆమె ఒకటే బాధపడసాగింది. కోడలికి ఫలహారము దగ్గరనుండి పూల వరకు పైకి పంపేది. కన్నా యెవరి పని చేయొద్దనీ ఆజ్ఞాపించింది. ఉమ్మడి కంపెనీలో పనిచేస్తే స్వాతంత్ర్యం వుండదు. పైగా డాబు, దర్పం రావంటూ, వాసంతి పోరి భర్త చేత వేరేచోట ఉద్యోగానికి దరఖాస్తు పెట్టించింది. మామగారి రికమండేషన్‌తో మంచి ఉద్యోగం సంపాదించాడు. అప్పటి నుండి వారి ధీమా యింకా ఎక్కువయింది.

"యాభైవేలు పెట్టి ఎక్కడయినా ఇల్లు కొనాలి. అద్దెలు వస్తాయి." ఒకటికి పదిసార్లు అనుకునేది సుశీలమ్మ.

"ఎక్కడయినా పొలం కొందామే" చలపతి ఆలోచన.

"వెధవ స్కూటర్! ఓ కారు కొనాలి! హాయిగా వుంటుంది." ఉదయ్ ప్రణాళికలు. కష్టపడకుండా వచ్చే డబ్బు యెన్నో అనర్థాలకు మూలము. మనిషికి గర్వం, వక్రమైన ఆలోచనలే వస్తాయి! కష్టపడి సంపాదిస్తే దాని విలువ తెలుస్తుంది. సక్రమమైన ఆలోచనలు వస్తాయి! రోజుకులాగే ఆ రోజు ఆఫీసుకు తయారయింది సుజాత!

"నిన్నటి స్టేట్‌మెంటు నిండా తప్పులే వున్నాయి - నీ మనసు బావుండనట్టుంది! విశ్రాంతి తీసుకో" విష్ణు వారించాడు.

"ఫరవాలేదు!"

"ఒకసారి చెబితే వినాలి" విసుక్కున్నాడు. అతను వెళ్ళిపోయాక వనేం తోచలేదు. రోజూ క్రమం తప్పకుండా పనిచేసేసరికి ఆ వేళకు పని

లేకపోతే పిచ్చెక్కినట్టు వుంటుంది ఎవరో సోమరివాళ్ళకు తప్పితే. తోచటం అన్న సమస్యే వుండదు. సుజాత బూజుకర్రతో బూజు దులు తోంది.

పది గంటలకు ఉదయ్ మేడ దిగుతున్నాడు. సుజాతను చూచి ఆశ్చర్యపోయాడు.

"వదినగారు, ఈ సమయంలో యింట్లోనా? యెక్కడ్ పడుతుంది."

"జంట పిడుగులు పడతాయి మరిదిగారూ! తమరు తొందరగా లేచారు" అంది. అతనికి షిఫ్ట డ్యూటీ. అందుకే ఒంటి గంటకు లేస్తాడు. అతను లేవకపోతే వాసంతి లేవదు. చేసి పడుకుంటుంది.

"మేం పన్నెండు గంటలదాకా పడుకుంటాము. ఆక్షేపించటా నువ్వెవరు?" పై మెట్టుపై నిల్చున్న వాసంతి తీవ్రంగా అంది.

"చూడు వాసంతీ! ఆక్షేపించటానికి సమానత్వం వుండాలమ్మా! చేతులూపుకుంటూ వచ్చాను. యాభైవేలతో వచ్చిన నీతో నాకేం మరిది ఏదో పరిహాసంగా అంటే జవాబు చెప్పాను." సుజాత జవాబు అందరూ తెల్లబోయారు. ఆమె నోరు విప్పి ఏనాడూ జవాబు చెప్పలేదు. యిన్నాళ్ళూ అంతా తనకన్నా పెద్దవారు అని మాట్లాడేది కాదు. ఇప్పుడు ఊరుకుంటే రెచ్చిపోతుందని జవాబు చెప్పింది.

"యూ....బ్లడీ...."

"లాంగ్వేజ్ ప్లీజ్!" సుజాత నవ్వుతూ అన్నా, మాటలు పదునుగా వున్నాయి. "ఉదయ్! చెల్లాయికి కాస్త డీసెంట్ లాంగ్వేజ్ నేర్పించు" అన్నది.

"ఏమండీ!" వాసంతికి ఉక్రోషంగా వుంది.

"సుజాతా! ఏమిటేవ్! మహాజోరుగా వుంది. దాన్ని అంటే నేనూరుకోను" సుశీలమ్మ వచ్చింది.

"యెవర్నీ అనడానికి తీరికా, ఓపికా రెండూ లేవత్తయ్యా. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది" అత్తా, కోడలూ సుజాతను సాయంత్రము వరకు సాధిస్తూ వున్నారు.



ఉదయ్ జీతం స్వంతానికి ఖర్చుపెట్టుకుంటాడు. యెవరికీ ఒక్క యివ్వడు. అయినా అతని అదృష్టము. అతన్ని, అతని భార్యను బిడ్డలు అందరూ గౌరవిస్తారు. అదంతా యాభైవేల మహత్యం అని పోయింది.

దీపావళి పండుగకు సుమతి, సుధ వచ్చారు. అందరూ వాసంతితో ఆమె పుట్టింటి వైభవము వింటున్నారు.

"కనీసం పూటకు నాలుగు రకాల కూరలు లేనిదే భోజనము చెయ్యము."

"ఈ ఇంట్లో కూడా యిదివరకు అలాగే వుండేది వాసంతీ! మా పోయాడు. అంతా పోయింది."

"అలాగా వదినగారూ! ఒకసారి ఓ గమ్మత్తు జరిగింది. నేన ఒక కొట్లో చూచాను. ఇంటికి వచ్చి వెళ్ళేసరికి అది అమ్ముడయిపోయింది. మొత్తం విజయవాడ షాపులన్నీ గాలించారు. సాయంత్రానికి దొరికిందను కేంది."

"మాకూ అలాగే జరిగింది వాసంతీ! వీడి చేతిలోకి ఇల్లు వచ్చాక యిలా తయారయింది."

"మీ అమ్మగారెలా ఊరుకుంటారు? మా అమ్మ అంటే మా అన్నయ్యకు హడలు. మా అన్నలు నిజంగా యెంత మంచివారో ....." అటుగా వెడుతున్న సుజాత విని నవ్వుకుంది. వాసంతి అన్నలిద్దరూ అడంగి ముత్తయ్యలే. వాళ్ళు మొగవారితో తిరగరు. తల్లిచుట్టే తిరుగుతారు.

"అమ్మా కంచి చీర తీయనా, ధర్మవరం చీర తీయనా" తల్లిని అడుగుతూ, తల్లి, చెల్లెలు విడిచిన బట్టలు జాగ్రత్తగా డ్రైక్లీనింగ్‌కి యిస్తూ పడత పెడుతూ వుంటారు. యెప్పుడూ జేబులోంచి దువ్వెనతో క్రాఫ్ దువ్వుకుంటూ తిరుగుతారు. వారికి విష్ణు పోలికా!

"వాసంతీ! ఈ పంజాబీ అమ్మాయి మెడలో నెక్లెస్ బావుందే. చేయించమను మీ అత్తారిని......" అలా సాగుతుంది వాళ్ళ మధ్య సంభాషణ. తల్లి ఏరిపెట్టిన బట్ట వేసుకుంటారే తప్ప తమది అంటూ

ఏం వుండదు. "మీ అమ్మ అదృష్టవంతురాలు. మా అమ్మ చూసి వాడి కొడుక్కు ఆయా...."

సుజాత ఉలిక్కిపడింది. ఈ రోజు ఓ కొత్త సత్యం తెలిసివచ్చింది. తను కొడుకును పూర్తిగా అత్తగారికి వదలటం కూతుర్లకిష్టంలేదని.

"రండి, నా చీరలు చూద్దురుగాని" వాసంతి తన చీరలన్నీ చూపింది. ఆ తరువాత ఏం జరిగిందో గాని, చెరొక చీర పెట్టుకుని వచ్చారు సుమతి, సుధ.

"అమ్మా! వాసంతి చాలా పొడవు, యివి పొట్టి అయిపోయాయట. మాకు ఇచ్చింది."

"బావుంది" అన్నది కాంతమ్మ. ఏమంటే ఏం గొడవ వస్తుందోనని.

మర్నాడు భోజనాల దగ్గర వాసంతి డైరెక్టుగా విష్ణుని డబ్బు అడిగింది.

"డబ్బు యెందుకమ్మా?"

"వదిన, సుధ నా దగ్గర చీరలు కొన్నారు."

"నీకు షాపుందా?"

వాసంతి ముఖం కందగడ్డలా అయింది. అతను లేనప్పుడు నానా హంగామా చేసే అత్త, భర్త అతని ముందు మాట్లాడరు. విష్ణును వంటరిగా ఎదిరించటం కష్టంగా తోచింది. అది కాక అతడు నవ్వుతూ ఇంట్లో వారితో మాట్లాడటం ఆమె చూడలేదు.

"కాదు. నా దగ్గరున్నవి నచ్చాయి."

"డబ్బు వారినే అడుగు. మేం యిచ్చేవి కట్టాలు, కట్టిన చీరలు కాదు. మాకున్నంతలో కొత్తవి యిస్తాం."

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది. ఏమో అనబోయింది. విష్ణు ముఖంలోని గంభీరత, కళ్ళలోని ఎర్రజీరలు చూచి ఆగిపోయింది. తనకు పొట్టి అయ్యాయని యిచ్చింది గాని డబ్బు తీసుకుంటుందని అనుకోని ఆడబడుచులు తెల్లబోయారు.

"అక్కయ్యా! కట్టి విడిచిన చీరలు యెవరు కడతారో తెలుసా? పనివారు. అభిమానం వదలి మీరు..." కోపంతో మాట రాలేదు.



"ఒకరివి ఒకరు కట్టుకుంటే తప్పేం?"

"తప్పులేదు - స్నేహితురాండ్రు, ఆత్మీయులయినప్పుడు" అతను లేచి వెళ్ళిపోయాడు. అందరూ ముఖాలు మాడ్చుకున్నారు. వాసంతి భర్తను కొర, కొర చూసి పైకి వెళ్ళిపోయింది.

## 35

రఘు ఉద్యోగం ఊడిపోయింది. అతనికి రెండు, మూడు వార్నింగ్ నోటీసులిచ్చారు. అతని ప్రవర్తనలో, పనిలో మార్పు లేదు. సరళకు ఏం తోచటం లేదు. సుందరమ్మ ఆస్పత్రి నుండి వచ్చినా నీరసంగా వుంది. బలమైన ఆహారం కావాలంటాడు డాక్టరు. అయోమయంగా వుంది. కంపెనీ మేనేజర్ ఇంటికి ఓసారి ఏదో పార్టీకి వెళ్ళింది. అది గుర్తుంది. ఆ గుర్తుతో సరళ అక్కడకు వెళ్ళింది. తనింటి పరిస్థితి చెప్పింది.

"నేను ఏం చెయ్యనమ్మా! నచ్చ చెప్పాను. సంవత్సరం నుండి యిదే తంతు. ఈ మధ్య మధ్యాహ్నమే తాగి రావటం, అందరినీ నానా బూతులు తిట్టటం, అన్నీ అవకతవక పనులే." పచార్లు చేస్తూ అన్నాడు.

"ఏమండీ! పిల్లల ముఖం చూచి యింకొక్క అవకాశము యివ్వండి. ఆయన కిన్నేళ్ళు సర్వీసుంది కదండీ."

అతను యింకొక్క అవకాశము యివ్వడానికి అంగీకరించాడు.

"మీ మేలు మరిచిపోలేను."

"ఇప్పుడా మాట అనకు. మీ ఆయన మళ్ళీ పనిలో చేరితే, అందువు గాని" అన్నాడు. ఆయన మాట నిజమే అయింది, సరళ యెంత చెప్పినా అతను ఉద్యోగం చెయ్యటానికి అంగీకరించ లేదు. పైగా మేనేజర్ ఇంటికి వెళ్ళినందుకు నానా మాటలన్నాడు.

"నన్నేం అన్నా ఫరవాలేదండి. నా పిల్లలను అన్యాయం చేయకండి" బ్రతిమిలాడింది.

"నాకు గౌరవము లేనిచోట, ఒక్క నిముషం కూడా పని చెయ్యలేను, చెయ్యను" అన్నాడు.

"మొగాడు, వాడి మంచి చెడ్డలు వాడికి తెలియవా? వాడి బ్రతకనివ్వవా ఏం?"

అత్తగారి మాటలు విని తలబ్రద్దలు కొట్టుకోవాలనిపించింది. సుజాతకు కబురు చేసింది. ఆమె వచ్చి ఎన్నో విధాలుగా చెప్పింది. రఘు అంగీకరించలేదు.

"అన్నయ్యా! కష్టాలలో నిలదొక్కుకుంటేనే మనిషి. నా మాట విను. నేను వెళ్ళినప్పుడు మా ఇంట్లో యింతకు రెట్టింపు అధ్వాన్నంగా వుంది."

'అవునే. వెళ్ళావు. అన్నీ చక్కబడ్డాయి. ఒక్కొక్క ఆడపిల్ల పాద మహిమే తల్లీ! వచ్చిందిగా యినుపగజ్జల తల్లి."

"అమ్మా!"

"ఎందుకు సుజా! అమ్మ అన్నది నిజమేనేమో! నా పెళ్ళి అయినాక ఒక్కరోజు శాంతంగా వున్నామా?" రఘు అన్నాడు. సరళ ముఖం చేతులతో కప్పుకుని బయటికి వెళ్ళిపోయింది.

"నీ అసమర్థత ఆడదాని మీదికి నెట్టడానికి సిగ్గులేదట్రా?" ఆడపులిలా లేచింది సుజాత.

"సుజా!"

"ఇంకా నన్నా పేరుతో పిలవకు. అమ్మా! నీ సారెలు, చీరలు నాకు అక్కరలేదు. నీ కూతుర్లలాగే కోడలు ఒక మనిషి అని ఎందుకు అనుకోవు? మిమ్మల్ని భగవంతుడు కూడా బాగుచెయ్యలేడేమో?" సుజాత చరచరా బయటకు వచ్చింది. "సుజా" సరళ పిలిచింది. "వద్దమ్మా! నా కోసం మీ అన్నయ్యపై విముఖత పెంచుకోకు. మా సంసార చక్రము బురదలో కూరుకుపోయింది. బాగు చేయటం యెవరి తరమూ కాదు."

"వదినా!"

"ఒక్క వాగ్దానం చేయి సుజా. నేను ఎప్పుడు పిలిచినా రావాలి. ఒక విధంగా వాళ్ళన్నది నిజమేనేమో! నా పాద మహిమేనేమో?"

"వదినా, అలా అనకు, చేజేతులా చేసుకుని ఖర్మ అంటే నమ్మను" సుజాతకు కన్నీరు ఆగటం లేదు.

"పోనీ, వారిని పంపించనా?"



"వద్దు సుజా! మాట వినకపోతే మనసులు కష్టపడతాయి. ఎవరూ ఆయనను మార్చలేరు" అన్నది సరళ.

# 36

సుజాతకారోజే పథ్యం పెట్టారు. ఆమెకీ జ్వరంలో కొన్ని నిజాలు తెలిసివచ్చాయి. పని చేసినందుకు అభిమానం తప్పితే భర్తకు తనంటే ప్రత్యేకం లేదు అనుకుంది. తోటి ఉద్యోగులపై చూపే గౌరవమే తనపై చూపుతున్నాడనుకుంది. కాని ఈ వారం రోజులలో అతను వెళ్ళిందే అరుదు. గడ్డం గీసుకోలేదు. అతనో పేషంటులా తయారయ్యాడు. ఆ రోజు పుట్టింటిలోనే తలపోటు ప్రారంభం అయింది. ఇల్లు ఎలా చేరిందో తెలియదు.

"అదేమిటమ్మా, అలా వున్నావు?" కాంతమ్మ అడిగింది.

"తలనొప్పి అత్తయ్యా" పైకి వెళ్ళి బెడ్‌కవర్ తీసి పడుకుందే గుర్తుంది. మళ్ళీ ఈ రోజే తెలివి వచ్చింది.

* * *

"సుజా!"

"ఏమండీ! మీకేమయింది?" అన్నది అతని గడ్డం రాస్తూ.

"భలే దానివే" అతను నవ్వాడు. ఆ నవ్వులో ఏదో బరువు దింపుకున్న భావం కన్పించింది. "నువ్వే వారంరోజులు పడకబెట్టావు."

"ఆఁ!" అన్నది. తల దగ్గర బల్లపై మందులూ, పళ్ళూ వున్నాయి. కొంచెం దూరంలో క్యాంప్ కాట్ వుంది. లేవాలని ప్రయత్నం చేసి విఫలురాలయింది. నీరసంగా వుంది. కళ్ళు మూసుకుంది.

"సుజా! పాలు త్రాగు" అతను త్రాగించాడు. ఒకవైపుకు దొర్లించి పక్క దులిపాడు. ధర్మామీటరుతో జ్వరం చూస్తూండగా కాంతమ్మ వచ్చింది.

"ఎలా వుందిరా?"

"ఈ పూట పూర్తిగా తగ్గిందమ్మా. నార్మల్‌కు వచ్చింది" అన్నాడు ధర్మామీటర్ దులుపుతూ.

"పెళ్ళి అయిన దగ్గర నుండి జలుబు ఎరుగని పిల్ల. హడలిపోయావ్" తలవైపుగా వచ్చి జుట్టు సర్దింది కాంతమ్మ.

"నేనుంటాను. నువ్వెళ్ళి స్నానం చేసిరా. వారం రోజుల నుండి వేళకు తిండి లేదు" కొడుకుని లేవదీసింది.

"అత్తయ్యా......శ్రీరామ్......"

విష్ణు ఫక్కుననవ్వాడు. ఎంతో తృప్తిగా, ఆనందంగా వుందా నవ్వు.

"చూచావా అమ్మా! ఎవరి కొడుకును గూర్చిన తాపత్రయము వారిది."

"ఆడపిల్లవై పుడితే తెలిసేదిరా" అన్నది.

మరో రెండు రోజులలో పూర్తిగా కోలుకుంది సుజాత.

"మీ అన్నయ్య మీది బెంగతో నన్ను అన్యాయం చేయాలను కున్నావు కదూ?" విష్ణు అడిగాడు కొడుకును ఆడిస్తూ.

"అలాంటిదేం లేదు."

"ఏది, నా ముఖం చూచి అను ఆ మాట. జ్వర తీవ్రతలో అన్నీ బయటపెట్టేవు మేడమ్."

అతని భుజంపై తలవాల్చి కన్నీరు కార్చింది. "అన్నయ్య సంగతి మీకు పూర్తిగా తెలియదండీ!"

"అంతా తెలుసు. సరళ వచ్చారిక్కడికి. ఈ సాయంత్రం రావచ్చు" అన్నాడు కొడుకును పడుకోబెట్టి.

"త్రాగటానికి డబ్బు కావాలి. నా దగ్గరకొచ్చి ఎన్ని అబద్ధాలు ఆడేవాడు, అతనిలా అవుతాడని ఊహించనైనా లేదు."

"అదుగో! మళ్ళీ కన్నీరా? మనకు చేతనయితే ఏదయినా సహాయం చేయాలి. కాని అతనితో సమంగా మనం పిచ్చివాళ్ళం అవుతామా?" అతను ఆమె తల నిమురుతూ ఓదార్చాడు. అతని చేతులలో అలాగే వుండిపోయింది.

* * *

మర్నాడు సుశీలమ్మ అనే సూటిపోటీ మాటల్లో భర్త ఈ వారం రోజులు తనపై ఎంత ఆదుర్దా పడ్డారో తెలుసుకుని ఆమె కళ్ళు



గాలివంతం అయ్యాయి - వాసంతికి జ్వరాలంటే భయమట. ఏ హాస్పటల్లో చేర్పించక ఇదేం ఖర్మ అంటూ గొణుక్కోవటం, ఉదయ్ విసుక్కోవటం అన్నీ తెలిశాయి. తనకేం - ప్రాణం యిచ్చే భర్త, అర్థం చేసుకుని ఆదరించే అత్త వున్నారు.

ఆ సాయంత్రం టీ త్రాగుతుండగా భార్య కళ్ళతో హెచ్చరించగా ఉదయ్ తను పట్నంలో కాపురం పెడతానని చెప్పాడు.

"అన్నయ్యా! రోజూ వెళ్ళిరావటం కష్టంగా వుంది. ఇక్కడ గది కూడా యిరుకుగా వుంది. నేను సికింద్రాబాద్‌లో వుంటాను."

"మంచి అభిప్రాయమే. అలాగే కానివ్వు" అందరూ తెల్లబోయారు. ఎలనెదురుచెబితే ఎలా మాటల బాణాలు విసరాలని అత్తా, కోడళ్ళు ఎదురు చూచారు. అలాంటి అవకాశమే రాలేదు. విష్ణు ఈ వారం రోజులు ఇంటిపట్టున వున్నందుకు చాలా విషయాలు తెలిశాయి. సుశీలమ్మ గర్వం, వాసంతి అహంకారము చూచి యిలాంటిది ఏదో జరుగుతుందని వూహించాడు.

"పట్నంలో మేడ ఖాళీ చేయించనా?"

"అంతా కాదు, సగం మాత్రమే. నాన్నగారు రాశారు - సికింద్రాబాద్‌లో ఇల్లు ఇద్దరికి, వూర్లోది ఒక్కరికని. అక్కడ సగం ఇష్టంలేక పోతే ఈ ఇల్లే పూర్తిగా తీసుకోండి."

"నేను పంచమని అడగలేదు."

"నువ్వు అడక్కపోయినా, చెప్పాల్సిన బాధ్యత నాపై వుంది. పొలాలు కూడా మూడు భాగాలు చేసి వున్నాయి. యేది యిష్టమయితే, అది తీసుకోండి. వ్యాపారం చూచుకోవాలనుకుంటే, దానికి తగిన అప్పులు వున్నాయి. రేపు సాయంత్రం ఆఫీసుకురా. చూచుకుందాము..."

"అదికాదన్నయ్యా!" కంగారుపడ్డాడు. "పొలాలు అవీ పంచటం దేనికన్నయ్యా", అమ్మా నాన్న యిక్కడే వుంటారు. రాజీవ్‌కు నీవంటే భయము!"

"చూడు ఉదయ్! అమ్మా, నాన్న నాకు పరాయివారు కారు. నా హయాంలో వారు కష్టపడ్డారు. కొన్నాళ్ళు సుఖపడనీయి" విష్ణు లేచాడు.

ఉదయ్ పని యిరకాటంలో పడింది. ఆముదం తాగినట్టు ముఖం పెట్టింది వాసంతి. భర్త వంక కొర, కొర చూస్తోంది.

సుశీలమ్మ సామాన్లు ఏరి, యెంచి పెట్టుకుంది. కాంతమ్మ చూస్తూ వుండిపోయింది.

"చూడక్కయ్యా! తరువాత మేం అది పట్టుకుపోయాము, యిది పట్టుకుపోయాము అని అందరిలో అనొద్దు. నాకేం ఆడపిల్లలు వున్నారు! యెంత తీసుకున్నా తక్కువే."

"సుశీలా! ఎందుకే ఆ మాటలు. మమతా బంధాలే విడిపోగా వస్తువులుండి ఉద్ధరిస్తాయా! నీకేం కావాల్సివస్తే అది పట్టుకుపో" ఆమె దుఃఖం ఆగటం లేదు. తనెంత అపురూపంగా ఉదయ్‌ని, రాజీవ్‌ని పెంచింది. రెక్కలొచ్చిన పక్షులు యెగిరిపోతున్నాయి.

సామానంతా లారీలలో పేర్చారు. ఫలహారము చేసి బయలుదేరటమే తరువాయి. అందరూ బల్ల దగ్గర కొచ్చారు. విష్ణు మాత్రం రాలేదు. అతని కోసం కాచుకోవటం పరిపాటి. అతనైనా అంతే! యెవరెవరు రాలేదా అని చూచి, మరీ పిలుస్తాడు. వాసంతి కూర్చుని వడ్డించుకోసాగింది.

"అన్నయ్య రానీ...."

"ఏం? ఆయన వచ్చి ప్రారంభోత్సవము చేయాలా? నేనేం గతిలేక రాలేదు. అందరికీ భయపడటానికి" అన్నది ఓరగా సుజాత వంక చూస్తూ. జ్వరంతో పాలిపోయిన సుజాత చెక్కిళ్ళు మరీ పాలిపోయాయి. ఏమో అనాలని తల యెత్తింది. షర్టు చేతి గుండీలు పెట్టుకుంటూ, విష్ణు మేడ దిగాడు. ఆమె చూపులోని రోషం, నిస్సహాయత గమనించాడు.

"ఉదయ్! దర్జీవాడు మనల్ని నాగరీకులను చేయగానే నాగరికులం కాముర. మన మాట, చేతలోను నాగరికత కనిపించాలి. చిన్నది వాసంతికి తెలియకపోతే, నువ్వు చెప్పాలి" అన్నాడు నవ్వుతూ. వాసంతి వేసుకున్న లుంగీ వంక చూస్తూ ఉదయ్ తల వంచేశాడు. అదేం ఖర్మో. యెంత తీవ్రంగా జవాబు ఇవ్వాలనుకున్నా విష్ణును చూస్తూనే మాటలు రావు వాసంతికి.



"గతిలేని మాకు మేడలూ, కార్లూ తెచ్చావు కదా వాసంతీ. చాలా జాగ్రత్తగా మాట్లాడాలమ్మా. నీ యాభైవేల కట్నం నీకే వుందిగా. గతిలేని వాళ్ళకే వాటా యిచ్చావా? యెవరో నీ మాట 'సై' అన్నారని రెచ్చిపోయి నీ మాటలు నీకు తృప్తినిస్తాయా ఆలోచించాలి! అదే నా పిల్లడకమ్మా. నీ మాటలు నీకు తృప్తినిస్తాయా ఆలోచించాలి! అదే నా పిల్లలయితే రెండు చెంపలు వాయించేవాడిని. వెళ్ళేటప్పుడు మనస్తాపాలు వద్దు. ఇకనుండి పదాలు జాగ్రత్తగా వాడు." అతను ఫలహారం మొదలుపెట్టగానే అందరూ ప్రారంభించారు. రాజీవ్ చాలా ఉదాసీనంగా వున్నాడు.

## 37

భార్యను చూడగానే ముఖం పక్కకు తిప్పుకున్నాడు రఘు. సంతోషంగా వచ్చిన సరళ నీరుగారిపోయింది.

"నా ముఖం అంత అసహ్యంగా వుందా? మాట్లాడరేమండీ! మీరు నాపై యింత విముఖత యెందుకు పెంచుకున్నారో అర్థం కావటం లేదు. చెప్పండి. నా పాద మహిమే మిమ్మల్ని వెంటాడుతుందనుకుంటే, నేను వెళ్ళిపోతాను, మీరయినా బాగుపడితే సంతోషం."

"సరళా!" బాధగా వుంది అతని గొంతు. "నీపై విముఖత కాదు. నాపై నాకే అసహ్యంగా వుంది. దినమంతా పిల్లలకు గంజినీళ్ళు పోసి పిన్ని అమానుషంగా కొడుతున్నాను, హింసిస్తున్నాను."

"అలా ఆలోచించి మనసు పాడుచేసుకోవటంకంటే పరిష్కార మార్గము ఆలోచిస్తే మంచిది కదా!"

"అనుకున్నదానికి కట్టుబడలేకపోతున్నాను."

"మనోనిబ్బరం అలవర్చుకోండి. ప్రయత్నిస్తే ఉద్యోగం దొరక్కపోదు"

అతను లేచి కూర్చున్నాడు.

"నాకెవరిస్తారు సరళా! ఆ రోజు నీ మాట వింటే....."

"చెప్పాను కదండీ! గతం మర్చిపొమ్మని! సుజాత వాళ్ళ వర్క్ షాపులో క్లర్క్ పోస్టు ఖాళీగా వుందట. మీరు వెడతానంటే సంతోషిస్తారు."

"ఆడపిల్ల చేతిక్రింద?"

"ఏమిటండీ, మీ ఆలోచన. ఎవరయితే మనకేం? పని చేస్తాము జీతం యిస్తుంది. అయినా మీకే ఆ భేదభావం. ఆ అమ్మాయికి మీరంటే ఎంత అభిమానము! మీ గురించి ఆలోచించి, ఆలోచించి మంచం పట్టింది."

"నన్నేం చేయమంటావు?"

"అన్నిచోట్ల అభిమానము పనికిరాదంటాను."

"ఆడదాని సంపాదనపై బ్రతుకుతున్నవాడికి యింకా అభిమానం ఎక్కడుంది?"

"మీరలా అపార్థం చేసుకుంటే నేను చెప్పాల్సిందేమీ లేదు. అది మీ తప్పు కాదు. కష్టాలలో కాలుతున్న మనిషికి, ప్రపంచమంతా శత్రువుల్లాగే కనిపిస్తారు. మీ కోసం కాదు, పిల్లల ముఖం చూసి అంగీకరించండి." అన్నది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"సరే" అన్నాడు, భారంగా నిట్టూర్చుతూ.

"వద్దండీ, మనిషిని దారిద్ర్యం కంటే, ఆ ఫీలింగ్స్ చెండుకు తింటాయి."

అతను రాత్రి నిశ్చింతగా నిద్రబోయాడు.

మర్నాడు గడ్డం గీసుకుని, వున్నవాటిలో మంచి డ్రస్సు వేసుకుని తయారయ్యాడు. రోజూ ఆప్యాయంగా మాట్లాడే సుందరమ్మ ఆ రోజు ముభావంగా వుంది. కొడుకు వెళ్ళటం, గంట తర్వాత తిరిగి రావటం చూస్తూనే వుంది. అతను వచ్చి భార్య దగ్గర స్టూలు వేసుకుని కూర్చున్నాడు. "సరూ! చిన్నవాడయినా విష్ణు చాలా మంచివాడు. బాధ్యతగా పనిచేస్తే భాగం యిస్తాడట?"

"మీరు జాగ్రత్తగా చెయ్యండి పని. మేడలు, మిద్దెలు అక్కరలేదు. చిట్టిని, రాజును ప్రయోజకులను చేస్తే చాలు."

"రేపు వచ్చి నాకు పని చూపిస్తారట. ఈ రోజు వాళ్ళు బయటికి వెడుతున్నారు."

"అన్నిచోట్ల తిరగటానికి సమయము వుంటుంది. అమ్మను చూడడానికి టైమే వుండదు దానికి" తల్లి దీర్ఘం తీసింది.



"లేదమ్మా! వాళ్ళు ఆడబిడ్డకు సంబంధం చూస్తున్నారట. అందుకు
వెళ్ళారు. లేకపోతే క్షణం తీరిక వుండదుట. స్వయంగా అత్తగారే చెప్పారు."
"అవునులే, జీతం బత్తెం లేని నౌకరుగా, ఈ పిచ్చి సన్యాసి
కాబట్టి చేస్తుంది. అందుకే నాలుగు ముఖం మెప్పు మాటలు అంటారు"
అన్నది.
'మనింట్లో అదీ లేదుగా....' అనుకుంది సరళ. ఆమె వెనకాలే
పెరట్లోకి వెళ్ళాడు.
"రోజూ మధ్యాహ్నం తినటానికి ఏదయినా చేసియివ్వాలి మేడమ్...."
"యస్ సర్! మీరు అడిగింది ఏది కాదన్నాను" యిద్దరూ
నవ్వుకున్నారు. పిల్లలూ, తల్లీ బడికి వెళ్ళిపోయాక, రఘు తన బట్టలు,
పుస్తకాలు సర్దుకున్నాడు. ఆ సాయంత్రము చాలా రోజుల తరువాత
సంతోషం వెల్లివిరిసింది. పిల్లలు, తల్లి, తండ్రి ఆనందంగా గడిపారు.
"నాన్నా! నాకు మిఠాయి" చిట్టి మారాము చేసింది.
"నాకు పెన్సిల్, డ్రాయింగ్ పుస్తకం కావాలి నాన్నా" రాజు అడిగాడు.
"అలాగేలెండి. సరళా! ఒక్క రూపాయి.....తీసుకువెళ్ళి స్వీట్స్
తెస్తాను."
"అలాగే త్వరగా వచ్చేయండి" అన్నది. ఆమె పెరట్లో ఇంటామెతో
మాట్లాడుతుంది. అద్దెకట్టక రెండు నెలలయింది. తప్పక భర్త జీతం రాగానే
యిస్తానని చెప్పింది.
అతను గుమ్మం దగ్గరకొచ్చి ఆగిపోయాడు. యెవరో భిక్షకత్తెలా
ఉంది. చింపిరిజుట్టు, మాసినగుడ్డలు -చంకలో అస్థిపంజరాన్ని గుర్తుకు
తెచ్చే పసిపాపతో నిలబడి వుంది."
"యె...యెవరూ?"
"మామయ్యా!" యెంతో ప్రయత్నం మీద అనగల్గిందా ఆకారం.
"నిర్మలా!" పడబోయిన ఆకారాన్ని పట్టి ఆపాడు. ఒళ్ళు సల
సల మసిలిపోతోంది. అతని అరుపు విని సుందరమ్మ, సరళ ముందు
గదిలోకి వచ్చారు. అప్పటికే ఆమెను నడిపించుకువచ్చి మంచంలో
పడుకోబెట్టాడు. చేతిలోని పిల్లవాడిని ప్రక్కన పడుకోబెట్టుకుంది.

శక్తిలేనట్టు ఏడ్చాడు. సరళ వెళ్ళి తొందరగా కాఫీ చేసి తెచ్చి త్రాగించింది. అదే కాఫీ చెంచాతో పిల్లాడి నోట్లో పోసింది.

"అయ్యో, నీకిదేం ఖర్మ...." సుందరమ్మ గుండెలు బాదుకుంది.

"యెందుకే ఏడుస్తావు! చూడు వీడు లోకకళ్యాణానికై జన్మించిన కారణజన్ముడు. లోకమాతను కదూ, అందరూ నన్ను పూజించండి. ఆహా....హ" నీరసంగా నవ్వింది నిర్మల.

"ఏమిటే నిర్మలా! అయ్యో!"

"అమ్మమ్మా! కావు. నా పాలిట మృత్యుదేవతవు. ఇంకా పాద పూజలు చేయించవే."

"నిర్మలా! నువ్వు కాసేపు కళ్ళు మూసుకుని పడుకో" నిర్మల తల నిమురుతూ కూర్చుంది సరళ. రఘు తీక్షణంగా చూస్తున్నాడు. అతని ముఖం పది లంకణాలు చేసినట్టు అయింది.

"మామయ్యా. అలా చూడకు, అసహ్యించుకోకు" బావురుమని ఏడ్చింది. స్పృహ తప్పిపోయింది నిర్మల.

"రాజా! నాలుగిళ్ళవతల 'రాజన్' అని డాక్టరున్నాడు ెలుచుకురా" సరళ రాజాతో అన్నది.

"నేను పిలిస్తే వస్తాడా?"

"నా పేరు చెప్పు! త్వరగా వెళ్ళు" రాజా పరుగెత్తాడు. రఘు భార్యను తీక్షణంగా చూశాడు.

"రాజన్ నీకెలా తెలుసు?"

"అతనికో విధవ చెల్లెలుంది. ఆవిడ నాతో పనిచేస్తుంది. ఒకటి రెండుసార్లు యిద్దరికీ లిఫ్టు యిచ్చాడు. చాలా మంచివాడు! యెప్పుడయినా అవసరం అయితే పిలవమన్నాడు."

"మరి మొన్న అమ్మకు జబ్బుచేస్తే పిలవలేదేం?"

"బావున్నాయి మీ యక్షప్రశ్నలు! మీ అమ్మ స్పృహ తప్పిపోయారా? ర్మల స్థితి బావుండలేదని పిలిపించాల్సి వచ్చింది."

"బహు...." ఇంకేమో అనబోయాడు.



"నిర్మల మూల్గుతూ ఏదో గొణుక్కుంటోంది. ఆదుర్దాగా "నిర్మలా! నిర్మలా" అంటూ పిలవసాగింది. డాక్టర్ వచ్చాడు.

"రాజు కరెక్టుగా వర్ణించాడు పేషెంటుని? ఏం జరిగింది?"

"నాకేం తెలియదు డాక్టరుగారూ! ఇప్పుడే వచ్చింది ఊరి నుండి" అన్నది. అతను పరీక్షచేసి తల్లికి, పిల్లాడికి చెరో ఇంజక్షన్ చేశాడు. కళ్ళు విప్పింది నిర్మల. అతను వెళ్ళబోతూ, "సరళా! యిలా రా అమ్మా!"

అతని వెనకే బయటికి వెళ్ళింది. అతను పెదవి విరిచాడు. "మందులు దండగమ్మా! క్షణంలో...." అతను పూర్తిచేయలేకపోయాడు.

"మీరేం చేస్తారు? మీ సహాయానికి చాలా థాంక్స్!"

"ఫరవాలేదు, అవసరము అనుకుంటే కబురుచేయమ్మా. అడిగితే పాలు యివ్వు. రేపటివరకు క్షేమంగా వుంటే, ఏదయినా ట్రీట్‌మెంట్ ఆలోచిద్దాం" అతను వెళ్ళిపోయాడు. సరళ మనసు గీరయిపోయింది. బంగారం వంటి పిల్ల. యిలా పాడయిపోయింది. కళ్ళు వత్తుకుంటూ వచ్చింది.

"ముగిసిందా రహస్య సమాలోచన?" వెటకారంగా అడిగాడు రఘు. భర్త వంక అసహ్యంగా చూచింది.

"ముగిసింది."

ఇంట్లోకి వచ్చింది. పది నిమిషాల తరువాత కళ్ళు విప్పింది నిర్మల.

"అత్తయ్యా! నువ్వు దేవతవు. నన్ను క్షమించావు. మందు వద్దు. నన్ను నీ చేతులలో పోనియ్యి. పాపాలు కడుక్కుపోతాయి" అన్నది నీరసంగా.

"ఊరుకోమ్మా. అసలు ఏం జరిగింది?"

"ఏం చెప్పేది అత్తా! వారివద్ద ఏవో వశీకరణ మూలికలుంటాయి. వంచించాడు. వాడు నడిపేది వ్యభిచారగృహాలు. నెల నెల దివ్యౌషధం అంటూ ఏమో యిచ్చేవాడు. అది త్రాగి కడుపులో మంట భరించలేక, ఓసారి పారబోశాను. ఫలితము కనిపించింది, ఆ వంచకుడు...."

"ఊరుకో రేపు చెబుదువుగాని నిర్మలా"

"చెప్పనీయత్తా. నేను బ్రతుకుతానో లేదో, నాలా మరెవరూ మోసపోవద్దు. వంచకుడు నన్ను అసహ్యించుకుని తరిమేశాడు" ఆయాసపడ సాగింది. సరళ పిల్లాడిని తీసి క్రింద ఓ బొంతేసి పడుకోబెట్టింది. సుందరమ్మ తలక్రింద చేయిపెట్టుకుని నిదురబోయింది. "ఆస్పత్రిలో వీడు పుట్టాక మళ్ళీ ఆశతో వెళ్ళాను. కొడుకుని చూచి ఆదరిస్తాడని. వాడికి అదంతా అవసరం లేదు. కామపిశాచి, రాక్షసుడు. ఎల్లవేళలా స్త్రీ కావాలి. కాళ్లా వేళ్లా పడితే ఆశ్రమంలో వుండమన్నాడు. నా ఆ...రో...గ్యం బాగు పడలేదు. ఆశ కోర్కెల కనుగుణంగా తయారు కాలేదు. తన్ని తగిలేశాడు. అమ్మకు కోపంతో ఉత్తరం రాశాను. మిగిలిన పిల్లల బ్రతుకులు నాశనం చెయ్యవద్దని రాసింది! చేతులు మారాను. ఇదిగో యిలా" ఆయాసంతో మాట్లాడలేకపోయింది.

"పడుకోమ్మా, రేపు మాట్లాడుకొందాము." దుప్పటితీసి కప్పింది. నిర్మల మగతలోకి జారిపోయింది.

"సరళా!"

"ఊఁ"

"ఈ రోజులలో డాక్టర్లు ఫీజు యిచ్చినా రావడానికి తటపటాయించే కాలంలో ఒక ఆడది పిలిస్తే అందులో కుర్రాడిచేత కబురుపంపితే రావడంలో అర్థం ఏమిటి?"

"ఏమో. మీకే తెలియాలి."

"మీ యిద్దరిమధ్యా చాలా చనువుండాలి."

"ఆ మాట అనడానికి సిగ్గుపడాలి మీరు."

"నేను నిన్ను చేసుకున్నందుకే సిగ్గుపడాలి."

"అది రోజూ అనేమాటేగా! వెళ్ళి వదినగారికి టెలిగ్రామ్ యివ్వండి."

సరళ పర్స్, పెట్టె గాలిస్తే రెండు రూపాయలు దొరికాయి. అతని గ్గర ఓ రూపాయి వుంది. అంతా కలిపి టెలిగ్రామ్ యివ్వమని చెప్పింది. ఆ రాత్రి టెలిగ్రామివ్వాలంటే చికాకుపడ్డాడు, అయినా తప్పదు.

"ప్రొద్దుటే వెళ్ళి సుజాతకీ విషయం చెప్పి పనిలో చేరండి."



"పనిలో చేరకపోతే పస్తుంటాను, నిన్నేం అడగనులే" విసురుగా వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయమే కాఫీ తెచ్చిన సరళ కెవ్వుమంది. నిర్మల శరీరం చల్లగా, కర్రలా వుంది. ఏమిటంటూ భర్త, అత్త రావటం చూచి బావురుమంది.

"నిర్మల, నిర్మల.... పోయింది" అన్నది. సుందరమ్మ శోకాలు మిన్నుముట్టాయి. నిర్మల శవాన్ని క్రిందకు దింపారు.

నిర్మల తల్లిదండ్రులు వచ్చాక, దహన సంస్కారాలు జరిగాయి. ఆనాడేమో త్రిలోకనాథులు, స్వాములు అంటూ ధారాదత్తం చేసినవారే ఈ రోజు సరళను నిందించసాగేరు, రఘూతో పోట్లాడి వెళ్ళిపోయారు. ఖర్చులన్నీ విష్ణు భరించాడు.

"వెళ్ళేవారు మీ మనుమడిని తీసుకుపొండి."

"మనుమడా, మట్టిగడ్డలా! దాంతోపాటు కాష్టంలో పడేస్తే పోయేది" అన్నది తల్లి నీరసంగా. తన జీవం వుందని తెలుపుతూ అటూ యిటూ కదిలిన పిల్లవాడికి సరళే పాలుపట్టింది.

"వాడిని చావనియ్యవే" అంది సుందరమ్మ.

"వాడు నేను పుడతానంటూ వచ్చాడా? పుణ్యం, స్వర్గం, లోక కళ్యాణం అంటూ వాడి జన్మకు కారకులు మీరు."

"వాడిని పెంచి ఏం చేద్దామని...."

"వాడు బ్రతికితే ఆలోచిద్దాం" అన్నది నిర్లక్ష్యంగా. సరళ అంచనా తప్పు కాలేదు. నాల్గురోజులనంతరం ఓ సాయంత్రం తల్లిని వెతుక్కుంటూ పోయాడా కారణజన్ముడు. ఆ పిల్లవాడి జన్మకెవరూ సంతోషించనట్టే, అతని మరణానికెవరూ విచారించలేదు. గడ్డిపూలు పూస్తాయి, రాలిపోతాయి. అలాగే వాడూ పోయాడు. రఘూ పిచ్చిగా చూచాడు. భూస్థాపితం చేయక తప్పలేదు. నాల్గురోజులు పాలు త్రాగించిన మమకారమేమో సరళ రెండు కన్నీటిబొట్లు రాల్చింది.

# 38

దాదాపు నెలరోజులు గడిచినా రఘులో మార్పు లేదు. సరళ ఇక నిర్లిప్తంగా వుండలేకపోయింది. పిల్లలు నిదురపోయాక మెల్లగా అతని దగ్గర కెళ్ళింది.

"ఏమండీ!"

"ఊ" అటు తిరిగాడు. ఆ రోజు సుజాత వచ్చి వెళ్ళింది.

కొంచెం త్రాగివచ్చినట్టున్నాడు.

"ఇంటివాళ్ళు సాయంత్రం అన్న మాటలు విన్నారా?"

"ఊఁ"

"ఏం ఆలోచించారు?"

"నేనేం ఆలోచించాలి? ఉద్యోగం చేస్తున్నావు, యిచ్చేయి."

"నాకెంత వస్తుందో మీకు తెలియదా!"

"- - -"

"రేపు సుజాతవాళ్ళ వర్క్‌షాపుకెళ్ళండి. అడ్వాన్సుగా వాళ్ళ దగ్గర కొంత డబ్బు అడిగి యింటివాళ్ళకిద్దాం. వెడతారు కదూ?"

"వెళ్ళను" కళ్ళు మూసుకున్నాడు.

"ఎందుకో?" అతన్ని తనవైపు తిప్పుకుంటూ అడిగింది. అతను పరాయి వ్యక్తి తన్ను ముట్టుకున్నంత కంపరంగా ఆమె చేయి తీసివేశాడు.

"మాట్లాడరేమండీ!"

"నా యిష్టం. నీ పొగరు నాకు తెలుసు. సంపాదిస్తున్నాననేగా! నీ చండాలపు కూడు నాకొద్దు. రేపు ఏదైనా విషంతెచ్చి పిల్లలకు పోస్తాను. నేను త్రాగుతాను. నీకు వీధినిండా ఆత్మీయులేగా. వారితో కులుకుదువు గాని."

"మీరీ మాటలు త్రాగిన మైకంలో అంటున్నారా? నన్ను అర్థం చేసుకుంది యింతేనా?"

"సుజాతకు డబ్బు యివ్వద్దని చెప్పింది నీవు కాదూ?"

"సుజాత కంపెనీలో పని చేయుటానికి అభిమానము అడ్డువస్తుంది



కాని, డబ్బు అడగడానికి రాదా? ఆ పిల్లకేం యిచ్చామని! అడగడానికి కొన్ని హద్దులుండాలి."

"అన్ని హద్దులు నాకేనా? నీకేం వద్దా? అవునులే, సంపాదించే దానివి కదూ?" వెటకారం చేశాడు. రోజూ యిదే తంతు. అతను ఏదో మాటలతో గాయపరచటము, ఆమె ఏడవటం పరిపాటి అయింది. యిద్దరి మధ్య ఎన్నో ఆమడలదూరం అన్పించసాగింది. లాలించి, బుజ్జగించి అడిగినా, నచ్చచెప్పినా నిరాసక్తిగా చూస్తాడు. తను అభిమానం విడిచి సుజాతను ఇంటి అద్దె అడగలేకపోయింది. ఫలితం, ఓ సాయంత్రం సామాన్లు వీధిలో పడవేసి, తాళం వేసుకుంది ఇంటామె. అప్పటికే అయిదు నెలలు గడిచాయి అద్దె యివ్వక. ఇంటిముందు బేలగా నిల్చున్న సరళ సంసారాన్ని డాక్టర్ రాజన్ చెల్లెలు చూచింది. జాలిపడి తమ అవుట్ హౌస్‌లో వుండమని కోరింది. అంతకన్న ఆ క్షణంలో వేరే మార్గం కన్పించలేదు.

# 39

మోటార్ సైకిల్ స్లిప్ అయింది. విష్ణు కాలుకు కొద్దిగా దెబ్బ తగిలింది. ఇంట్లోనే పడుకున్నాడు. ఆఫీస్ ఫైళ్ళు తీసుకుని త్వరగా వచ్చింది సుజాత. అతను మంచి నిద్రలో వున్నాడు. కాలు దిండుపై వుంది. నుదుట స్వేదబిందువులతో విధిలేక పడుకున్నట్టు వుంది. ప్రక్కనే కూర్చుని అతని నుదుటిపై స్వేదబిందువులు తుడిచింది. అతను మేల్కొన్నాడు.

"మీరెప్పుడూ ఒకగంట స్థిమితంగా ఉండరు. ఈ రోజు మంచి శిక్షే పడింది."

"శ్రీరామ్ కంపెనీ యిచ్చాడులే. నిన్న బాంబే పంపమన్న ఉత్తరం పంపావా?"

"లేదు. స్లయిట్ మాడిఫికేషన్ చేయాలి."

"మీ అనుమతి లేనిదే!"

"పతివ్రతా లక్షణం కాబోలు."

"పతివ్రతను కావాలని కాదు. స్వతంత్రించానని అనుకునే ఆస్కారం మీకెందుకివ్వాలి?"

"అపార్థం చేసుకుంటానని కల వచ్చిందా?"

"లేదు గాని, మొగవారి మాటలకు అర్థాలు వేరు అనాలిప్పుడు."

"ఎందుకో?"

"అన్నయ్య చూడండి. వదినను ప్రేమించి, యిష్టపడి వివాహం చేసుకున్నాడు. ఇప్పుడు ఆమెచేసే ప్రతిపనీ తప్పుగానే కన్పిస్తోంది. హీనాతి హీనంగా విమర్శిస్తాడు. చివరకు శీలాన్ని కూడా శంకించే స్థితికి దిగజారిపోయాడు. ఆమె పిచ్చిదానిలా తయారయింది."

"తప్పు అతనిది కాదు. పరిస్థితులు అలా అనిపిస్తున్నాయి. కష్టాలలో నిలద్రొక్కుకున్నవాడే, ఆత్మస్థయిర్యం గలవాడే నిజమైన మనిషి. కొందరు ఏదో కాంప్లెక్సుతో తాము బాధపడతూ, ఇతరులను బాధ పెడతారు. ఎదుటివాడు ఏది చెప్పినా చెడుగానే వినిపిస్తుంది."

"లెక్చర్ ఇచ్చేశారా?"

"కాదు, నీకు నిజం చెబుతున్నాను. నేనంత బలహీనుడిని కాదు. ఒకవేళ నీవల్ల ఏదయినా పొరపాటు జరిగినా దిద్దుకునే శక్తి వుందిలే."

"అంగీకరించాము" నవ్వుతూ అతని బుగ్గపై చుంబించింది. ఆమె మెడపై చేయి పోనిచ్చి మత్తుగా చూచాడు.

"ఏమిటి కొత్త పెళ్ళికొడుకులా!"

"ప్రేమానురాగాలు అమరమయినవి సుజా! వాటికి కాలం, వయసుతో పనిలేదు. సామరస్యంగా జరిగే సంసారంలో యివి నిత్య నూతనమై వుంటాయి."

"అలాగా! టీ త్రాగుతారా?"

"ఇస్తే వద్దంటామా!"

ఆమె టీ చేసి భర్తకిస్తుండగా ఉదయ్ పైకి వచ్చాడు. తనకు చేసుకున్న టీ అతనికిచ్చింది.

"ఏమన్నయ్యా! ఈ సమయంలో మీరింట్లో వుంటారనుకోలేదు."

"పరిస్థితులు వుండమంటే వుండాల్సిందే" కాలు బెణికిన వుదంతం చెప్పాడు.

"వదినా! రేపు వాసంతికి ఏదో సీమంతమంట. మీరు రావాలి" అన్నాడు.



"అలాగే! కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్స్! అన్నయ్యా. వివాహ జీవితం సుఖమయం కావాలంటే ఈ పెద్దలను దూరంగా పంపించాలి. లేని ఆంక్షలు పెడతారు. అమ్మ యింత చాదస్తం అని అనుకోలేదు" విష్ణు ముఖంపై చిరునవ్వు చూచి అన్న తనను సమర్థించటం లేదని తెలిసిపోయింది.

"నీకు గజగజ వణికిపోయేవారు, నాకయితే తలనొప్పిగా వుంది."

"ఉదయ్! ఎటువంటివారయినా తల్లి తండ్రులేరా. వాళ్ళను విమర్శించే అధికారము నీకు లేదు. భార్య స్థానం భార్యదే, పెద్దలస్థానం పెద్దలదే" అన్నాడు. అతనో అరగంట ఆ మాటా, ఈ మాటా మాట్లాడి వెళ్ళిపోయాడు.

క్రిందికి వచ్చి ఉదయ్ పిలిచిన విషయము చెబితే కాంతమ్మ బాధపడింది. "అంత నిర్లక్ష్యంగా పిలిస్తే వెళ్లడం దేనికి?" కమలమ్మ కసురుకుంది. సుజాత అత్త వంక చూచింది.

"పరాయివారా! వెళ్ళిరా" అన్నది. ఆ తరువాత ముగ్గురూ చాలాసేపు బాధపడ్డారు.

అలసిపడుకుంది కమలమ్మ. విష్ణు పిలవటంతో కంగారుగా లేచింది.

"ఏమిటి నాయనా! యిలా వచ్చేవు? నన్ను పిలిస్తే నేనే వచ్చేదాన్నిగా."

"ఫరవాలేదు పిన్నీ!" చనువుగా ఆమె మంచంపై కూర్చున్నాడు.

"పిన్నీ! ఈ రోజు ఉదయ్‌తో మాట్లాడుతుంటే కొత్త విషయాలు తెలిసి వచ్చాయి. రాజీవ్ రెండుసార్లు అదనంగా పరీక్షకు కూర్చున్న డబ్బు లెక్కకడుతున్నాడు. అందుకే మిమ్మల్ని ఓ ప్రశ్న అడగాలని వచ్చాను. నీకు రేణు ఒక్కర్తే కూతురు. మాకు ప్రభ, రమ వున్నారు. ఉమ్మడి ఆస్తి పోయిందన్న తగాదా వద్దు. మీది మీరు చూసుకుంటే నాకేం అభ్యంతరం లేదు."

"విష్ణూ!"

"అవును పిన్నీ! అది నీవల్ల కాదంటే కలిసే వుందాం."

"ఎంత ఖచ్చితంగా మాట్లాడుతున్నావురా?"

"జరుగుతున్న విషయాలు చూస్తుంటే అంత్య నిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరమే నయం అనిపించింది."

"ఒకప్పుడు మూర్ఖంగా యేదయినా అంటే మనసులో పెట్టుకోకురా. నీ అండన యిలాగే వెళ్ళిపోనీ నా జీవితం." ఈ పిల్లలను అదుపులో పెట్టటము నా తరమా! ఇక పెళ్ళిళ్ళు, నువ్వు సంపాదిస్తావ్. నీ చెల్లెండ్ల కిస్తావు."

"అంతమాత్రం అర్థం చేసుకుంటే చాలు పిన్నీ!" అతను లేచి తల్లి దగ్గర కాసేపు కూర్చుని నెమ్మదిగా మేడ యెక్కాడు.

## 40

"సరళా!"

"ఊం" అన్నది పచ్చడి రుబ్బుతూ.

"డాక్టరుకు, నీకు యెలా పరిచయం అయింది."

"ఇదివరకు చాలాసార్లు చెప్పాను."

"నాకు మామూలు పరిచయంలా కన్పించటం లేదు."

"కామెర్ల రోగి శాస్త్రం"

"షటప్! స్త్రీని మహా మహావాళ్ళె అర్థం చేసుకోలేదు. నేనెంత? నీకు నా సంపాదన ముఖ్యంగాని నేను కాదు. నా ఉద్యోగం ఊడేసరికి నేను పనికి రాకుండా పోయాను. డాక్టరు కావాల్సి వచ్చాడా?"

"ఛీ, ఛీ! మీకు మతి వుండే మాట్లాడుతున్నారా?"

"నీకెంత పొగరే! నాకు మతిలేదంటావా?" వంగదీసి వీపుపై దబా, దబా గుద్దాడు. కిక్కురుమనలేదు. ముందు డాక్టరు కుటుంబం వుంది. వింటే పరువుపోతుంది. జుట్టుపట్టి అటూ, యిటూ కుదేశాడు.

"నిజం చెప్పవే."

"మీకు ఏం చెప్పినా అర్థం కాదు" అన్నది. శరీరం అప్పగించి ఊరుకుంది. అతను చేతులు నొప్పి పుట్టేవరకు దెబ్బలుకొట్టి వదిలేశాడు. పిల్లలు అరవబోయారు. సరళ సైగ ననుసరించి అలాగే నిలబడిపోయారు.



అతను బయటికి వెళ్ళిపోయాడు. పచ్చడి ఒక్క దగ్గర చేర్చి గిన్నెలోకి తీసింది.

"ఏమిటే ఆ గొడవ?" సుందరమ్మ అడిగినా ఎవరూ జవాబు చెప్పలేదు. లోపలికి వెళ్ళి తన ముఖం చూసుకుంది అద్దంలో. ఉబ్బి భయంకరంగా వుంది. బడికిపోవటం కుదరదని డాక్టరుగారి చెల్లెలికి లీవు లెటరిచ్చి పంపింది చిట్టితో.

సాయంత్రం పంపుదగ్గర బట్టలు వుతుకుతోంది సరళ. డాక్టర్‌గారు క్లినిక్‌కు వెళ్ళటానికి బయటకు వచ్చారు.

"ఏమండీ!"

ఉలిక్కిపడి చూచింది సరళ. ఆమెను చూస్తూనే అతను చలించి పోయాడు.

"మీ వారిని మంచి డాక్టరుకు చూపించాలమ్మా! ఇందాక వచ్చి నా భార్యకు విడాకులు యిస్తాను, మీరు పెళ్ళి చేసుకోండి అన్నారు. నాకేం అర్థం కావటం లేదు."

"డాక్టరుగారూ, మావల్ల యిలాంటి అవమానాలు జరిగితే క్షమించండి. మరో నాలుగు రోజుల్లో యిల్లు చూచుకుంటాము."

"అదికాదమ్మా! నేను వెళ్ళిపొమ్మనటంలేదు; ఆయన ఆరోగ్యం ఐ మీన్ మానసిక ఆరోగ్యం బావున్నట్టు లేదు."

"అంటే, అంటే-"

"అలాగే వదిలితే పిచ్చి...."

"డాక్టర్‌గారూ!"

"అవునమ్మా! మిమ్మల్ని...." అడగలేకపోయాడు. సరళ ముఖం తిప్పుకుంది. అతను వెళ్ళిపోయాక అలాగే బట్టలు ముందు పెట్టుకుని కూర్చుంది.

"ఒరేయ్ రాజా! నువ్వు డాక్టరువు కావాలిరా. అవుతావు కదూ?"

తన ఆలోచనలు కట్టిపెట్టి యిటు తిరిగింది. రఘు కొడుకును పట్టుకుని నిలదీస్తున్నాడు. వాడేమో, భయంగా చూస్తున్నాడు.

"మాట్లాడవేరా వెధవా! నీకు నేనంటే లక్ష్యం లేదు కదూ!" చాచి చెంపకాయ కొట్టాడు. వాడు బావురుమన్నాడు. తను కలుగజేసుకుంటే మరీ రెచ్చిపోతాడని ఊరుకుంది. సుందరమ్మ వచ్చి నానాతిట్లు తిడుతూ పిల్లవాడిని విడిపించుకుపోయింది.

## 41

సుజాత వాసును తీసుకుని సికింద్రాబాద్ సుశీలమ్మ ఇంటికి పేరంటానికి వెళ్ళింది. ఇల్లంతా వాసంతి బంధువులతో కిటకిటలాడుతోంది. సుశీలమ్మ యెక్కడా కన్పించలేదు. ఎవరూ మాట్లాడించలేదు. వాసు మొగవారిలో కలిసిపోయాడు. సుజాత పేరంటాండ్రను, బంధువులను పరికించింది. నగల తళతళలతో, పట్టుచీరల రెపరెపలతో ఆడంబరంగా వున్నారు. మొదటిసారిగా తన అలంకరణవైపు చూసుకుంది. నీలం బార్డరున్న గద్వాల చీర, మెడలో సూత్రం తాడు, చెవులకు దిద్దులు తప్ప మరో నగలేదు. వాళ్ళంతా తనను పరీక్షగా చూడటం అసలు నచ్చ లేదు. తనే వెళ్ళి వాసంతిని పలకరించింది.

"బావున్నావా వాసంతీ?"

"వెరీ నైస్" అని మళ్ళీ తన స్నేహితురాండ్రతో మాటలు మొదలు పెట్టింది. నుదుట చెమట తుడుచుకుంటూ సుశీలమ్మ వచ్చింది. ఈవిడ సాధింపులు వినాలి కాబోలు అనుకుంది. దానికి విరుద్ధంగా చాటంత ముఖం చేసుకుని వచ్చింది.

"వచ్చావా సుజాతా! అక్కయ్య, కమల ఏరి?"

"పేరంటానికి మేమెందుకు అన్నారత్తయ్యా!"

"బయటివాళ్ళా! ఆశీర్వదించటానికేం? అలా వంటింట్లోకి పద. వంట పూర్తి కాలేదు" అని ఆమె వెళ్ళిపోయింది. యాభై సంవత్సరాలున్న వాసంతి తల్లి పాతికేళ్ళ అమ్మాయిలా అలంకరించుకుని, తిరుగుతోంది. లిప్‌స్టిక్‌తో ఏదో పగటివేషకత్తెలా వుంది.

"ఉదయ్‌బాబూ! క్రింద ఆడవాళ్ళున్నారు. ఏమిటలా మేనర్సు లేకుండా నవ్వులు?" ఆమె మాటలకు నవ్వులు ఆగిపోయాయి.



సుజాతకు కంపరం పుట్టింది. వంట యింట్లోకి వెళ్ళి చిన్నత్తకు సాయం చేసింది.

"వంటవాడిని పెట్టమంటే నామాట ఎవరికి లెక్క. పిలవటం మాత్రం దండిగా పిలిచారు" అన్నది. వంట పూర్తయి బయటికి వచ్చేసరికి వాసంతి పీటలమీద కూర్చుంది. సర్వాలంకారాలతో చుట్టూ స్నేహితురాళ్ళు కూర్చున్నారు. సినిమాలో సెట్‌లా వుంది. ఫొటోగ్రాఫర్ ఫొటోలు తీస్తున్నాడు. తల్లి చీర యిచ్చేటప్పుడు, తండ్రి అక్షింతలు వేసేటప్పుడు, అన్నలు పూలు యిస్తుండగా, స్నేహితురాళ్ళు గాజులు వేస్తుండగా ఫొటోలు తీశారు. సుశీలమ్మంటూ ఒకామె ఇంట్లో వుందన్న సంగతే మరచిపోయారు. అత్తమామలతో, బావమరుదులతో, యెప్పుడు, యెక్కడ ఏ ఫోజు పెట్టమని వాసంతి చెబితే ఆ ఫోజు పెడుతున్నాడు ఉదయ్.

"సైడ్ బర్న్స్ మరీ పెద్దవిగా వున్నాయి ఉదయ్‌బాబూ!" అత్తగారు అల్లుడితో చెబుతోంది. సుజాత సిగ్గుతో చచ్చిపోయింది.

"వసూ! మీ ఆయనకు బొత్తిగా డ్రెస్సు వేసుకోవటం తెలియదే" కూతుర్ని అన్నది.

"అవునమ్మా. ఆయన పెరిగింది నట్టి అడవి మనుష్యుల మధ్య మమ్మీ! ఇంకా కొన్నాళ్ళు పోవాలి" భర్తవైపు గోముగా చూచింది. ఉదయ్ అదేదో జోక్ అయినట్టు నవ్వుతున్నాడు. అందరూ జత కలిపారు. సుజాత ముఖం చిన్నబోయింది. తను తెచ్చిన ప్యాకెట్టు తీసుకువెళ్ళి వాసంతి కిచ్చింది బొట్టు పెట్టించుకుంటుందో లేదో అని భయపడుతూ. అందరూ భోజనాలకు బదులు పడకగదిలో అమర్చిన పానీయాలవైపు వెళ్ళారు. 'చీర్స్' అత్తా అల్లుడు గ్లాసులు తాకించుకున్నారు. సుజాతకు వింతగా వుంది.

"ఆడవారు త్రాగుతారా అత్తయ్యా?" నెమ్మదిగా అడిగింది.

"వాళ్ళు ఆడవాళ్ళటే తల్లీ! అంతా ఖర్మ."

సుజాతకు నవ్వు వచ్చింది. పొత్తుల సంసారం పోరంటూ వేరయితే అక్కడా సుఖం లేదు.

"పెద్దమ్మా! త్రాగుడు పార్టీ ఈ రోజు తెమలదుగాని, మాకు వడ్డించేయి" వాసు బయటికి వచ్చాడు. బయటనుండి రాజీవ్, చలపతి

వచ్చారు. అందరికీ వడ్డించింది. పక్కగదిలోంచి నవ్వులూ, కేరింతలూ వినిపిస్తున్నాయి. ఏదో ఇంగ్లీష్ రికార్డు వేసినట్టున్నారు. మ్యూజిక్ వినపడుతూంది.

"ఈరోజు డ్రింకింగు పార్టీయా?" రాజీవ్ అడిగాడు.

"ఈరోజు అంటున్నావ్, రోజూ వుంటుందేమిటి?" వాసు అడిగాడు.

"ఆదివారం ఆదివారం వుంటుందిరా."

వాళ్ళు భోజనము చేస్తుండగా ఉదయ్ బయటికి వచ్చాడు.

"మీరు అప్పుడే వచ్చేశారేం నాన్నా!" తీక్షణంగా వుంది కంఠం.

"మీ అమ్మ ఏదో పేరంటం - అది ఆడవారికి..." మధ్యలోనే త్రుంచేశాడు.

"ఇలా అయితే సంసారం అయినట్టే. వ్యవసాయదారుడంటే పొలం తప్ప వేరే ఏం గుర్తుండరాదు."

"ఇంట్లో యింత పండుగయితే ఆయన ఒంటరిగా అక్కడ భోజనం చేస్తారా! నేనే రమ్మన్నాను." అంది సుశీలమ్మ.

"నీకెన్నిసార్లు చెప్పాలి. ఇలాంటి విషయాలలో తలదూర్చవద్దు అని." ఉదయ్ గట్టిగా మాట్లాడాడు.

"అవునులే. ధర్మరాజువంటి కొడుకును కర్కోటకుడు అన్నందుకు అనుభవించాలి" గొణుక్కుంది సుశీలమ్మ.

"అమ్మా! ఏమిటి నీ సణుగుడు! ఒక్క నిముషం శాంతంగా వుండనివ్వవు కదా!"

"ఉదయ్ బాబూ!" అత్తగారి పిలుపు వింటూనే ఆదరా బాదరాగా వెళ్ళిపోయాడు.

"రావే అమ్మా, మనము తిందాము. వచ్చి పోట్లాడినా పోట్లాడగలడు" అన్నది. ఇద్దరూ భోజనాలు చేసి, వాసు, సుజాత ఇంటికి వచ్చేశారు.

వరండాలో శ్రీరామ్‌ను గుర్రం (కొయ్యది) యెక్కించి ఆడిస్తున్నాడు విష్ణు. "వదినా, మరిది రాత్రివరకు రారనుకున్నాను" అన్నాడు.

"వారంరోజులు వుందామనే అనుకున్నాము. మీకు కోపం వస్తుందని వచ్చేశాము" అన్నాడు.



"మంచిపని చేశావు. స్పేర్ పార్ట్సు వచ్చాయట. నేను ఈ పూట వెడితే కాలు మరీ నొప్పి అవుతుందో ఏమో? కాస్త వెడతావా!"

"అలాగే. వదినా! కాసింత టీ."

కొడుకును ముద్దాడుతూ లోపలికి పోయింది. నాల్గు ముక్కల్లో తాను పేరంటం విశేషాలు చెప్పాడు.

"ఉదయ్ అలా మారాడా?"

"నేను చూడకపోతే నమ్మకపోయేవాడిని. ఆమె అత్త కాదు."

"పోనీలే. మనకెందుకురా" అన్నాడు. వారు టీ త్రాగినాక వాసు వెళ్ళిపోయాడు.

"ఏమండోయ్ అడవిమనిషిగారూ! ఒకసారి మావాళ్ళను చూసి రావాలి" అన్నది తమాషాగా సుజాత.

"తమ్ముడి కాంప్లిమెంటా, మరదలిదా?"

"ఊహించండి చూద్దాం!"

"ఉదయ్ అంత మాట అనలేడు. వాసంతే అని ఉంటుంది. ఔనా!"

"తమరి ఊహ తప్పటం యెప్పుడూ చూడలేదుగా."

"మరికాస్త విస్కీ రుచి చూడకపోయావా?"

"ఈసారి వెడితే చూస్తానులెండి. మరి నాకు పార్టీలో పాల్గొనే దుస్తులు అవీ కొనిపెట్టండి."

"నాగరికత పేరుతో వేసే పిచ్చిగంతులు, వీడికింత డబ్బెలా వస్తుందో."

"లంచాలు గుంజడంలో ఆరితేరాడట మీ తమ్ముడు."

"నాకే సిగ్గుగా వుంది సుజా! నా చేతిక్రింద తర్ఫీదు పొందిన ఉదయ్ ఇలా అయ్యాడంటే."

"మంచి అలవాట్లు నేర్చుకోవాలంటే ఏళ్ళు కావాలి. దిగజారిపోవటానికి కొన్ని క్షణాలు చాలు, పదండి. మరోసారి అయొడెక్స్ రాసి వెడతాను"అన్నది. ఇద్దరూ మెల్లగా లోపలికి వెళ్ళిపోయారు.

# 42

"అందరూ దొంగలు, కమ్యూనిస్టులు! అవును. నేను ఏ వర్గానికి చెందినవాడిని? జమీందారును కాను. అంతా ప్రభుత్వం లాక్కుంటుంది.... నాయకుడిని. ఎంత బావుంటుంది. పని లేదు, హాయిగా ప్రారంభోత్సవాలు, కార్లూ, షికార్లూ" రఘు పెద్దగా నవ్వాడు. అతనలా అరుస్తుంటే పిల్లలు తమాషాగా చూస్తున్నారు.

"మీరు ఇంట్లోకి పదండి" సరళ మృదువుగా పిలిచింది.

"నువ్వు, నువ్వు ఎవరు? నన్ను పిలవటానికి."

"వీధిలో వారంతా వినోదం చూస్తున్నారు. ఇంట్లోకి పదండి" చేయిపట్టి లేవదీయబోయింది. ఒక్క నెట్టు నెట్టాడు. ఆమె తలకు గేటు తగిలింది. బొప్పి తడుముకుంటూ ఇంట్లోకి వచ్చింది.

"అత్తయ్యా! నేను పిలిస్తే రెచ్చిపోతున్నారు. మీరు వెళ్ళి పిలవండి" అన్నది సుందరమ్మతో.

"బంగారంలాంటి నా కొడుక్కు - ఇదేం రాత రాశావురా దేవుడా!" అంటూ ఆవిడ ఓ శోకం పెట్టి బయటికి వెళ్ళింది.

"రఘూ! ఇంట్లోకి పదరా తండ్రీ" అన్నది దగ్గరగా వచ్చి.

"ఏమన్నావ్! తండ్రినా! ఆహా! ఆహా" పెద్దగా నవ్వాడు.

"నీ నాటకాలు నా దగ్గర చెల్లవు. నేను రాజాకు, చిట్టికి మాత్రమే తండ్రిని. నువ్వు ... నిర్మలను చంపావు. నన్నూ చంపుతావు పో! దూరంగా పో!"

"రఘూ! అమ్మనురా!"

"నాకు అమ్మ వుందంటావా! సరే ఓ పదిరూపాయలు యిలా పడేయి- చూశావా! అమ్మవు కావు."

"నా దగ్గర డబ్బెక్కడిదిరా? నేను ఉద్యోగం చేస్తున్నానా? నాన్న సంపాదించింది వుందా?"

"ఉద్యోగం చేస్తావా! నేను బ్రతికి వుండగానే! చెప్పు. చేస్తావా!" తల్లి గొంతు పట్టుకున్నాడు లేచి.



"వదలండి" సరళ వచ్చి అతని పట్టు నుంచి ముసలమ్మను వదిలించింది.

"నీకు బాగా పొగరెక్కిందే. నిన్ను చంపితే శాంతి."

సరళ నేర్పుగా తప్పించుకుని గదిలో దూరి తలుపు వేసుకుంది.

"అమ్మా! అది భయపడిపోయిందే. నువ్వేడుస్తున్నావా! వద్దు. ఇల్లు కట్టిస్తానుగా. అప్పుడు చెల్లెండ్లకందరకు సారెలు పెడతాను." ఆమె దగ్గరగా జరిగాడు. ఆమె పై ప్రాణాలు పైనే పోయాయి. భయంగా చూచింది.

"ఎందుకే ఆ భయము. ఆ సరళ మాట వింటాననేగా!" గుసగుసగా అన్నాడు.

"అది ఉద్యోగానికి పోతుందిగా! అప్పుడు అప్పు చేస్తాను. ఆ తరువాత మనము పిండివంటలు చేసుకుందాం."

అతన్ని చూస్తే సుందరమ్మ హృదయం నీరు అయింది. ఆమె నోట్లో గుడ్డ కుక్కుకుంది.

"అయ్యో! నాకు చావురాదేమిటి?" తలబాదుకుంది.

"ఓహో! చచ్చిపోదామనే! ఎంతాశ! మార్వాడీ దగ్గర అప్పులెవరు చేయిస్తారు? సరళను ఎవరు సాధిస్తారు? అవును. సరళను సాధించినందుకు, నిర్మలను చంపినందుకు శిక్షపడాలి" తల్లిపైకి ఉరకబోయాడు. సరళ తలుపు తీసుకువచ్చి అతన్ని పట్టుకుంది.

"ఏయ్! వదులు."

"కాసేపు పడుకోండి."

"పడుకుంటాను. నిర్మలను చంపింది అమ్మకాదూ?"

"ఆయుష్షు మూడి చనిపోయింది."

"ఏమన్నావ్!" ఆమెను విదిలించి, రెండు తగలనిచ్చాడు. "నాకెదురు చెప్పటమే నీ ధ్యేయమా?"

"లేదండీ, అత్తయ్యే చంపింది."

"నేను .... నేను త్రాగుతానా?"

"లేదండీ ఆ మాట యెవరన్నారు?"

"నువ్వు అనలేదా? గుడ్. పద పడుకుంటాను" అతను కళ్ళు మూసుకున్నాడు. డాక్టర్ రాజన్ వచ్చి ఇంజెక్షన్ యిచ్చాడు. కాసేపు గొణుక్కుని నిద్రలోకి జారిపోయాడు. ఆ రోజంతా అలాగే నిద్రబోయాడు. రాత్రి కూడా లేవలేదు. ఇంజక్షన్ ప్రభావమే అనుకుని, నిద్రబోయింది సరళ, మధ్యరాత్రి మేలుకున్నాడు రఘు. భార్యను తట్టిలేపాడు. సరళ భయంగా అతని వంక చూచింది.

"అలా చూస్తావేం సరూ?" ఆప్యాయంగా ఆమె బుగ్గలు పుణికాడు. చాలాకాలం తరువాత అతని కన్నులలో కాంతి, అనురాగం, తొణికిస లాడటం కన్పించింది. అతని చేతులు చెంపల కాన్పుకుంది. అతని చేతిలో ఏవో కాగితాలున్నాయి.

"మీరు ఎప్పుడు లేచారు?"

"చాలాసేపయింది!"

"ఏమిటండి ఇవన్నీ?"

"ఉద్యోగం కోసం దరఖాస్తు. ఇది యింటికోసం. నన్ను క్షమించు సరూ! మిమ్మల్ని ఈ మూలకు తీసుకువచ్చి పడేశాను."

"ఫరవాలేదండి. మీరిలా సంతోషంగా వుంటే గుడిసె అయినా ఫరవాలేదు."

"ఈ కవర్లకు స్టాంపులు కావాలి, డబ్బులున్నాయా?"

"ఎంత కావాలి?"

"రూపాయి చాలు."

"అంతేగదా వుంది. పొద్దుట లేచాక వెదుదురుగాని."

"ఆలస్యం అమృతం విషం అనేది తెలియదా?"

"తెలుసు, యింత రాత్రి పోస్టాఫీసు వుంటుందా?"

"ఆ విషయము మరిచిపోయాను. ఐయామ్ సారీ. నా సరసన పడుకోవాలంటే భయమా సరూ?"

"అదేం లేదు" అన్నది. కొన్ని రోజుల క్రితం సిగ్గువిడిచి, అతని సరసన చేరితే, అసహ్యంగా చూచి, లేచి వెళ్ళిపోయాడు. కుదుటపడుతున్న అతని మనసులో రాయి వేయటము భావ్యము కాదని ఊరుకుంది.



"ఇలా రా" చేయిపట్టి లేవదీశాడు. లేచి అతని సరసనే పడుకుంది.

"సరూ! ఉద్యోగం దొరికితే అప్పులు అన్నీ తీర్చి పారేద్దాం."

"అలాగేనండీ" అన్నది ఆప్యాయంగా, అతని వీపు నిమురుతూ. అతను తోటకూరకాడల్లా వున్న సరళ చేతులు ఆప్యాయంగా తన మెడ చుట్టూ వేసుకున్నాడు.

"ఎలా అయిపోయావో చూడు. పనిమనిషిని పెడతాను సరళా." అన్నాడు.

"మంచిది."

"నమ్మకం లేదు కదూ?"

"అలాగే పెట్టుకుందాము, పడుకుందామా, కంటికి పండుగ్గా నిద్రపోయి యెన్నాళ్ళయిందో."

"నిజమే. నువ్విలా నా దగ్గర పడుకుని కబుర్లు చెప్పక ఏళ్ళు అయినట్టు లేదూ?"

"అందుకే కాసేపు పడుకుందాము" మృదువుగా అతని తల నిమురుతూ, లైటు తీసివేసింది. ఈ మార్పు నిజమా, తాత్కాలికమా అర్థం కాలేదు. మొదట ఇల్లు మారాలి అనుకుంది.

లేస్తూనే, భర్త కవర్లలో పెట్టిన ఉత్తరాలు కనిపించాయి. తృప్తిగా చూస్తూ వాటిని విప్పింది. మతిపోయినదానిలా నిల్చుండిపోయింది. ఒకటి ముఖ్యమంత్రికి, రెండోది ప్రధానమంత్రికి అడ్రసు చేసి వున్నాయి. కొన్ని క్షణాల క్రింద అనుభవించిన ఆనందమంతా ఆవిరిలా ఇగిరిపోయింది.

"ముఖ్యమంత్రిగారికి శతకోటి నమస్కారాలు. త్రాగానట, కంపెనీ వారు ఉద్యోగం నుండి తీసివేశారు. వెంటనే మీరు నాకో మంచి జాబ్..... ఇల్లు చూపించాలి. అప్పుల బాధ భరించలేక ఇల్లు అమ్ముకున్నాను. కనుక ఇల్లు యివ్వాలి. ఇది ప్రజల ప్రభుత్వము. నేను ప్రజలలో ఒకడిని. త్వరగా తేల్చాలి.

ఇట్లు

రఘునాధరావు

కుమిలిపోయే శరీరాన్ని మంచంకోడు ఆసరాగా చేసుకు నిల్చుంది. కంటిలో నీరు యెప్పుడో యింకిపోయింది. హృదయ స్పందన కూడా ఆగిపోతే ఎంత బాగుండును అనుకుంది. బయటికి వెళ్ళి, డాక్టర్‌గారింటి నుండి సుజాతకు ఫోన్ చేసి వచ్చింది. రఘు లేచి దిక్కులు చూస్తున్నాడు.

"అప్పుడే లేచారేం."

"యెక్కడికెళ్ళావు? ఆ డాక్టరు దగ్గరికే కదూ? అక్కడేం పని?" తీక్షణంగా అడిగాడు.

"సుజాతకు ఫోను చేశాను."

"నీ ఆటలు నా దగ్గర సాగవు. వ్యభిచారిణీ! వెళ్ళు, వెళ్ళవే. నా ఇంట్లో వుండొద్దు" మెడ పట్టుకుని గెంటాడు. గుమ్మంలో కూర్చున్నాడు.

"అమ్మా! ఇంట్లోనివారు బయటికి, బయటివారు ఇంట్లోకి రావద్దు. ఇది నా ఆజ్ఞ. భారత ప్రభుత్వపు ఆజ్ఞ" నవ్వుతూ పచార్లు మొదలు పెట్టాడు. సరళ బేలగా చూడసాగింది. రెండు మూడు గంటల క్రితం యెంతో సానుభూతిగా మాట్లాడిన భర్త నిర్దాక్షిణ్యంగా నిందిస్తూంటే అసహాయంగా చూడటం తప్పితే ఏం చేయగలదు?

"తొందరగా డాక్టరుకు చూపించమ్మా" డాక్టరుగారి పనిమనిషి సలహా ఇచ్చింది.

"డాక్టరుకన్నా భూతవైద్యుడే నయము. గాలి, ధూళి సోకితే యింతే" డ్రైవరు సలహా యిచ్చాడు కారు తుడుస్తూ.

"అంతే అయివుంటుంది అబ్బాయి. ఈ మతిభ్రమణ మా ఇంటా వంటా లేదు." సుందరమ్మ మాట కలిపింది.

"యెవరికే మతిభ్రమణ"

"నీక్కాదురా. యెవరికోనట" ఆమె వణికిపోతూ వేపచెట్టు మొదట్లో కూర్చుంది. సరళ అలాగే నిల్చుంది. అరగంట తరువాత సుజాత వచ్చింది భర్తతో. ఆడపడుచును చూడగానే బావురుమంది సరళ.

"ఊరుకో వదినా." అన్నది బలవంతంగా కన్నీరు ఆపుకుంటూ.

"హల్లో విష్ణూ! యెలా వచ్చావు! కర్ఫ్యూ లేదూ! వాళ్ళకు తెలియదేమిటి తహసిల్‌దార్‌గారి అల్లుడివి."



విష్ణు పరీక్షగా తీక్షణంగా చూచాడు. మాసిన జుత్తు, పెరిగిన గడ్డం, రేతుకుపోయిన దవడలు, చిరుగులుపట్టిన బట్టలు, ఎలుగుగొడ్డులా ఉంది ఆకారం.

"సుజా! వచ్చావా? నీకంటే ఆత్మీయులెవరున్నారు? ఈ కులటను పొమ్మను."

"అన్నయ్యా!" వెళ్ళి అతన్ని పట్టుకుంది.

"యెవరేమన్నారమ్మా! కట్నం తేలేదని బాధపెట్టాడా? ఇదిగో విష్ణూ! నేను యెవరనుకున్నావు! తహసిల్‌దార్ మనవడిని. కాదు? ఏకైక పుత్రుడిని. మా నాన్న సిఫార్స్‌తో అమాంతం మంత్రినైపోతాను. అప్పుడు ఏం కావాలన్నా యిస్తాను."

"అన్నయ్యా!" సుజాత అతని నోరు మూసింది. ఏమిటా వాగుడు! వన్నెవరు ఏమీ అనలేదు. యెందుకిలా మారిపోయావురా" బావురుమంది.

"ఛ! నువ్వు ఏడుస్తావా! నేను ప్రధానమంత్రి కావటం నీకు ఇష్టం లేదా?"

సుజాత కన్నీరు ఒత్తుకోవటం మరిచి అతన్ని చూచింది. నెమ్మదిగా అతని చేయిపట్టి నడిపించుకుపోయి, చెట్టు మొదట్లోనే సిమెంటు అరుగుపై కూర్చుండబెట్టింది. సుందరమ్మ బెదిరి లేచిపోయింది.

"చూడు సుజా! అమ్మ నేనంటే భయపడుతుంది." ఫక్కున నవ్వేశాడు.

"నువ్విక్కడే వుండు. అరగంటలో వచ్చేస్తాను" విష్ణు వెళ్ళిపోయాడు. సరళ నెమ్మదిగా ఇంట్లోకి వెళ్ళిపోయింది. పిల్లలు గుమ్మంలో నిలబడి బిక్కు బిక్కున చూశారు. "ఒరేయ్ రాజా! వెళ్ళి మీ అమ్మను కాఫీ తెమ్మను. అత్తయ్య వస్తే అంతదూరం నిల్చుంటారా?" కసురుకున్నాడు.

"సుజా! మీ వదినకు నిర్మల దయ్యం అయి పట్టినట్టుందే. ఒకటే పిచ్చివాగుడు. ఆ డాక్టరుగాడితో సరసాలు. నా కళ్ళు కప్పగలదా?" గుసగుసగా చెప్పాడు.

"అన్నయ్యా! నువ్వు కాసేపు ఊరుకుంటావా?"

"నిజం చెబితే నమ్మవు కదూ? నిజంగా అదే కట్నం తెస్తే మన స్థితి యెంత బావుండేది. దాని పాదమహిమ భలే చెడ్డది."

అలా సాగుతూనే వుంది అతని వాక్ ప్రవాహము. సరళ కాఫీ తెచ్చింది.

"సుజాత వచ్చిందని తెలిసే యింత ఆలస్యం చేశావా?" ఉరిమి చూచాడు.

"ఊరుకో అన్నయ్యా. రా మనము కాఫీ త్రాగుదాం." అతనిచేత కాఫీ త్రాగించి తనూ త్రాగింది.

"చూడు సుజా! అమ్మకు కాస్త మతి చలించిందేమోనని అనుమానం" చిన్నగా నవ్వాడు. విష్ణు టాక్సీలో వచ్చాడు. బలవంతంగా యెక్కించి, డాక్టర్ దగ్గరకు తీసుకుపోయారు. డాక్టర్ రఘు వాలకము చూచి, నిద్రకు ఇంజక్షన్ యిచ్చాడు. అతను నిద్రబోయాక, డాక్టరు కుటుంబ విషయాలు, అతనికి మతి చలించక పూర్వము జరిగిన ముఖ్య సంఘటనలు వివరంగా అడిగి తెలుసుకున్నాడు. కొన్ని డైరీలో నోట్ చేసుకున్నాడు. అతను పెన్ను పెదాలకు ఆనించుకుని ఆలోచనలో పడ్డాడు.

"విష్ణూ! సీరియస్‌గా లేదు. కొంత మనశ్శాంతి అవసరము. అతని మనసును బట్టి నడుచుకుంటే లాభం వుంటుందేమో? నిర్మల చనిపోయిన పరిసరాలకు దూరంగా, ప్రశాంతంగా వుండే చోటుకు మారిస్తే బావుంటుంది. వారి శ్రీమతి ఉద్యోగం మాని అతనికెదురుగా వుంటే కొన్నాళ్ళు కుదురుతుందేమో? ఆ తరువాత ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నం చేద్దాం."

ఇంటికి తిరిగివచ్చారు. సరళ విషయాలు విని నిట్టూర్చింది. తను ఉద్యోగం మానేస్తే ఇల్లు గడిచేదెలా! భర్తను పడుకోబెట్టి, వంటయింట్లోకి వెళ్ళింది ఫలహారం తయారుచేయటానికి.

"ఒకసారి యిలా వస్తారా?" సుజాత బయట వున్న బాదం చెట్టు క్రిందకు వెళ్ళింది. విష్ణు బయటికి వచ్చాడు.

"ఏవండీ, మీ ఇంటికి వచ్చిన దగ్గర నుండి నా అవసరాలు గ్రహించి, మీ అంతట మీరే అన్నీ చేశారు. ఈ రోజున నా అంతట



నేను అడుగుతున్నాను. ఈ రెండు నెలలు అన్నయ్యను ఆదుకోండి. నాకు తెలుసు యిది శక్తికి మించిన పని" ఆమె కళ్ళు నిండుకున్నాయి. "కాని ప్రేమగా తన భుజంపై పెంచాడు, గోరుముద్దలు తినిపించాడు."

"సుజా!"

"నాకు తెలుసు, యెవరికయినా శక్తికి మించిన పని - మమతా బంధం." వెక్కి వెక్కి ఏడ్చింది.

"నీకు మతి వుండే యిలా మాట్లాడుతున్నావా?" విష్ణు గొంతు తీక్షణంగా వుంది. అవును అతను యెందుకు ఆదుకుంటాడు. తను కట్న, కానుకలు తేకపోయినా అతనికి అదనపు ఖర్చు తగిలిస్తుంది. కన్నీరు బొట, బొటా రాలింది. "రఘు నీకు అన్నేగాని, నాకేం కాడా? అతని బాగోగులు నాకు ముఖ్యం కాదా? నువ్వింత మూర్ఖురాలివని అనుకోలేదు. వృధా ఖర్చులంటే ఇష్టం వుండదు. అంతమాత్రాన బావమరిదిని గాలికి వదిలేస్తానా?"

"ఏమండీ!" అతని చేతులు పట్టుకుంది.

"ఇది మన పడక గది కాదు. ఆ ఏర్పాట్లు నేను చూస్తాను. నువ్వెళ్ళి సరళగారికి ధైర్యం చెప్పు" అని వెళ్ళబోయాడు.

"ఫలహారం చేసి వెళ్ళండి. వదిన నొచ్చుకుంటుంది."

"అలాగే" యిద్దరూ ఇంట్లోకి వెళ్ళారు.

## 43

విష్ణు పొలాల దగ్గరున్న రేకుల ఇంట్లో యెంతో ప్రశాంతంగా వుంది. ప్రతిరోజు విష్ణు, డాక్టర్, ఒకోసారి సుజాత వస్తారు. రఘుకు చాలా నయంగానే కనిపిస్తోంది. మనిషి ఆరోగ్యంగా, తయారయ్యాడు. సరళకు చాలా బాధగా వుంది. ఆడబడుచు డబ్బు కూర్చుని ఖర్చు చేయటం. కాని వేరే మార్గాలు లేవు. నిరంతరం సుజాతకు తనవల్ల భారమనిపించకుండా వుండాలని మార్గాలు వెతికేది. రఘు మంచము ప్రక్కన కూర్చుని ఆలోచిస్తోంది.

"అమ్మాయ్ నీ దగ్గర ఏమయినా డబ్బు వుందంటే?"

"లేదత్తయ్యా" అన్నది. ఆమెకు సుజాత యిచ్చిన డబ్బు ఖర్చయ్యింది. అభిమానము వదిలి తన అన్నలకు రెండు ఉత్తరాలు రాసినా జవాబు లేదు. వారికే ఇల్లు గడపడం కష్టంగా వుండొచ్చు. తనకేం పంపుతారు? ఒకతను ప్లీడరు గుమస్తా, రెండో అతను హైస్కూల్ టీచర్. అతనికి గంపెడు సంతానం. తమ్ముడు వున్న ఎకరం పొలం సాగుబాటు చేస్తాడు.

"నేను చెప్పింది వినిపించిందా?"

"ఆఁ? ఏమిటత్తయ్యా?"

"పెద్ద జీతగాడు లేడూ, వాడి అల్లుడికి యిలాగే అయితే యెన్ని వందలు పెట్టినా బాగవలేదటే" ఆసక్తిగా చెప్పింది. "యెవరో మంత్రకాడు ముప్పై రూపాయలతో బాగు చేశాడట."

"మనకు చేతబడులు చేసేవారెవరత్తయ్యా?"

"ఏదో కన్నకడుపే తల్లీ. ఏం చేస్తే వాడు మనుష్యుల్లో పడతాడో అని నా తాపత్రయము. నీకు నిశ్చింతగా వుంటే నాకేం? మా కాలంలో సూత్రాలమ్మి మొగుళ్ళను బాగుచేసుకున్నాము." ఆవిడ నిష్టూరానికి సరళ నవ్వుకుంది. 'తనలాంటివారు యెందుకు పుడతారో తెలియదు' అనుకుంది. రఘు కట్నం లేకుండా సరళను వివాహం చేసుకున్ననాడు అందరూ అదృష్టవంతురాలని కొనియాడారు. ఆ అదృష్టము వెనుక యింత కక్ష, అసూయ పేరుకొని వుంటుందని తెలిస్తే అన్నలను ఇబ్బంది పెట్టి అయినా కట్నం తెచ్చుకునేది.

పుట్టింటి వారెవరూ రారు. ఇకమీదట సుజాత తప్పితే అత్తింటివారూ అంతే. అత్తగారి తత్వమేమిటో అర్థం కాలేదు. ఈ స్థితిలో కూడా కోడలిపై నిష్ఠూరం వేస్తుందనుకుంటే, ఈ రకం స్త్రీలు పుట్టుకతో వచ్చిన గుణం మార్చుకోలేరని తేలిపోయింది.

చెవులకున్న ఏడురాళ్ళ దిద్దులు తీసి యిచ్చింది. "అత్తయ్యా! వీటితో వారికి ఏదో చేయిస్తామన్నారుగా, చేయించండి." ఆవిడ అవి తీసుకుని వెళ్ళిపోయింది. సాయంత్రం, కార్యభారం అంతా నెత్తిన వేసుకుని నడిపించింది. మాంత్రికుడు వచ్చి, చక్రం గీసి రఘును కూర్చోబెట్టాడు.



"నల్లకోడి, అయిదు మూరల నల్లదారం" యిలా ఒక్కొక్కటే లిస్ట్ చెప్పాడు.

"ఇదంతా వుంటుందనే కదా, ముందుగా డబ్బు మీ చేతిలో పెట్టాం."

"భలే మాట. అది అంబది - అంబ మీద ఆన. నాకెందుకు మీ డబ్బు."

ఒకటి తరువాత ఒకటి అడుగుతూనే వున్నాడు.

"సవాశేరు బియ్యం - అగరొత్తులు - పసుపు - ఆకులు - అం.... ఓం సవ్వారూపాయి భేతాళుడికి ముడుపుకట్టి ఆకులలో పెట్టు-" ఓ గంట తతంగము తరువాత, రఘుకి స్నానము చేయించి ఆ బట్టలు ఒలిపించుకొని వెళ్ళిపోయాడు. రఘుకి వేడి వేడి కాఫీ యిచ్చి పడుకోబెట్టింది. అదృష్టం ఏమిటంటే అతను గొడవచెయ్యక కూర్చున్నాడు. మంత్రాలు చదివినంత సేపూ సుందరమ్మ ముఖం వికసించింది. కోడలు నిద్రపోగానే గబగబా బొడ్లో మిగిలిన రూపాయలుపెట్టి, బయటికి వెళ్ళి నౌకరును పంపి, మిఠాయి, పళ్ళు తెప్పించి పంచిపెట్టింది.

"చూడవే. దేని మహిమ దానిదే - ఈరోజు రఘు చాలా కోలుకున్నట్టు లేడూ."

"ఊఁ" అంది. మనదేశంలో సగంమందికి మూర్ఖము. మూఢ భావాలపట్ల అచంచల విశ్వాసము. ఒకవైపు రాకెట్లు చంద్రమండలానికి వెడుతుంటే - రెండోవైపు గురువులు, దేవతలు, దయ్యాలంటూ పూజలు పునస్కారాలు చేస్తుంటారు. దైవభక్తి, పాపచింతన మంచిదే. యెంత వరకు! ఆత్మవిమర్శ చేసుకుని తను చేసే పనులు మంచివా, చెడ్డవా అని ఆలోచించేవరకే! మితిమీరితే మూర్ఖత్వము అవుతుంది. సుందరమ్మ లాంటివారు మనదేశంలో కోకొల్లలు.

## 44

"ప్రభ పెద్దది వుండగా, రమకు, వేణుకేం తొందర!" చికాకుగా అంది కాంతమ్మ.

"తొందరే. చూడమ్మా కొన్ని విషయాలలో మీరు నాతో ఏకీభవించక పోవచ్చు. చదువు విజ్ఞాన సముపార్జనకు, ఉన్నతికి తోడ్పడితే మంచిది. మనము చదివించగల్గినా, మన పిల్లలు చదవగలరా? ఆలోచించాలి. ప్రభకు చదివే నేర్పు, ఓర్పు, తెలివితేటలున్నాయి - చదివిస్తున్నాము."

"చిన్నపిల్లలు ఓ సంవత్సరం ఫేలయితే."

"వచ్చే ఏడయినా అంతే. వాళ్ళకు అనవసరమైన ఆలోచనలు వస్తాయి. తమ అందచందాలు, అర్హతలు అటుంచి, ప్రతి అమ్మాయి డాక్టరో, కలెక్టరో కావాలని కోరుకుంటారు. వచ్చిన సంబంధాలు నచ్చక, నచ్చినవారికి వారడిగినది యిచ్చుకోలేక, నడివయసు వచ్చేవరకు పెంచుతున్నారు ఆడపిల్లల్ని. కాలుజారితే వారి తప్పా?"

ఆ మాటలకు ఉలిక్కిపడిందామె. ఆమె పినమ్మ కూతురుంది. ఆమెకు నలుగురు అమ్మాయిలు. చదువుల పేరుతో ఫాషన్లు నేర్చుకున్నారు. డాక్టరు, కలెక్టరు అయితేనే పెళ్ళి చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తిరగగొట్టారు. ఇరవై ఎనిమిది దాటాయి. వారిని గురించి, వారి శీలాన్ని గురించి మంచి అభిప్రాయం లేదు యెవరికీ.

"ఏమ్మా-"

ఉలిక్కిపడి యిటు తిరిగింది. "ఆఁ- ఏం లేదు."

"నాకు వాళ్ళంటే కోపమా అమ్మా. ఇప్పుడు మనము చెబితే వినే స్థితిలో వున్నారు. ఇంకా కొన్నాళ్ళయితే ఊహాజగత్తులో విహరిస్తారు. పెద్దా, చిన్నా అంటూ ఆలోచించే కాలం పోయిందమ్మా. జీవితం ఓ సుందరసౌధం. తెలిసీ తెలియని వయసులో కంటికి పూల నిచ్చెనలు కనిపిస్తాయి. వాస్తవం ఆలోచింపజేయాలి. ప్రతి మెట్టూ జాగ్రత్తగా యెక్కాలి. ఒక్క అడుగు తప్పుగా పడినా, జీవితం కుంటిదయిపోతుంది."

సంభ్రమంగా, గర్వంగా కొడుకువైపు చూచింది కాంతమ్మ. వ్యక్తిత్వము, పురుషత్వము నింపుకుని, సమర్థవంతంగా ఈ సంసార చక్రం నడిపే కొడుకుని చూడనోచని తండ్రిని తలుచుకొని కళ్ళు ఒత్తుకుంది.

"నాకేం తెలుసురా. నీ ఇష్టం. అలాగే కానియ్యి. భగవంతుడు నీ రూపంలో నన్ను ఆశీర్వదించాడు."



"ఏం మాటలమ్మా" తల్లి దగ్గర చాలాసేపు కూర్చుని పైకి వెళ్ళాడు.

దాదాపు పెళ్ళిళ్ళు నిశ్చయమయినట్టే. మొదట గుణిసినా తరువాత సంతోషంగా వున్నారు రేణు, రమలు. చలపతిని పిలిపించి వారితోనే తాంబూలాలు పుచ్చుకున్నారు. బంధువులు వెళ్ళిపోయారు.

"విష్ణూ!"

"ఏమిటి చిన్నాన్నా?"

"ఆడవారి మాటలు వింటే అన్నీ అనర్థాలేరా."

"అదేమిటి!" ఆశ్చర్యంగా చూచాడు.

"వేరుగా వెళ్ళి ఏదో బావుకుందాం అనుకుంది మీ పిన్ని. ఇల్లు నరకంరా. మా అందరి మధ్య రాజీవ్ నలిగిపోతున్నాడు. మా కష్టాలు అటుండనీ. వాడు పూర్తిగా మారిపోయాడురా. త్రాగుడు, వాడితోబాటు వాసంతి కూడా త్రాగుతుంది."

"చిన్నాన్నా?"

"పోనీలే. ఒకసారి వచ్చి నువ్వయినా చెప్పు. వింటాడేమో."

"అలాగే!" చలపతి వెళ్ళిపోయినా విష్ణు అలాగే నిలబడ్డాడు. "వెర్రి గంతులు! త్రాగటం నాగరికతా! ఏమో."

"మంచివాళ్ళకే కష్టాలు వస్తాయేమోరా? సరళ యెంత మంచిపిల్ల" కాంతమ్మ అంది.

"యెందుకమ్మా?" దేనికి ఉపోద్ఘాతమో తెలియక అడిగాడు.

"రోజా పూలమొక్కలలోనేనట పని. కనకాంబరాలు, మల్లెలు పూయిస్తుందట. జీతగాడు వచ్చాడు. రోజుకు పది రూపాయలు వస్తున్నాయట."

"అలాగా" అన్నాడు. "అభిమానురాలు" అనుకున్నాడు.

చెల్లెండ్ల వివాహాలు వున్నంతలో క్లుప్తంగా, చక్కగా చేశాడు విష్ణు. ఉదయ్, వాసంతి బంధువుల్లా వచ్చి, అదిలేదు, యిదిలేదు అని ఆక్షేపించి వెళ్లిపోయారు. వధూవరులను చూచి అందరూ ముచ్చటపడ్డారు. "వాడిదంతా ప్లాను ప్రకారంగా జరగాలి" అనుకుంది సుమతి మొదటి సారిగా. సుజాతతో ప్రేమగా మాట్లాడింది.

## 45

"అన్నయ్యా! నా గురించి ఇంత సంకుచితంగా ఆలోచిస్తావని నేను యెప్పుడూ అనుకోలేదు" వాసు ఆవేశంగా అన్నాడు. అతని ముఖం ఎర్రగా, రక్తం కక్కేలా వుంది.

"చూడు వాసూ! నా మాటలు నిన్ను బాధపెడితే క్షమించు. పక్షులు రెక్కలు వచ్చేవరకే గూటిని అంటిపెట్టుకుని వుంటాయి. నీకయినా ఏం బాధ్యతలున్నాయి! చంద్రమౌళిగారు కూతురుతోపాటు వ్యాపారమంతా అప్పగిస్తాడట. ఉద్యోగంకంటే స్వతంత్రంగా బ్రతకడం మంచిదేగా."

"ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పన్నయ్యా."

"అడుగు!"

"చంద్రమౌళిగారింట్లో నేను స్వతంత్రంగా బ్రతకగలనంటావా? పోనీ, నేను ఇల్లరికం వెళ్ళటం నీకిష్టమేనా!"

"ఇప్పటికే కుటుంబం శ్రేయస్సుకోరి, మీకు ఇష్టంలేనివి, నాకిష్టమైన పనులు చాలా చేయించాను. ఇంకా నిరంకుశత్వంగా ప్రవర్తించలేను."

"నా ప్రశ్నకు సమాధానము అదికాదు."

"చూడరా, ఉదయ్ విషయంలో సూటిగా చెప్పి అవమానము పాలయ్యాను. అందుకే-"

"అది కాదన్నయ్యా! చంద్రమౌళి ఆస్తితో నేను బాగుపడతానంటావా?"

"నా అభిప్రాయం మనిషి స్వయంకృషితో పైకి రావాలి. నీకు అభ్యంతరం యెందుకు? ఆడపిల్లల బాధ్యత లేదు. ప్రభ యెలాగూ ఎక్స్ట్రాయే."

"అన్నయ్యా! మీకు కర్కోటకుడని పేరు ఎవరు పెట్టారోగాని చాలా బాగా ఆలోచించి పెట్టారు. మీరు కర్కోటకులే" చరచర మెట్లు దిగాడు. సుజాత యెదురయినా పలుకరించలేదు. ఆశ్చర్యపోతూ పైకి వెళ్ళింది.

"వాసును ఏమయినా అన్నారా?"

"లేదే! వాడలా చెప్పాడా?"



"లేదు. అతని శ్వాస హోరు, నడక జోరు చూస్తే ఏదో జరిగిందనిపిస్తుంది."

"ఏం లేదు. వ్యక్తిత్వం అబ్బిందా? డబ్బు, పేరు వింటూనే అన్నీ మరచిపోతాడా అని ఒక ఊపు ఊపి చూచాను."

"ఓహో!"

"ఉదయ్‌లాంటివాడు కాడు. మనిషిలా బ్రతుకుతాడు. వయసు ప్రభావంవల్ల ఆవేశం సహజమేననుకో."

"రమ ఉత్తరం రాసింది. చదివి అత్తగారికి వినిపించాను."

"అబ్బో, శ్రీరామచంద్రుడు నా కొడుకంటూ."

"పాపం నిన్ను సీత అనలేదా?"

"అనాలని నాకేం లేదు. పిచ్చి సీత ఏం సుఖపడిందని!"

"పోనీ, నువ్వు సుఖపడుతున్నావా?"

"ఉహూ-" వెక్కిరిస్తూ అతని సరసనే కూర్చుంది.

"బోరుగా వుంది. సినిమాకు వెడదామా?"

"మీకు అంత తీరుబాటు వుంటే వద్దంటానా?"

"మరి త్వరగా తెములు. ఆడవాళ్ళ ముస్తాబుపట్ల వచ్చే కార్టూన్లు నిజం చేయకు."

"అయిదు నిముషాలు. ప్రభ కూడా వస్తుంది. రమా వాళ్ళు వెళ్ళిపోయారా-ఒక్కర్తే అయిందే." సుజాత వెళ్ళిన దిక్కే చూచాడు. మనుష్యులు పూర్తిగా స్వార్థపరులయి, తను, తన భర్త అనే ఈ రోజులలో సుజాత లాంటివారు అరుదుగా కనిపిస్తారు. అతనేదో గుర్తుకు వచ్చినట్టు, కోటు జేబులు వెతకసాగేడు, బట్టల స్టాండ్ వద్ద.

"రడీ సర్" సుజాత వచ్చింది.

"కళ్ళు మూసుకుంటే మంచి బహుమతిస్తాను."

"సరే" కుతూహలంగా కళ్ళు మూసుకుంది. మెడలో బరువైన వస్తువు పడగానే కళ్ళు విప్పింది.

"అప్పుడేనా, గాజులు వేయొద్దూ." విసుక్కుంటూ చేతులకు రెండేసి గాజులు వేశాడు. చెవులవంక అసహాయంగా చూచాడు. పెద్ద పెద్ద రింగులు

వ్రేలాడుతున్నాయి. సంభ్రమంగా చూచింది. కెంపులు, ముత్యాలు పొదిగిన సెట్టు. తన యిష్టము అతనికెలా తెలుసు!

"యెక్కడివి?"

"దొంగిలించాను."

"మనసులు దొంగిలించే నేర్పే కాక, వస్తువులు కూడా దొంగిలిస్తావా, మహాశయా!" అన్నది పొంగి పొరలే సంతోషం అదుపులో పెట్టుకుంటూ. మగవాడికి శాసించే గుణం, ప్రేమించే గుణం సమంగా వుండాలి. గంగిరెద్దులా తలూపటం అసహ్యంగా వుంటుంది.

"మరేం చేద్దాం. నీలాంటి భార్య వుంటే" దగ్గరగా వచ్చి, ఆమె వంక ఆరాధనాపూర్వకంగా చూచాడు. "సుజా! పురుషుడు వేసే ప్రణాళికలు విజయవంతం కావాలంటే, దానికి స్త్రీ అండదండలు యెంతో అవసరము. నీ సహకారం లేకపోతే ఈ సుడిగుండం నుండి బయటపడేవాడినా? నీకోసం ఈ మాత్రం కొనలేనా?"

"కొనలేరని కాదు, అత్తయ్య...."

"అత్తయ్య అభ్యంతరం చెబుతుందనా? అమ్మకు నాపై కంటే నీపైనే ప్రేమ ఎక్కువ. నీకేం కొనలేదని యెన్నిసార్లు నాతో దెబ్బలాడిందామె."

"అదంతా నా అదృష్టము. కోడళ్ళు చేసే పనులు గుర్తించే అత్తగార్లు యెందరున్నారంటారు?" అన్నది.

"వదినా! నేను రడీ" ప్రభ వచ్చింది. ఇద్దరూ బయటికి వచ్చారు. అలా ముగ్గురూ సినిమాకు వెడుతుంటే సుజాతకు తను రఘు, సరళతో వెళ్ళిన రోజులు గుర్తుకు వచ్చాయి. ఓ నిట్టూర్పు వదిలింది.

మర్నాడు ఆఫీసులో అడుగుపెట్టి ఆశ్చర్యపోయింది సుజాత. ఆమె సీట్లో వాసు కూర్చుని వున్నాడు. వదినను చూడగానే గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డాడు. "రండి వదినా!" కుర్చీలాగి కూర్చోమన్నట్టు సైగచేశాడు. సుజాత నవ్వుతూ వెళ్ళి కూర్చుంది.

"మీకు యెప్పుడు వీలుంటే అప్పుడు ఈ ఆఫీసు రికార్డంతా నాకు చూపి, ఛార్జీ యిచ్చివేయాలి."

"మరి నేనేం చేయాలి?"



"ఇంటిదగ్గర పనులు చాలా వున్నాయి."

"ఎం.ఏ., చదివి...."

"ఎం.ఏ., చదవగానే ఉద్యోగం చేయాలని ఎక్కడున్నది? మా పనులు మేం చేసుకుంటే తప్పేం వుంది?"

సుజాత విస్ఫారిత నేత్రాలతో చూచింది. తను అడిగినంత డబ్బు యివ్వలేదని మూతి ముడుచుకునే వాసేనా ఇతను! దినమంతా కూర్చుని అతనికి ఆఫీసు విషయాలు వివరించింది. గుమస్తాలు ఎవరు యెటువంటి వారో తెలియ చేసింది.

"మరి బాస్ గుణగణాలు చెప్పవేం?" గంభీరంగా అడిగాడు. అంతకంటె గంభీరంగా ముఖం పెట్టింది.

"ఒట్టి కర్కోటకుడు. పనికీ, అతనికీ లంకె. ఎలా వేగుతావో?"

వాసు నవ్వేశాడు! సుజాత శ్రుతి కల్పింది.

"నువ్వు ఆటోలో వెళ్ళిపో వదినా! అన్నయ్య యెన్ని గంటలకొస్తారు?"

"సాధారణంగా మూడు, నాల్గు గంటల మధ్య వస్తారు."

వాచ్‌మెన్‌ను పిలిచి, ఆటో తెప్పించి ఆమెను పంపాడు.

విష్ణు త్వరగా తన ప్రయివేటు రూమ్ కెళ్ళి, కోటు సోఫాపై పడేశాడు. తిరిగి తిరిగి అలసిపోయాడు. సుజాత ఆఫీసు పనిచేస్తోంది. బయటికి వెళ్ళలేదు. రోజుకుమల్లే చిరపరచితమైన గాజుల శబ్దం వినిపించలేదు. షర్టు చేతులు పైకి మడిచి రెండు చేతులలో, రెండు కప్పులు పట్టుకొని వచ్చి జాగ్రత్తగా స్టూల్‌పై పెట్టాడు వాసు. విష్ణు ఆశ్చర్యంగా చూశాడు తువాలుతో ముఖం అద్దుకుంటూ.

"సుజాత లేదా?"

"ఇంటికి వెళ్ళింది" విష్ణు కూర్చున్నాక, అతనికెదురుగా కూర్చున్నాడు.

"ఏమయిందిరా?" మెల్లగా అడిగాడు కాఫీ తీసుకుంటూ.

"ఏం కాలేదు. సిన్సియర్‌గా వర్క్ చేసి మొగాళ్ళపేరు పాడు చెయ్యకమ్మా - అని నిరుద్యోగి హోదాలో ఆమెను సస్పెండ్ చేశాను."

విష్ణు ఫక్కున నవ్వాడు. ఆ నవ్వుతోనే తెలిసిపోయింది అన్న తనను అభినందిస్తున్నాడని.

"ఒరేయ్ నాయనా! ఆ మాట పైకి అనేవు. ఇప్పటికే దేశం అంతటా సత్యాగ్రహాలు. నిరసన వ్రతాలు చెలరేగాయి. నీ ధైర్యంచూచి మరికొందరు నిరుద్యోగులు వెళ్ళి స్త్రీలను సస్పెండ్ చేయగలరు." ఈసారి వాసు నవ్వాడు హృదయపూర్వకంగా.

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. దేశసేవ చేయక పోయినా కనీసం నా వ్యాపారం నేను చేసుకుంటే నిరుద్యోగులకు అండగా నిలిచిన వాడినవుతాను. ఆస్తులు తెగనమ్మి చదివిన నిర్భాగ్యులకు ఉద్యోగం రాని...."

"దేశంలో నూటికి పదిమంది నీలా ఆలోచిస్తే నిరుద్యోగ సమస్యే వుండదు" అన్నాడు, తృప్తిగా ఊపిరి పీల్చుకుంటూ. "మూలకూర్చున్న ముసలమ్మ కూడా ప్రభుత్వ ఉద్యోగం అంటే లేచి కూర్చుంటుందీ రోజులలో."

"అదీకాక సెక్యూరిటీగల జాబ్ కదన్నయ్యా. రిస్కులేదు. పనిచేసినా మానినా జీతం వస్తుంది."

"పని ఉందంటూ విష్ణు వెళ్ళిపోయాడు. వాసు ఆఫీసులో వుండి పోయాడు. వారంరోజులలో వాసు కార్యదీక్ష అర్థం అయింది.

వాసు సీరియస్‌గా పనిచేసుకుంటుండగా ఫోను వచ్చింది.

"హల్లో వాసూ, నేనురా, ఓ ఫియట్ అమ్మకానికి వచ్చింది! నువ్వు వచ్చి చూస్తే కొనేద్దాము" ఫోను పెట్టేసి అలాగే నిలబడిపోయాడు. ఒక నాడు నిరంకుశత్వంతో శాసిస్తాడనుకున్న అన్నయ్యేనా, కారు కొనడంలో తన సలహా అడుగుతున్నాడు. ఎందుకు? బరువు బాధ్యతలు తెలుసనేగా.

పదకొండువేలకు కారు కొన్నారు. ఇద్దరూ ఇంటికి బయలుదేరారు.

"నాకు ద్రాక్షతోట వేయాలని చాలా రోజులనుండి మోజుగా వుందన్నయ్యా."

"మంచిదే, పడమటివైపు పొలం బావుంటుందేమో?"

"అది బాగానే వుంటుంది. రోడ్డుప్రక్కదయితే యింకా బావుంటుంది."



"నీ ఇష్టం, సులువు ప్రకారము చూసుకో."

కారు ఇంటి ముందు ఆగింది. వాసు ఫక్కున నవ్వుతూ "అన్నయ్యా అటు చూడు."

విష్ణు వాసువైపు తిరిగి చూచాడు. కారును చూచి కంగారుగా యెవరో కొత్త వారనుకుని తోడికోడళ్ళిద్దరూ, భుజాలమీదకు పమిటలు లాక్కుని, శ్రీరామ్‌ను తీసుకుని లోపలికి పోతున్నారు.

"మనమని, కారు కొన్నామని ఏం తెలుసు?" అని తను దిగి తల్లిని, పిన్నిని పిలిచాడు విష్ణు.

"మీరేనా? కారు యెక్కడిదిరా?"

"కొన్నాము" అంటూ రెండో ప్రక్కనుండి దిగాడు వాసు.

"యెలా వుందమ్మా కారు?"

కాంతమ్మ అలాగే చూస్తూ వుండిపోయింది. మీరిద్దరూ దిగిరావటం యింకా బావుంది అని చెప్పాలనుకుని చెప్పలేకపోయింది.

"ఇద్దరూ తీరుబడిగా కూర్చున్నారు. ఏనేం లేదా ఏమిటి?" వాసు నవ్వుతూ అడిగాడు.

"ఆఫీసులో పనిలేదని, మీ వదిన ఇంట్లోపని మొదలుపెట్టింది." కమలమ్మ అన్నది. అందరూ లోపలికి వెళ్ళేసరికి టీ తెచ్చిపెట్టింది సుజాత.

టీ త్రాగి పేపరు చూస్తూ వరండాలో కూర్చున్నారు. సుజాత కూడా వచ్చింది.

"ఏమండీ! కమలత్తకు మరిది వివాహము చూడాలని చాలా కోర్కెగా వుంది."

"పోట్లాట కావాలని తమరికి వున్నట్టుంది" వాసు పరిహాసము చేశాడు.

"మరే" సుజాత వెక్కిరించింది.

"పిన్ని కోర్కెలో అసమంజసం, అసందర్భం ఏంలేవు. భర్తృవిహీన అయిన స్త్రీ, పిల్లల సుఖాలలోనే స్వర్గం చూస్తుంది."

"ఇంత ఉపోద్ఘాతం దేనికన్నయ్యా! వివాహము వద్దని అనలేదుగా"

"మరి అమ్మాయిని-"

"అదంతా పెద్దవాడివి నీ యిష్టము."

"నష్టపోతావ్ మరిది" సుజాత పరిహాసం ఆడింది.

"అన్నయ్య ఛాయిస్ లాభసాటిబేరమని నిన్ను చూచి తెలుసుకున్నాను."

"ఒరేయ్ వాసూ, నన్నిలా బ్రతకనియ్యరా" విష్ణు భయము నటించాడు.

'పెద్దన్నయ్య యింత సరళంగా వుంటారా', అని ప్రభ ఆశ్చర్యపోయింది.

* * *

పది దాటాక పైకి వచ్చింది సుజాత. విష్ణు ఆవులిస్తూ తన రైటింగు బల్లముందు నుండి లేచాడు.

"ఆఫీసులో ఉన్నప్పుడే నయం తొందరగా వచ్చేదానివి."

"అత్తయ్య కొడుకును దీవిస్తూ, పొగుడుతూ-"

"ఏమని దీవించిందేమిటి?"

"కొడుక్కి ఓర్పు నేర్పు చాలా వుందట. అందుకని కనీసం పది మంది సంతానముతో-"

"ఆగాగు. నాకు నేర్పున్నా పదిమందిని కనిపెంచే ఓపిక నీకుందా?"

"అంటే?"

"ఇంకేం, నావైపు నుండి మరో ఇద్దరిని కలుపుకో, డజను అవుతారు" కొంటెగా కళ్ళు చికిలించాడు.

"మీరు చాలా మారిపోయారు."

అతను పెద్దగా నవ్వాడు. "నీ రిసర్చికి అభినందనలు."

"నిజం. ఇంత స్వచ్ఛంగా, హృదయపూర్వకంగా నవ్వటం ఏనాడూ చూడలేదు."

"బాధ్యతలు, సమస్యలు వచ్చే నవ్వును అణచివేస్తాయి. నాన్నగారు పోయిన క్రొత్తలో సాలీడు గూటిలో చిక్కుకున్న పురుగులా గిలగిలలాడాను. నాన్నగారికిచ్చిన మాట నిలబెట్టుకోలేనేమో, చచ్చిపోవాలనుకున్నాను...."

"వద్దండి" అతని నోరు మూసేసింది.



వారి ఆనందం అట్టేసేపు నిలువలేదు. చలపతి బిక్కమొహంతో వచ్చాడు. ఉదయ్, అతని భార్య ప్రవర్తనకు విసిగిపోయిన రాజీవ్ యిల్లు వదిలిపోయాడు.

"యెప్పుడు చిన్నాన్నా?"

"రెండు రోజులు అయింది. అంతటా వెతికాం. ఇక్కడ వుంటాడన్న ఆశ వుండి వచ్చాను." అతని ముఖం పాలిపోయింది.

"నువ్వేం దిగులుపడకు. నేను వెతికి తీసుకువస్తాను" హామీ యిచ్చాడు.

"సుజాతా! చిన్నాన్నకు అన్నం పెట్టు."

"వద్దురా."

"దిగులుగావుంటే వాడు కనిపిస్తాడా?"

## 46

రఘు శారీరకంగా బాగా కోలుకున్నాడు. దృఢంగా, పచ్చగా అయ్యాడు. భార్య కళ్ళెదుట వుండటం తృప్తిగానే వుంది. అయినా అతని అనుమానాలు అతనికి వున్నాయి. అతను పేపరు చూస్తున్నా, దృష్టి అక్కడలేదు. వంట చేస్తున్న భార్యను కేకవేశాడు.

"ఏమండీ, టీ కావాలా?"

"అక్కరలేదు. నువ్వు ఉద్యోగం పూర్తిగా మానేశావా? యెందుకు?"

"మీకిష్టంలేదని" తలవంచుకుంది.

"మంచిపని చేశావు" అది వెటకారమో, నిజమో తెలియలేదు.

అతను యింకా ఏదయినా మాట్లాడుతాడేమోనని చాలాసేపు చూసింది. అతను పై కప్పుకేసి చూస్తుంటే ఆమె వంటింట్లోకి వెళ్ళిపోయింది. రోజూ అడిగినట్టు రెండుసార్లు "వంట అయిందా సరూ!" అని అడగలేదు.

త్వరగా వంట ముగించి కంచాలు పెట్టింది.

"రండి భోజనానికి. మీపిల్లలు గొడవ చేస్తున్నారు" అన్నది నవ్వుతూ.

"ఆఁ.... ఏమిటి?" భావరహితంగా చూచాడు.

"భోజనం చేద్దాం రండి."

"సరళా! నేను ఇల్లు కదలటం లేదు. నువ్వు ఉద్యోగం మానేశావు. ఈ ఖర్చులకు డబ్బు యెలా వస్తోంది?"

"........."

"మాట్లాడవేం?"

"ఇప్పుడు అవన్నీ యెందుకు?"

"ఒహో! నువ్వింత ముద్ద వడేస్తున్నావు. అదే ప్రసాదం అనుకోమంటావా?"

"..........."

"వాడే - ఆ డాక్టర్ రాజన్ పంపిస్తున్నాడు కదూ!"

"మీకెలా చెప్పాలి?" దెబ్బతిన్నట్టు చూచింది.

"మీరు అసమర్థులు, సంపాదన లేనివారని చెప్పడానికి యింత తికమక పడాలా?"

"అలా అనుకుంటే, ఈరోజు యిక్కడ వుంటానా?"

"నోరుముయ్యి."

"మీకెట్లా ఇష్టమో, నన్నేం చేయమంటారో చెప్పండి. నన్ను ఈటెల లాంటి మాటలతో బాధించవద్దు" అన్నది బాధగా.

"నేను చెప్పడము, నీవు వినడం యెప్పుడో గతించింది. రాజన్ వ్యక్తిత్వాన్ని పొగిడేనాడే నీ అసలు రూపం బయటపడింది" అన్నాడు లేచి పచార్లు చేస్తూ. "నీవు మెత్తని కత్తివి. భర్త దగ్గర ప్రేమ నటిస్తూ, ప్రియుని దగ్గర హొయలు కురిపిస్తావు."

"ఆపండి.... మీ మనసు గాయపడరాదని ఊరుకుంటే మితిమీరి పోయింది మీ ప్రవర్తన. మీకోసం మీ చెల్లెలు సుజాత ఈ ఖర్చులన్నీ భరిస్తోంది. ఇది ఆమె పాలమే."

"సుజాతా?" అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"అవును. ఆమె సాయంత్రము వస్తుంది, అడగండి."

"ఛీ.... ఛీ... సిగ్గులేదూ! ఆడపిల్ల సొమ్ము తింటామా? వారి దయాభిక్ష స్వీకరించటానికి నేనేం భిక్షగాడినా."



"అదేదో మీరే తేల్చుకోండి. అడుక్కుని తాగలేదా! అప్పుడు లేని సిగ్గు యిప్పుడెందుకు?"

"ఛీ.... యింత బ్రతుకు బ్రతికి..."

"యెంత బ్రతుకేమిటి? మా తాతలు నేతులు త్రాగారు అన్నట్టు మాట్లాడితే యెవరికీ సమ్మతి కాదు. మీకోసం వాళ్ళు సాయం చేశారు. స్వీకరించాము. దానికేదో పరిష్కారమార్గము చూడాలిగాని, దురభిమానం పనికిరాదు."

"చాల్లే, నీ తెలివి తేటలు. నోరుముయ్యి."

"నిజమే. నాకే తెలివితేటలుంటే మీరు తెచ్చే జీతం ఆదా చేద్దును. నోరుచేసి మిమ్మల్ని, ఇంట్లో వారిని అదుపులో పెడుదును. శాంతం, సహనం పేరిట, నా బాధ్యత విస్మరించాను. ఇటు సుఖమూ లేదు - అటు పేరూ లేదు" ఆవేశంగా అరిచింది. రఘు తగ్గిపోయాడు. కొందరి తత్వమే అంత. ఉరికినంతవరకు తరుముతూనే వుంటారు. వెనుతిరిగి ఆగితే భయపడతారు.

"ఇంతకీ నువ్వు అనేది ఏమిటి?"

"అనుమానం పెనుభూతం అంటాను. ఆవేశం పనికిరాదంటాను. మనకేమయింది? మనకంటే హీనస్థితిలో ఉన్నవారు ఎందరు లేరు? కష్టాలతో త్రాగుతున్నారా? బాధ్యత విస్మరిస్తున్నారా? ఆస్తి, పాస్తులు కావాలని నేను అడగలేదు."

"మరి ఈ ఏడుపు యెందుకు?"

"మీ నైజానికి. ప్రతిదీ అపార్థమేగాని, అర్థం చేసుకోరు. ఇప్పటికయినా మించిపోయిందేం లేదు. ఇద్దరం పనిచేసుకు బ్రతకవచ్చు. మొగాళ్ళు నా వెంటపడటానికి నేనేం బాలాకుమారిని కాను, అందకత్తెను అంతకంటే కాను."

"ఊఁ" గాఢంగా నిట్టూర్చాడు.

"వాడికి అసలే మతిలేదంటే నీ సాధింపులేమిటే. మీ పుట్టింటివారిది పోగొట్టాడా! వాడిది వాడు నాశనం చేసుకున్నాడు. మధ్య నువ్వెవరు?" సుందరమ్మ అందుకుంది.

"నేను యెవరినో వివరించి చెప్పాలా? మీలాంటి మనుష్యులున్నంత కాలం సంసారాలు బాగుండవు. నా బిడ్డల్ని తీసుకుని నేను వెళ్ళిపోతాను. వారిని మీరు బాగు చేసుకోండి" అన్నది. ఆమెకు సహనము నశించింది.

"అయ్యో, అయ్యో! ఏం మాటలే? నాకు చావెందుకు రాదు" దినమంతా ఏడ్చింది. సాయంత్రం సుజాత రాగానే  రాగాలుపెడుతూ కోడలు అన్నమాటలు చెప్పింది. సుజాత క్షణం ఆలోచించింది.

"అమ్మా! వేళకు తిండిలేక యెంతగా చిక్కిపోయావో చూడు. కొన్నాళ్ళు నా దగ్గర వుందువుగాని రా. కమలత్త కూతురు దగ్గర కెళ్ళింది. అత్తయ్య ఒంటరిగా వుంటుంది."

"అలాగేనే. నాకెవరూ లేరనుకుంటుంది మీ వదిన."

వాళ్ళు వెళ్ళిపోయాక, సరళ ఒంటరిగా కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టింది. రఘూ ఉదయము తిని వెడితే, సాయంత్రమే ఇంటికి వస్తాడు. మతి చలించిన మనిషి. దారిలో ఏమైనా ఏది దిక్కు? తను ఇక లీవు పొడిగించితే ఊస్టు చేస్తారు. అంతవరకు లీవు యివ్వడం కూడా విష్ణుకూ, వాళ్ళకూ వున్న పరిచయమువల్లే.

ఓ మధ్యాహ్నము అకస్మాత్తుగా వాసు వచ్చాడు. రఘు యింకా ఇంటికి రాలేదు.

"అక్కయ్యా! అన్నయ్య మీకో విషయము చెప్పమన్నాడు. ఆయనే వచ్చేవారు. రాజీవ్ కోసం వెతుకుతున్నారు. బావ ఆఫీసుల చుట్టూ, బడుల చుట్టూ ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు. ఈ కాలంలో ఉద్యోగం యిచ్చేది యెవరు? రికమండేషన్ లేనిదే ఎవరూ యివ్వరు. అన్నయ్య రికమండేషన్ నిరాకరించాడట. సుధా మెమోరియల్ స్కూల్ హెడ్‌మాష్టర్ మనకు బాగా తెలుసు. అక్కడో లెక్కల పోస్టు ఖాళీగా వుంది. మేం అన్ని ఏర్పాట్లూ చేశాము. బావను అక్కడకు పంపే భారము మీది."

"బాబూ!" కంట నీరు పెట్టింది."

"మరిక వెళ్ళిరానా?"

"వుండు బాబూ, కాఫీ అయినా తీసుకుని వెళుదువుగాని."

"ఇంకోసారి వస్తాను అక్కయ్యా! చాలా పని వుంది."



అతను వెళ్ళిపోయాక  నెమ్మదిగా పొలంవైపు వెళ్ళింది. కూరల మడులు యెండుతున్నాయి. అదే విషయము జీతగాడితో చెప్పింది.

"నాకు తలనొప్పిగా వుందమ్మా. ఒంగి నీళ్ళు మలుపుతుంటే తల పడిపోయేలా వుంది."

"నేను నీళ్ళు మలుపుతాను."

"అమ్మా!" నోరు వెళ్ళబెట్టాడు. "యిప్పటికే మీరు చాలా పనులు చేస్తున్నారు".

"ఫరవాలేదు. ఊరికే తింటున్నామన్న బాధ వుండదు" అని నీళ్ళు మలుపుతోంది. అలవాటు లేని పనులు. చెమట పట్టింది.

"సరూ" తలెత్తింది. రఘు నిలబడి వున్నాడు. మధ్యలో వదిలేస్తే యెలా అని ఆలోచిస్తుండగానే, చలపతి, జీతగాడు వచ్చారు.

"అయ్యగారు వచ్చారు. మీరెళ్ళండమ్మా" అతను అనగానే కాళ్ళు కడుక్కుని వచ్చింది. "అయ్యా! ఊరెలాంటిది" అని వెనుక యెవరో అడిగితే "మొదట నీ నోరెలాంటిదో చెప్పు" అన్నారట. అలాగే, సరళ తన సరళత్వంతో అందరినీ ఆకట్టుకుంటోంది-అనుకున్నాడు.

"ఈరోజు తొందరగా వచ్చారేం?"

"తిరిగి, తిరిగి కాళ్ళు పడిపోతున్నాయి సరూ! యెక్కడికెళ్ళినా "ఏజ్" అడ్డు వస్తోంది. ఏం చేయను." యిద్దరూ షెడ్డు చేరుకున్నారు. పిల్లలు, చలపతి పొలంలో సొరకాయలు తెంపి గంపకెత్తుతున్నారు. "తల్లి పోలికలు వచ్చాయి" అనుకున్నాడు.

"సరళా!"

"చెప్పండి."

"నా బలహీనత అర్థం చేసుకో. నేను పిచ్చిగా మాట్లాడితే క్షమించు. నీవు నిజంగా మనిషివి. అభిమానము, మనసు వున్న మనిషివి. మనము ఒకరికి బరువు కావద్దనే కదా, ఈ పనులన్నీ చేస్తున్నావు" అతని కళ్ళు నిండుకున్నాయి.

"మీరు అన్నారని నాకేం బాధ లేదు. మీరు ఆరోగ్యంగా వుంటే అదే చాలు."

"నీవన్నది నిజమే సరూ! ఇద్దరం పనిచేసుకుని బ్రతకవచ్చు."

"మీరు చేస్తామంటే, పనులవే దొరుకుతాయి. మొదట ముఖం కడుక్కోండి." అతను ముఖం కడుక్కు వచ్చాక హార్లిక్సు యిచ్చింది. పిల్లలు చెరో సొరకాయ పట్టుకుని వచ్చారు. వారు కాళ్ల చేతులు కడుక్కుని, తల్లితో పాఠాలు చెప్పించుకుంటుండగా, అతను పరీక్షగా చూశాడు. సరళకు పాపిట్లో వెంట్రుకలన్నీ తెల్లబడ్డాయి. కళ్ళక్రింద నల్లటి వలయాలు యేర్పడ్డాయి. బుగ్గలు పీక్కుపోయాయి. చేతికివున్న నీలం మట్టిగాజులు వదులయి మోచేతివరకు పోతున్నాయి. అతని హృదయం ఆర్ద్రమయింది. మొదటిసారి ఆమెను చూచినప్పుడు యెలా వుండేది. ముద్దబంతి పూవులా, ముద్దుగా వుండేది.

"పదండి, అన్నాలు పెడతాను."

"నీతోనే కూర్చుంటాము అమ్మా!"

"ఇంకో రోజు..."

"వద్దు సరళా! అందరికీ వడ్డించు. అందరం తిందాము" ఆమె భర్త వంక ఒకసారి చూసి వడ్డించింది. భోజనాలు కాగానే పిల్లలు అలసి నిద్రపోయారు. సరళ పని ముగించుకుని వచ్చింది. పిల్లల ప్రక్కన కూర్చోబోయింది. రఘు చేయిచాపాడు. అతని చేయి పట్టుకుని లేచి మంచంలో కూర్చుంది.

"ఒక మాట చెప్పనా!"

"చెప్పు ప్లీజ్.... మాట్లాడు సరూ."

"సుధా మెమోరియల్ స్కూల్‌లో మాథ్స్ టీచర్ పోస్టు ఖాళీగా వుందట. ఒకసారి ప్రయత్నించండి. ప్రయివేటు బడి కాబట్టి ఏజ్ రిస్ట్రిక్షన్ వుండదనుకుంటాను."

"అలాగే" చాలా రోజుల తరువాత భార్యాభర్తల మధ్య అడ్డుగోడ కూలిపోయింది.

మర్నాడు అపాయింట్‌మెంటు ఆర్డర్‌తో వచ్చాడు రఘు. అతని ఆనందం యింతా, అంతా కాదు. పిల్లలను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.



"సరళా... ఓ సరళా... ఈరోజు మనం ఇల్లు మారాలి."

"ఒక నెలజీతం చేతికందనీయండి."

"నాకదంతా తెలియదు. ఇక్కడ నాకు ముళ్ళమీద వున్నట్టుంది. అందుకే బడికి దగ్గరగా చూచాను. ముప్పై అయిదు. ఒకే గది అయినా, బాగానే వుంది.

"సరే" అన్నది. ఆమెకు అతనితో వాదం పెట్టుకోవటం ఇష్టం లేదు. కాని ఇల్లు గడిచేది యెలా? అమ్మడానికేం వుంది. ఈ తోటలో డబ్బు అంతగా అవసరం అనిపించదు. ఉదయం పాలు తీయగానే కొన్ని సరళ కిస్తారు. కూరలు, పళ్ళు ఊరికినే వస్తాయి.

తన అసహాయతను, రఘు మొండి పట్టుదలను వివరిస్తూ సుజాతకో ఉత్తరం రాసి పంపింది.

## 47

విష్ణు విసిగిపోయాడు. రాజీవ్ ఆరా తెలియలేదు. సుశీలమ్మ మంచం పట్టింది. పేపర్లో వేయిద్దామా? అని ఒకోసారి అనుకునేవాడు! అప్పుడే టెలిఫోను మ్రోగింది!

"హల్లో - యెవరూ-వాసు-ఏమిటి? మద్రాసు వెళ్ళాలా!"

అతను ఆలోచనలోపడ్డాడు! మంచి సీజన్. తను ఏమాత్రం అశ్రద్ధ చేసినా సంవత్సరం పొడవునా బాధపడాలి. ఒకసారి సుశీలమ్మను చూద్దాం అని వెళ్ళాడు. హాల్లోని దృశ్యం చూసి స్థాణువులా నిలబడిపోయాడు. వాసంతి దుస్తులు అధునాతనంగా వున్నాయి. అది మామగారి యెదుట అలా మాట్లాడుతుంటే అసహ్యము వేసింది.

"మీరిలా వుంటారనే, వాళ్ళు అలా తయారయ్యారు" భర్తను యెగదోస్తోంది.

"నాన్నా! ఏం చేశారు మార్కెట్టునుండి తెచ్చిన డబ్బు?" ఉదయ్ నిలదీశాడు.

"నేను త్రాగలేదు, తగలెయ్యలేదు. మీ అమ్మకు మందులు కొన్నానురా?"

"చూచారా మనము త్రాగుతున్నామని ఆక్షేపిస్తున్నాడు" వాసంతి గొంతు జీరబోయింది.

"ఏం కూశావ్ ముసలి నక్కా!" ఉదయ్ తండ్రిపైకి చేయిలేపాడు. బలహీనంగా వున్న చలపతి ఉండచుట్టుకుపోయేవాడే! కాని ఉదయ్ చేయి గాలిలో ఆగడమేకాక అతని గూబ గుయ్యిమంది.

"పెళ్లాం ముందు తల్లిని, తండ్రిని అవమానించే స్థితికి వచ్చావట్రా! రాస్కెల్!" విష్ణు కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"అన్నయ్యా!" చెంప అదుముకుంటూ, అనుకోని ఈ సంఘటనకు తెల్లబోయినట్టు నిల్చున్నాడు.

"వరసలు గుర్తున్నందుకు సంతోషం" అని వాసంతి వైపు తిరిగాడు. "ఏమ్మా! బి.ఏ.లో బండబూతులు నేర్చావా! నీ త్రాగుడు అలవాటు నీకు నాగరికతగా కన్పిస్తే, వేరే యింట్లో తాగి తందనాలు ఆడుకో. పెద్దలు, తల్లితండ్రులపైకి వాడిని వుసికొలిపి పశువును చేస్తావా?"

'మధ్య మీరెవరు' అనాలనుకుంది. కాని విష్ణు ముఖం చూచి మాటలు మింగేసింది.

"ఉదయ్, నేను మద్రాసు వెడుతున్నాను, వచ్చేసరికి ఇల్లు ఖాళీ చేయాలి. లేకపోతే చేయించాల్సి వస్తుంది. చిన్నాన్న, పిన్ని నా దగ్గర వుంటారు."

"అన్నయ్యా! నువ్వు జరిగిందేం వినలేదు!"

"వినాల్సిన పని కూడా లేదు." విసురుగా గదిలోకి వెళ్ళాడు. తలపట్టుకుని ఏడుస్తూంది సుశీలమ్మ.

"పిన్నీ!" అంతకుమునుపు అంత కోపంగా మాట్లాడిన స్వరానికి, యిప్పుడు పిలిచే మృదువైన పిలుపుకు అసలు పోలికేలేదు.

"విష్ణూ! నాకు చావెందుకు రాదురా?"

"పిన్నీ! ఏదీ నా ముఖంచూచి అను ఆ మాట" ఆమె కన్నీరు వత్తి, దగ్గర కూర్చున్నాడు.

"నేను అర్జంటుగా మద్రాసు వెడుతున్నాను పిన్నీ! రాగానే తమ్ముడిని చూసే బాధ్యత నాది. నువ్వు నిశ్చింతగా ఉండు!"



"ఇది స్వయంకృత అపరాధంరా విష్ణూ..."

"పిన్నీ! నువ్వు చేయరాని అపరాధం చేశావా! వాళ్ళు చదువుకున్న మూర్ఖులు! నువ్విలా వుంటే అసలు నేను వెళ్ళలేను."

"నువ్వుండగా నాకేం నాయనా! వెళ్ళి రా" కన్నీరు ఒత్తుకుంటూ సాగనంపింది. విష్ణు వెళ్ళిపోయాక వాసంతి భరతనాట్యం మొదలుపెట్టింది.

"ఛీ, అసలు మీరు మొగవారా? అతను అలా అంటుంటే, దెబ్బ వేస్తే రాయిలా వున్నారు. అసలు వీళ్ళకు కొడుకు మీరా, అతడా తేల్చుకోండి?"

"వాసంతీ! కాసేపు నోరుమూస్తావా!" ఉదయ్ విసుక్కున్నాడు.

"నేనెందుకు ముయ్యాలి నోరు! మా మమ్మీకి ఫోను చేస్తానిప్పుడే."

ఉదయ్ ముందు అత్తగారొచ్చి నిల్చునట్టయింది. అత్తంటే అతనికి చాలా భయము. ఆమె మామూలు స్త్రీ కాదు! అల్లుడి బూట్ల మెరుపు నుండి సైడ్‌బర్న్స్ షేప్ వరకు గుర్తుంటాయి. ఏఏ సందర్భాలలో ఎలా నవ్వాలో ఆమెకు తెలుసట! ఒక్కసారి అత్తకు, విష్ణుకు మాటలలో ద్వంద్వ యుద్ధం కలిగిస్తే.... వెంటనే అతని దృష్టి తన బ్యాంక్ బ్యాలెన్స్‌వైపు మళ్ళింది. ఒక్క పైసా లేదు. ఈ ఆర్థిక యిబ్బంది యెదుర్కోవాలంటే కాస్త తను మగవాడిలా మసలుకోవాలి. అతనో నిర్ణయానికివచ్చి త్వరగా తయారయి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అత్తగారొచ్చింది. ఇంటి నాగరికతను, యింటివారి నాగరికతను దుయ్యపట్టింది. దుమ్మెత్తిపోసింది. కవ్వించింది! యెదురు చెప్పేవారులేక విసిగి వెళ్ళిపోయింది.

"ఉదయ్! వాట్ ఈజ్ దిస్?"

"ఏమిటి వసూ!"

"మీ అన్న చేసినదానికి ప్రతీకారం చెయ్యాలి."

"అదే ఆలోచిస్తున్నాను?"

"పెద్ద పొగరు! వాడి పెళ్లాం గతిలేక వచ్చింది. డాం, డూం, అంటే సహిస్తుంది" అని నానా తిట్లు తిడుతూ తృప్తి చెందింది.

## 48

పది నిమిషాల్లో ప్లేన్ మిస్ అయింది. ఇక లాభంలేదని మెల్లగా సెంట్రల్ స్టేషన్‌వైపు వెళ్లాడు విష్ణు. పని అయిపోయాక సరదాకి వుండటం అతనికి చాలా చికాకు. రైల్వేస్టేషన్లో ఏజంట్లు వుంటారు. పది పన్నెండు రూపాయలు యెక్కువ పెడితే అప్పటికప్పుడు రిజర్వేషన్ దొరుకుతుంది. అలాగే రిజర్వు చేయించుకున్నాడు. బుక్‌స్టాల్ దగ్గర నిలబడి ఏవో పుస్తకాలు చూస్తున్నాడు.

"లాభంలేదు సర్! టామిల్ రాదని నన్ను మోసం చెయ్యలేరు! డోంట్ ట్రై టు ఛీట్ మి. యు టోల్డ్ వన్ రుపీ, పే యిట్ అదర్‌వైజ్ అయి విల్ మేక్ యు టు పే."

"ఐసీ! యు నో ఇంగ్లీష్" యిద్దరూ ఘర్షణ పడుతున్నారు. విష్ణు చివ్వున తలెత్తి చూచాడు. మాసిన బట్టలతో చిక్కిపోయి వున్నాడు రాజీవ్.

పోట్లాడుతున్న రాజీవ్ ఆశ్చర్యంగా చూచాడు. అప్పటికే విష్ణు చెయ్యి అతన్ని భుజాన్ని గుచ్చి పట్టుకుంది.

"మీ, మీరు-" అతని నోరు తడి ఆరిపోయింది.

"నేనేరా! నేను బ్రతికివున్నానని నీవు మరచిపోయావా? నేను నువ్వున్నావని గుర్తుంచుకున్నాను."

"అన్నయ్యా!"

"అన్నయ్య వున్నాడని గుర్తుంచుకుంటే యిలాగేనట్రా నువ్వు బ్రతికేది? ఛీ, ఛీ!"

సూటువాలా విసుక్కుని వెళ్ళిపోయాడు. యిందాకటి ఏజెంటును పట్టుకుని మరో టిక్కెట్టు సంపాదించాడు. వెయిటింగ్ రూమ్‌కెళ్ళి ముఖం కడుక్కుని విష్ణు బట్టలు వేసుకునేసరికి బండి వచ్చేసింది.

"నేను మళ్ళీ ఆ నరకంలో వుండలేను అన్నయ్యా!"

"పోనీ, యెక్కడుంటావో చెప్పు. మన కొట్టుదగ్గర నీలాంటి హమాలీలు అవసరము. పదరా" అన్నాడు.

"అది కాదన్నయ్యా! ఆవిడ వదిన కాదు రాక్షసి."



"నువ్వేం తక్కువ? అక్కడ పడకపోతే లోకమంతా శత్రువులన్నట్టు వస్తావా! మంచిదే అయింది. ప్లేస్ మిస్ అయింది. లేకపోతే మళ్ళీ నిన్ను చూసేవాడినా! అమ్మ మంచము పట్టింది తెలుసా?"

"అమ్మకు ప్రాయశ్చిత్తం జరగాల్సిందే."

"నా యెదుటే యిలాంటి మాటలు మాట్లాడుతున్నావట్రా..."

"నిజమన్నయ్యా! అన్నయ్య అలా కావటానికి అమ్మే కారణం. నీమీద లేనిపోని ఆరోపణలు చేస్తూ వదినను చులకనచేస్తూ మాట్లాడి ఆ వాసంతి గర్వం రెట్టింపుజేసింది. త్రాగుబోతు వాసంతికి, సుజాత వదినకి పోలిక యెక్కడ?"

"త్రాగుడు ఫ్యాషన్‌రా."

"చలి దేశాలవారికి గానీ మనవారికేం రోగం!"

"అదేరా మన దేశాన్ని పట్టి పీడిస్తున్న బానిస భావము. మంచిని అనుకరించినా ఫరవాలేదు. మంచి పనులు నేర్చుకోవటం తప్పు కూడా కాదు. మంచి పనులు నేర్చుకోవటం చాలా కష్టం. అందుకే పిచ్చిచేష్టలు. నాగరికత పేరుతో ముంచేస్తున్నారు."

"ఎదటి మనిషిని గౌరవించలేని మనిషి నాగరికురాలా? ఒకే బల్లపై రెండు రకాల వంటలు. భార్యముందు తన ప్రతాపం చూపించుకోవాలని చీటికి మాటికి దెబ్బలు కొట్టడం. న్యాయానికి చిన్నన్నయ్య నా చేతి క్రిందికి కొర కాడు. అతను మరిచిపోయినా మర్యాద నేను మరిచిపోలేదు. యెదురు తిరగలేదు. నాన్నగారేం చేయలేరని తెలిశాక యిల్లు వదిలాను."

"నువ్వు వట్టి ఫూల్‌విరా" నవ్వుతూ ఆవులించి కళ్ళు మూసుకున్నాడు. బండికంటె వేగంగా అతని ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

## 49

సుందరమ్మకు కూతురు యింట్లో అంతా చిత్రంగా కన్పించింది. పెళ్ళిముందు ఇంట్లో వారిని గూర్చి యెన్నో విన్నది. అలాంటివి కన్పించలేదు. సుజాత, కాంతమ్మ పోట్లాడుకోగా చూడలేదు. కట్నంలేని కోడలు అన్న భావన యెవరికీ వున్నట్టు లేదు. సుందరమ్మ, కాంతమ్మ

భోజనాల తరువాత లోకాభిరామాయణం మాట్లాడుతూ కూర్చున్నారు. సుజాత సుమతి ఉత్తరం తెచ్చి చదివింది. ఆమె రెండో కాన్పుకు రావాలనుకుంటున్నదట. ఆదివారం సాయంత్రం బండిలో వస్తున్నామని రాసింది.

"ఎవరు వెళ్తారే"

"వాసు లేడా? నర్సింగ్ హోమ్‌కు ఫోన్ చెయ్యనా అత్తయ్యా!"

"యెందుకే. విక్టోరియాకే వెడుతుందిలే. ప్రభకేవో కట్టుడు చీరెలు కావాలట. వెళ్ళి చూడమ్మా." సుజాత వెళ్ళిపోయింది. వీరయ్య వచ్చాడు.

"అమ్మా! తోటలో చెట్లకు పురుగులు పట్టాయి. మందు కావాలి."

"ఆ విషయాలన్నీ సుజాతమ్మనే అడగండిరా" అన్నది మనమడిని జోకొడుతూ.

చలపతి వచ్చాడు. విచారంగా వున్నా ఏదో నిశ్చింతే కన్పించింది అతని కళ్ళల్లో.

"వదినా! పడమటి పొలంలో చింతలు అమ్మాము. ఈ రోజు డబ్బిచ్చాడు. మీ ఇద్దరివీ రెండు వేలు, నావి వేయి." రెండు వేలు యివ్వబోయాడు.

"నాకెందుకు? కోడలికివ్వు" అన్నది. సుందరమ్మ కళ్ళు వెళ్ళబెట్టి చూచింది. సుజాత వచ్చి చినమామకు నమస్కరించి డబ్బు తీసుకుంది.

"అమ్మా సుజాతా, వీరయ్యకు వందరూపాయలు కావాలి! వాడి పెళ్ళాం మంచం పట్టిందట."

"వాడిదంతా నటన అత్తయ్యా! పోయిన నెలలో మీ అబ్బాయి దగ్గర తీసుకున్నాడు. మొన్న వాసుబాబు దగ్గర. వాళ్ళనడిగితే లాభంలేదని మిమ్మల్ని అడుగుతున్నాడు. సాయంత్రము త్రాగుడికే కావాలి."

"ఏదోలే అమ్మా! మీ మామ కాలం నాటి వాడు."

"మీ ఇష్టం" వందరూపాయలు అత్తగారి ముందు పెట్టింది.

"వాడితో చెప్పేవు." సుజాత నవ్వుతూ వెళ్ళిపోయింది. సుందరమ్మకు ఆశ్చర్యంగా వుంది. తనే అయితే హాయిగా ఆ రెండువేలు తీసుకుని కూతుళ్ళకు యిచ్చేది. కాంతమ్మ కొడుక్కు అంత భయపడుతుందేమిటి?



తన కోడలులాగే సుజాత కానీ కట్నం లేకుండా వచ్చింది. అయినా యజమానే. ఆత్మవిమర్శ ప్రారంభము అయింది. తను పిల్లలను చూడటం నామోషి అనుకునేది. కాంతమ్మ మనుమడే ప్రాణం అన్నట్టు తిరుగుతుంది. తను ఒక్క క్షణం కోడలిని నమ్మదు. కూతురు వట్టి అమాయకురాలు-యింత డబ్బు వస్తుంటే, దాచుకుంటుందో లేదో? ఒక్కసారి కొడుకూ, కోడలూ కళ్ళముందు మెదిలారు. ఆత్మగ్లానితో కళ్ళు మూసుకుంది. పశ్చాత్తాపం కలిగితే మారేవారు కొందరే వుంటారు. కొందరు మంచి చూడటం పాపము అనుకుంటారు. ఆ జాతికి చెందిందే సుందరమ్మ. సుజాత మంచితనము వల్లే అత్త మంచిగా ప్రవర్తిస్తుంది అనుకుంది.

మర్నాడు సాయంత్రం విష్ణు వచ్చాడు. రాజీవ్ ఆగమన వార్త అందరినీ సంతోషపరిచింది.

"ఏడిరా వాడు?"

"పిన్నిదగ్గర వదిలానమ్మా. రాత్రికి వస్తాడేమో. పిన్ని ఆనందము ఇంతా అంతా కాదు." అదే సమయంలో సుమతి భర్తతో వచ్చింది. అందరూ గలగల కబుర్లు చెప్పుకుంటూ ఆనందం అంతా తమదే అన్నట్లు గడిపారు. విష్ణు స్నానంచేసి వచ్చేసరికి సుశీలమ్మ, రాజీవ్ కూడా వచ్చారు. కాంతమ్మ రాజీవ్‌ను అక్కున చేర్చుకుని కంట తడిపెట్టుకుంది.

"ఏంరా. పెద్దమ్మ వుందని మరచిపోయావా?"

"ఈ శ్రీరామ్‌గాడు వచ్చిన దగ్గర నుండి నన్ను నువ్వు మరిచి పోలేదూ?" అన్నాడు శ్రీరామ్‌ను యెత్తుకుంటూ.

"ఒరేయ్ వాసూ! నాకంటే చిన్నవాడివి, పోస్టు గ్రాడ్యుయేటువి, ఉద్యోగస్తుడివి, నేను చూడు-" అన్నాడు విచారంగా.

"ఒరేయ్ రాజీ! నీకు జీవితంలో గట్టిపునాదులు పడ్డాయిరా" అన్నాడు వాసు. అందరూ నవ్వారు.

సుశీలమ్మ తామున్న గదిలో తన బట్టలు సర్దుకుంటుంటే కాంతమ్మ చూసింది. ఇంటికి ఏదో నిండుతనము వచ్చినట్టు అన్పించింది. సుజాత వడ్డనకుపక్రమించింది.

"నేను లేనూ.... నువ్వు వెళ్ళవే సుజాతా?" సుశీలమ్మ చనువుగా పళ్లెం లాక్కుంది.

ఇదంతా చూచి సుందరమ్మ మండిపడింది. అందరూ కలిసి పొగడ్తలతో కూతుర్ని మాయ చేస్తున్నారు. కళ్ళు తెరిపించాలి. ఆమె ఓ నిశ్చయానికి వచ్చింది. అందరూ పడుకున్నాక మేడ యెక్కింది అయాస పడుతూ.

బేసిన్ దగ్గర సుజాత నోరు పుక్కిలిస్తోంది. ఆమె వెనుదిరగగానే, అమాంతం రెండు చేతుల మధ్య యెత్తాడు విష్ణు.

"వదలండి...."

"నా దగ్గర యిన్నాళ్ళు యెందుకు దాచావు ఈ విషయం!."

"దించాక చెప్తాను."

"ఇక్కడ కాదు" అతడు మంచముపై దించాడు.

"ఊఁ చెప్పు!"

"ఏం చెప్పను. పొరపాటయింది."

"మరి ఈసారి పాప కావాలి. లేకపోతే తల్లీ కొడుకులను రైలు యెక్కించేస్తాను."

"ఎక్కడికి!"

అలాగే కూర్చుని ఆమె వైపు చూడసాగాడు. ఆమె మెల్లగా అతని ఒడిలోకి ఒరిగింది.

తను చెప్పినా కూతురు వినదని తెలుసుకుని క్రిందికి దిగింది సుందరమ్మ.

## 50

"మా ఇంటా వంటా లేదు. మతిచాంచల్యం వాడికెందుకు వస్తుంది? యెవరో చేతబడి చేయించారు. ఆ రోజు బాగు చేయించాకనే నా కొడుకు బతికి బట్టకట్టాడు" అన్నది సుందరమ్మ. కూతురు యింటి నుండి వస్తూనే, మారిన కొడుకుని చూచి.



"పోనీండి అత్తయ్యా! మందో, మంత్రమో పనిచేసింది. వారికి నయమయింది-అదే చాలు."

"వాడు బాగయితే సత్యనారాయణ వ్రతం చేస్తానని మొక్కుకున్నానమ్మా"

"ఈ నెల జీతం రాగానే చేయిద్దాం అత్తయ్యా" అన్నది.

రఘు ఉద్యోగంలో చేరి మూడో నెల. జీతం తీసుకువచ్చి భార్య చేతిలో పెట్టాడు.

సుందరమ్మ ఆ రోజంతా ముఖం మాడ్చుకునే కూర్చుంది. మర్నాడు సత్యనారాయణవ్రతం గూర్చి జ్ఞాపకం చేసింది.

"అలాగే చేద్దాం" ఆదివారం బ్రాహ్మడ్ని రమ్మని చెప్పింది. కావాల్సిన వస్తువులు తెచ్చింది.

"అదికాదే, ఆడపిల్లలను పిలువవద్దటే!"

"ఈ ఒక్క గదిలో ఎలాగత్తయ్యా! ఇంకా ముందు రోజులు లేవా?"

"యెందుకు లేవు! కొండంత కొడుకు బాగయ్యాడు కదా! ఆడపిల్లలకు పసుపు, కుంకుమ, తలొక చీర యిద్దాం అనుకున్నాను. కంచివి అడిగానా, బెనారసువా, మనం పెట్టిందే తీసుకుంటారు. అదయినా నేను వున్నంతసేపు. నేను చస్తే రంగడెవరో, రాకాసి యెవరో?"

"అత్తయ్యా! అదృష్టం బావుండి, వారిలాగే సంపాదిస్తే ఆడబిడ్డలకు ఒక చీర పెట్టుకోలేనా? ఇప్పుడు డబ్బేది? ఆయనకింకా మందులూ, టానిక్కులూ కొనాలి!"

"సుజాతనడిగితే మరో రెండు వందలు యివ్వదా? డబ్బు అంతా దాని చేతిలోనే వుంటుంది."

"ఆమె ఇచ్చినా తీసుకోవటం నాకిష్టం లేదు. అప్పు చేయకూడదని నిర్ణయించుకున్నాము."

"మీ ఇష్టం. నా పెద్దరికం ఏమేడ్చిందిలే." ధుమధుమలాడుతూ లేచి వెళ్ళింది. ఒకే గది! భార్యాభర్తలకు ఏకాంతము అనేది లేదు. ఈ మధ్య రఘుకు వాంఛలు పెరుగుతున్నాయి. భార్య ఎప్పుడూ ప్రక్కనే వుండాలనుకుంటాడు. అత్తగారు వచ్చిన దగ్గర నుండి యిరకాటంలో పడింది.

తన కోర్కెలు నెరవేరటం లేదని ధుమధుమలాడసాగేడు.

"వెధవ పెత్తనమూ, వాడూనూ! ఎక్స్‌ట్రా క్లాసులట."

"యెవరండీ?" మృదువుగా అడిగింది.

"వాడే. ఆ అసిస్టెంటు గాడు. నిన్న వేశాడు. ఈ రోజు వేశాడు. వాడు తీసుకుంటేనే?"

"కాలం కలిసిరాకపోతే అలాగే అంటారు. కొన్నాళ్ళు ఓపిక పట్టండి. మనమే వాళ్ళను ఆడించవచ్చు." ఆమె ఓదార్పు అతను విన్నట్టు లేదు. భార్యను నఖశిఖ పర్యంతము పరిశీలనగా చూస్తున్నాడు. పూర్తిగా చిరుగులు పట్టిన చీరలతో బడికిపోలేక, రెండు నేతచీరలు కొన్నది. వంగపండు రంగుచీరలో సరళ అతని కంటికి అందంగా కన్పించింది. అతని భావం గ్రహించిన సరళ ఆలోచనలో పడింది. అతని కోర్కె నెరవేరకపోతే మళ్ళీ పిచ్చియెక్కుతుందేమో?"

బలవంతంగా అత్తగార్ని, పిల్లలను రెండో ఆట సినిమాకు పంపింది. ఆడది. అందునా భారతదేశంలో పుట్టింది. అంతకంటే ఏం చేయగలదు?

సంసారం ఒక్కనాటితో ముగిసేదా? రఘు పూర్తి శారీరక సుఖాలకు బానిసయిపోయాడు. మరో రోజు ధుమధుమలాడుతూ వచ్చాడు బడి నుండి.

"పిల్లలు గొడవ చేస్తే, నన్ను జాగ్రత్తగా వుండమంటాడేం సరూ! వాడికసలు బుద్ధి వుందా? అందరూ నాపై అధికారం చెలాయించాలని చూస్తారు. నా అనుమానం ఏమిటంటే, పిల్లలకు నేర్పి పెడతారేమో. వాళ్ళంతా పని యెగవేస్తే తప్పులేదు. నన్ను మాత్రం జాగ్రత్తగా కనిపెడతారు. నిన్న పదిహేను నిమిషాలు ముందుగా క్లాసు వదిలానని ఎన్ని మాటలు అన్నాడో వెధవ. అతను ప్రతి చిన్న విషయం భూతద్దంతో చూస్తాడేమో అనిపించింది."

"ఉద్యోగం అన్నాక యిలాంటివి సహజం. సర్దుకుపోవాలి."

"చాల్లే సమర్థింపు" విసుక్కున్నాడు.



రాత్రి ఏదో ఉక్కగా అనిపించి యిటు తిరిగింది. రఘు వున్నాడు ప్రక్కన.

"ఉష్......అత్తయ్య!"

"నిద్రబోయింది."

"వెళ్ళి పడుకోండి" అతన్ని తీసుకుపోయి మంచంలో వదిలి వచ్చింది.

"సరూ!"

"సరూ!"

"ప్లీజ్! నిద్రపోండి." అతను అప్పుడేమనలేదు. మర్నాడు కాఫీ చల్లారిందని ఆ చెంపా, యీ చెంపా వాయించేశాడు. పిల్లలను విసుక్కోవటం, తల్లితో ఏదో విషయముతో పోట్లాట. లాభం లేదని, ఇంటి వాళ్ళను అడిగి ప్రక్కనే వున్న ఓ గది తీసుకుంది. దానికి నలభై అడిగారు. భర్త ఆరోగ్యం కంటే కావల్సిందేం లేదు! తన పరిస్థితి సుజాతకు చెప్పుకుని ఉపశమనం పొందింది. రోజూ బడిలో ఏదో గొడవ తెచ్చుకునేవాడు. సర్ది చెబుతూ, అతన్ని మార్కింగు చేసిపెట్టేది.

## 51

"సుజా!"

"ఊఁ"

"కోపంగా వుందా?"

"మరి వుండదేమిటి? కూతురు కావాలని గొడవ చేసి, కూతురు పుట్టిన అయిదు గంటలకా ఇక్కడికి రావటం?". "మనమ్మాయి అదృష్టవంతురాలు....." పొత్తిళ్ళలో పాప బుగ్గలు పుణికాడు. "చూడు పుడుతూనే బాబాయిలనంతా ఒక్కచోట చేర్చింది. మనదింకో వర్క్‌షాప్ సికింద్రాబాద్‌లో ప్రారంభము చేశాము. కొట్టు వాసు చూస్తాడు. రెండు వర్క్‌షాప్స్ ఉదయ్, రాజీవ్ చూస్తారు. నేను అంతా సూపర్‌విజన్. చిన్నాన్న వ్యవసాయం చేస్తారు."

"ఉదయ్ ఉద్యోగం!"

"రిజైన్ చేశాడు."

"మళ్ళీ కలిసి వుండటం....." వాసంతి మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ.

"నీకలాంటి భయం వద్దు. వాళ్ళు సికింద్రాబాద్‌లోనే వుంటారు. వాసు వివాహము కాగానే, కొట్టులో ఖాళీ స్థలంలో ఇల్లుకట్టి అక్కడ వుంచుదాము" భార్య తల నిమురుతూ చెప్పాడు.

"కలిసిమెలిసి పనులు చేసుకుంటే యెంతో కలిసివస్తుంది. కలిసి మెలిసి జీవించాలనుకున్నప్పుడు యెన్నో సమస్యలుంటాయి. నాకు తెలుసు. ఇప్పటివరకు కుటుంబగౌరవము పేరుతో నిన్ను యిబ్బంది పెట్టాను."

"అలా యెప్పుడూ అనుకోవద్దు. మీరు మీ నాన్నకిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. భర్త చేసే సత్కార్యంలో సహాయం చేయటంకంటే స్త్రీకి ఏం కావాలి? పెళ్ళి యెందుకు చేసుకున్నావని పురుషుడు బాధపడ్డనాడు స్త్రీ చావటమే మేలు...."

అతను ఆమె నోటిపైన చేయిపెట్టి మాట్లాడనీయలేదు. అలాగే ఆ చేతిని పట్టుకుని చెంపలకాన్చుకుంది.

"యెవరిలా వుంది మీ అమ్మాయి."

"అదేమిటి.... నా ఒక్కడికేనా అమ్మాయి."

"నేను మీలాగా కోరుకోలేదు. నన్ను బండెక్కించేస్తానన్నారు గుర్తుందా?"

"ఓహో, అయితే లక్షల చుట్టూ సంచులు అల్లుతున్నట్లున్నావ్?"

"తండ్రి ఒక సంచి నింపితే, కొడుకులు నాల్గు నింపుతారు. తండ్రే వరించి, ఉత్తచేతులతో భార్యను తెచ్చుకుంటే కొడుకులేం తెస్తారు?"

"చాలా మాట్లాడావుగాని, యిక పడుకో." దుప్పటి గుండెలవరకు లాగి పాపను తీసి ప్రక్కనే వున్న ఉయ్యాలలో వేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్ వదినా" ముగ్గురు మరుదులు ఒకేసారి వచ్చారు.

"థ్యాంక్స్!" నవ్వింది. ఉదయ్ పూర్తిగా మారిపోయాడు. అతనికి కొడుకు పుట్టి పోయాడు. అది భార్య నిర్లక్ష్యమే అని అతనికి బాగా తెలుసు. అతను పూర్తిగా పాప పైకి తన్మయత్వంతో చూశాడు.



"ఉదయ్!"

"ఏం వదినా!"

"మళ్ళీ ఈ రోజులకు వాసంతికి పాపో, బాబో పుడతారు. విచారం దేనికి?"

"విచారం కాదు వదినా-" మాట్లాడలేనట్టు బయటకు వెళ్ళిపోయాడు. తమ్ముళ్ళను పంపి తిరిగి వచ్చాడు విష్ణు. స్టూలు లాక్కుని భార్య దగ్గరగా కూర్చున్నాడు.

"సుజా! నా కోర్కె నువ్వు తీర్చావు. నీ కోర్కెలు తీర్చటం నా ధర్మం. చెప్పు ఏం కావాలో!"

"నాకేం తక్కువండీ....." అతని చేతిని మృదువుగా నిమురుతూ అంది. "ప్రేమించే మీరున్నారు. ఇద్దరు పిల్లలు - కూతురిలా చూచుకునే అత్తగారు."

"ఆ సోది కాదు నేనడిగింది."

"అలా అయితే చెప్పనా, నవ్వద్దు, మరి నాకు తీరని కోర్కె ఒక్కటే మిగిలిపోయింది."

"ఊఁ! సందేహం వద్దు."

"ఈ పరిసరాలకు దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో మీరూ - నేనూ -ఇద్దరమే-"

"కవిత్వం చెబుతావా?"

"అందుకే నేను వద్దన్నది." కళ్ళు మూసుకుంది. విష్ణుకు నిశ్చింతగా వుంది. తన నిశ్చింతకు కారణం అయిన భార్యను చూస్తే గర్వంగా కూడా వున్నది. మెల్లగా భార్య చేతిలో వున్న తన చేతిని విడిపించుకుని బయటకు వచ్చాడు. అలసిపోయిన సుజాత నిద్రలోకి జారిపోయింది.

## 52.

ఒక్కోసారి చిన్న సంఘటనే మానవుడిని దానవుడుగా మార్చి వేస్తుంది. రఘు పనిచేసే బడిలో చింతాలు, హనుమాన్లు అని ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తారు. నారద అంశాన జన్మించారు. అందుకే ఆ

యిద్దర్నీ ప్రత్యేకంగా గుర్తుపెట్టుకుంటారు స్టాఫ్ మరియు విద్యార్థులు. వారికి ముద్దుగా కరటక, దమనకులు అని పేరుపెట్టుకున్నారు. వారిద్దరూ అందరిపై పితూరీలు చెబుతూ హెడ్‌మాష్టరు మంచి సంపాదించారు. అధికారుల వద్ద కుక్కకంటే విశ్వాసంగా వుంటారు. అమాయకులను ఆటలు పట్టిస్తారు. వాళ్ళిద్దరూ ఫీజు వసూలు చేసి రసీదులు యిస్తారు. క్లర్క్ సెలవు మీదున్నప్పటి నుండి అలాగే చేస్తున్నారు. వారిద్దరూ చిట్‌ఫండ్ సభ్యులు. చెరో యాభై రూపాయలు కట్టాలి. ఫీజులోంచి వాడటానికి, వారిద్దరూ క్లాసు టీచర్లు కారు. వారిద్దరూ బల్ల దగ్గర కూర్చుని తర్జన భర్జనలు చేస్తుండగానే, రఘు తన క్లాసులో వసూలయిన ఫీజు తీసుకు వచ్చాడు.

"ఏమండీ రఘూ క్లాసులు లేవా?" చింతాలు అడిగాడు.

"ఉందండీ. పిల్లలు లెక్కలు చేస్తున్నారు. నా దగ్గర వుంటే ఖర్చయిపోతుందని పట్టుకొచ్చాను."

"అలా క్లాసులు వదిలిపెట్టి రాకూడదయ్యా."

"సరే" వెనుతిరిగాడు.

"ఇచ్చి వెళ్ళవయ్యా. ఎంతయినా హెడ్‌మాష్టరు పెట్‌వి. పదీపరకా ఖర్చు చేసినా ఏమనుకోడు."

"అతడు అనుకోకపోయినా, అతని మంచితనం దుర్వినియోగం పరచటం భావ్యం కాదండి."

"మీరు చాలా మారిపోయారు. ఏమంటారు హనుమాన్లుగారూ!" చింతాలు నవ్వాడు అనవసరంగా.

"అవసరమే కదయ్యా మార్పు. డబ్బు యిలా యివ్వండి- యెనభై రెండు రూపాయలు. రశీదు పంపిస్తాను!"

"థ్యాంక్స్!" రఘు వెళ్ళిపోయాడు.

"ఏం గురూ! రశీదు యివ్వడానికి యెంతసేపు కావాలి?"

"రశీదు యివ్వలేక కాదు, తరువాత చెబుతాను" యిద్దరూ గుసగుసలాడుతూ వెళ్ళిపోయారు.



వారం రోజుల తరువాత హెడ్‌మాష్టరు ఫీజు మొత్తం తీసుకున్నాడు. అది చూస్తూనే అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"చింతాలుగారూ! యెనభై రూపాయలు బకాయి యెవరు పెట్టారు?"

"యెవరు పెడితేనేం? వారం రోజులలో పూర్తి చేస్తారు సార్. కావాలంటే జీతం రాగానే కోసుకుందురు......" నసిగాడు.

"నో! నో! యిదేం యిర్రెగ్యులారిటీ? యెవరికయినా అవసరం అయితే, నన్ను అడిగి తీసుకోవాలి."

"రఘుకు ఏదో అవసరం వుండి వుండాలి" అన్నాడు. రఘు అంటే జాలి, సానుభూతి వున్నాయి హెడ్‌మాష్టర్‌కి. అదీకాక రఘు బావమరిది పెద్ద బిజినెస్ మాగ్నెట్. హెడ్‌మాష్టర్ విష్ణువర్ధన్‌తో యెంతో వినయంగా మాట్లాడటం చూచాడు. రఘు పేరు చెప్పి హెడ్‌మాష్టర్ నోరు మూయించా లనుకున్నాడు. అతని వూహకు విరుద్ధంగా రఘును పిలిపించాడాయన.

"సర్! నా మాట వినండి" కంగారుగా చూచాడు చింతాలు.

"నో! నో! రూల్స్ అతిక్రమించి తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించే వారంటే నాకసహ్యము."

"పిలిచారా సర్!" రఘు వచ్చాడు.

"అవునండీ. మీరు ఫీజు డబ్బులు పెద్ద మొత్తంలో వాడుకునే ముందు మాకు చెప్పాలని తెలియదా?"

"లేదు సర్. యెక్కడో పొరపాటు జరిగింది. ఈ నెల నేను అంతా కట్టేశాను. కావాలంటే చింతాలుగారిని అడగండి రశీదు పంపుతానని అన్నారు."

"ఏమిటండి చింతాలుగారూ!"

"ఆఁ లేదు సర్! మీకెందుకు? ఆ డబ్బు యిచ్చే బాధ్యత నాది. అసలే అతని ఆరోగ్యం బావుండలేదు."

"అదేమిటండీ చింతాలుగారూ! నా ఆరోగ్యానికి, డబ్బుకూ ఏం సంబంధం. నేను డబ్బు ఇచ్చానుగా?"

"ఏమిటండీ....ఇదంతా?"

హెడ్‌మాస్టర్ చింతాలు వంక చూచాడు. అతని ముఖం వెల వెల బోయింది. ఒక అబద్ధం కప్పిపుచ్చుకోవటానికి నూరు అబద్ధాలు ఆడాలన్నది యెంతయినా నిజం. చింతాలు ధైర్యంగా అబద్ధం ఆడేశాడు.

"బాగా జ్ఞాపకం చేసుకో రఘూ! మాకిస్తే వెంటనే రసీదు యిస్తాం. కావాలంటే హామీ ఇస్తాను."

రఘు ముఖం ఎర్రబడింది.

"మీ వెధవ హామీ మీ దగ్గరే వుంచుకోండి. డబ్బిచ్చి రశీదు తీసుకు పోకపోవటం నాదే తప్పు. మీరు ఏ ప్రమాణం చేయమన్నా చేస్తానండి. నేను డబ్బు యిచ్చాను."

"మిస్టర్ రఘూ! మీ ఆరోగ్యం బావుందా?"

"సర్!" జాలిగా చూచాడు. "ఒకప్పుడు నా ఆరోగ్యం బావుండని మాట వాస్తవమే. నేను నిక్షేపంలా వున్నాను. నిజమే చెబుతున్నాను."

"అతన్ని మన్నించండి సర్. డబ్బు నేను యిస్తానుగా." చింతాలు అడ్డుపడబోయాడు. నిజం చెప్పలేక మాటిమాటికీ హామీ యివ్వటం రఘుకి అంతులేని కోపాన్ని కల్గించింది. వెంటనే చింతాలు షర్టు పట్టుకుని ఆ చెంపా, ఈ చెంపా ఎడాపెడా వాయించాడు. కోపంతో అతను ఊగిపోయాడు. హెడ్‌మాస్టర్ విడిపించాడు.

"సర్! హనుమాన్లు అక్కడ వున్నాడు. పిలిపించండి." అన్నాడు. ఒగరుస్తూ హనుమాన్లు వచ్చాడు. ఇంత జరిగాక నిజం చెబితే చింతాలుపై తీవ్రమైన చర్య తీసుకుంటారు. రఘుపై నెడితే, అతని ఆరోగ్యరీత్యా అతన్ని క్షమించవచ్చు. అందుకే అతను అబద్ధం చెప్పి రఘు చేతిలో చిత్తుగా తన్నులు తిన్నాడు. చుట్టుప్రక్కల వారంతా వచ్చారు. ఇద్దరినీ విడదీశారు.

"రఘూ! బడిలో ఏమిటి అల్లరి! పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులే అన్యాయంగా మాట్లాడితే, అబద్ధాలు సృష్టిస్తే సహించరాని విషయము. నన్ను అడిగితే యిచ్చేవాడిని."

"సర్! నన్ను నమ్మండి. నేను చెప్పింది నిజం. నిజమండీ" అని అరిచాడు.



"నిజమే అయితే నిరూపించుకోరేం?" తీవ్రంగా అడిగాడు అతను. "పైగా మర్యాద మరిచిపోయి అందరిపైకి ఒంటికాలిపై లేచి కొడతారా?"

"ఊఁ, నిరూపించుకోలేనిది నా తప్పు. రేపు డబ్బు తెచ్చి కడతాను."

"డబ్బుది కాదు సమస్య. నా దగ్గరకొచ్చి వివరాలు తెలిపితే అర్థం చేసుకోలేనా! మీలాంటివారు ఉపాధ్యాయ పదవికి తగరు!"

"మాటలు తిన్నగా రానియ్యండి సార్. నేనేం కావాలని మీ కాళ్ళా వేళ్ళా పడలేదు. ఆ రోజే ఉపాధ్యాయ పదవికి పనికివస్తానా లేదా చూడాల్సిన బాధ్యత మీకులేదా!"

"చూచే తీసుకుంటాము. కాని-"

"కాని, నాలాంటివాడు ఆ క్షణంలో దొరకలేదు."

"దొరక్క కాదు, నీ బావమరిది బ్రతిమిలాడితే యిచ్చాను."

అంతవరకు రోషంగా వున్న రఘు ఎఱ్ఱని ముఖం పాలిపోయింది. రక్తం లేనట్టు అయింది.

"ఎవరూ? ఎవరు విష్ణువర్ధనా!"

"అవును. అతనిపై వుండే గౌరవం కొద్దీ...."

"చాలు, ప్లీజ్! యింకేం చెప్పొద్దు. యిదిగో"-పెన్నుతీసి కనిపించిన కాగితంపై రిజిగ్నేషన్ ఉత్తరంరాసి యిచ్చాడు హెడ్‌మాస్టరుకు.

"క్షమించండి! నా జీతం డబ్బులు లెక్క చూచి ఫీజు కట్టుకోండి." చరచర బయటికి వచ్చాడు.

"పాపం మతి చలించినట్టుంది మళ్ళీ...."

"అంతే-నడివీధిలో యిద్దరు మనుష్యుల్ని కొట్టాడు."

"అసలు పిచ్చివాడికి ఉద్యోగం యెట్లా వచ్చింది?"

"వాడి బావమరిది వ్యాపారస్థుడట." రఘు వెనకాల వినిపించే కామెంట్లు. అతను చెవులు మూసుకుని, పరుగులు పెట్టినట్టే ఇల్లు చేరాడు. సుందరమ్మ తాళంపెట్టి యెక్కడికో పెత్తనాలకు వెళ్ళింది. అతను ఆకలి గొన్న పులిలా ఇంటిముందు పచార్లు మొదలుపెట్టాడు. ఇంటివారు తొంగి తొంగి చూచారు. బయటికి రావటానికి జంకారు.

విధి కొన్నిసార్లు బలహీనులతో భలే నాటకం ఆడుతుంది. సరళకు తలనొప్పి ప్రారంభమయి మధ్యాహ్నము వరకు జ్వరం వచ్చింది. ఆమె సహధ్యాయిని డాక్టర్ రాజన్ చెల్లెలు యెంత చెప్పినా వినక రిక్షా మాట్లాడి తన అన్న క్లినిక్‌కి తీసుకువెళ్ళింది. పరీక్షలు ముగించి, 'ఫ్లూ' అని మందులు రాసిచ్చాడు.

"ఇంత జ్వరంలో యెలా వెడతారు."

"ఫరవాలేదు" అన్నది రెండు అడుగులు వేసి.

"ఆగండి. నేను అటే వెడుతున్నాను, డ్రాప్ చేస్తాను" అన్నాడు. మూడు నెలలు సరళను తన అవుట్ హౌస్‌లో వుండగా చూచాడు. ఆమె నెమ్మది, శాంతము, సహనము అతన్నెంతో ఆకర్షించాయి. అందుకే అతనికి తెలియకుండానే ఆమెపట్ల గౌరవం కలిగింది.

అతను కారు డోరుతీసి పట్టుకున్నాక సరళ అసహాయంగా చూచింది.

"క్షమించండి. నాకంటే మా ఇంటి స్థితి మీకే బాగా తెలుసు. ఆయన చూచారంటే..."

"ఓ ఐ.సీ. వెళ్ళండి." అతను కారు స్టార్టు చేశాడు. గేటువరకు వచ్చి ఆగిపోయింది. సరళ కాళ్ళు లాగటాన నీరసంగా గేటును ఆసరాగా చేసుకుని నిల్చుంది. అతను కారాపాడు. "రండి, వీధిచివర వదిలేస్తాను. నాల్గు గంటలవరకు ఈ వీధిలో రిక్షాలు కూడా దొరకవు."

కాదనే ఓపికలేక యెక్కేసింది. సమయము పన్నెండున్నరే. భర్త నాల్గింటికి వస్తాడు-అనుకుని యెక్కేసింది. అతను నాల్గిళ్ళ అవతలే దింపి వెళ్ళిపోయాడు.

తూలుతూ వచ్చిన సరళ వీపుపై బలమయిన దెబ్బ పడేసరికి, "అమ్మా!" అంటూ కూలబడిపోయింది. "చెప్పు, ఆ రాజన్‌గాడితో కులికి వస్తున్నావు కదూ! నేను వుంటే నీ ఆటలకు అడ్డు అని, ఆ విష్ణుగాడితో చెప్పి నాకు ఉద్యోగం వేయిస్తావా! చెప్పవే, నేను మనిషిని కానూ? నాకు అభిమానం లేదూ? ఆ విష్ణుగాడి సామర్థ్యము మీకు నచ్చితే వాడి అడుగులకు మడుగులు ఒత్తండి. నన్ను అవమానిస్తారా? మాట్లాడు



రాక్షసీ!" అతని పిడికిళ్ళు బిగించి గుద్దుతూ వుంటే, ఆమె స్పృహ కోల్పోయింది. ఇంటివారు తలుపులు బిగించి తమాషా చూస్తున్నారు.

"నన్నో బిక్షగాడిని చేసింది, దొంగ రాస్కెల్! వాడికెంత సిగ్గులేదు. ఇంటిముందు అందరూ చూస్తారని దూరంగా వదిలిపోతాడా?" కాళ్ళతో స్పృహతప్పి వున్న శరీరాన్ని అటు ఇటు కదిపాడు.

"అయ్యయ్యో! చచ్చిపోయింది. దేవుడో.... తండ్రో" ఇంటివారి పనిమనిషి కేకలు వేస్తోంది.

"చచ్చిపోయిందా? యెంత చల్లని మాట చెప్పావు! పీడా పోయింది" పెద్దగా, పకపక నవ్వసాగేడు. "నేను అసమర్థుణ్ణి, తాగుబోతును, దొంగను, హంతకుడిని. మీకు భయంగా లేదూ? అహహ్హ!" అతను పిచ్చిగా గంతులు వేస్తుండగా సుందరమ్మ వచ్చింది. "సుందరమ్మా! చక్కని బొమ్మా, యముడు పిలుస్తున్నాడు పదవేమమ్మా!" నవ్వుతూ తల్లిపైకి ఉరికాడు. సుందరమ్మ వణికిపోతూ, గేటు బయటికి వెళ్ళి గేటు మూసింది. "రక్షించండి బాబో" అంటూ ఆమె పనిమనిషి పెట్టే కేకలకు నలుగురూ పోగయ్యారు.

## 53

"వదినా, వెళ్దాం పద" సుజాత సరళ భుజంపై చేయి వేసింది. నీరసంగా మరదలి వంక చూచింది. "వదినా, నువ్వు ధైర్యంగా వుండాలి" అన్నది. దూరంగా కటకటాల ఆవల నిల్చుని వేళ్ళపై లెక్కించే భర్తను చూచింది సరళ. ఇవతల విష్ణు తీక్షణంగా చూస్తూ నిల్చున్నాడు. "ఏం చూచి ధైర్యంగా వుండను సుజా! నాకెందుకీ బ్రతుకు?"

"వదినా! మీకిద్దరు పిల్లలున్నారు. వారికోసమైనా బ్రతకాలి." సుజాత వదినకోసం బాధనంతా మింగేసింది.

"మీ అన్నయ్యకు బాగవుతుందా?"

"అదంతా కాలమే నిర్ణయించాలి. నువ్వు అధైర్యపడితే పిల్లలు నిరాశ్రయులు, అనాధలవుతారు" అన్నది కన్నీరొత్తి. "సరే సుజా" భారంగా ముందుకు కదిలింది. మరోసారి భర్తవున్న దెస చూచింది. ఇద్దరు

యువకులు నిల్చున్నారు. రఘు, విష్ణు. ఇద్దరూ జీవితబాటపై దక్కా మొక్కీలు తిన్నవారే. ఒకడు బలహీనుడు, భయపడుతూ పిరికితనంతో, చెడు అని తెలిసినా, భయపడి పిరికివానిలా తన జీవితమేకాక, యితరుల జీవితం నరకప్రాయం చేసినవాడు - రెండో అతడు మంచిని ఎంచి యెవరెన్ని మాటలన్నా. కర్కోటకుడని బిరుదు యిచ్చినా, ధైర్యంగా నిలబడి, శాసించి, శిక్షించి, బ్రతుకుబాటలోని గతుకులను పూడ్చాడు. అందరూ ఒకేలా వుండరుగా. మందర లేకపోతే రామాయణమే లేదన్నట్టు హనుమాన్లు, చింతాలు వంటివారు లేకపోతే జీవితమే వుండదు.

కాని ఒక్క విషయంలో మనుష్యులెప్పుడూ జాగురూకులయి వుండాలి. తాము మాట్లాడే చిన్నమాట ఇతరుల జీవితాలపై ఎంత పెద్ద దెబ్బతీస్తుందో ఆలోచించాలి. అలా ఆలోచించక చేసే పనులవలన అవతలివారు ఎంతో నష్టపోతారు.

ఒక్క రఘు కాదు, రఘులాంటి యువకులెందరో ఇంటివారి దుబారా, బయటవారి దుష్ప్రచారాలకు బ్రతుకులు బలిచేస్తున్నారు.

అందరూ భారంగా వెనుతిరిగారు. రఘు నవ్వుతూ విష్ణును పిలిచాడు-

"ఏమిటి బావా?"

'బావా? ఎవడోయ్ నీకు బావ? యిలా రా, జీవితంలో అమ్మమాట వినకు. నమ్ము. సుఖపడిపోతావు. భార్యను నమ్మకు. ఆ! ఇంకో రహస్యం. పెళ్ళానికి పైసా యిచ్చినా రసీదు తీసుకో. ఎందుకు చెబుతున్నానంటే, నువ్వు ఒట్టి అమాయకుడవు, పిరికివాడివి."

"రఘూ!"

"ఏమిటోయ్, భలే తమాషాగా వుందా? ఇప్పుడే బావ, అప్పుడే రఘు. నా దగ్గర డబ్బు లేదని కదూ! రహస్యం, ఎవరితోనూ చెప్పకు. డబ్బు ఆంధ్రాబ్యాంక్‌లో దాచాను.

విష్ణు అతన్ని అలా చూస్తూ ముందుకువచ్చి ఆడవాళ్ళను చేరాడు. సరళను ఇంటి దగ్గర వదిలి కార్లో కూర్చున్నాడు. సుజాతకు అప్పటివరకు బిగపట్టిన దుఃఖం కట్టలు తెగింది.



"సుజా! ఏమిటిది?" ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు.

"జీవిత పోరాటంలో ఒకోసారి ఓటమి తప్పదు. రఘుకు చేయూత నియ్యబోతే దులిపేసుకున్నాడు. ఇకనుండి మనకు నల్గురు పిల్లలు...."

"విష్ణూ!" కృతజ్ఞతగా, గౌరవంగా, ఆరాధనా పూర్వకంగా అతని వంక చూచింది సుజాత.

"మీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోవాలి?" అన్నది కన్నీటితో.

"చెప్పనా!" కారు స్టార్టు చేశాడు.

"స్త్రీ సంసారపు కేంద్రబిందువు సుజా! ఈ మధ్య నువ్వు పూర్తిగా మీ అన్నయ్య ధ్యాసలోపడి నన్నూ, పిల్లలనీ నిర్లక్ష్యం చేశావు" అన్నాడు.

ఆమె కన్నీరు ఒత్తుకుని, "ఇకముందు అలా జరగదు. అంది "జరిగినదానికి విచారించి లాభం లేదు" అన్నాడు. సుజాత అతని భుజంపై తలవాల్చింది.

జీవిత బాటలోలాగే జనసమ్మర్దం గల రోడ్డుమీద నేర్పుగా, తాపీగా నడుపుతున్నాడు కారును. ఒకచేయి స్టీరింగ్‌పై నుంచి, రెండో చేయి భార్య భుజాలచుట్టూ వేశాడు.

